ఈనాడు

విజయవాడ 10-2-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 181
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కాలం చెల్లిన చట్టాలు రద్దు

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే చర్యలు
- సాంకేతికతతో ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- తొలిసారి లాభాల బాటలో విశాఖ ఉక్కు
- బృందస్ఫూర్తిని మరింత సమర్థంగా చాటుకోవాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు



సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, మంత్రి లోకేశ్, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎస్ విజయానంద్, మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు

ఈ ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించింది. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎస్‌ఐపీబీల ద్వారా రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు ఆమోదించాం. దీంతో మరో 8.50 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయించాం. 95 కేంద్ర ప్రాయోజిత పథకాల్ని పునరుద్ధరించాం. -సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

కాలం చెల్లిన చట్టాలు, నిబంధనలపై సమీక్షించి రద్దు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఓ కమిటీ వేసి అనవసర చట్టాలను తొలగిస్తోందని, దీనికి ఆంధ్రప్రదేశ్ మోడల్‌గా ఉండాలన్నారు. కొత్తగా కేంద్రం తీసుకొస్తున్న ఏఐ సావరిన్‌తో పాటు ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలు, సాంకేతికతలను అందిపుచ్చుకొని నిర్దిష్ట ప్రణాళికతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చేరామని, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పరిపాలనలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం ప్రారంభోపన్యాసం చేశారు. 'రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని, అన్ని వ్యవస్థలనూ గాడిలో పెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. 19 నెలలుగా అద్భుతంగా పనిచేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీల అమలు సహా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తున్నాం. నెలలో రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు, మూణ్నెల్లకోసారి కలెక్టర్ల సదస్సు విధిగా నిర్వహిస్తున్నాం. ఎస్‌ఐపీబీ, ఎస్‌ఐపీసీ నిర్వహించి పెట్టుబడుల ప్రతిపాదనల్ని ఆమోదిస్తున్నాం. జిల్లాల్లోనూ ఇన్‌ఛార్జ్ మంత్రులు, కలెక్టర్లు, కిందిస్థాయి సిబ్బంది వరకూ ఇదే బృందస్ఫూర్తితో పనిచేయాలి' అని సీఎం కర్తవ్యాన్ని గుర్తుచేశారు.

'ప్రభుత్వ సమాచారమంతా సింగిల్ పోర్టల్‌లోకి తెచ్చాం. ఏఐ అప్లికేషన్‌ను వినియోగిస్తున్నాం. క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన చేయడం వల్ల క్వాంటమ్ కంప్యూటర్ ఉండే ఆరేడు దేశాల్లో ఇండియా ఒకటిగా మారనుంది. రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను అమరావతిలోనే తయారుచేసి ప్రపంచానికి అందించబోతున్నాం. ఏఐ, క్వాంటమ్ (మిగతా 12లో)

మేం నాలుగు గోడల మధ్య ఉండే వ్యక్తులం కాదు



- ఏ కార్యక్రమం అమలులోనూ వెనుకబాటు ఉండకూడదు
- క్షేత్రస్థాయిలో కొంత ఉదాసీనత కనిపిస్తోంది
- ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ ప్రజలకు ఉపయోగపడాలి
- పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ ప్రజలకు ఉపయోగపడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. ఏ ఒక్క కార్యక్రమం అమలులోనూ వెనుకబాటు ఉండకూడదని, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ముందుకు వెళుతుంటే క్షేత్రస్థాయిలో పనుల పూర్తి విషయంలో కొన్ని మినహాయింపులు, ఉదాసీనత కనిపిస్తోంది. అలాంటివి లేకుండా చూడాలి. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నారు. మేం నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదు. కొన్నింటిలో కొన్ని అంతరాలున్నాయి. (మిగతా 12లో)

రూ.700 కోట్లు మళ్లించిన కేసులో.. జైల్లో ఉన్నది 9 నెలలేగా!



- రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌లో జోక్యం చేసుకోలేం
- ఆయనపై మద్యం విధానానికి రూపకర్త, ప్రధాన కుట్రదారన్న తీవ్ర ఆరోపణలున్నాయి
- నచ్చిన బ్రాండ్లను ప్రమోట్ చేసి, నెలకు రూ.50-60 కోట్లు వసూలు చేశారని అభియోగాలు
- మీ వాదనలతో ఇతరుల బెయిల్ రద్దవుతుందేమో కానీ మీకు బెయిల్ రాదు

సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కెసిరెడ్డి) బెయిల్ ప్రయత్నాలు సుప్రీంకోర్టులో ఫలించలేదు. తనకు బెయిల్ నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు జనవరి 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అతను వేసిన ఎస్ఎల్‌పీపై జోక్యానికి సుప్రీంకోర్టు విముఖత వ్యక్తం చేసింది. మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితుల(ఎ6, ఎ34, ఎ38)కు బెయిల్ ఇచ్చి తనకు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 'ఈ కేసులో మీరే (రాజ్ కెసిరెడ్డి) ప్రధాన కుట్రదారు. మద్యం పాలసీ రూపకర్త. అనుకూలమైన బ్రాండ్లను ప్రోత్సహించి ప్రతి నెలా రూ.50-60 కోట్ల ముడుపులు వసూలు చేసినట్లు దర్యాప్తు తర్వాత మీపై కచ్చితమైన ఆరోపణలు వచ్చాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో మేం ఇందులో జోక్యం చేసుకోం. కొందరు ముఖ్యమైన సాక్షుల విచారణ తర్వాత వెలుగులోకి వచ్చిన అంశాలు మీ మీదున్న నేరారోపణలతో ముడిపడి ఉన్నాయి' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అందువల్ల మీరు కొత్తగా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి అని సూచించారు. పూర్తిస్థాయిలో వాదనలు వినాలన్న కెసిరెడ్డి తరఫు న్యాయవాది విజ్ఞప్తి మేరకు విచారణను గురువారానికి వాయిదా వేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు (మిగతా 12లో)

సర్‌కు ఆటంకాలు సృష్టించనివ్వం

అందుకోసం ఎలాంటి ఉత్తర్వులు అవసరమైనా జారీ చేస్తాం

సుప్రీంకోర్టు ఉద్ఘాటన

డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే

నివారణకు ప్రామాణిక నిబంధనలు రూపొందించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

10లో

సామాజిక మాధ్యమాల వినియోగంపై 16 ఏళ్లలోపు పిల్లలకు నియంత్రణ!

ముఖ్యమంత్రి చంద్రబాబు 13లో

అది నెయ్యి కాదు.. రసాయనాలమయం

- 57.56 లక్షల కిలోల పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్
- 8.30 లక్షల కిలోల మోనోగ్లిజరైడ్స్, ఇతర రసాయనాలు కొన్న భోలేబాబా డెయిరీ
- వీటి మిశ్రమాన్నే నెయ్యి పేరిట తితిదేకు సరఫరా
- తిరుపతిలోని వినాయక ఏజెన్సీస్, సుమతి ట్రేడర్స్ ద్వారా రాష్ట్రంలోని ఇతర దేవాలయాలకూ పంపిణీ
- సిట్ దర్యాప్తులో గుట్టు రట్టు




ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన ముఠా దాని తయారీ కోసం ఏకంగా 57.56 లక్షల కిలోల పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, 8.30 లక్షల కిలోల మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్, లబ్సా తదితర రసాయనాలు కొనుగోలు చేసింది. వీటన్నింటిని వినియోగించి 68.17 లక్షల కిలోల నెయ్యి లాంటి రసాయనిక మిశ్రమాన్ని తయారు చేసింది. అందులో 59.71 లక్షల కిలోలను నెయ్యి పేరిట భోలేబాబా, వైష్ణవి డెయిరీ, మాల్ గంగా, ఏఆర్ డెయిరీల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేసి.. రూ.234.51 కోట్లు కొల్లగొట్టింది. ఈ రసాయన మిశ్రమంతోనే అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం అప్పట్లో తయారు చేశారు. తితిదేకు సరఫరా చేయగా మిగిలినదాంట్లో కొంత తిరుపతిలోని వినాయక (మిగతా 12లో)

లోక్‌సభ స్పీకరుపై అవిశ్వాస తీర్మానం!

రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఆగ్రహం

103 మంది సభ్యుల సంతకాల సేకరణ

సభాపతితో విపక్షనేత భేటీ.. సభలో అంశాలపై చర్చ



ఓం బిర్లా

దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు సమాచారం. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన (మిగతా 12లో)

సత్వర న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర

వేగంగా న్యాయం పొందడం ప్రజల హక్కు

శిక్షణ కార్యక్రమంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ 2లో

సరస్వతి వాటాల వ్యవహారంలో కౌంటరు వేస్తా

ఎన్‌సీఎల్ఏటీకి నివేదించిన షర్మిల

మధ్యంతర ఉత్తర్వులు పొడిగించిన ట్రైబ్యునల్

విజయమ్మ పిటిషన్‌పై విచారణ మార్చి 17కు వాయిదా 3లో

స్వర్ణ కార్యాలయాలపై నిరంతర పర్యవేక్షణ

అమల్లోకి మూడంచెల వ్యవస్థ

గుణదల మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

8లో

పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ తొలగింపు

పురపాలిక పీఠం కోసం కులాన్ని మార్చేసిన వైకాపా నేత

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్, వైకాపా నేత ఆనంగి హరిని పదవి నుంచి తొలగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హరి గతంలో క్రైస్తవ మతంలోకి మారి బీసీ-సీ కుల ధ్రువపత్రం పొందారు. 2014లో క్రిస్టియన్ మైనారిటీ కోటాలో కో-ఆప్షన్ సభ్యుడయ్యారు. 2019 ఎన్నికల తర్వాత వైకాపాలో చేరారు. 2020లో ఎస్సీ కుల ధ్రువీకరణపత్రం తీసుకున్నారు. 2021 మున్సిపల్ ఎన్నికల్లో పుత్తూరు పురపాలిక పీఠం ఎస్సీలకు రిజర్వ్ అయింది. దీంతో ఆయన ఆ ధ్రువపత్రం ఆధారంగా తాను ఎస్సీనని పేర్కొని ఎన్నికల్లో పోటీ చేసి ఛైర్మన్ అయ్యారు. ఈ వ్యవహారంపై గతేడాది జూన్ 9న (మిగతా 12లో)

అంబటికి బెయిలు.. మరో కేసులో మళ్లీ జైలు


- సీఎంను దూషించిన కేసులో ఊరట
- పోలీసులపై దౌర్జన్యం కేసులో రిమాండ్



విచారణ అనంతరం బయటికి వస్తున్న రాంబాబు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించిన కేసులో వైకాపా నేత అంబటి రాంబాబుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.స్రవంతి సోమవారం ఉత్తర్వులిచ్చారు. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కొట్టివేశారు. అయితే పోలీసులపై దాడికి పాల్పడి, వారి విధులకు ఆటంకం కలిగించిన మరో కేసులో ఎక్సైజ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీశారదా నమ్మ.. రాంబాబుకు ఈ నెల 20 వరకు రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ను మళ్లీ రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించినందుకు గుంటూరు నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టైన రాంబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని రాంబాబు, ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ కోర్టు జడ్జిలో పిటిషన్లు వేశారు. సోమవారం ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి జి.స్రవంతి.. రాంబాబుకు షరతులతో కూడిన (మిగతా 12లో)

సీఎంను కలిసిన తితిదే ఈవో ముద్దాడ



ఈనాడు, అమరావతి: తిరిగి ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవి చంద్ర.. ముఖ్యమంత్రి చంద్రబాబును సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని సీఎంకు అందించారు.

సత్వర న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర

- వేగంగా న్యాయం పొందడం ప్రజల హక్కు
- శిక్షణ కార్యక్రమంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్. చిత్రంలో జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ రవినాథ్ తిల్హరి

ఈనాడు, అమరావతి: సత్వర న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ విధానాన్ని అనుసరించి కేసులను పరిష్కరించుకుంటే ఇరుపక్షాల కక్షిదారులకు శాశ్వత, సంతృప్తికరమైన ఉపశమనం లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. వేగంగా న్యాయం పొందడం ప్రజల హక్కు అని గుర్తుచేశారు. సోమవారం హైకోర్టు ప్రాంగణం మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని పలువురు న్యాయమూర్తులతో కలిసి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రారంభించి ప్రసంగించారు. న్యాయం త్వరగా అందించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థతోపాటు సంబంధిత అధికారులపై ఉందన్నారు. వివాహ, వ్యవసాయ, వ్యాపార తదితర కేసుల వివాదాల్లో మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోని, కేసుల పరిష్కార దిశగా అడుగులు వేయాలని న్యాయవాదులను కోరారు.

హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ ఇప్పటికే నాలుగుసార్లు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామని గుర్తుచేశారు. భవిష్యత్తులో నిర్వహించనున్న జాతీయ మధ్యవర్తిత్వ క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో నైపుణ్యం సాధించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు న్యాయవాదులకు ఉపయోగపడతాయన్నారు. జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ వివాదాలు కోర్టులకు రాకముందే గతంలో పెద్దల మధ్య చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యేవని గుర్తుచేశారు. అలాంటి సంప్రదాయాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ టీసీడీ శేఖర్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో సాంకేతిక పద్ధతులను పాటిస్తూ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ ప్రాజెక్ట్ కమిటీకి చెందిన సీనియర్ శిక్షకులు అరుణాచలం, సందీప్ సక్సేనా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నిర్మాణ రంగ కార్మికులకు ఇక మంచి రోజులు

- వైకాపా ప్రభుత్వంలో ప్రత్యేక సంక్షేమ పథకాల నిలిపివేత
- సాయం అందక ఇబ్బందులు పడిన శ్రామికులు
- పథకాల అమలుకు దస్త్రం సిద్ధం చేస్తున్న కార్మిక శాఖ



ఈనాడు, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ఇక మంచి రోజులు రాబోతున్నాయి. వీరికి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కార్మికశాఖ దస్త్రాలు సిద్ధం చేస్తోంది. పథకాల అమలుకు కార్మికశాఖ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు వీరికి ప్రత్యేక సంక్షేమ పథకాలను నిలిపివేసింది. 'నవరత్నాలు' పథకంలో కలిపేసి, వీరికి పథకాలు సక్రమంగా అందకుండా చేసింది. దీంతో నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైకాపా సర్కారు కొలువుదీరగానే అప్పట్లో కొత్త ఇసుక విధానం పేరిట రీచ్‌లను మూసేసింది. ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కార్మికులు నెలల తరబడి ఉపాధి కరవైంది. కరోనా సమయంలో పనుల్లేక కార్మికులు ఆకలితో అలమటించినా.. వైకాపా ప్రభుత్వం వారిని ఆదుకోలేదు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను సైతం వారి సంక్షేమానికి ఖర్చు చేయలేదు. గతంలో ప్రభుత్వాలు ఎన్ని పథకాలను అమలు చేసినా నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా ప్రత్యేక పథకాలు అమలయ్యాయి. జగన్ ప్రభుత్వం 'నవరత్నాలు' పేరు చెప్పి ప్రత్యేక పథకాలను నిలిపివేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్మాణ కార్మికుల ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

20 లక్షల మంది నమోదు

రాష్ట్ర వ్యాప్తంగా భవన, ఇతర నిర్మాణ కార్మికులు 40 లక్షలకు పైగా ఉంటారని అంచనా. కానీ, సంక్షేమ బోర్డులో 19.96 లక్షల మంది నమోదయ్యారు. వీరిలో పని చేస్తున్న వారు 19.15 లక్షల మంది ఉండగా.. 80 వేల మందికి పైగా కార్మికులు పని చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. గత ప్రభుత్వంలో వీరికి ప్రత్యేక సంక్షేమ పథకాల అమలును నిలిపివేయడంతో దరఖాస్తులు కార్మికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం కొత్త రిజిస్ట్రేషన్లను సైతం నిలిపివేసింది. కొత్తగా అనేక మంది కార్మికులు నిర్మాణ రంగంలోకి వచ్చారు. వీరికి గుర్తింపు కార్డులను ఇవ్వలేదు. బోర్డు సభ్యులు కాకపోతే సంక్షేమ పథకాలు అందే పరిస్థితి ఉండదు.

గతంలో 11 పథకాలు

నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి గతంలో తెదేపా ప్రభుత్వం (2014-19)లో 11 రకాల పథకాలను అమలు చేశారు.

★ శ్రామికుల సంక్షేమానికి భవన, ఇతర నిర్మాణదారుల నుంచి ప్రత్యేకంగా 1% పన్ను వసూలు చేస్తారు. ఇలా వసూలు చేసిన నిధులు సంక్షేమ బోర్డులో రూ.3 వేల కోట్లకుపైగా ఉన్నాయి.

★ మహిళా కార్మికులు, నిర్మాణ రంగ కార్మికుల ఇద్దరు అమ్మాయిల వివాహాలకు సాయం అందిస్తారు. వివాహానికి రూ.40 వేల చొప్పున ఇవ్వనున్నారు.

★ ప్రసూతి కింద మహిళా కార్మికురాలు, కార్మికుడి భార్య, ఇద్దరు పిల్లల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ప్రసూతికి రూ.20 వేల చొప్పున ఇస్తారు.

★ కార్మికుల సహజ మరణానికి రూ.60 వేలు అందించనున్నారు.

★ కార్మికులు మరణిస్తే అంత్యక్రియలకు రూ.20 వేలు ఇస్తారు. పని ప్రదేశంలో మరణిస్తే వారిని సొంత ప్రాంతానికి తరలించేందుకు కిలోమీటరుకు రూ.20 చొప్పున అందించే సదుపాయం ఉంది. గతంలో రిజిస్టర్ కాని కార్మికులు మరణించినా.. 50 శాతానికి పైగా అంగవైకల్యం ఏర్పడినా.. అంతకంటే తక్కువ వైకల్యం ఏర్పడిన సాయం అందించేవారు దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

★ నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ అందిస్తారు. వీరికి 15 రోజులపాటు శిక్షణ ఉంటుంది. శిక్షణకు హాజరయ్యే వారికి రూ.300 చొప్పున స్టైపెండ్ చెల్లించే సదుపాయం సైతం ఉంది.

15న శ్రీకాళహస్తిలో రాహు, కేతు పూజలు రద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 15 (మహా శివరాత్రి రోజు)న రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో టి.బాపిరెడ్డి సోమవారం తెలిపారు. అదేరోజు రూ.50 టికెట్‌తో ప్రత్యేక దర్శనాన్ని కూడా నిలుపుదల చేస్తామన్నారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం దృష్ట్యా మంగళవారం నుంచి 13 రోజుల పాటు మహద్వారం లోపల నిర్వహించే రూ.2500, రూ.5 వేల విలువైన రాహు, కేతు పూజలతో పాటు అన్ని ఆర్జిత సేవలూ రద్దు చేశారు. రద్దీ నేపథ్యంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో అంతరాలయ దర్శనాలు నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

నీట్, ఈఏపీసెట్ పరీక్షలకు..
మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ: మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నీట్, ఈఏపీసెట్ పరీక్షలకు మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సెంటర్‌ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ద్వారా ఈ శిక్షణ అందిస్తామని సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 45 రోజులపాటు శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు, ఇతరవివరాలకు www.apcedmmwd.org వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఉద్యోగ అవకాశాలు

ప్రభుత్వ విద్యుత్తు సర్వీసులకు ప్రీ-పెయిడ్ సదుపాయం
ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని ప్రభుత్వ విద్యుత్తు సర్వీసులకు ఇప్పటికే ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లకు ప్రీ-పెయిడ్ సదుపాయం కల్పిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని కార్యాలయంలో ఆ సంస్థ డైరెక్టర్లు, సీజీఎంలతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో 16,082, తిరుపతిలో 19,460, చిత్తూరులో 13,871, అన్నమయ్యలో 13,311, వైఎస్సార్ కడపలో 16,829, అనంతపురంలో 8,136, శ్రీసత్యసాయిలో 6,717, కర్నూలులో 10,457, నంద్యాలలో 9,836 సర్వీసులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేశామని, వీటన్నింటినీ ప్రీ-పెయిడ్‌గా మార్చడంతో పాటు రీఛార్జ్ చేసేందుకు ఈ-వాలెట్లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అంతకుముందు నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో 39 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పిన్నెల్లి సోదరుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

గురజాల, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా గుండ్లపాడులో జంట హత్యల కేసులో నిందితులుగా ఉన్న వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిల బెయిల్ పిటిషన్‌ను గురజాల 10వ అదనపు కోర్టు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని కొట్టివేశారు. జంట హత్యల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలతో గతేడాది డిసెంబరు 11న పిన్నెల్లి సోదరులు మాచర్ల కోర్టులో లొంగిపోయారు. ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి సోమవారం విచారించి కొట్టేశారు. ప్రాసిక్యూషన్ నుంచి ఏపీపీ కందిమళ్ల సూర్యరాజు, నిందితుల తరఫున న్యాయవాదులు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, రామిరెడ్డి వాదనలు వినిపించారు.

కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో కాకాణి వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: ఓ బాలిక అత్యాచారానికి గురై మృతి చెందిన ఘటనలో తాను ప్రభుత్వంపై విమర్శలు చేసినందుకు కోవూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం హైకోర్టులో వ్యాజ్యం వేశారు.

హైకోర్టులో జోగి వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ ఈ నెల 6న తన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడం, ప్రజల రాకపోకలకు అవరోధం కలిగించామంటూ ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని వైకాపా నేత జోగి రమేష్ సోమవారం హైకోర్టులో వ్యాజ్యం వేశారు.

తిరుపతి చేరుకున్న బండ్ల గణేష్ సంకల్ప యాత్ర



తెదేపా నాయకులతో కలిసి పాదయాత్రగా వస్తున్న బండ్ల గణేష్

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: తెదేపా అధినేత చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఆయన క్షేమంగా బయటకు రావాలని ఆ ఏడు కొండల స్వామిని మొక్కుకున్నానని, అది నెరవేరిన క్రమంలో మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినట్లు సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ తెలిపారు. ఆయన చేపట్టిన సంకల్పయాత్ర సోమవారం తిరుపతి చేరిన నేపథ్యంలో తెదేపా నాయకులు, పార్టీ అభిమానులు స్వాగతం పలికారు. జనవరి 19న హైదరాబాద్ సమీప షాద్‌నగర్‌లో యాత్ర ప్రారంభించానని, 507 కి.మీ. నడుస్తూ తిరుపతి చేరుకున్నట్లు చెప్పారు. మంగళవారం అలిపిరి నుంచి తిరుమల చేరుకుని మొక్కులు తీర్చుకుంటానని వెల్లడించారు.

వయసు పెరుగుతుంటే ఇలా ఉండాలి

వయసు పెరిగే కొద్దీ కొన్ని విషయాలను తప్పక పాటించాలి. అవి..

- ఊబకాయాన్ని దూరం చేసుకోవాలి
- బరువులు ఎత్తే వ్యాయామాలు చేయాలి
- నడక నిత్యకృత్యం కావాలి
- ప్రకృతితో మమేకమవుతుండాలి
- కొత్త అంశాలు నేర్చుకోవాలి
- సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి
- ఫాస్ట్‌ఫుడ్ తినడం పూర్తిగా ఆపేయాలి
- స్నేహితులు, కుటుంబసభ్యులతో సమయం గడపాలి

– డాన్ గో, హెల్త్ కోచ్

గ్రహం అనుగ్రహం

10–2–2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం

అష్టమి: ఉ.7-27 తదుపరి నవమి

విశాఖ: ఉ. 8-15 తదుపరి అనూరాధ

వర్జ్యం: మ. 12-40 నుంచి 2-27 వరకు

అమృత ఘడియలు: రా. 11-19 నుంచి 1-05 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-50 నుంచి 9-35 వరకు తిరిగి రా. 10-58 నుంచి 11-49 వరకు

రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.6.34; **సూర్యాస్తమయం:** సా.5.55

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	12.2	32.3
హైదరాబాద్	15.4	30.7
విజయనగరం	16.0	29.0
తిరుపతి	16.6	31.8
అనంతపురం	17.7	34.9
శ్రీకాకుళం	18.0	31.0
విశాఖపట్నం	18.2	28.6
కర్నూలు	18.6	34.1
తాడేపల్లిగూడెం	19.0	32.0
కడప	19.0	32.0
రాజమహేంద్రవరం	19.0	35.0
విజయవాడ	20.0	30.8
గుంటూరు	20.0	32.0
నరసాపురం	21.0	31.6
ఒంగోలు	21.6	31.1
నెల్లూరు	22.0	31.6

సరస్వతి వాటాల వ్యవహారంలో కౌంటరు వేస్తా

- ఎన్‌సీఎల్‌ఏటీకి నివేదించిన షర్మిల
- విజయమ్మ పిటిషన్‌పై విచారణ మార్చి 17కి వాయిదా



ఈనాడు, హైదరాబాద్: సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలకు చెందిన వాటాలను వైఎస్ విజయమ్మ, చాగరి జనార్దన రెడ్డిల పేరుతో బదలాయింపు వ్యవహారంలో ప్రతివాదిగా ఉన్న తాను కౌంటరు దాఖలు చేస్తానని వైఎస్ షర్మిల సోమవారం జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)కి నివేదించారు. ఇందుకు కొంత గడువివ్వాలని కోరారు. దీంతో ట్రైబ్యునల్ విచారణను మార్చి 17కు వాయిదా వేసింది. అప్పటి వరకు జగన్‌మోహన్ రెడ్డి, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీల వాటాలను వైఎస్ విజయమ్మ, చాగరి జనార్దనరెడ్డిల పేరుతో బదలాయింపు వ్యవహారంలో యథాతథస్థితి కొనసాగించాలంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీల వాటాల బదలాయింపు తరువాత విజయమ్మకు చెందిన 99.75 శాతం వాటా యథాతథంగా కొనసాగనుంది.

విజయమ్మ, జనార్దనరెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు చేసిన తీర్మానాన్ని, దీని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాలు చేస్తూ జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు గతంలో ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. విచారించిన ఎన్‌సీఎల్‌టీ వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీల పేర్లను పునరుద్ధరించాలంటూ గత ఏడాది జులై 29న తీర్పు వెలువరించిన విషయం విదితమే. హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేయాలని కోరుతూ ఎన్‌సీఎల్‌ఏటీ చెన్నై బెంచ్‌లో సరస్వతి పవర్ లిమిటెడ్, వైఎస్ విజయమ్మ వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఎన్‌సీఎల్‌ఏటీ సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రతివాదిగా ఉన్న షర్మిల తరఫు న్యాయవాది ఎన్‌సీఎల్‌ఏటీ నోటీసులు అందుకున్నామని చెప్పారు. కౌంటరు వేయడానికి గడువు కోరారు. వాదనలు విన్న ధర్మాసనం షర్మిలతో పాటు ఇతర ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని, వీటికి రిప్లై కౌంటర్లు దాఖలు చేయాలనుకుంటే చేయాలంటూ విజయమ్మ, సరస్వతి పవర్ లిమిటెడ్ తరఫు న్యాయవాదులను ఆదేశించింది. అన్ని పక్షాలవారు మార్చి 17లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది. విజయమ్మ తరఫున న్యాయవాది ఎం.మహర్షి విశ్వరాజ్, జగన్ తరఫున సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ హాజరయ్యారు.



పాదయాత్రగా వస్తున్న భక్తులు

కొండా కోనల్లో లోయల్లో.. శివయ్య దర్శనానికి నడవాలో!

శ్రీశైలంలో కొలువైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వారిని దర్శించుకొనేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పాదయాత్రగా కదిలారు. వీరంతా నంద్యాల జిల్లా వెంకటాపురం నుంచి అటవీ మార్గంలో శ్రీశైలం వరకు నడిచి వెళ్లి దర్శించుకుంటారు. చిన్నపిల్లలు సైతం కొండాకోనలు ఎక్కి దిగుతూ వెళుతున్నారు. భక్తులకు అటవీమార్గం, క్షేత్ర పరిధిలో పలు శాఖల అధికారులు, దాతలు సేవలు అందిస్తున్నారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

అంబటికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- ఒకే ఘటనపై 35 కేసులు నమోదు చేశారన్న అంబటి తరఫు న్యాయవాది

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఘటనలో వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఠాణాల్లో నమోదు చేసిన 33 కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదుదారులకు నోటీసులిచ్చి.. విచారణను మార్చి 2కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకూడదు

తనపై నమోదు చేసిన 33 కేసులను కొట్టేయాలని అంబటి రాంబాబు అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఒకే ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35 కేసులు నమోదు చేశారన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పలు తీర్పులిచ్చిందని గుర్తుచేశారు. ఈ విషయంలో పోలీసులకు తగిన సూచనలు చేయాలని పీపీని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. నల్లపాడు ఠాణాలో నమోదైన కేసును ప్రధానమైనదిగా పరిగణించి మిగిలిన కేసుల ఎఫ్ఐఆర్‌లను సీఆర్‌పీసీ సెక్షన్ 162 ప్రకారం వాంగ్మూలాలుగా పరిగణించే విషయాన్ని పరిశీలించి తగిన సూచనలు చేస్తానన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలను పోలీసులు నిరోధించలేరని, ఈ నేపథ్యంలో వివిధ ఠాణాల్లో కేసులు నమోదు అయ్యాయన్నారు.

మరో రెండు కేసుల్లోనూ..

వెన్నుపోటు దినం పేరుతో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అడ్డుకున్న సీఐని దూషించి బెదిరించారని అంబటి రాంబాబుపై పట్టాభిపురం పోలీసులు, జూట్‌మిల్ భూ వివాదంలో అంబటి రాంబాబు జోక్యం చేసుకొని తనను బెదిరించారంటూ ఓ కార్మిక నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుపై గుంటూరు-నగరంపాలెం పోలీసులు గతేడాది నమోదు చేసిన రెండు కేసుల్లో అంబటికి నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన తెదేపా ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఏపీలో రక్షణ పరిశ్రమల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోండి

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు తెదేపా ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: ఏపీలో ఏరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను తెదేపా ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు కోరారు. ఈ మేరకు వారిద్దరూ సోమవారం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, దొనకొండ వద్ద ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, నెల్లూరులో ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ ఆధ్వర్యంలో అల్యూమినియం ప్లాంట్, అధునాతన మధ్యస్థాయి యుద్ధ విమానాల తయారీ కేంద్రాలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం సమీపంలో నావికా పరికరాలు, ఆయుధాల పరీక్ష సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గుర్తించిన మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌లలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ఏర్పాటుకు అవసరమైన చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున రక్షణ శాఖ తరఫున త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు.

అత్యవసర వైద్య సేవలకు అదనపు నిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అత్యవసర వైద్యసేవల బలోపేతంలో భాగంగా 108 అంబులెన్సులు, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల నిర్వహణకు ప్రభుత్వం రూ.56.37 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది. వైద్య విద్యా సంచాలకుల విభాగం పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధులు ఖర్చుచేసేలా పరిపాలన ఆమోదం తెలుపుతూ వైద్యారోగ్య శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఖైదీలకు చిత్రహింసలపై డీఐజీకి ఫిర్యాదు


ఈనాడు, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష పడ్డ ఖైదీలుగా ఉన్న తన తండ్రి చింత కృష్ణ, సోదరుడు చింత చంద్రశేఖర్‌నాయుడిపై జైలు అధికారులు భౌతికదాడులకు పాల్పడటంతో పాటు వారి పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారని కృష్ణ కుమార్తె విజయకుమారి కోస్తా రీజియన్ జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై తాను గతంలో హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ జైలర్లు దుర్గారమేశ్, శంకర్‌రావు, అచ్చెన్నాయుడులు తన సోదరుడిని తీవ్రంగా కొట్టారని, బలవంతంగా రెండు తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'నేను, మా అమ్మ ఇటీవల ములాఖత్‌లో కలవడానికి వెళ్లి చూడగా మా సోదరుడు చంద్రశేఖర్‌నాయుడి శరీరంపై తీవ్ర గాయాలున్నాయి. నా సోదరుడు, తండ్రిని సింగిల్ లాకప్‌లో పెడతామని జైలు అధికారులు బెదిరిస్తున్నారు. మేం తీవ్ర ఆందోళన చెందుతున్నాం. తక్షణమే చర్యలు తీసుకోండి' అని ఆమె కోరారు. దీనిపై డీఐజీ రవికిరణ్‌ను వివరణ కోరగా 'విజయకుమారి ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమే. ఆరోపణలు చేసిన ఖైదీ వివాదాస్పద వైఖరిపై ఇటీవల జైలు అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామ'ని తెలిపారు.

తిరుగులేని నేతగా తకాయిచి

జపాన్ మొదటి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలలకే ప్రజాతీర్పు కోరిన సనాయె తకాయిచి- తన సాహసోపేత నిర్ణయానికి తగినట్లు అసమాన విజయాన్ని దక్కించుకున్నారు. అక్కడి పార్లమెంటు దిగువ సభకు జరిగిన ఎన్నికల్లో ఆమె నేతృత్వంలోని సంకీర్ణ కూటమి మూడింట రెండొంతుల స్థానాలను ఒడిసిపట్టింది. అందులోనూ సొంత లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ)కి నిర్దిష్ట మెజారిటీకి మించి సీట్లు సాధించి పెట్టడంలో తకాయిచి నాయకత్వ శైలి కీలకపాత్ర పోషించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన జపాన్‌లో కొన్నాళ్లుగా ద్రవ్యోల్బణం ప్రజలను కుంగదీస్తోంది. ఆర్థిక మందగమనానికి తోడు చైనా దుందుడుకు వైఖరి జపనీయుల్లో అభద్రతను పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార పదార్థాలపై అమ్మకపు పన్నును రద్దు చేస్తానన్న తకాయిచి హామీ జపనీస్ జనసామాన్యాన్ని ఆకట్టుకుంది. వృద్ధి సాధనకు ప్రభుత్వ వ్యయం పెంచుతాం, చైనా ముప్పును కాచుకోవడానికి రక్షణ బడ్జెట్‌ను ఇతోధికం చేస్తామన్న ఆమె వాగ్దానాలూ స్థానికులను ఆకర్షించాయి. 'పని.. పని.. పని' అంటూ ఇచ్చిన నినాదాలు, మాటల్లో స్పష్టత జపనీస్ యువతలో తకాయిచిపై అభిమానాన్ని అమాంతం పెంచేశాయి. అదే సమయంలో ప్రతిపక్ష నేతలపై ప్రజల్లో అనుమానాలెన్నో తలెత్తాయి. ఇవన్నీ కలిసి జపాన్‌కు తిరుగులేని నేతగా తకాయిచిని నిలబెట్టాయి!

ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మామూలు మధ్యతరగతి కుటుంబంలో తకాయిచి జన్మించారు. 1993లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా పార్లమెంటుకు ఎన్నికైన ఆమె, ఆపై ఎల్‌డీపీలో చేరారు. జపాన్‌లో ఆరున్నర దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న చరిత్ర కలిగిన ఎల్‌డీపీ ప్రభుత్వంలో వివిధ శాఖల మంత్రిగా పనిచేశారు. నిరుడు సెప్టెంబరులో షిగెరు ఇషిబా రాజీనామా చేసిన తరవాత మూడో ప్రయత్నంలో ఆమె ప్రధాని పీఠాన్ని అధిష్ఠించారు. కరడుగట్టిన సంప్రదాయవాది అయిన తకాయిచి- జపాన్ సైనిక శక్తి పునరుద్ధరణకు పిలుపిస్తుంటారు. బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను అభిమానించే తకాయిచి- తన కారణంగా 'ఐరన్ లేడీ 2.0'గా పేరుపొందారు. జపాన్ పూర్వ ప్రధాని షింజో అబె అనుయాయిగా గుర్తింపు పొందిన ఆమె- అబె అనుసరించిన జాతీయవాద రాజకీయాలను మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్తున్నారు. జనాకర్షక పథకాలను కొనసాగిస్తూ, కట్టుతప్పిన రుణభారాన్ని నిభాయిస్తూ, స్వదేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో తకాయిచి ఎంతవరకు నెగ్గుకొస్తారో చూడాలి!

చైనా విస్తరణ వాదాన్ని గట్టిగా నిరసించే తకాయిచి- తైవాన్‌పై బీజింగ్ దండెత్తితే తమ భవిష్యత్తు భద్రత దృష్ట్యా సైనికంగా జోక్యం చేసుకోవాల్సి వస్తుందని ఇప్పటికే హెచ్చరించారు. దక్షిణ, తూర్పు చైనా సముద్రాల్లో డ్రాగన్ ఏకపక్ష పోకడల నేపథ్యంలో స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ ప్రాంతం కోసం 'క్వాడ్' బలోపేతానికి మద్దతు పలుకుతున్నారు. ఈ విషయంలో ఇండియాతో కలిసి పనిచేస్తామని తకాయిచి స్పష్టీకరించడం సంతోషదాయకం. వాస్తవానికి ఇండియా-జపాన్‌ల మధ్య శతాబ్దాలుగా సాంస్కృతిక అనుబంధం ఉంది. ఇండో-పసిఫిక్‌లో ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా అది ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఎదిగింది. రెండు దేశాల నడుమ రక్షణ పొత్తు బలపడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రెండున్నర వేల కోట్ల డాలర్లకు చేరింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దమొత్తంలో సమకూర్చడం ద్వారా ఇండియాలో ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులకు టోక్యో చేయూతనిస్తోంది. తకాయిచి హయాములో జపాన్-ఇండియా మైత్రీబంధం మరింత పటిష్ఠమైతే- ప్రాంతీయంగా శాంతి స్థిరత్వాల సాధనకు అది తోడ్పడుతుంది!



విజ్ఞానాధారిత సమాజానికి బాటలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనంగా కనిపిస్తోంది. మన ప్రాచీన విజ్ఞానాలను ఆధునిక సైన్స్‌తో; డిజిటల్ మౌలిక వసతులను సమ్మిళిత మానవాభివృద్ధి యజ్ఞంతో మేళవించారు. సంప్రదాయం, సాంకేతికతలను పరస్పర విరుద్ధమైనవిగా పరిగణించకుండా వాటి మధ్య సమతుల్యతను గుర్తించి ఆచరించడానికి ప్రాధాన్యమిచ్చారు.

ఇటీవలి కేంద్ర బడ్జెట్ ఆయుర్వేదం వంటి సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థలను భారతదేశ ప్రజారోగ్య సంరక్షణ, పరిశోధన వ్యవస్థల్లో అంతర్భాగాలుగా పరిగణించింది. ఆధునిక అలోపతి వైద్యంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వంటి ఉత్కృష్ట సంస్థలను ఏర్పరచినట్లే, సంప్రదాయ వైద్యంలోనూ అఖిల భారత ఆయుర్వేద విజ్ఞాన సంస్థలను నెలకొల్పదలచినట్లు బడ్జెట్‌లో ప్రకటించడం విశేషం. ఈ ప్రతిపాదిత ఆయుర్వేద సంస్థలు సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనలతో, క్లినికల్ ప్రయోగాలతో రుజువు చేసి ప్రామాణీకరిస్తాయి. అధునాతన రోగ నిర్ధారణ విధానాలను అవలంబిస్తాయి. ఆయుర్వేదం సమర్థ ఆరోగ్య రక్షణ విధానమని రుజువు చేయడం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు సాధిస్తాయి. సమకాలీన వైద్యంలో ఆయుర్వేదాన్ని అంతర్భాగం చేస్తాయి. దానికి కావాల్సిన మూలికల సాగును ప్రోత్సహించి జీవవైవిధ్య పరిరక్షణతో పాటు గ్రామీణుల ఆదాయాలను పెంచడానికీ బడ్జెట్ ప్రతిపాదన ఊతమిస్తోంది.

బయోఫార్మాకు ప్రాధాన్యం



ఆధునిక జీవన శైలి, దైనందిన ఒత్తిళ్ల వల్ల దేశంలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయనే వాస్తవాన్ని బడ్జెట్ అంగీకరించింది. ఇప్పటికే ఉన్న మానసిక చికిత్సాలయాలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు కొత్తవాటినీ నెలకొల్పాలని ప్రతిపాదించింది. ఉత్తర భారతంలో మానసిక చికిత్సా కేంద్రాలు తక్కువగా ఉన్నాయని గ్రహించి, అక్కడ ఎక్కువగా వాటిని కొలువుదీర్చడం ద్వారా ప్రాంతీయ అసమతుల్యతను సరిదిద్దాలని సంకల్పించింది. వాటికి అవసరమైన నిపుణ సిబ్బందినీ తయారు చేసుకోవాల్సిన అవసరాన్నీ గుర్తించింది. శరీరం, మనసు, ప్రకృతి మధ్య సమతుల్యత ఉన్నప్పుడే పరిపూర్ణ స్వస్థత చేకూరుతుందనే ఆయుర్వేద సారాన్ని అమలులో పెట్టడానికి బడ్జెట్ ముందడుగు వేసింది.

బయోఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు బడ్జెట్ అమిత ప్రాధాన్యమిచ్చింది. ప్రజారోగ్య రక్షణకు, ఆర్థిక ప్రగతికి, అంతర్జాతీయ ఫార్మా విపణిలో పోటీ పడటానికి ఈ రంగాలు పునాదిగా నిలుస్తాయి. ఇంతకాలం జనరిక్ మందులపైనే ఆధారపడుతూ వచ్చిన భారతదేశం ఇకపై అధిక విలువనిచ్చే బయోలాజిక్స్, బయోసిమిలర్స్, టీకాలు, అధునాతన చికిత్సా విధానాలకు ప్రాధాన్యమివ్వదలచింది. అందుకే బయోఫార్మా ముడిసరకుల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలని బడ్జెట్ ప్రతిపాదించింది. నాణ్యమైన బయోఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడానికీ బడ్జెట్ ప్రాధాన్యమిస్తోంది. దేశంలో ఇప్పటికే ఉన్న జాతీయ ఔషధ విద్యా, పరిశోధన సంస్థలకు (నైపర్లకు) తోడు కొత్తవి ఏర్పాటు చేయాలని కేంద్ర పద్దు ప్రతిపాదించింది. బయోఫార్మా రంగ అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై బయోలాజిక్స్, బయోసిమిలర్స్ మందుల పరిశోధన, ఉత్పత్తికి మరింత సిబ్బంది అవసరపడతారు. వారిని తయారు చేయడానికే కొత్త నైపర్లను ఏర్పాటుచేయదలిచారు. విద్యా సంస్థలు, పరిశ్రమ, ప్రభుత్వం మధ్య నైపర్లు అనుసంధానం ఏర్పరుస్తాయి.

విద్యా రంగానికీ ఇటీవలి కేంద్ర బడ్జెట్ పెద్దపీట వేసింది. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరడానికి అవసరమైన సృజనాత్మకత, నైపుణ్యాలు, నవీకరణను అభివృద్ధి చేయడానికి విద్యా సంస్థల్లో కాంటెంట్ లేబొరేటరీల ఏర్పాటుకు ప్రతిపాదించింది. డిజిటల్ కమ్యూనికేషన్లు, వివిధ రంగాలు కలిసి సమస్యా పరిష్కారాన్ని సాధించడం విజ్ఞానాధారిత సమాజానికి కీలకం. అందుకే విద్యాలయాల్లో కాంటెంట్ క్రియేషన్, ఇన్నోవేషన్ ల్యాబులను ఏర్పాటు చేయదలిచారు. ప్రతి జిల్లాలో బాలికల హాస్టల్‌ను నెలకొల్పాలన్నది మరో ముఖ్యమైన ప్రతిపాదన. గ్రామీణ, బలహీన వర్గాలకు చెందిన బాలికలు చదువుకోవడానికి దూరాభారం పయనించాల్సి వస్తోంది. ఈ క్రమంలో భద్రత కరవవుతోంది. దీనికి జడిసి చాలామంది అమ్మాయిలు చదువుకోవాలంటే వెనకడుగు వేస్తున్నారు. దీన్ని నివారించడానికి బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మేలిమి అంశాల కలయిక

సమాచారం (డేటా) ఒక ఆర్థిక ఆస్తి. అందుకే డేటా సెంటర్లు, క్లౌడ్ వసతులను ప్రోత్సహించడానికి 2047 వరకు బడ్జెట్లో పన్ను విరామం ప్రకటించారు. దీనివల్ల పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షించవచ్చు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణకు తోడ్పడవచ్చు. నేడు విద్య, పరిపాలన, వ్యవసాయం, ఆరోగ్య రక్షణ రంగాల్లో ఏఐ వినియోగం పెరిగిపోతున్న క్రమంలో డేటా, క్లౌడ్ కేంద్రాలు తప్పనిసరి అవుతున్నాయి. వీటిలో సమాచార నిల్వ, పంపిణీ సౌకర్యాలు ఆధునిక విజ్ఞానాధారిత సమాజ సృష్టికి కీలకమవుతాయి. బడ్జెట్లో ప్రకటించిన భారత్-విస్తార్ రైతులకు ఎంతగానో మేలు చేసే కృత్రిమ మేధా వేదిక. రైతులకు వారు ఉన్నచోటనే మాతృభాషలో వ్యవసాయ సమాచారాన్ని సమకూర్చుతుంది. అగ్రిస్టాక్‌లోని రైతుల డిజిటల్ రికార్డులను పరిగణనలోకి తీసుకుని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) సిఫార్సుల ప్రకారం ఎప్పటికప్పుడు శాస్త్రీయ సమాచారాన్ని అందిస్తుంది. దిగుబడులను పెంచడానికి తోడ్పడుతుంది. భారత్-విస్తార్ రైతు చేతిలో సరికొత్త డిజిటల్ సాధనంగా నిలుస్తుంది. మొత్తంమీద 2026 బడ్జెట్ సంప్రదాయం, ఆధునికత; నవీకరణ, సమ్మిళిత అభివృద్ధి; ఆర్థిక ప్రగతి, సామాజిక అభివృద్ధుల సంగమంగా కనిపిస్తోంది. సుస్థిర, సంపూర్ణ, విజ్ఞానాధారిత సమాజ సాధనకు వారధిగా అది రూపుదిద్దుకుంది. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచంలో అగ్ర శక్తుల్లో ఒకటిగా నిలపడానికి సాయపడుతుంది.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

శ్రీనివాస్ ఫోన్ మోగింది. తెల్లారితే చెల్లెలి పెళ్లి. అంతా సంగీత్ మూడ్‌లో ఉత్సాహంతో ఆడుతూపాడుతూ ఉన్నారు. ఫోన్ ఆన్సర్ చేసి మాట్లాడుతూ శ్రీనివాస్ ఒక్కసారిగా సోఫాలో కూలబడిపోయాడు. ఉన్నట్టుండి భోరున విలపించాడు. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. అందరూ కంగారు పడుతున్నారు. 'చెల్లెలూ బావగారికి రాసిచ్చిన ఇల్లు రోడ్డు వెడల్పులో కొట్టేస్తున్నారట. రేపు నోటీసులు ఇస్తారట అందరికీ అని ఊరినుంచి కబురు వచ్చింది' అని ఏడుస్తూ చెప్పాడు. శుభకార్యం జరిగే ఇల్లంతా విషాదంతో నిండిపోయింది. మ్యూజిక్ ట్రూప్ వాళ్లని బంధువులు డబ్బులిచ్చి పంపించే పనిలో ఉన్నారు. ఇంతలో మళ్లీ శ్రీనివాస్ ఫోన్ మోగింది. కన్నీళ్లు ఆపుకుంటూ ఫోన్ ఎత్తిన శ్రీనివాస్ రెండు నిముషాలు అవగానే 'హేయ్' అంటూ ఉత్సాహంతో లేచి గంతులేశాడు. 'ఆ మ్యూజిక్ వాళ్లని ఆపండి.. అందరం డాన్స్ చేయాలి' అంటూ ఉత్సాహంలో చిన్నపిల్లాడిలా మారిపోయి మాట్లాడేస్తున్నాడు. అసలేంటి కథ



మిత్రుడూ శత్రువూ మనసే

అని ఆరా తీస్తే ఆ నోటీసులు తమ ఊరి పేరులాగే ఉన్న మండలంలోని మరో ఊరికి అని తెలిసింది. అరగంటకు ముందు శ్రీనివాస్ దుఃఖంలో ఉన్నాడు. ఇప్పుడు ఉత్సాహంతో చిందులేస్తున్నాడు. కారణం? అతని మనసు.

రాజేష్‌కి ఉద్యోగంలో ఇంక్రిమెంట్ ఇచ్చారు. అతను మంచి పనిమంతుడే. కానీ పక్కవారితో కంపేర్ చేసుకుని సంస్థను శాపనార్థాలు పెట్టాడు. ఆ కోపంతో సరిగ్గా పనిచేయటం మానేశాడు. ఉన్నట్టుండి స్టాక్‌మార్కెట్‌లో ఒడుదొడుకుల వల్ల కంపెనీకి నష్టాలొచ్చాయి. మేనేజ్‌మెంట్ ఒకరోజు పూర్ పెర్ఫార్మెన్స్ ఉన్న ఉద్యోగులను పిలిచి సంస్థ లాస్‌లో ఉంది రాజీనామా చేయమంది. రాజేష్ కాళ్లావేళ్లా పడ్డాడు. తనకి అసలు ఇంక్రిమెంట్లు ఏమీ వద్దని ఉద్యోగంలో ఉంచితే చాలని రిక్వెస్ట్ చేసినా లాభం లేకపోయింది. పక్కవాడి కంటే 4వేలు తక్కువ వచ్చిందని సరిగ్గా పనిచేయడమే మానేసిన అతనే ఇప్పుడు అసలు ఇంక్రిమెంటే వద్దన్నాడు. కారణం? మనసు. ఆరోజు సంతృప్తి పొంది, పాజిటివ్‌గా స్పందించి ఉంటే ఉద్యోగం నిలబడేది.

మనసనేది మనిషిని కంట్రోల్ చేసే రిమోట్. దాన్ని మనిషి నియంత్రించాలి. కానీ, మనల్ని అది ఆడించకూడదు. ఆఫీసులో, ఇరుగుపొరుగులో హీరోను చేయాలన్నా, విలన్‌ను చేయాలన్నా సూత్రధారి మనసే. ఆలోచనలు, ప్రవర్తన వీటిని ఆడించేది అదే. మన పాలిట బంధువు, శత్రువు అదే. అదెంత స్వచ్ఛంగా ఉంటే మన ఆచరణా అలాగే ఉంటుంది. దాన్నిబట్టే ఆదరణా ఉంటుంది. రోజూ కాసేపైనా మన మనసుతో గడపాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. అప్పుడే మనసుకు పట్టే మకిలి ఎప్పటికప్పుడు వదిలిపోతుంది. మనసులోకి విషం ఎక్కించేవారికి దూరం జరగాలి. ఇతరుల దోషాలను ఎంచేముందు మనం ఆ స్థానంలో ఉంటే ఏం చేసేవారం? మనం ఎప్పుడూ తప్పు చేయలేదా? మనం ఎవరినీ నిందించలేదా? అని ప్రశ్నించుకోవాలి. అనుమానం, అసూయ, పరనింద, ఆత్మస్తుతి, వక్రబుద్ధి, గాసిప్స్ వినడం, మాట్లాడటం ఇవన్నీ హానికారకాలు. వీటికి ఎంతదూరంగా ఉంటే మానసిక, శారీరక ఆరోగ్యం అంత బాగుంటుంది.

– పొచిరాజు శ్రీరామ్



నదీ ప్రవాహం పుట్టిన చోట ఎంత స్వచ్ఛంగా ఉంటుందో జీవితం కూడా ప్రారంభంలో అలాగే ఉంటుంది. పెరిగే కొద్దీ కోపం, ద్వేషం, అసూయ, దురాశ... లాంటి కల్మషాలను చేర్చుకుంటూ దాన్ని కలుషితం చేస్తాం. అప్పుడిక ముఖాల్లో నిర్మలత్వం ఎక్కడినుంచి వస్తుంది?

– సారా జోసెఫ్, రచయిత్రి

సంకల్ప బలం

మనిషి జీవితంలో సుఖాలు, దుఃఖాలు, విజయాలు, వైఫల్యాలు అనే కొండలను, లోయలను ఎక్కుతూ దిగుతూ ముందుకు పయనించాల్సిందే! నిజానికి ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ప్రాథమిక ఇంధనం ఏమై ఉంటుందీ అంటే- సంకల్ప బలం అని చెప్పొచ్చు. అది మనిషి లోపల దాగి ఉండే అద్భుతమైన శక్తి! మనిషిని మనీషిగా, సాధారణాన్ని అసాధారణంగా మలిచే గొప్ప గుణం!

మహాభారతంలోని ఆనుశాసనిక పర్వంలో సంకల్ప బలం గురించి మంచి కథ ఉంది. ఉపమన్యుడు నిరుపేద కుటుంబంలో జన్మించాడు. ఆ బాలుడు ఒకరోజు తల్లితో కలిసి మేనమామ ఇంటికి చుట్టంచూపుగా వెళ్లాడు. అక్కడ మేనమామ పిల్లలు పాలు తాగుతూ ఇతడికి కూడా కొంచెం ఇచ్చారు. ఉపమన్యుడికి ఊహ వచ్చాక పాలు రుచి చూడటం అదే మొదటిసారి. దాంతో తిరిగి ఇంటికి వెళ్లాక తల్లిని పాలు కావాలని అడిగాడు. 'మన దురదృష్టం వల్ల పేదవారిగా పుట్టాం. పాలు కొని తాగలేని నిర్భాగ్యులం' అని బుజ్జగిస్తూ చెప్పింది తల్లి. ఉపమన్యుడు ఒక్కసారిగా బావురుమన్నాడు. పిల్లాడి ఏడుపు చూసి తల్లి తల్లడిల్లిపోయింది. వార్చిన అన్నపు గంజిలో నీళ్లు, కాస్త తీపి కలిపి 'నాయనా ఇవిగో పాలు, తాగు' అని ఇచ్చింది.



వాటి రుచి చూడగానే బాలుడు 'ఇవి పాలు కానే కాదు. నాకు నిజమైన పాలే కావాలి' అంటూ మారాం చేశాడు. 'నా చిట్టితండ్రీ! శివుడి ఆజ్ఞ లేకుండా ఏదీ జరగదు. కాబట్టి పరమేశ్వరుణ్ని స్మరించు. అప్పుడు గిన్నెడు పాలే కాదు, ఆ క్షీరసాగరమే తరలివస్తుంది. నీ కోరికలన్నీ ఫలిస్తాయి' అని ఉపదేశించింది.

అంతర్యామి

తల్లి పలుకులు శ్రద్ధగా ఆలకించిన ఉపమన్యుడు కంటినీరు తుడుచుకుంటూ, లేత మనసును దృఢం చేసుకున్నాడు. శివుడి అనుగ్రహం కోరుతూ హిమాలయాల్లో కఠిన తపస్సు చేయనారంభించాడు. ఉపమన్యుడి భక్తికి ముగ్ధుడైన శివుడు ఇంద్రుడి వేషంలో అతడి ముందు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. పరమేశ్వరుడి అనుగ్రహం కోసం దృఢ సంకల్పంతో ఉన్న ఉపమన్యుడు తన అచంచల భక్తిని ప్రదర్శిస్తూ, 'నాకు శివయ్య దర్శనం తప్ప మరే ఇతర వరం వద్దు' అని నిరాకరించాడు. ఆ భక్తికి సంతోషించిన శివుడు తన నిజరూపాన్ని వెల్లడించి అపార దయా వర్షం కురిపించాడు. పార్వతీదేవి సైతం తన కరుణా కటాక్ష వీక్షణాలను అతడిపై ప్రసరింపజేసింది. ఉపమన్యుడి కథ స్వచ్ఛమైన, అచంచలమైన భక్తికి, సంకల్ప సిద్ధికి ప్రతీక!

సంకల్ప బలం అంటే ఏదైనా చేయాలనే కోరిక మాత్రమే కాదు. ఆ కోరికను కార్యరూపంలోకి మార్చేందుకు తీసుకునే దృఢ నిర్ణయం, అవిచ్ఛిన్నమైన పట్టుదల కూడా! ఏకాగ్రతతో మనసు, శరీరం మధ్య సమన్వయాన్ని సాధించి, అన్ని ఆటంకాలను అధిగమించే సామర్థ్యం! లోతైన భక్తికి, నిష్కామమైన కోరికలకు భగవానుడు తప్పకుండా దాసోహమవుతాడు. సంకల్పం సరైనదైతే దానికి బలంగా ఆయనే మారతాడన్నది సత్యం!

– కె.వి.సుమలత

మంచి నీరు కరవై...

పల్లెలూ పట్టణాల్లో చాలామందికి పరిశుభ్రమైన తాగునీరు అందని వరం అవుతోంది. కలుషిత నీటి కారణంగా నిరుడు ఏపీలో దాదాపు 42వేల డయేరియా కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో వాటి సంఖ్య 38వేలు. బ్యాక్టీరియాతో నిండిన నీటిని తాగడం వల్ల ఏపీలో గతేడాది 36వేల మందికి టైఫాయిడ్ సోకితే, తెలంగాణలో ఆ వ్యాధి పీడితుల సంఖ్య ఆరు వేలకు పైబడింది. నిర్ధారణ పరీక్షలు పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల చాలా కేసులు వెలుగులోకి రావడంలేదు. కలుషిత జలాల వల్ల 2025లో దేశవ్యాప్తంగా ఎంతమంది ఆయా వ్యాధుల గుప్పిట చిక్కారంటే...

డయేరియా	23,51,962
టైఫాయిడ్	5,67,775
హెపటైటిస్-ఎ	40464
లెప్టోస్పైరోసిస్	20888
హెపటైటిస్-ఇ	2537
కలరా	1131

(ఆధారం: రాజ్యసభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

మరో వేలూరి ఎప్పుడొస్తారో!

ఫలితాలపై నిర్దిష్టమైన స్పష్టతతో సుదీర్ఘమైన లక్ష్యాలను పెట్టుకుని నిశితమైన అధ్యయనం, నిర్ద్వంద్వ విమర్శతో నిరంతరం శ్రమించే అలనాటి తరానికి చెందినవారిలో శిఖర సమానులు వేలూరి వేంకటేశ్వర రావు. 1938లో నేటి ఏలూరు జిల్లాలోని చింతలపూడిలో జన్మించిన వేలూరి చాలామంది రచయితల్లాగే అచ్చులో పేరు చూసుకోవాలనే ఆసక్తితో ప్రస్థానం ప్రారంభించారు. ఇంట్లో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక దినపత్రికలు చదివే

వేలూరి వేంకటేశ్వర రావు వెళ్లిపోవడం మన సాహిత్యంలో, ముఖ్యంగా అమెరికా తెలుగు సాహితీ ప్రపంచంలో పెద్ద ఖాళీని సృష్టించింది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలతో పాటు చిత్రకళ, ఫొటోగ్రఫీపై లోతైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. చేతిరాతతో పత్రికను నడపడం దగ్గర మొదలు పెట్టి డిజిటల్ పత్రిక సంపాదకుడిగా వ్యవహరించడం వరకూ సాగిన వేలూరి ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం.

అలవాటు ఉండటం వల్ల చిన్నతనంలోనే అధ్యయనం అలవడింది. దాంతో లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ, హైస్కూలు రోజుల్లోనే కథలు రాయడం ప్రారంభించి, కాలేజీకి వచ్చేసరికి రొమాంటిక్ కథలు కూడా రాసేశారు. ఇప్పటిలా కేవలం ర్యాంకుల కోసమే చదువు కానందువల్ల, విద్యార్థులను ప్రోత్సహించడానికి విద్యాసంస్థలు ఏటా ఒకటో రెండో మ్యాగజైన్లు ప్రచురించేవి. వాటిలో వేలూరి రచనలు అచ్చయ్యేవి. ఉత్సాహం ఉరకలు వేసే ఇరవై ఏళ్ల వయసులో పత్రిక నడపడానికి సిద్ధమయ్యారు. మిత్రుడు వడ్లపట్ల దయానందం ఎడిటర్‌గా 'ఏలూరు వీక్లీ' పేరుతో వచ్చిన ఆ పత్రికలో స్థానిక రాజకీయ నేతలందరినీ ఏకిపారేసేవారు. అది మూత పడటం, పీజీ చేయడానికి ఆంధ్ర యూనివర్సిటీకి వెళ్లడంతో వేలూరిలోని సాహిత్యాభిలాష కొత్త పుంతలు తొక్కింది.

కొత్త ఒరవడి దిద్దిన ప్రజ్ఞాశాలి

'నీ స్నేహితులెవరో చెప్పు, నువ్వు ఎలాంటివాడివో చెప్తా' అనే నానుడి తెల్సిందే కదా. మరి వేలూరి స్నేహితులు ఎవరో తెలుసా? శ్రీశ్రీ, తిలక్, బంగోరే, చేకూరి రామారావు, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, అబ్బూరి రామకృష్ణారావు, రావిశాస్త్రి. తిలక్‌తో ఎంత సాన్నిహిత్యమంటే, ఏలూరు క్లబ్‌కి వచ్చే ఆయనతో పేకాట మాన్పించేటంత. ఇక ప్రముఖ సాహితీవేత్త వేల్చేరు నారాయణరావుతో తొలినాళ్ల నుంచీ స్నేహం



కొనసాగింది. వేల్చేరు మదిలోని 'కావ్యదహనోత్సవం'కు వేలూరి రూపం ఇచ్చారు. 1958లో ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్‌లో దాన్ని తొలిసారి ప్రదర్శించారు. మరో రెండేళ్లకు మెరుగుపరిచి ఆంధ్ర యూనివర్సిటీలో ప్రదర్శన ఇచ్చారు. అది విజయవంతమైంది. 'డిలాన్ థామస్ లాంటి కవిత్వం ఇక్కడ కూడా రావల్సి ఉంద'ని తిలక్ ప్రోత్సహిస్తే, శాంతినికేతన్‌లో చదువుకున్న సూర్యనారాయణరాజు అనే స్నేహితుడు పాశ్చాత్య సాహిత్య పుస్తకాలు అందించి వేలూరిలో కొత్త ఆలోచనలకు దారులు తీశారు. దాంతో ఇంగ్లిషులో కవితలు రాసి 'కారవాన్' పత్రికలో ప్రకటించారు. ఆ ఊపులోనే జీన్ పాల్ సార్త్రే, ఆల్డస్ హెక్స్లీలకు వేలూరి ఉత్తరాలు కూడా రాశారు. పైచదువుల కోసం అమెరికా చేరుకున్నాక చికాగో తెలుగు సంఘంవారి 'తెలుగు వెలుగు' మాసపత్రికను చేతిరాతతో నడిపారు. జూలై 2004 నుంచి మే 2013 వరకూ 'ఈమాట' ఆన్‌లైన్ మాసపత్రికకు సంపాదకులుగా వ్యవహరించి తెలుగు సాహిత్య లోకంలో కొత్త ఒరవడి దిద్దారు. అయితే, ఇదంతా ఆయనేదో సుఖంగా, బ్రహ్మాండమైన ఉద్యోగం చేసుకుంటూ కాలక్షేపంగా చేయలేదు. తన భుక్తి కోసం ఫెలోషిప్‌లు వినియోగించుకుంటూ, అందుకోసం కోర్సులు చేస్తూ, ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్లవారికి సాయం చేస్తూనే ఇవన్నీ నెత్తికెత్తుకున్నారు. చుట్టూ ఉన్న ప్రవాస తెలుగువారిని రచయితలుగా ప్రోత్సహించారు. 'తెలుగు డయాస్పోరా' కథకు శ్రీకారం చుట్టారు.

అనువాదాల్లోనూ అందెవేసిన చెయ్యి

వేలూరి ఎన్నో ముఖ్యమైన అనువాదాలు కూడా చేశారు. తన మిత్రుడు, అద్భుతమైన ఒడియా కవి సౌభాగ్య కుమార్ మిశ్రా కవితలను వెనిగళ్ల బాలకృష్ణ సాయంతో 'ద్వాసుపర్ణా', 'అవ్యయ' పేరిట రెండు సంపుటాలుగా తెలుగులోకి అనువదించారు. వీటిలోని ప్రతి కవితా తెలుగు కవితంత స్వచ్ఛంగా ఉండటం ఈ అనువాదం ప్రత్యేకత. 'ఆ నేల ఆ నీరు ఆ గాలి' పేరుతో కథా సంపుటి వెలువరించారు. 'గోమెజ్ ఎప్పుడొస్తాడో' కథ మనుషుల్లోని వైరుధ్యాలను వినూత్నంగా ఆవిష్కరిస్తుంది. హాస్యం, వ్యంగ్యం కలగలిసిన శైలితో వేలూరి కథలు చురుక్కుమనిపిస్తాయి. గాంధీని అమితంగా ఇష్టపడే ఆయన, గాంధీ సమగ్ర సాహిత్యాన్ని అమెరికా తెప్పించుకుని చదివారు. అంతేకాదు, ఓ కథలో గాంధీని ప్రవేశపెట్టి కథనాన్ని రక్తికట్టించారు.

కటక్‌లో ఫిజిక్స్ పాఠాలు చెప్పిన వేలూరి, భౌతిక శాస్త్ర పరిశోధకుడిగా చికాగో యూనివర్సిటీ నుంచి పదవీ విరమణ చేశారు. తెలుగు సాహిత్యాన్ని ఎల్లలు దాటించిన ఆయన మొన్న ఏడోతేదీన అమెరికాలోని ఫీనిక్స్ నగరంలో కీర్తిశేషులయ్యారు. ఆయన తన చివరి కథలో "స్వర్గం భూమిపైనే ఉంది. ఆ స్వర్గాన్ని ధ్వంసం చెయ్యకండి అనే జనం నా గురించి ప్రార్థిస్తే సంతోషిస్తాను" అంటారు. ఇటువంటి ఉద్దండులు వెళ్లిపోయాక స్వర్గం ఇంకా ఇక్కడే ఎందుకు ఉంటుంది? మళ్లీ వస్తే తప్ప!

– దేశరాజు, కవి, కథకులు

కన్నీళ్లు ఎన్ని రకాలో!

హలో ఫ్రెండ్స్..! అమ్మానాన్నలు మనకు నచ్చింది కొనివ్వకపోయినా, నడుస్తూ కిందపడిపోయినా గోల పెట్టి ఏడ్చేస్తుంటాం కదా! అప్పుడు మనకు కళ్ల నుంచి నీళ్లు వస్తాయి. అలా ఎందుకు వస్తాయని ఎప్పుడైనా ఆలోచించారా?

మనం బాధలో ఉన్నా, ఎక్కువ కోపంలో ఉన్నా, అంతుపట్టలేని సంతోషంలో ఉన్నా మెదడులోని లింబిక్ సిస్టమ్ కన్నీటి గ్రంథులను ప్రేరేపిస్తుంది. దాంతో మనకు తెలియకుండానే ఆటోమేటిక్‌గా కన్నీళ్లు వస్తాయి. ఉల్లిపాయలు కోస్తున్నప్పుడు దానిలో నుంచి 'సిన్ ప్రొపానెథియల్ ఎస్ ఆక్సైడ్' అనే గ్యాస్ విడుదలవుతుంది. అది కంటిలోని తేమతో కలిసినప్పుడు బలహీనమైన సల్ఫర్ ఏర్పడుతుంది. దానివల్ల వచ్చే మంటను తగ్గించడానికి కళ్లు నీటిని విడుదల చేస్తాయి.



ఎక్కువగా స్క్రీన్ చూడటం వల్ల కళ్లు పొడిబారుతుంటాయి కదా! ఆ సమయంలో శరీరం అత్యవసరంగా నీటిని ఉత్పత్తి చేస్తుంది. అప్పుడూ కళ్ల నుంచి నీళ్లు వస్తాయి. మరో విషయం ఏంటంటే.. కన్నీళ్ల వల్ల మనకు కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అవి కనుగుడ్డును తేమగా ఉంచి వెలుతురు సరిగ్గా లోపలికి వెళ్లేలా చేస్తాయి. దుమ్మూధూళి కంట్లో పడినప్పుడు, బాక్టీరియాను ఎప్పటికప్పుడు కడిగేస్తాయి. లాక్రిమల్ గ్లాండ్స్ కంటి పైభాగంలో ఉంటాయి. ఇక్కడే కన్నీళ్లు తయారవుతాయి. మనం రెప్ప వేసిన ప్రతీసారీ కన్నీళ్లు కంటిపై పొరలా పరుచుకుంటాయి. కన్నీళ్లలో మూడు రకాలు ఉంటాయి.. ఒకటి బేసల్ టియర్స్ ఇవి కంటిని ఎప్పటికీ తడిగా ఉంచి, ధూళి నుంచి రక్షిస్తాయి. రెండోది రిఫ్లెక్స్ టియర్స్ ఉల్లిపాయలు కోసినప్పుడు లేదా కంటిలో ఏదైనా పడినప్పుడు రక్షణగా వస్తాయి. మూడోది ఎమోషనల్ టియర్స్. వీటిలో ప్రోలాక్టిన్ హార్మోన్లు ఎక్కువగా ఉంటాయి. అందుకే ఏడ్చిన తరవాత మనసు రిలాక్స్‌గా ఉంటుందట..! ★

నేనెవర్ని?

1. నేనో నాలుగు అక్షరాల పదాన్ని. 'ఆరు'లో ఉంటాను కానీ 'కారు'లో లేను. 'లోకం'లో ఉంటాను కానీ 'అంకం'లో లేను. 'చరణం'లో ఉంటాను కానీ 'కారణం'లో లేను. 'నది'లో ఉంటాను కానీ 'గది'లో లేను. నేనెవర్ని?
2. మూడు అక్షరాల పదాన్ని నేను. 'సంబరం'లో ఉంటాను కానీ 'అంబరం'లో లేను. 'తోట'లో ఉంటాను కానీ 'వేట'లో లేను. 'వేషం'లో ఉంటాను కానీ 'వేళ'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.ఆలోచన 2.సంతోషం



విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావుతో కలిసి జూబిలేరియన్ గురువులు మద్దాల జోసఫ్, నేలటూరి ఫ్రాన్సిస్ తదితరులు వేడుకల ప్రారంభ సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పటమట



విద్యుత్తు వెలుగుల్లో గుణదల కొండ

వృద్ధే ముద్దు.. ఆకాశమే హద్దు

- వేగంగా జీడీపీ పెరుగుదలలో విజయ'దశ'
- కీలక ప్రగతి సూచికలో 'పశ్చిమ' ప్రథమం

ఈనాడు, అమరావతి

ఎన్టీఆర్ జిల్లా ప్రగతి పథ సోపానాన్ని చకచకా అధిరోహిస్తోంది. పారిశ్రామిక, సేవా రంగాల్లో మంచి వృద్ధి రేటు సాధిస్తోంది. కీలక ప్రగతి సూచికలో మొదటి ఐదు నియోజకవర్గాల్లో రెండు స్థానాలు సాధించగా.. తలసరి ఆదాయం విషయంలో మెరుగుదలతో దూసుకెళుతోంది. సోమవారం సీఎం ఆధ్వర్యంలో మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వర్చువల్‌గా హాజరయ్యారు.



సమావేశానికి వర్చువల్‌గా హాజరైన కలెక్టర్, సీపీ

వృద్ధి రేటు పరుగులు...

విజయవాడ

ప్రపంచంలో వేగంగా జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) పెరుగుతున్న నగరాల జాబితాలో (ఫాస్టెస్ట్ గ్రోతింగ్ సిటీస్) విజయవాడ పదో స్థానంలో నిలిచింది. 2019 నుంచి ఇప్పటి వరకు జీడీపీలో పెరుగుదలను ప్రామాణికంగా తీసుకోగా 9.17 శాతంతో సూరత్ మొదటి స్థానంలో ఉంటే.. విజయవాడ 8.16 శాతం సాధించింది.

భళా.. పశ్చిమ, తూర్పు

కీలక ప్రగతి సూచిక ప్రకారం రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో విజయవాడ పశ్చిమ 93 స్కోర్ పాయింట్లతో ప్రథమ, 91 పాయింట్లతో విజయవాడ తూర్పు నాలుగో స్థానంలో నిలిచాయి. విద్యా, వైద్యం, పర్యాటకం, పరిశ్రమలు, ఆధ్యాత్మికం, సేవారంగం వంటి 69 నుంచి 75 ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఈ స్కోర్లు ఇచ్చారు.

అ'ద్వితీయ' సేవ

సేవారంగం ద్వారా జిల్లాకు వచ్చే ఆదాయం ఒక్క ఏడాదిలో రూ.8 వేల కోట్లు పెరిగి రూ.65,291 కోట్లకు చేరింది. రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది.

తలసరి.. చక్కని సిరి

తలసరి ఆదాయం విషయంలో మంచి వృద్ధి కనబరుస్తోంది. గత భేటీలో విశాఖ, కృష్ణా, ఏలూరు తొలి మూడు స్థానాల్లో ఉండగా.. ఈసారి రూ.3,91,390 తలసరి ఆదాయంతో ఏలూరును వెనక్కి నెట్టి మూడో స్థానంలో నిలిచింది.

భళారే... జీడీడీపీ

జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ) విషయంలో పురోగతి బాగుంది. 2024-25లో రూ.93,132 కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.1,05,173 కోట్లకు పెరిగింది. అప్పటితో పోలిస్తే 12.93 శాతం పెరుగుదల ఉంది.

మట్టి తరలింపుపై గట్టి హెచ్చరిక..

జిల్లా నుంచి అమరావతి నిర్మాణాల కోసం తరలిస్తున్న మట్టి విషయం తమకు చెప్పటం లేదని కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈవిషయం సీఎం దృష్టికి రావడంతో కలెక్టర్ లక్ష్మీశతో మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి మట్టి తరలిస్తే ప్రజాప్రతినిధులకు ఇబ్బంది ఏంటి? దీనిని కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించాలి. ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని ఆదేశించారు.

సాంకేతికతతో నేరాల కట్టడి

సీపీ రాజశేఖరబాబుకు సీఎం ప్రశంస

ఈనాడు - అమరావతి: విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాల వినియోగం ద్వారా నేరాలను కట్టడి చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పలు కేసులను ఛేదించారు. ఈ విషయంలో మంచి పురోగతి సాధించినందుకు సీపీ రాజశేఖర్‌బాబును సీఎం చంద్రబాబు ప్రశంసించారు. అత్యుత్తమ ఆచరణలు మిగిలిన పోలీసు యూనిట్లలో అనుసరించాలని సూచించారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాంతి, భద్రతల అంశం చర్చకు వచ్చినప్పుడు పురోగతి గణాంకాలను ప్రదర్శించారు.

శిక్షల శాతం పెరిగింది: జిల్లాలో పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పలు కేసుల్లో ఆధారాలు దొరికాయి. ఫలితంగా కోర్టుల్లో శిక్షలు 52 శాతం పెరిగాయి. ప్రాపర్టీ నేరాలు 39.8 శాతం, మహిళలపై నేరాలు 15.1 శాతం తగ్గించగలిగారు. నేరాల ఛేదన రేటు 8.35 శాతం పెరిగింది. ప్రాపర్టీ నేరాల్లో రికవరీ 22.1 శాతం పెరిగింది.

అంచనాలు ఆకాశంలో.. అమలు పాతాళంలో..!

- వైకాపా పాలకపక్షం చివరి బడ్జెట్.. కోట్లు దాటింది
- గతసారితో పోలిస్తే.. ఏకంగా రూ.660 కోట్ల పెంపు

ఈనాడు – అమరావతి

"విజయవాడ నగరపాలక సంస్థ బడ్జెట్ అంచనాలు.. ఏటా కోట్లలు దాటిపోతున్నాయి. అంచనాలు ఆకాశంలో ఉంటే.. అమలు పాతాళంలో ఉండని తీవ్ర విమర్శలు వచ్చినా.. వైకాపా పాలకపక్షం తీరు మారడంలేదు. ఏటా పోలిస్తే సంపు ఆమోదించిన.. కౌన్సిల్లో ప్రవేశపెడుతున్న బడ్జెట్ అంచనాల్లో కనీసం మూడో వంతైనా అమలుచేసే పరిస్థితి లేదు. అయినా.. వచ్చే ఏటా బడ్జెట్ అంచనాలను పెంచుతూ పోయారు."

"తాజాగా పాలకులు వైకాపా పాలకపక్షానికి ఇదే చివరి బడ్జెట్ కావడంతో.. ఈసారి ఏకంగా రూ.2 వేల కోట్లకు చేర్చేశారు. ఎలాగూ వెళ్లిపోతున్నాం కదా.. మనంగా ముగింపు ఇవ్వాలనే తాపత్రయంతో తప్పు.. వాస్తవంగా దీనిలో మూడో వంతైనా అమలు చేసే పరిస్థితి లేదని తెలిసినా.. అంకెల గారడీకే మేయర్ భాగ్యలక్ష్మి నేతృత్వంలో పాలకపక్షం పావులుకదుపుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి."

2024–25లో రూ.1123.90 కోట్లే ఎక్కువ వసూలయింది.. 2025-26లో రూ.1,309.53 కోట్ల బడ్జెట్‌ను కౌన్సిల్ ముందుకు తెచ్చారు. ఈసారి 2026-27కి.. ఏకంగా ఆదాయం రూ.1968.13 కోట్లు, వ్యయం రూ.2,093.65 కోట్లు అంచనా వేసి.. స్థాయీ సంఘంలో ఆమోదించారు. దానినే నేడు కౌన్సిల్ ముందుకు తెస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా రూ.660 కోట్లు అధిక అంచనాలు చూపే.. అంకెల గారడీకే హంగామా చేస్తున్నట్టుంది.

ఆదాయానికి తగ్గట్టు ఖర్చులు...

పాలికకు ప్రజల నుంచి పన్నుల రూపేణా రూ.350 కోట్ల ఆదాయం వస్తోంది. మిగతా.. పట్టణ ప్రణాళిక అనుమతులు, లైసెన్స్ రుసుములు, అద్దె, నిర్మిత చార్జీలు, ఆక్రమణలు, వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ అద్దెలు, నీటి సరఫరా, యూజీడీ, జరిమానాలు, ఇతర పన్నులు కలిపి.. రూ.800 కోట్ల ఆదాయం మొత్తంలో. దీనిలో ఉద్యోగుల జీతాలకే రూ.250 కోట్లు, నిర్వహణ, మరమ్మతులు, పరిపాలన ఖర్చులు, ఇతర అన్నీ కలిపితే రూ.700 కోట్ల వరకూ అవుతోంది. మొత్తం ఆదాయంపై రూ.100 కోట్లే మిగులుతోంది.

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పాలికకు నిధులు తేవడంలో పాలకపక్షం విఫలమైంది. బడ్జెట్ అంచనాలు పెంచామా.. కౌన్సిల్లో పెట్టామా.. మమ అనిపించామా.. అనేలా గడిపేశారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సజావుగా ఏపీపీఎస్సీ పరీక్షలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ పరీక్షలు నగరంలో సజావుగా జరుగుతున్నాయని అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అటవీ, దేవాదాయ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తోందని, ఈ నెల 13 వరకు జరుగుతాయన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో 15 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందికీ గురికాకుండా పూర్తి భద్రత మధ్య పరీక్షలు రాసేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ వివరించారు.



ముక్కులదిరే వేదన.. ముద్ద పోరుకు యాతన

మ్యాన్‌హోల్స్‌లో దిగి మురికిని బకెట్లతో తోడి తరలించే రోజువారి కూలీలు వీళ్లు. నగరపాలకసంస్థ పరిధిలో మురుగునీరు సరిగా ప్రవహించని మ్యాన్‌హోల్స్‌లోకి దిగి పేరుకుపోయిన చెత్త, మట్టి, వ్యర్థాలను బకెట్లతో తోడి శుభ్రం చేస్తుంటారు. వీరికి కనీసం నోటికి మాస్కులు, చేతులకు గ్లౌజులు కూడా లేని దుస్థితి. వాసన భరిస్తూనే బతుకు పోరాటం వీరిది. బందరురోడ్డులో కలెక్టర్ కార్యాలయం సమీపంలో డ్రెయినేజీలో మురికిని తోడుతున్న కూలీల బతుకు చిత్రం ఇదీ. **- ఈనాడు అమరావతి**

ఈ-నారీ.. అక్రమాలకు లేదిక దారి..!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

డ్వాక్రా సంఘాల్లో సంస్కరణలు



బాపులపాడులో శిక్షణ పొందుతున్న ఈ-నారీ ప్రతినిధులు

డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు పక్కాగా ఉండేలా, ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ఉండేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సొమ్ము పక్కదారి పట్టడం, రుణ వాయిదాలను కొందరు సంఘ నిర్వాహకులు స్వాహా చేయడం వంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ఉదంతాలు చోటుచేసుకున్నాయి. బాధ్యులపై పోలీసు కేసులు పెట్టడం మినహా బాధితులకు చేయగలిగిందేమీ లేకుండా పోయింది. సెర్ప్, డీఆర్డీఏ నుంచి కూడా ఘటనలపై విచారణ చేయడం మినహా పెద్దగా రికవరీ చేసిన దాఖలాల్లేవు. వీటన్నింటికీ పరిష్కారంగా 'ఈ-నారీ' విధానం, 'మన డబ్బులు-మన లెక్కలు' పేరుతో యాప్‌ను ప్రవేశపెట్టారు.

సమస్త సమాచారం అందుబాటులో: పొదుపు సంఘాల కార్యకలాపాలు, రుణాలు, వాయిదాలు, పొదుపు మొత్తాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పుస్తకాలతో పాటు, ఆన్‌లైన్‌లో కూడా పొందుపరిచేలా వెలుగు ఆధ్వర్యంలో సంస్కరణలు చేపట్టారు. దీని కోసం ఈ-నారీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. 10 సంఘాలకు ఒక ఈ-నారీ చొప్పున నియమిస్తున్నారు. ప్రతి నెల 8 రోజుల పాటు వీరు తమకు కేటాయించిన సంఘాల పుస్తకాలు రాయడం, గ్రామైక్య సంఘాలు(వీఓఏ) పర్యవేక్షణలో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటివి నిర్వహిస్తారు. దీనికి ఏఐ సాయం కూడా తీసుకుంటారు. ఇందుకు గాను ఒక్కో ఈ-నారీకి రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి:

జిల్లా	డ్వాక్రా సంఘాలు
కృష్ణా	29,302
ఎన్టీఆర్	25,006

అరచేతిలో సమాచారం

సాధారణంగా మొన్నటి వరకు డ్వాక్రా సంఘాల్లో కార్యకలాపాలన్నీ వీఓఏల బాధ్యులు, సీఆర్పీల కనుసన్నల్లోనే జరిగాయి. బ్యాంకు నుంచి రుణాలు తీసుకునేటప్పుడు, తప్పనిసరి సమావేశాలప్పుడు మాత్రమే సంఘ సభ్యులు హాజరయ్యేవారు. పొదుపు మొత్తాలు, రుణ వాయిదాల లెక్కలు కూడా అంతగా తెలుసుకునేవారు కాదు. దీంతో చాలా మండలాల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. దీంతో వీటికి అడ్డుకట్ట వేస్తూ, తమ సంఘానికి సంబంధించిన లెక్కలన్నీ తెలుసుకునేందుకు వీలుగా 'మన డబ్బులు-మన లెక్కలు' పేరుతో ఓ యాప్‌ని రూపొందించారు. దీని ద్వారా సంఘానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ ఇంట్లో ఉండే తెలుసుకునే వెసులుబాటు లభిస్తుంది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలో ప్రస్తుతం దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. త్వరలోనే అంతటా అమల్లోకి రానుంది.



నీతిపాఠం.. తలకెక్కలేదేం?

ద్విచక్రవాహన ప్రమాదాల్లో మరణాలు తగ్గించేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి వాహనచోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ఇకపై ప్రత్యేక తనిఖీలు కూడా చేస్తామని స్పష్టం చేశారు. అధికారుల ఆదేశాలను పోలీసులే పాటించడం లేదు. శిరస్త్రాణం లేకుండా తిరుగుతున్నారు. సాధారణ జనం శిరస్త్రాణం పెట్టుకోకుండా వస్తే ట్రాఫిక్ పోలీసులు కేసులు రాస్తున్నారు. సీసీ కెమెరాల్లో చూసి, ఫొటోలు తీసి చలానాలు పంపిస్తున్నారు. తమ సహచర పోలీసులను మాత్రం వదిలేస్తున్నారు. నిబంధనలన్నీ సాధారణ ప్రజలకే వర్తిస్తాయా? సీసీ కెమెరాలు పోలీసుల వాహనాలకు ఫొటోలు తీయవా? అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పోలీసులంతా శిరస్త్రాణాలు ధరించి ఆదర్శంగా నిలిచేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

గ్యాస్ డెలివరీ బాయ్స్ ఆచూకీ లభ్యం!

భవానీపురం - న్యూస్‌టుడే: విద్యాధరపురంలోని రమ్యకృష్ణ గ్యాస్ ఏజెన్సీలో తుపాకీ చూపించి నగదు దోచుకెళ్లిన కేసులో పురోగతి సాధించినట్లు తెలిసింది. ముగ్గురు నిందితుల జాడను కనిపెట్టినట్లు సమాచారం. రాజస్థాన్‌కు చెందిన భజరంగి, దినేష్, ధీరజ్‌లు ఇటీవల గ్యాస్ ఏజెన్సీ నుంచి రూ.1.50 లక్షలు, రెండు ఫోన్లతో బైక్‌పై పరారైన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పరారీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనం ఆచూకీ ఇంకా లభించలేదు. నిందితుల ఫోన్లు ఇంకా స్విచాఫ్‌లోనే ఉన్నాయి. ఘటన అనంతరం వీరు తమ స్వస్థలాలకు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో వీరిని పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు రాజస్థాన్‌లోని వీరి ప్రాంతాలకు వెళ్లాయి. అక్కడ స్థానిక పోలీసుల సాయం తీసుకున్నాయి. నిందితులు అక్కడే ఉన్నట్లు గుర్తించారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. వీరిని ఒకటి, రెండు రోజుల్లో అదుపులోకి తీసుకునే వీలుంది.

దుర్గమ్మ.. నీటి బాటిళ్లు తాగొచ్చిక..!

- రూ.1.10 కోట్లతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ఏటా దుర్గగుడికి రూ.2.5 కోట్లపైగా ఆదా

ఈనాడు, అమరావతి–ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



పాలక మండలి సభ్యులతో చర్చిస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, పక్కన ఈవో శీనానాయక్

'**దు**ర్గగుడిలో దసరా, భవానీదీక్షలు.. ఈ రెండు వేడుకలకు మంచినీటి బాటిళ్లను కొని భక్తులకు ఇచ్చేందుకు ఏటా రూ.3 కోట్ల ఖర్చవుతోంది. గత పదేళ్లలో వేడుకల వేళ.. వాటర్ బాటిళ్లు, మంచినీటి ప్యాకెట్లకే రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఈ డబ్బు వృథాను అరికట్టేందుకు.. దుర్గగుడి ఆధ్వర్యంలోనే ఓ వాటర్ ప్లాంట్ నెలకొల్పాలని నిర్ణయించారు. ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పాలకమండలి భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రైల్వేస్టేషన్ పక్కనే ఉన్న దేవస్థానానికి చెందిన సి.వి.రెడ్డి ఛారిటీస్ స్థలంలో రూ.1.10 కోట్లతో వాటర్ ప్లాంట్ నెలకొల్పేందుకు పాలక మండలి ఆమోదించింది. ఏటా ప్లాంట్ నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతాలు కలిపినా.. రూ.50 లక్షల లోపే అవుతాయి. దీంతో ఏడాదికి కనీసం రూ.2.5 కోట్ల వరకూ ఆదా కానుంది.'

తిరుపతి తరహాలో లడ్డూ తయారీ...

తిరుపతిలో లడ్డూ ప్రసాదం తయారీ విధానాన్నే దుర్గగుడిలోనూ అమలు చేయాలని నిర్ణయించారు. యంత్ర పరికరాలను కొననున్నారు.

★ ప్రసాదాల తయారీ భవనానికి రూ.1.70 కోట్లతో నాలుగు లిఫ్టులు, రూ.70 లక్షలతో అన్నప్రసాద భవనానికి రెండు లిఫ్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

★ లడ్డూ, పులిహోర ప్రసాదాల ప్యాకింగ్ కవర్లు ఏటా కనిష్ఠ ధరకు సరఫరా చేసే గుత్తేదారుకు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు.

★ దత్తత ఆలయమైన.. అమరలింగేశ్వర దుర్గానాగేశ్వరస్వామి ఆలయానికి మరమ్మతులు, దుర్గగుడిలో రాయబార మండప మార్గం రూ.8.25 లక్షలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ★ రూ.14.50 లక్షలతో చలువ పందిళ్లు, రూ.6.50 లక్షలతో మహా కుంభాభిషేకం ఏర్పాట్లకు ఆమోదించారు.

వాయిదా వేసిన తీర్మానాలు...

గూడవల్లిలో కోదండ రామస్వామి దత్తత ఆలయ.. 7.66 ఎకరాల భూమి లీజు విషయం ప్రభుత్వ పరిశీలనకు పంపాలని నిర్ణయించారు. ● రామవరప్పాడులోని 8.71 సెంట్లను.. 30 శాతం లీజు పెంచి ఎం.పెదవెంకయ్య పేరుతో రెన్యూవల్ చేయాలనే ప్రతిపాదన వాయిదా వేశారు. ● పోరంకి వేద పాఠశాలలో బ్రాహ్మణులకు సామూహిక ఉపనయనాలు నిర్వహించే ప్రతిపాదనపై పూర్తి నివేదిక సమసర్పించాలని సూచించారు. ● సీవీరెడ్డి ఛారిటీస్ స్థలంలో 150 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రతిపాదనను సభ్యులు తిరస్కరించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై నోటీసులు

'ఈనాడు' కథనాలతో అధికారుల్లో కదలిక

ఈనాడు, అమరావతి: పెనుగంచిప్రోలు, రామవరప్పాడు, ముక్తేశ్వరపురం పంచాయతీల్లో వైకాపా పాలనలో అడ్డగోలుగా నిధులు దుర్వినియోగం చేసిన పలువురు పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు సోమవారం పంచాయతీ రాజ్ అధికారులు షోకాజ్‌లు జారీ చేశారు. నిధుల దుర్వినియోగంపై తగు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. తొలుత ఈ మూడు పంచాయతీల అక్రమాలపై గ్రామస్థులు పోరాడినా ఎవరికీ పట్టించుకోలేదు. 'ఈనాడు'లో 'అక్రమం మేసింది.. అధికారం దాచింది', 'పాత పనుల్లో గుట్టు.. కొత్త బిల్లుల్లో కనికట్టు' శీర్షికలతో కథనాలు ప్రచురించగా అధికారులు విచారణ చేపట్టారు. అయినా కొలిక్కి తేకుండా తాత్సారం చేయగా 'నిధులు మెక్కి.. విచారణ తొక్కి' శీర్షికన కథనం ఇవ్వగా నామమాత్ర నిధుల దుర్వినియోగం అని మళ్లీ మసిపూసే ప్రయత్నం చేశారు. ఆపై 'అంతు చూస్తారంటే.. అంత లేదన్నారు' శీర్షికతో మరో కథనం ప్రచురించగా కలెక్టర్ లక్ష్మీశ ఆగ్రహించడంతో ఎట్టకేలకు అక్రమాలపై ప్రాథమిక నివేదిక సిద్ధం చేసి నోటీసులు జారీ చేశారు.

అంత గోప్యమా? మూడు పంచాయతీల్లో ఫిర్యాదుల మేరకే రూ.13 కోట్ల అక్రమాలు జరిగాయి. రాజకీయ ఒత్తిడితో నిధుల దుర్వినియోగం సమాచారం అధికారులు బయటపెట్టడం లేదు. పెనుగంచిప్రోలులో రూ.1.33 కోట్లు, ముక్తేశ్వరపురంలో రూ.3.5 కోట్లు, రామవరప్పాడులో రూ.4.43 కోట్లు అక్రమాలు జరిగాయని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

కట్టలే కావాల... కష్టాలు మాకేల?

- రహదారుల విస్తరణ కథ మొదటికి...
- అయినోళ్ల కోసం రోడ్ల టెండర్ల రద్దు

ఈనాడు – అమరావతి

"విజయవాడ నగరంపై ట్రాఫిక్ రద్దీ తగ్గించే ప్రత్యామ్నాయ రహదారుల విస్తరణ పనుల కథ మళ్లీ మొదటికి వచ్చింది. పిలిచిన టెండర్లను ప్రజారోగ్య శాఖ రద్దు చేసింది. సాంకేతిక బిడ్లను తెరిచిన తర్వాత రోజుల తరబడి నాన్చి చివరకు అధికారులు రద్దు చేశారు. ఈ పనులను రద్దు చేయడం ఇది రెండోసారి. పనులు ప్రారంభించి ప్రజల కష్టాలు తొలగించడంపై కాకుండా.. అయిన వారికి పనులు కట్టబెట్టేందుకే రద్దు బాటపట్టారు. కొందరు కాంట్రాక్టర్ల మేలు కోసమే ఇలా రద్దు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి."

లెస్‌కు కోట్ చేసినా..

నగరంలోని ప్రధాన మార్గాలకు మూడు ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధి కోసం గత ఏడాది డిసెంబరులో సీఆర్డీఏ నిధులతో ప్రజారోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగం కోట్లతో టెండర్లు పిలిచింది. రూ.25.40 కోట్లతో బల్లెంవారివీధి నుంచి నిడమానూరు మెయిన్‌రోడ్డు కూడలి వరకు రహదారి విస్తరణ, రూ.25.21 కోట్లతో మహానాడు రోడ్డును బల్లెంవారివీధి నుంచి పోరంకి-నిడమానూరు మెయిన్‌రోడ్డు వరకు, రూ.22.35 కోట్లతో బందరు రోడ్డు నుంచి హైటెన్షన్ లైన్ రోడ్డు కూడలి వరకు విస్తరించేందుకు రూ.72.96 కోట్లతో అధికారులు టెండర్లు పిలిచారు. మూడు పనులకూ కొన్ని సంస్థలు లెస్‌కు కోట్ చేశాయి.



బల్లెం వారి వీధి నుంచి మహానాడు రోడ్డు మీదుగా హైటెన్షన్ రోడ్డుకు వెళ్లే మార్గం

40 రోజుల తర్వాత తీరిగ్గా..

బిడ్ల పరిశీలన పేరుతో ప్రజారోగ్య శాఖ అధికారులు దాదాపు 40 రోజులు ఏ నిర్ణయం తీసుకోకుండా నాన్చుడు ధోరణి అవలంబించారు. సాంకేతిక బిడ్లను తెరిచిన తర్వాత టెండర్లను రద్దు చేశారు. ఈ పనులకు తొలిసారి గత ఏడాది సీఆర్డీఏ టెండర్లు పిలిచి సాంకేతిక బిడ్లను తెరవకుండానే రద్దు చేశారు. రెండుసార్లు పిలిచిన టెండర్లను రద్దు చేయడం వెనుక తమకు కావాల్సిన గుత్తేదారులకు పనులు కట్టబెట్టేందుకు అనే విమర్శలు ఉన్నాయి.

తాజాగా మరోసారి...

రహదారుల విస్తరణ పనుల టెండర్లను పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు ఈనెల 7న రద్దు చేశారు. అదే రోజు తిరిగి మూడోసారి టెండర్లు పిలిచారు. బిడ్ల దాఖలుకు ఈనెల 21 వరకు గడువు ఇచ్చారు. అధికారులు టెండర్లను రద్దు చేసి.. హడావుడిగా అదే రోజు మరోసారి పిలవడం కొసమెరుపు. దీనిపై గుంటూరు ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ శ్రీనివాస్ వివరణ కోరగా.. బిడ్లు దాఖలు చేసిన సంస్థలకు సరైన పత్రాలు లేనందున కమిటీ నిర్ణయం మేరకు రద్దు చేసినట్లు చెప్పారు.

పరిశ్రమలకు పెద్దవరం


స్పెక్ట్రం నాన్‌ఫెర్రస్ పరిశ్రమ పనులు

న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

పరిశ్రమల ఏర్పాటుకు నందిగామ మండలం పెద్దవరంలో వందలాది ఎకరాల భూములు సిద్ధంగా ఉండటంతో పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో పట్టించుకోకపోవడంతో ఒక్కటీ ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలకు భూముల ధరలు తగ్గించి కొంత వెసులుబాటు కల్పించింది. దీంతో ఇటీవల ఏపీఐఐసీ నుంచి పారిశ్రామికవేత్తలు 25 ఎకరాలు కొనుగోలు చేశారు.

నందిగామ మండలం పెద్దవరం రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీకి 2016లో 515 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆర్ఎస్ నంబర్లు-1/4, 666, 667, 668, 669లలో ఉన్న ఈ భూముల్లో సంస్థ సుమారు రూ.4 కోట్లతో తారు రోడ్లు, విద్యుత్తు స్తంభాలు వంటి మౌలిక వసతులు కల్పించింది. పారిశ్రామిక వెలుగులతోనే ఇక్కడి గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుంది.

పారిశ్రామికవేత్తల్లో కదలిక..

- భూముల ధర తగ్గించడంతో తాజాగా ఎకరం రూ.35 లక్షలు, రూ.40 లక్షలు వంతున 25 ఎకరాలను పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేశారు.
- ఒకరు నాలుగెకరాలు కొని ఆసుపత్రుల్లో వైద్య ఉత్పత్తుల తయారీ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు.
- కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి..
- ఏపీఐఐసీ భూముల సమీపంలో గతంలో క్రెస్ బయో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటైంది. ఈ పరిశ్రమ రెండో యూనిట్‌ను ఏర్పాటుచేసి కొనసాగిస్తోంది. పరిశ్రమకు ముడిసరకుగా మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేస్తుంటారు. ఈ పరిశ్రమలతో వందల మంది యువకులకు ఉపాధి లభించింది.
- తాజాగా కొందరు స్పెక్ట్రం నాన్ ఫెర్రస్ పరిశ్రమ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ పరిశ్రమ వస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుంది.

రైతులకు అందని పరిహారం

ఏపీఐఐసీ కోసం ప్రభుత్వం తొలుత పెద్దవరం, చెర్వుకొమ్ముపాలెం గ్రామాలకు చెందిన పేదల నుంచి 116 ఎకరాల కొండభూములను సేకరించింది. ఇందుకుగాను 184మంది రైతులకు ఇవ్వాల్సిన సుమారు రూ.12 కోట్ల పరిహారం ఇప్పటివరకు రాలేదు. దీనిపై తహసీల్దారు ఎన్.సురేష్ బాబు మాట్లాడుతూ కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడం వల్ల పరిహారం మంజూరులో జాప్యం ఏర్పడిందని చెప్పారు.

ముందుకొస్తున్న ఔత్సాహికులు..

పెద్దవరం ఏపీఐఐసీ భూముల కొనుగోలుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు. పెద్ద, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన భూములున్నాయి. ఇప్పటికే మౌలికవసతులు కల్పించాం. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఏర్పాటవగా, చాలా మంది ఔత్సాహికులు ముందుకొస్తున్నారు.

- కె.బాబ్జి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు

సంపూర్ణ దైవత్వానికి కేంద్ర బిందువు మేరీమాత


ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం


కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

గుణదల(పటమట), న్యూస్‌టుడే: సమస్త జాతులను ఐక్యపరిచే శక్తి సృష్టికర్త దేవుడికే ఉందని, ఆ దిశగా ప్రతిఒక్కరూ గుణదల మేరీమాతను వేడుకుందామని జూబిలేరియన్ ఫాదర్ నేలటూరి ఫ్రాన్సిస్, సిల్వర్ జూబిలేరియన్ ఫాదర్ మద్దాల జోసఫ్ అన్నారు. గుణదల కొండ కింద బిషప్ గ్రాసీ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కళా వేదికపై ప్రారంభమైన మేరీ మాత ఉత్సవాల్లో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు తదితర గురువులతో కలిసి జూబిలేరియన్ ఫాదర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేరీమాత సంపూర్ణ దైవత్వానికి కేంద్ర బిందువుగా నిలిచిందని అన్నారు. దేవుని మార్గంలో నడిపించడానికి మరియమాత అనేక ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిచ్చారని పేర్కొన్నారు. మొదటి రోజు ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు కడప పీఠాధిపతులు బిషప్ సగినాల పాల్ ప్రకాష్ తదితర గురువులు సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నేటి ఉదయం 7, 11:30 గంటలకు, , మధ్యాహ్నం 3, సాయంత్రం 6 గంటలకు సమిష్టి దివ్యపూజాబలి ఉంటుంది. తొలిరోజు విశ్వాసులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

11న ఎన్టీఆర్ వర్సిటీ మహిళా చెస్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీలో ఈ నెల 11వ తేదీన ఎన్టీఆర్ వర్సిటీ మహిళల చెస్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, ఫిజియోథెరపీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలల విద్యార్థులు ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ చెస్ పోటీల్లో వర్సిటీ జట్టుకు ఆడతారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు 11వ తేదీ ఉదయం 10 గంటలకు వర్సిటీ ప్రాంగణంలో హాజరు కావాలని సూచించారు.

నౌకల తయారీ, మరమ్మతుల కేంద్రానికి ప్రభుత్వం పచ్చజెండా

బందరు పోర్టు అభివృద్ధికి కీలక నిర్ణయాలపై ఎంపీ హర్షం


ఎంపీ బాలశౌరి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం : మచిలీపట్నంలో నౌకల తయారీ.. వాటి మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంపై ఎంపీ బాలశౌరి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 'మచిలీపట్నం ఓడరేవుకు మరిన్ని అవకాశాలు తెచ్చేందుకు ఈ అనుమతులు కీలకం. ఇది ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుంది. రాష్ట్ర మారిటైమ్ బోర్డుకు అవసరమైన అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పోర్టు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుంది. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా మచిలీపట్నంలో నౌకల తయారీ.. ఓడల మరమ్మతు సౌకర్యాల ఏర్పాటుపై జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇవి కార్యాచరణలోకి వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికాభివృద్ధికి పోర్టు కీలకంగా మారుతుంది. బందరు ప్రజల దీర్ఘకాలిక కల నెరవేరే దిశగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు' అని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు.

గోనె సంచుల సొమ్ము చెల్లించాలని వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రేషన్ డీలర్లకు కమీషన్‌తో పాటు, గోనె సంచులు వారికే మిగులుతాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 సెప్టెంబరు నుంచి డిసెంబరు 21 వరకు కరోనా తరుణంలో రేషన్ డీలర్ల నుంచి గోనె సంచులను తీసుకున్నారు. సంచికి రూ.20 చొప్పున చెల్లిస్తామని సర్క్యులర్ విడుదల చేశారు. ఇంటింటా బియ్యం పంపిణీకి ఎండీయూ వాహన విధానం అమలు జీవోలో డీలర్ల వద్ద నుంచి గోనె సంచులు వాపస్ తీసుకుని, వేలం వేసుకోవాలని 'క్లాజు' పెట్టారు. తీరా డీలర్లకు సొమ్ము చెల్లించలేదు. దీనిపై 2022లో హైకోర్టులో రెండు పిటిషన్లు వేసినట్టు జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. అప్పటి ప్రభుత్వ జీవోను కొట్టివేస్తూ.. కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో జిల్లాలో 5 లక్షల గోనె సంచులకు సంబంధించి రూ.కోటి ఇప్పించాలని కోరుతూ.. నగరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు డీలర్లు సోమవారం వినతి పత్రం సమర్పించారు. డీలర్ల వినతిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల అధికారులను జేసీ ఆదేశించారు. రేషన్ డీలర్ల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు, నగర శాఖ కోశాధికారి పూర్ణ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చకు డిమాండ్


నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిరుద్యోగ సమస్యపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక గోవిందరాజులు నేతృత్వంలో నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జేసీ ఎస్.ఇలక్కియాకు వినతిపత్రం సమర్పించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇవ్వాలని, గతంలో ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ కింద పనిచేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి, పౌర సరఫరాల విభాగంలో పని చేసిన బియ్యం రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులకు న్యాయం చేయాలని కోరారు. సమాఖ్య నేతలు కందర్ప భార్గవ్, సింగంశెట్టి మోహనప్రసాద్, శీరం రవి, ఎన్.వెంకటేశ్వరరావు, పంచదార్ల విజయ్, గాడి అజయ్, ఎం.ఆంజనేయులు, ప్రైస్, సయ్యద్, రాంబాబు, శివ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, కార్తిక్, శివకుమార్, సాదిక్‌బాబు, రంజిత్, జగదీష్, రాజు, అభి, యశ్వంత్, దీపక్, పలువురు విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మెల ఏర్పాటు

గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డులో ఫుట్‌పాత్‌కు కాలువ రక్షణగా వేసిన రెయిలింగ్ పోయి ప్రమాదకరంగా ఉండడం 'కంచె నిర్లక్ష్యం.. ఆవైపే ప్రమాదం' శీర్షికన ఈనెల 1వ తేదీన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. పడిపోయిన రెయిలింగ్ తొలగించి రక్షణగా సిమెంటు దిమ్మెలు ఏర్పాటుచేశారు. - ఈనాడు, అమరావతి


పడిపోయిన రెయిలింగ్ తొలగించి సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారిలా..

చిత్తశుద్ధితో అర్జీల పరిష్కారం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జేసీ ఎస్.ఇలక్కియా సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ ద్వారా సోమవారం ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. మొత్తం 192 వినతి పత్రాలు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ క్లినిక్ ద్వారా 54, పీజీఆర్ఎస్‌లో 138 అందినట్లు వివరించారు. పీజీఆర్ఎస్‌లో పురపాలక శాఖకు 31, పోలీస్ శాఖ 27, డీఆర్డీఏకు 25, పంచాయతీరాజ్ శాఖకు 12, సీఆర్డీఏకు నాలుగు చొప్పున, మిగతా వివిధ శాఖలకు అందినట్లు పేర్కొన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్ఆర్సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ


బాధితుల గోడు వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం 87 మంది తమ ఫిర్యాదులు సమర్పించారు. డీసీపీ ఉదయరాణి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా భూ/ఆస్తి, నగదు లావాదేవీల ఫిర్యాదులు 49 వచ్చాయి. ఇవికాక వివిధ మోసాలపై 12, కుటుంబ కలహాలపై 4, మహిళా సంబంధ నేరాలపై 5, దొంగతనాలపై 1, కొట్లాటలపై 1, ఇతర ఫిర్యాదులు 15 వచ్చాయి. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఇక అన్నీ శుభ ఘడియలే!

గంపలగూడెం, న్యూస్‌టుడే

మాఘమాసం శుభప్రదం కావడంతో ప్రజలు శుభ కార్యక్రమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా వరకు మూడు నెలల పాటు శుభ కార్యక్రమాలు ఆరంభం కానున్నాయి. మాఘమాసం రెండో పక్షం నుంచి అనువైన ముహూర్తాలు కూడా సమీపించడంతో శుభ కార్యక్రమాల సందడి వాతావరణం నెలకొంది. ఈ మాసంలో వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు, నూతన కట్టడాలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు ఇలా ఒక్కటేంటి అన్నింటా వేడుకలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. వరుసగా ఆరు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉండడంతో ఇప్పటికే అన్ని కల్యాణ మండపాలను ఖరారు చేసుకుంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల్లో వందల సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. శుభ ముహూర్తాలతో పురోహితులు, మంగళ వాయిద్యాలు, కుల వృత్తిదారులు, విద్యుత్తు వేదిక అలంకరణ, మైక్ సెట్లు, విందు భోజనాలు, షామియానా, బంగారం, వెండి, ఆభరణాల తయారీ, వస్త్ర దుకాణాలు, నిత్యావసరాల విక్రయదారులకు గిరాకీ ఏర్పడనుంది. పూలు, పండ్లు, పూలదండలు, కళాకారులు ఇలా వివిధ వృత్తుల వారికి పని దొరుకుతుంది. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, జూన్ నెలల్లో అత్యధిక సంఖ్యలో శుభ ముహూర్తాలు ఉండడంతో పెద్ద సంఖ్యలో జంటలు ఏకం కానున్నాయి. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు చాతుర్మాసం, శూన్యమాసం వల్ల ముహూర్తాలు లేవు. తిరిగి నవంబరు, డిసెంబరు నెలలో మళ్లీ ముహూర్తాలు రానున్నాయి.

ముహూర్త తేదీలివే..

ఫిబ్రవరి	19 నుంచి 21 వరకు, 24 నుంచి 26 వరకు
మార్చి	1, 3, 4, 7-9, 11, 12
ఏప్రిల్	15, 20, 21, 25-29
మే	1, 3, 5-8, 13, 14
జూన్	3-7, 10-12, 21-27, 29
జులై	1, 6, 7, 11

దూరాన సాగరం.. రైతన్న భగీరథ యత్నం

ఎన్నెస్పీ 3వ జోన్‌లో సాగునీటి అవస్థలు

మైలవరం, న్యూస్‌టుడే

ఈ చిత్రంలో రహదారి పొడవునా కనిపిస్తున్న పైపు సుమారు 150 మీటర్లకు పైగా ఉంది. అది తాగునీటి అవసరాలకో, నిర్మాణ పనులకో ఏర్పాటు చేశారనుకుంటే పొరపడినట్లే. రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్న బాడవకు చెందిన ఓ రైతు పడుతున్న పాట్లకు ప్రత్యక్ష నిదర్శనమిది. తనకున్న వ్యవసాయ బోరు నీరు చాలక సమయానికి సాగర్(ఎన్నెస్పీ) నుంచి నీరు విడుదల కాకపోవడంతో సమీప తోటలో ఖాళీగా ఉన్న బోరు నుంచి ఇలా పైపుల ద్వారా మొక్కజొన్నకు తడులు అందిస్తున్నాడు.

ప్రత్యామ్నాయంగా.. : మెట్ట ప్రాంతమైన పశ్చిమ కృష్ణాలో మూడు నియోజకవర్గాల పరిధిలో రబీ పంటలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) ఎడమ కాలువ పరిధిలో 3వ జోన్‌లోని మైలవరం బ్రాంచి కాలువే ఆధారం. ప్రాజెక్టు నిర్వహణ, నియమాల మేరకు ప్రతి ఏటా నవంబరు మొదటి వారం నుంచి మార్చి చివరి వరకు సాగు నీరు అందించాలి. రాష్ట్ర విభజన అనంతరం మొదలైన నీటి సరఫరా కష్టాలు ఏయేటికాయేడు పెరుగుతూనే ఉండటంతో, కాలువల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. దాంతో దశాబ్ద కాలంగా దాళ్వా వరి సాగు తగ్గింది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్న అధికారుల సూచనలతో కొన్నేళ్లుగా రైతులు మొక్కజొన్న వేస్తున్నారు. ఈ పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉండడంతో నీటి అవసరం ఉంటోంది. నీటి ఎద్దడి తలెత్తితే దిగుబడులపై ప్రభావం చూపుతుంది.

బోర్లపైనే ఆధారం..: మైలవరం, తిరువూరు నియోజకవర్గాలు, నందిగామలో కొంత మేర మైలవరం బ్రాంచి కాలువ ద్వారా సుమారు వెయ్యి క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తే తడులకు ఇబ్బంది ఉండదు. కానీ పది రోజులుగా చుక్కనీరు కూడా కాలువల ద్వారా రాకపోవడంతో రైతులు బోర్లపైనే ఆధారపడుతున్నారు. పైగా రబీలో సాగు పెరగడం, మోటర్ల వినియోగం అధికమవగా, భూగర్భ జల లభ్యత తగ్గింది. సాగర్ ద్వారా నీరు సరఫరా చేస్తే తడులందించడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని పలువురు అంటున్నారు.

మైలవరం బ్రాంచి కాలువ పొడవు- 37.5 కి.మీ	
సరఫరా సామర్థ్యం- సుమారు 1200 క్యూసెక్కులు	
అనుబంధ మేజర్లు- 5	ఆయకట్టు- సుమారు లక్ష ఎకరాలు


మైలవరం: బాడవ వద్ద మొక్కజొన్నకు నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసిన పైపు

ప్రయత్నిస్తున్నాం..

గత నెలలో మూడు రోజులే నీరు సరఫరా చేశారు. ప్రస్తుతం మొక్కజొన్నకు నీటి అవసరం ఉందని రైతుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఉన్నతాధికారులు నీటి సరఫరా కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు.

- ప్రభు, ఎన్నెస్పీ డీఈ, మైలవరం

పూర్వ వైద్య విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 58 ఏళ్ల తరువాత కలయిక
- దేశ, విదేశాల నుంచి పలువురు హాజరు



విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల 1968 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని డాక్టర్ తాతా సాంబశివరావు, ఈశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. రాష్ట్రంతో పాటు దేశ, విదేశాల్లో నివసిస్తున్న పూర్వ విద్యార్థులంతా 58 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వైద్య రంగంలో అప్పటికీ ఇప్పటికీ చోటు చేసుకున్న మార్పులపై చర్చించుకున్నారు. 75 సంవత్సరాల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. తమ అనుభవాలు, అనుభూతులను పంచుకొని సరదాగా గడిపారు. అనంతరం కృష్ణా నది అలలపై బోటు షికారు చేశారు. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై, మైసూర్, దిల్లీ, మలేసియా, సౌత్ ఆఫ్రికా, అమెరికా తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పోటీలు... ఉత్తమ క్రీడాకారుడిగా గోపి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల 'బెస్ట్ ఫిజిక్' (ఉత్తమ దేహదారుఢ్యం) పోటీల్లో ఆతిథ్య కళాశాలకు చెందిన సీహెచ్ గోపి ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికై ప్రత్యేక బహుమతి గెలుపొందాడు. ఈ పోటీలో 20 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో తలపడ్డారు. 60 కేజీల కేటగిరీలో డి.చంద్రమౌళి (కేబీఎన్ కళాశాల), ఎ.సాకేత్ (ఆంధ్రా లయోల), టి.రవితేజ (శ్రీబాలసాయి కళాశాల), 65 కేజీల కేటగిరీలో సీహెచ్ దినేష్‌రెడ్డి (నలంద), రౌత్ గిడెన్ (కేబీఎన్), ఇ.వేణు (పీబీ సిద్ధార్థ), 70 కేజీల కేటగిరీలో ఎం.దినేష్ (పీబీ సిద్ధార్థ), ఎ.శోభనాచారి (శారద కళాశాల), కె.లోవకుమార్ (ఆంధ్రా లయోల) వరుస స్థానాల్లో నిలిచారు. 75 కేజీల కేటగిరీలో సీహెచ్ గురు బ్రహ్మం(పీబీ సిద్ధార్థ), 90+ కేజీల కేటగిరీలో సీహెచ్ గోపి (పీబీ సిద్ధార్థ) ప్రథమ స్థానాల్లో నిలిచారు. పోటీల కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ మేకా రమేష్ విజేతలకు బహుమతులు అందించారు. డి.హేమచంద్రరావు టి.అశోక్ పరిశీలకులుగా వ్యవహరించారు.


విజేతలతో అతిథులు రమేష్, హేమచంద్రరావు, అశోక్ తదితరులు

సామాజిక అంశాలపై చైతన్యం అవసరం


ర్యాలీలో పాల్గొన్న నారాయణ భరత్‌గుప్తా, రవికృష్ణ, నగేష్‌బాబు

మాచవరం, న్యూస్‌టుడే: సామాజిక అంశాలపై అవగాహన ర్యాలీ విజయవంతం చేయాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా పేర్కొన్నారు. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన పెడల్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ ఎన్.నగేష్‌బాబులతో కలిసి నారాయణ భరత్‌గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. నారాయణ భరత్‌గుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు ఆరు జిల్లాల్లో ఆరు రోజుల పాటు ఆరు వందల కిలోమీటర్లు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారని, విజయవాడ నుంచి విశాఖ వరకు కొనసాగుతుందన్నారు. మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు, మానవ అక్రమ రవాణా, సురక్షిత వలసలు, మాదకద్రవ్యాల నివారణ, లైంగిక విద్య, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను సమాజంలోకి తీసుకెళ్లడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈగల్ ఐజీ రవికృష్ణ, ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబులు మాట్లాడుతూ సమాజానికి కావాల్సిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించుకోడానికి విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారన్నారు. కళాశాల విద్య అకడమిక్ అధికారి తులసి మస్తానమ్మ, కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాల(మహిళలు) ప్రిన్సిపల్ వి.నీరజ, రెడ్ రోప్ సమన్వయకర్త క్రిస్టోలెట్, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కొల్లేటి రమేష్, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త నాగేశ్వరరావు, అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-14, బెండ-30, పచ్చిమిర్చి-35, కాకర-38, బీర-30/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-34, దోస-20/30, సొర-12/14, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకుకూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్‌రూట్-26, కీరదోస-45, బీన్స్-60/55, క్యాప్సికమ్-65, చింతకాయలు-65, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర- 5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు(కిలో రూ.ల్లో) వర్తిస్తాయి.

- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

పిల్లల విక్రయం కేసులో సూత్రధారి మధాభాయ్‌కేర్ బాబు!

నిందితురాలు కవిత విచారణలో వెలుగులోకి

చిట్టినగర్, న్యూస్‌టుడే: పిల్లల విక్రయం కేసులో కొత్తగా మధాభాయికేర్ బాబు పేరు వెలుగులోకి వచ్చింది. అతడే పిల్లల విక్రయ ముఠాకు ప్రధాన సూత్రధారిగా పోలీసుల విచారణలో వెలుగుచూసింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయి రాజమహేంద్రవరం జైలులో ఉన్న ముంబయికి చెందిన కవితను విచారణ నిమిత్తం ఈ నెల 7, 8, 9 తేదీల్లో కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. కొత్తపేట పోలీసులు 8వ తేదీన జైలు నుంచి తీసుకొచ్చి విచారించగా మధాభాయికేర్ బాబు అసలు సూత్రధారిగా వెల్లడైంది. కవితకు సంబంధించిన ఇంట్లో అనిల్ ఉండేవాడని, అతనికి వరసకు బాబాయి అయిన బాబు పరిచయమైనట్లు చెప్పింది. బాబు దఫాలుగా ఇద్దరు పిల్లల్ని తీసుకొచ్చి తనకు అప్పగించినట్లు వివరించింది. కవిత మొదటిగా 45 రోజుల పసిపిల్లను నూరి ద్వారా సరోజినికి అప్పగించింది. ఆ శిశువును శ్రీనివాసరావు, యోహాలకు అప్పగించగా గత ఏడాది నవంబరులో వించిపేటలోని జ్యోతి దంపతులకు రూ.3.75 లక్షలకు విక్రయించారు. రూ.75 వేలు తీసుకుని మిగతా రూ.3 లక్షలు సరోజినికి ఇచ్చారు. సరోజిని రూ.25 వేలు తీసుకుని కొంత డబ్బు నూరి తీసుకుని కవితకు రూ.2 లక్షలు ఇచ్చినట్లు గత విచారణలో సరోజిని చెప్పింది. ఆ లావాదేవీల విషయమై కవితను ప్రశ్నిస్తే తనకు డబ్బులు ఇవ్వలేదని, సరోజిని ఎవరో తెలియదని చెప్పింది. అయితే వారిద్దరి మధ్య ఫోన్ సంభాషణ, డబ్బులు ఇచ్చిపుచ్చుకున్నట్లు సాంకేతిక ఆధారాలు ఉన్నాయని చెప్పినా ఒప్పుకోలేదు. 8వ తేదీన విచారించిన అనంతరం పోలీసులు కవితను సోమవారం రాజమహేంద్రవరం కారాగారానికి తీసుకెళ్లి అప్పగించారు.

బాబుని అదుపులోకి తీసుకుంటే ఓ కొలిక్కి వచ్చేనా..? ఈ కేసులో సూత్రధారిగా బాబు పేరు కొత్తగా బయటకు రావడంతో అతడిని నిందితుడిగా చేర్చనున్నారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే నిజంగా బాబు కుటుంబ సభ్యుల్లోని పిల్లలైతే కేసు ఓ కొలిక్కి వస్తుంది. కుటుంబ సభ్యుల పిల్లలైతే డీఎన్ఏ పరీక్షల ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

తవ్వే కొద్దీ బయటపడుతున్న కొత్తపేర్లు .. ఈ కేసులో మొదటిగా పాటి శ్రీనివాసరావు, సంకా యోహాను పేర్లు వచ్చాయి. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే బలగం సరోజిని పేరు బయటకు వచ్చింది. ఆమెను కస్టడీకి తీసుకుని విచారిస్తే కవిత, నూరి పేరు వచ్చాయి. ఈ నెల 8న పోలీసులు కస్టడీకి తీసుకుని కవితను విచారించగా మధాభాయికేర్ బాబు పేరు చెప్పింది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నైపుణ్యాలపై దృష్టి



కార్యశాలలో మాట్లాడుతున్న సుందరరాజన్

మైలవరం, న్యూస్‌టుడే : ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రస్తుతం డిమాండ్ ఉన్న ప్రోగ్రామింగ్ అంశాలపై దృష్టి సారించాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె. అప్పారావు తెలిపారు. కళాశాలలో ఐటీ విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల కార్యశాలను ఆయన సోమవారం ప్రారంభించారు. జావా, పైథాన్ ప్రోగ్రామింగ్‌లో ప్రాథమిక అంశాలను గ్రాడ్యుకే టెక్నాలజీస్ టెక్నికల్ ట్రైనర్ సుందరరాజన్, టెక్నికల్ లీడ్ శ్రీకాంత్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి రత్నకిషోర్, ప్రొఫెసర్లు నాగాంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి నాల్గోవ వార్డుకు చెందిన జి.నాగరాజు(45) సోమవారం మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుటుంబాన్ని తెదేపా పురపాలిక నాయకులు పరామర్శించారు. మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్, స్థానిక నాయకులు అందించిన రూ.21 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

పేపర్ క్రాఫ్ట్ ఉత్పత్తులపై శిక్షణ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లి రైజ్ కేంద్రంలో ప్రసాదంపాడు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త వరలక్ష్మి 20 మంది ఔత్సాహిక స్వయం సహాయక మహిళలకు పేపరు క్రాఫ్ట్ విభాగంలో వివిధ ఉత్పత్తుల తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి ఇంటి నుంచే ఉపాధి పొందే అవకాశాన్ని కల్పించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రీ స్కూల్‌కు సంబంధించి అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రజాప్రగతి ట్రస్ట్ ముందుకు రావడం మంచి పరిణామమని సీడీపీవో పుష్పలత అన్నారు. ఇబ్రహీంపట్నం భీమరాజు గుట్ట సామాజిక భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ దేవకుమారి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? జి.కొండూరు ఆత్కూరు క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రధాన రహదారి వెంబడి మురుగు కాలువల్లో పూడిక పేరుకుని దోమలతో అవస్థలు పడుతున్నాం. - **షేక్ మస్తాన్, గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. - **బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**



స్పందన : మైలవరం పంచాయతీలోని బాలయోగి నగర్‌లో నీటి కుళాయిల పైపులైను పగలడంతో నీటి సరఫరాకు ఇబ్బందిగా ఉందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి పగిలిన పైపులైనుకు మరమ్మతులు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి రఫీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. – **మైలవరం**

★ జి.కొండూరు సొసైటీ బ్యాంకు సమీపంలోని నాగేంద్ర స్వామి పుట్ట బజారులో కాలువల్లో మురుగు పారక దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. – **న్యూస్‌టుడే, జి.కొండూరు**

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత



కార్యక్రమంలో రమాదేవి, మూర్తి, తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రజాప్రగతి ట్రస్ట్(విజయవాడ) ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను వితరణ చేశారు. వీటిని ఆ సంస్థ ప్రతినిధి వి.మూర్తి పాఠశాల హెచ్‌ఎం ఎ.రమాదేవికి సోమవారం పాఠశాల ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ యాజమాన్యానికి పాఠశాల తరఫున ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు వాసు, నాగరాజు, ఆంజనేయులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

జి.కొండూరు, న్యూస్‌టుడే



కట్టుబడిపాలెంలో నిరుపయోగంగా తారకరామ పంపుహౌస్

విజయవాడ థర్మల్ విద్యుత్తు కేంద్రం(వీటీపీఎస్) నుంచి బయటకు వచ్చే వేడి జలాలను ఎత్తిపోసి తద్వారా మైలవరం నియోజకవర్గంలోని మాగాణి, మెట్ట భూములను సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో 1988 ఫిబ్రవరి 20న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి జి.కొండూరు మండలం పినపాక శివారు విద్యానగరంలో శంకుస్థాపన చేశారు. తర్వాత కొంత కాలానికి తెదేపా హయాంలో వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఉన్న కాలంలో ఎత్తిపోతల నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభించారు. మూడు విడతలుగా నిర్మాణం చేయాల్సి ఉండగా, రెండు విడతల మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఎడమ కాలువపై తాడేపల్లి కొత్తూరు వరకు 6.6 కి.మీ వరకు గ్రావిటీ ద్వారా అక్కడి నుంచి రెండు సబ్ లిఫ్ట్‌లతో వెలగలేరు, కొత్తూరు తాడేపల్లి చెరువులకు, కుడి కాలువపై నాలుగు పంపు హౌస్‌లు జి.కొండూరు మండలం వరకు నిర్మాణం చేసి కొంతకాలం సజావుగా నీరందించారు. దీంతో ఎత్తిపోతల పక్కనున్న దాదాపు 13,500 ఎకరాల భూముల్లో రైతులు పంటలు పండించుకున్నారు. కాలక్రమేణ ఎత్తిపోతల నిర్వహణ లోపంతో ప్రస్తుతం దుస్థితికి చేరిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపులు శూన్యం

వైకాపా ప్రభుత్వం తారకరామ ఎత్తిపోతల పథకం మరమ్మతులకు కేటాయింపులు చేసిందేమి లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పంపు హౌస్‌లో నాలుగు మోటార్లు ఉండగా ఒక్కొక్కటి మాత్రమే పని చేస్తుండడంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారిందని కర్షకులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగు చేపట్టినా.. రబీ అంతంత మాత్రంగానే ఉందని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కొందరు రైతులు సమావేశమై 17 మందితో తారకరామ ఎత్తిపోతల పరిరక్షణ సంఘంగా ఏర్పడ్డారు. ఈ నెల 2న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశను కలిసి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు తక్షణమే రూ.5 కోట్లు కేటాయించి వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగు నీరందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై తారకరామ సహాయక ఇంజినీర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆయన ఇలా స్పందించారు. మరమ్మతులకు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. అవి మంజూరు కాగానే పనులు ప్రారంభించి ఖరీఫ్‌కు సాగు నీరందిస్తామని చెప్పారు.

మహిళకు కుట్టుమిషన్ వితరణ

రాజవరం (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని రాజవరంలో పేద కుటుంబానికి చెందిన అనంత సీతామహాలక్ష్మికి సోమవారం తెదేపాకు చెందిన ఉత్తమ మార్గదర్శి అవార్డు గ్రహీత, ఎన్నెస్పీ నీటి సంఘం అధ్యక్షుడు చెన్నుపై అచ్చంరాజు రూ.10 వేల విలువైన కుట్టుమిషన్, సామగ్రిని వితరణ చేశారు. ఆ పార్టీకి చెందిన ఎం.గోపి, ఒ.వెంకటేశ్వరరావు, ఐ.ఏసు, బి.వీరయ్య, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనం



మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : డ్రగ్స్ నిర్మూలనతో దేశ ఉజ్వల భవిష్యత్తుకు యువత మార్గనిర్దేశంగా నిలివాలని ఎన్టీఆర్ జిల్లా డీసీపీ అడ్మినిస్ట్రేషన్ కేజీవీ సరిత కోరారు. సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాలతో డ్రగ్స్ నిర్మూలనపై చేపట్టిన సైకిల్ ర్యాలీ సోమవారం జి.కొండూరు చేరిన సందర్భంగా జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనం చేసుకోవలసి వస్తుందని సూచించారు. విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల దరి చేరనీయకుండా యువత కృషి చేయాలని కోరారు. తొలుత జి.కొండూరు వై జంక్షన్ వద్దకు చేరుకున్న సైకిల్ యాత్రకు విద్యార్థులు, పోలీసు సిబ్బంది మంచి స్వాగతం పలికారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

కొండపల్లి, న్యూస్‌టుడే : సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకోవాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్ అన్నారు. మాదక ద్రవ్యాలతో ఏర్పడే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని కొండపల్లి ఏబీఎంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో ఆ వ్యక్తి ఒక్కరే నష్టపోవడం లేదన్నారు. ఇది సామాజిక రుగ్మతగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశలోనే కొందరు వాటికి బానిసలుగా మారిపోవడంతో కుటుంబాలు పతనమవుతున్నాయని చెప్పారు. ఇలాంటి వాటిని తొలగించేందుకు డీ-ఎడిక్షన్ సెంటర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం కోఆర్డినేటర్ సాయిబాబు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



బాలబాలికలను సూచనలిస్తున్న చిట్టిబాబు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని కొండపల్లి పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అందులో భాగంగానే విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం స్టడీ అవర్స్‌లో అవసరమైన అల్పాహారాన్ని తాను అందిస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించండి

తిరువూరు, న్యూస్‌టుడే : రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని, లేబర్ కోడ్స్ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం తిరువూరు పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి బోసుబొమ్మ వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

ట్రాఫిక్.. రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎన్టీఆర్ జిల్లా ఆర్టీవో మహమ్మద్ ఆలీ అన్నారు. స్థానిక శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల మీటింగ్ హాల్‌లో సోమవారం జరిగిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శ్రీసిద్ధార్థ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ మేడా మోహన్‌రావు, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శివుని కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు



తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్సై అర్జున్‌రాజు



కొత్తపల్లి గుడిలో..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధి కొండపర్వలో శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 15,16,17 తేదీల్లో మల్లయ్య స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా భక్తులు చేపట్టాల్సిన ఏర్పాట్లను విస్సన్నపేట ఎస్సై అర్జున్ రాజు క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. గ్రామ ప్రముఖులు మట్ట వేణుగోపాలరావు, కొత్తపల్లి మహేష్, అక్కిరెడ్డి ఉమామహేశ్వరరావు, కారంగుల శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ పాల్గొన్నారు. మృత్యాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు గంగా విజయదుర్గ సమేత నాగ మల్లేశ్వర స్వామి గుడిలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు.

శివాలయాల్లో విశేష పూజలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, గంపలగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం అర్చకులు గంగా పార్వతీ సమేత పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. శివలింగాలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నదానం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట పరిధి ద్వారకా నగర్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయం వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్యాంకు శిథిలం... కూలితే ప్రమాదం



ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం దాములూరులోని తాగునీటి ట్యాంకు ప్రమాదకరంగా మారింది. శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉంది. దీని సమీపంలో నివాసాలు ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ట్యాంకుపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు కూడా విరిగిపోవడంతో ట్యాంకు శుభ్రం చేయడం లేదని, దీంతో తాగునీరు కలుషితంగా వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం గ్రామీణ తాగు నీటి సరఫరా శాఖ సహాయక ఇంజినీరు సునీత వివరణ ఇస్తూ జడ్పీ నిధుల నుంచి ట్యాంకు మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

పెరిగిన పొదలు.. నీటి ప్రవాహానికి అడ్డంకులు



ఎన్నెస్పీ కుదప మేజర్ కాల్వలో దట్టంగా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో కాల్వ చివరి భూములకు సాగర్ జలాల సరఫరా సక్రమంగా జరగడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కాల్వ ఆయకట్టులో అన్నదాతలు మొక్కజొన్న, వరి పంటలు సాగు చేపట్టారు. ఎన్నెస్పీ అధికారులు స్పందించి మేజర్ కాల్వలో పెరిగిన పొదలను తొలగించి నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

సమస్య పరిష్కారానికి హామీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కేతనకొండలోని రోడ్లపై ప్రవహిస్తున్న మురుగుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గ్రామానికి చెందిన మహిళలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీవో శకుంతల, పంచాయతీ కార్యదర్శి స్వాతిలతో పాటు నాయకుడు దుర్గప్రసాద్ గ్రామానికి వచ్చి సమస్య పరిశీలించారు. గ్రామంలోని రహదారులను సర్వే చేసి ఆక్రమణలు తొలగించి సీసీ రోడ్లతో పాటు మురుగు కాలువలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న అధికారులు

పొంచి ఉన్న ఆపద



రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని పశు వైద్యశాలకు వెళ్లే రహదారిలోని కల్వర్టు కూలి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రోడ్డు మొదట్లోనే కాల్వపై ఉన్న కల్వర్టు సగం పడిపోయింది. ప్రమాదకరంగా ఉన్న దానిపై నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పితే పక్కనే ఉన్న వాగులో పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

రహదారిని అభివృద్ధి చేయరూ..



రెడ్డిగూడెం పంచాయతీలోని ఒకటో వార్డు దగ్గర నుంచి జగ్గన్న కుంట వైపు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జగ్గన్న కుంటలోని శ్మశాన వాటికకు ఈ మార్గం నుంచే వెళ్తారు. వర్షాకాలంలో ఈ రోడ్డు బురదగా మారడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : ఊరిలోని ప్రభుత్వ బడిని బలోపేతం చేయడానికి అంతా కృషి చేయాలని ఎంఈవో బండి రాజు పేర్కొన్నారు. 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం- ఊరి బడిని కాపాడుకుందాం' పేరిట యూటీఎఫ్ రూపొందించిన గోడప్రతులను స్థానిక ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో ఆయన సోమవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.గంగరాజు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, వసంతరావు, కార్యదర్శులు శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : జూపూడిలోని ఎస్ఆర్‌కే గృహ సముదాయంలో అక్కడి నివాసులతో పాటు పరిసర వాసులకు సోమవారం నిమ్రా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సమస్యలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు సాహిత్య రెడ్డి వారికి వివరించారు. వైద్యులు రామానంద్, డాక్టరు బెనుష్షాలతో పాటు దంత వైద్య విద్యార్థులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఎస్‌కేఆర్ హోమ్స్ రెసిడెంట్స్ అసోసియేషన్‌కు చెందిన నాగభూషణం, జోగేశ్వరరావు, వాలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వినతి



జి.కొండూరులో ఏపీవోకు వినతిపత్రం ఇస్తున్న రమేష్, రాజ్‌బుడే తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న వీబీ జీ రాంజీ పథకాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని మైలవరం నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి బుడ్డి రమేష్, మండల ఏపీవోకు వినతిపత్రం అందజేశారు. షేక్ రాజ్‌బుడే, మస్తానవలి, లింగాల చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గొల్లపూడిలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం, విజయవాడ గ్రామీణ మండలం కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు, బి.రమేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న వ్య.కా.స నాయకులు

'ప్రత్యేక' చిన్నారులకు అభినందన



రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ప్రత్యేక అవసరాల పిల్లలకు రెండు రోజులుగా విజయవాడలోని స్టెల్లా కళాశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెడ్డిగూడెం భవిత కేంద్రం విద్యార్థులు పి.సుజన్, ఎం.సందీప్, పి.రవీంద్ర, ఎం.ప్రవీణ్, ఎం.యశ్వంత్ బహుమతులు సాధించారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో పి.రమేష్ బాబు, రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐ.దర్శకేల వీరిని అభినందించారు.

చర్చకు దారి తీసిన కొలికపూడి పోస్టు



ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఫోన్‌లో పెట్టుకున్న వాట్సప్ స్టేటస్

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి. శ్రీనివాసరావు తన చరవాణిలో పెట్టుకున్న వాట్సప్ స్టేటస్ మళ్లీ వివాదానికి దారి తీసింది. 'మూడు రోజుల్లో 35 గ్రామాలు, 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలతో పల్లె కన్నీరు పెడుతోంది' అంటూ తన వాట్సప్‌లో పెట్టుకున్నారు. ఈ వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పెట్టినట్లు స్థానిక అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. ప్రతిసారి ఇలా వివాదాలను సృష్టించాలని చూస్తున్నారన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుక

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాచవరం అమ్మనాన్న వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్‌జానీ, ప్రధాన కార్యదర్శి రాఘవరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గేదెలను ఢీకొన్న లారీ

గొల్లపూడి: గొల్లపూడి సమీపంలో విజయవాడ బైపాస్‌పై వెళ్తున్న గేదెలను లారీ సోమవారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గేదె, దూడ సంఘటనా స్థలంలోనే చనిపోగా మూడు గేదెలకు గాయాలయ్యాయి.

'విధులు బహిష్కరిస్తాం'

కొండపల్లి, న్యూస్‌టుడే : పురపాలిక సంఘ ఆర్వోను సస్పెండ్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం, సహాయక ఇంజినీరు మౌస్మిలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య మహిళా కార్మికులపై ఆర్వో రామకృష్ణ ఫోన్ సంభాషణలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరంగా ఉన్నాయన్నారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే కార్మికులందరూ విధులు బహిష్కరిస్తామన్నారు. సీఐటీయూ నాయకుడు మహేష్, యూనియన్ నాయకులు టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన



జల సేవ అధ్యయనంలో విద్యార్థుల బృందం, అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడు గ్రామంలోని శుద్ధ జలాలను కేంద్ర ప్రభుత్వం నియమించిన విద్యార్థుల బృందం పరిశీలించింది. వీరు జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు, గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిశీలనకు 'జల సేవా అధ్యయనం' నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం పర్యవేక్షించారు. ఇక్కడి నుంచి వస్తున్న నీటిలో నాణ్యతను పరీక్షించేందుకు నమూనాలను సేకరించారు. ఎ.కొండూరు, ఇబ్రహీంపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సీహెచ్.సాయిలక్ష్మి, దయానంద్ పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి




కంభంపాడులో సమావేశమైన ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడులో సోమవారం నిర్వహించిన ఏపీ ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు విచారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. దళిత మహిళలపై జరుగుతున్న దాడులను ప్రశ్నించేందుకే కర్నూల్ జిల్లా బొందిమడుగల గ్రామానికి చెందిన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం.రమేష్ హతమార్చారని ఆరోపించారు. ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.ఏలియాబాబు, బి.వెంకటరత్నం, కె.కృష్ణ, మల్లయ్య, ఏసురత్నం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి పేగులో పిన్నీసు

● బయటకు తీసిన వైద్యులు



పేగులో ఇరుక్కున్న పిన్నీసు / బయటకు తీశాక..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: బాలుడి పేగులోకి చేరిన పిన్నీసును వైద్యులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో బయటకు తీశారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పెద్ద అంబడిపూడికి చెందిన బాలుడు రెహాన్ (5) సోమవారం ఉదయం ఆడుకుంటూ నోట్లో పిన్నీసు పెట్టుకున్నాడు. ప్రమాదవశాత్తు అది గొంతులో నుంచి లోపలకు జారిపోయింది. వెంటనే తల్లిదండ్రులు నరసరావుపేటలోని యశ్వర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ నిఖిలేష్ యండమూరి బాలుడి ఉదర భాగంలో ఎక్స్‌రే తీసి పిన్నీసు పేగు లోపల ఇరుక్కుపోయిందని గుర్తించారు. అధునాతన పద్ధతిలో ఎండోస్కోపీ సాయంతో దానిని బయటకు తీసి బాలుణ్ని కాపాడారు. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని డా.నిఖిలేశ్ సూచించారు.

స్వర్ణ కార్యాలయాలపై నిరంతర పర్యవేక్షణ

● అమల్లోకి మూడంచెల వ్యవస్థ
● డిప్యుటేషన్లపై 2,778 మంది అధికారుల నియామకం
● విధులు, బాధ్యతలపై మార్గదర్శకాలు విడుదల

ఈనాడు, అమరావతి: స్వర్ణ గ్రామ, వార్డు శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన మూడంచెల వ్యవస్థ అమల్లోకి వచ్చింది. జిల్లా, మండల, పట్టణ స్థాయిలో ఈ కార్యాలయాల పర్యవేక్షణ కోసం అధికారుల నియామక ప్రక్రియను పూర్తిచేసిన ఆ శాఖ.. వారికి సంబంధించిన విధులు, బాధ్యతలపై మార్గదర్శకాలు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయాలపై సరైన పర్యవేక్షణ లేని కారణంగా పలు ఇబ్బందులు తలెత్తడంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. వాటిని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలుగా పేరు మార్చడంతో పాటు పర్యవేక్షణ కోసం మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఇందుకోసం డిప్యుటేషన్లపై ఇతర ప్రభుత్వ శాఖల నుంచి 2,778 మంది అధికారులను నియమించింది.

జిల్లాస్థాయి అధికారుల విధులు

● జిల్లాలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలను పర్యవేక్షించాలి ● ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యత తీసుకోవాలి ● ప్రభుత్వ నిర్దేశిత కాల వ్యవధిలో సేవలందేలా చూడాలి ● కార్యాలయాల తనిఖీలు చేసి లోపాలు సరిదిద్దాలి ● స్వర్ణ గ్రామ, వార్డు శాఖ ముందస్తు అనుమతి లేకుండా ఉద్యోగులు ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్లపై వెళ్లకుండా చూడాలి ● హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి ● ప్రజలకు అందించే సేవలపై వసూలు చేసే రుసుములు అదే రోజు, తప్పనిసరి పరిస్థితుల్లో మరుసటి రోజు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి ● ఉద్యోగులపై ఫిర్యాదులు, అక్రమాలపై విచారణ చేసి.. క్రమశిక్షణ చర్యల కోసం కలెక్టర్, రాష్ట్ర స్వర్ణ గ్రామ, వార్డు శాఖకు నివేదికలు పంపి, వారి నుంచి వచ్చే ఆదేశాలు అమలు చేయాలి.

మండల, పట్టణ స్థాయిలో ఇలా..

● మండల, పట్టణ స్థాయి పర్యవేక్షణ అధికారులు ఆయా కార్యాలయాల్లో మౌలిక వసతుల పరంగా ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి ● ఐటీ సేవల పరంగా పరికరాలు (కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్) సక్రమంగా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి ● ఆధార్ కేంద్రాల వసతిని పర్యవేక్షించాలి. ప్రతి ఆరు నెలలకు ఒక ఆధార్ కేంద్రం తనిఖీ చేయాలి ● ప్రతి పౌరుడూ ఆధార్ నమోదు చేసుకునేలా చూడాలి ● ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి ● ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యేలా చూడాలి.

యూరప్ పర్యటనకు ఇద్దరు మహిళా రైతులు



నరసమ్మ, జ్యోతి

ఈనాడు, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా దురుబిలికి చెందిన ఆరిక నరసమ్మ, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సంతపాలేనికి చెందిన లాలం జ్యోతి అనే ఇద్దరు మహిళా రైతులకు యూరప్‌లో పర్యటించే అరుదైన అవకాశం దక్కింది. వీరు జర్మనీ, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, పోలెండ్, బెల్జియం సహా ఏడు దేశాల్లో 30 రోజుల పాటు పర్యటించనున్నారు. ఆయా దేశాల్లోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలు, పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఆర్గానిక్ ట్రేడ్ ఫెయిర్‌లను సందర్శిస్తారు. అక్కడ అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా.. ప్రకృతి వ్యవసాయం చేస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఈ ఇద్దరు రైతులను ఎంపిక చేసినట్లు రైతు సాధికార సంస్థ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రైతులతో పాటు అధికారులు యర్రకొండ సుధాకర్, స్వాతి మంగళవారం యూరప్ బయల్దేరనున్నారు. బెర్లిన్‌కు చెందిన ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ ఫార్మింగ్ సంస్థ ఈ పర్యటన నిర్వహిస్తోంది.

శ్రీశైలంలో శివస్వాముల ఆందోళన

● ఆలస్యంగా స్పర్శ దర్శనాలకు అనుమతించడంతో ఆగ్రహం
● గేట్లు ఎక్కి ప్రధాన ద్వారం వైపు చొచ్చుకెళ్లిన వైనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు సోమవారం భక్తులు పోటెత్తారు. సాధారణ, శివదీక్షా భక్తులతో ఆలయ క్యూ కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనానికి శివదీక్షా భక్తులు తెల్లవారుజామున 2 గంటల నుంచి చంద్రావతి కల్యాణ మండపంలో గంటల తరబడి ఎదురుచూశారు. ఉదయం 10 గంటలైనా దర్శనం జరగకపోవడం, క్యూలైన్లు నిలిచిపోవడంతో భక్తుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. చంద్రావతి కల్యాణ మండపం వైపు క్యూలైన్ల నుంచి శివదీక్షా భక్తులు, పుష్కరిణి ఇనుప గేటు వద్ద సాధారణ భక్తులు గేటుపైకి ఎక్కి నేరుగా కృష్ణదేవరాయ గోపురం వైపు ఒకేసారి రావడంతో పరిస్థితి అదుపు తప్పింది. వందల సంఖ్యలో భక్తులు ఇనుప గేటును బలవంతంగా నెట్టేసి ఆలయంలోకి చొచ్చుకెళ్లారు. వీరిని యంత్రాంగం కట్టడి చేయలేకపోయింది. సాయంత్రం 5 గంటల వరకూ పరిస్థితి అదుపులోకి రాకపోవడం గమనార్హం. కొందరు భక్తులు గోపురం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. దేవస్థానం ఈవో, ఛైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఏర్పాట్ల కరవు: బ్రహ్మోత్సవాలకు దేవాదాయశాఖ తరఫున ఉత్సవాల ప్రత్యేక అధికారిగా రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్‌ను నియమించారు. ఆయన ధ్వజారోహణంలో పాల్గొన్న తర్వాత తిరుగుముఖం పట్టారు. భక్తుల రద్దీ విపరీతంగా ఉన్నప్పటికీ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు అందుబాటులో లేరు. ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు ఆలయం వద్దకు వచ్చి రద్దీని చక్కదిద్దే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. ఆలయ పరిసరాల్లో సరిపడా పోలీస్ అధికారులు, అదనపు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం, క్యూలైన్లు, ఇంజినీరింగ్ అధికారులు ఆలయం వైపు గేట్లను సక్రమంగా నిర్మించక పోవడం వంటి లోపాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.



కృష్ణదేవరాయగోపురం ఎదుట నిరసన తెలుపుతున్న శివదీక్షా భక్తులు

శివభక్తులపై ఏఎస్పీ లాఠీఛార్జ్

స్పర్శ దర్శనానికి ఆలస్యం అవుతుండడంతో శివదీక్షా భక్తులు నిరసన వ్యక్తం చేస్తూ గోపురం వద్దకు చేరుకోగా, ఆఘమేఘాల మీద తన సిబ్బందితో సాయంత్రం అక్కడికి వచ్చిన ఏఎస్పీ యుగంధర్‌బాబు శివదీక్షా భక్తులపై లాఠీఛార్జ్ చేశారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. దీంతో భక్తులు అక్కడే బైఠాయించి ఏఎస్పీ తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షలో ఉన్న భక్తులపై దాడి చేసిన ఏఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



శివదీక్షా భక్తులపై లాఠీఛార్జి చేస్తున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఈ-ప్యాంట్రీ సేవలకు శ్రీకారం

దిల్లీ: రైల్లో నుంచే ఆహారాన్ని ఆర్డర్ చేసేందుకు ఈ-ప్యాంట్రీ సేవలను ఐఆర్‌సీటీసీ ప్రవేశపెట్టింది. తొలుత వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలను ప్రారంభించగా.. 25 మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తాజాగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో విశాఖపట్నం నుంచి నడిచే ఏపీ ఎక్స్‌ప్రెస్ ఉంది. ప్యాంట్రీ కారు కలిగిన ఎంపిక చేసిన రైళ్లలో ఈ సేవలను పొందొచ్చు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లోగానీ, యాప్‌లోగానీ 'టికెట్ హిస్టరీ' సెక్షన్‌లో ఈ-ప్యాంట్రీ మీల్ ఆప్షన్ కనిపిస్తుంది. మీల్ బుక్ చేసుకున్నాక వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దాన్ని డెలివరీ సమయంలో చూపించాలి.

గుణదల మేరీమాత ఉత్సవాలు ప్రారంభం



మేరీమాత విగ్రహంతో వేదిక వద్దకు వస్తున్న బిషప్ తెలగతోటి రాజారావు తదితర గురువులు

గుణదల, న్యూస్‌టుడే: విజయవాడలో ప్రసిద్ధ క్రైస్తవ క్షేత్రం గుణదల కొండపై మేరీమాత మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు జ్యోతి వెలిగించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముఖ్యఅతిథులుగా జూబిలేరియన్ ఫాదర్ నేలటూరి ఫ్రాన్సిస్, సిల్వర్ జూబిలేరియన్ ఫాదర్ మద్దాల జోసఫ్ హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. అనంతరం మత పెద్దలు ప్రారంభ పవిత్ర సమష్టి దివ్యపూజాబలి సమర్పించి, భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. సాయంత్రం గుణదల వీధుల్లో మేరీమాత స్వరూపాన్ని ఊరేగించారు. కొండ కింద ఉన్న బిషప్ గ్రాసీ పాఠశాల మైదానంలో పూజా వేదికపై మేరీమాతను ప్రతిష్ఠించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా విశ్వాసులు తరలివచ్చారు.



వేడుకలకు హాజరైన విశ్వాసులు

గతి లేదని వస్తే గెంటేస్తామన్నారు!



ఒకరి భుజంపై ఒకరు చేయి వేసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ కార్యాలయం మెట్లు ఎక్కుతున్న వీరంతా అంధులు. తిరుపతిలోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో వసతి పొందుతున్నారు. హాస్టల్‌లో సౌకర్యాల లేమి, నాసి రకం భోజనంపై ఫిర్యాదు చేయడానికి సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రయాసపడి వచ్చినా ఇక్కడి సిబ్బంది తమ సమస్యలను పట్టించుకోలేదని, శరణాలయం నుంచి తరిమేస్తామని బెదిరిస్తున్నారని కార్యాలయం నుంచి తిరిగి వెళిపోతూ వాపోయారు.

– న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

బర్డ్ ఫ్లూ వ్యాపించకుండా పటిష్ఠ చర్యలు

● ప్రజలు ఆందోళన చెందొద్దు: మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లోనే కాకుండా, పరిసర ప్రాంతాల్లోనూ పటిష్ఠమైన నియంత్రణ చర్యలు చేపట్టామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లెలో బర్డ్ ఫ్లూని గుర్తించిన వెంటనే అప్రమత్తమై అవసరమైన సహాయ బృందాలను మోహరించాం. వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకున్నాం. సదుం మండలంలోని మరో గ్రామం, చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం నుంచీ నమూనాలను భోపాల్ ప్రయోగశాలకు పంపాం, వాటిపై నివేదికలు రావాల్సి ఉంది. వ్యాధి ప్రభావిత ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల్లోని కోళ్ల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పశువైద్యులు సూచనలిస్తున్నారు. పశు సంవర్ధకశాఖ సంచాలకులు దామోదర్‌నాయుడు కార్వేటినగరం మండలంలో పర్యటించి, ఫ్లూ నియంత్రణకు పాటించాల్సిన చర్యలపై రైతులకు మార్గనిర్దేశం చేశారు' అని మంత్రి తెలిపారు. 'ఈ ఫ్లూ పక్షులకు మాత్రమే సంబంధించినది. బాగా ఉడికించిన కోడి మాంసం, గుడ్ల వినియోగం సురక్షితమే. కోళ్ల పెంపకందారులు బయోసెక్యూరిటీ చర్యలను కఠినంగా పాటించాలి. వాటిలో ఏవైనా అసాధారణ మరణాలు గమనిస్తే వెంటనే సమీప పశువైద్యాధికారులకు సమాచారం అందించాలి' అని మంత్రి నిర్దేశించారు.

15న జిల్లా స్థాయి రగ్బీ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా రగ్బీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న గన్నవరంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి అండర్-12 బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు బొప్పన హరికృష్ణ, కార్యదర్శి నాగళ్ల చంద్రకళ తెలిపారు. 2013, 2024, 2015 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల పాఠశాలల జట్లు తమ ఎంట్రీలను ఈ నెల 10వ తేదీ సాయంత్రం లోపు పంపాలని చెప్పారు. మరిన్ని వివరాలకు కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాంబాబు (సెల్ నంబరు 99487 76941)ను సంప్రదించాలని తెలిపారు.

నకిలీ మద్యం కేసులో సెంథిల్‌కు రిమాండ్

పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపర్చిన ఎక్సైజ్ పోలీసులు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో సీసాలను సరఫరా చేసిన కోయంబత్తూరుకు చెందిన సెంథిల్ (ఏ22)కు కోర్టు రిమాండ్ విధించింది. అన్నమయ్య జిల్లా మదనపల్లి జైలులో ఉన్న నిందితుడిని పీటీ వారెంట్‌పై సోమవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. సెంథిల్‌కు న్యాయాధికారి ఈనెల 19 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో విజయవాడలో జిల్లా కారాగారానికి తరలించారు. ఈ కేసులో నిందితుడు సుదర్శన్ (ఏ21) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్.. సోమవారం ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చింది. పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పు నిమిత్తం ఈనెల 17కు కోర్టు వాయిదా వేసింది.

28న మహాధర్నా జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న నారగోని, ప్రతినిధులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: బీసీ రిజర్వేషన్లు కులగణనపై ఈ నెల 28న తలపెట్టిన మహాధర్నా జయప్రదం చేయాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు మాదిరిగా ఓబీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మండల్ కమిషన్‌ను అమలుచేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. పాలక, ప్రతిపక్షాలు కక్షపూరిత చర్యలు మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. సంఘం నాయకులు పి.దేవిశ్రీ, వి.అయ్యన్నబాబు, ఎల్.జైబాబు, విజయబాబు, వేల్పుల శ్రీనివాస్, పూర్ణ, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

13న ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు ఈ నెల 13న జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి దాదాపు 17 మంది పోటీలో ఉన్నారు. బీబీఏ నుంచి సిట్టింగ్ సభ్యులైన సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్‌లు తిరిగి పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలోని 152 బార్ అసోసియేషన్ల నుంచి సుమారుగా 200 మంది బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీలో ఉన్నారు. రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల నుంచి దాదాపు 42 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఒక్కో న్యాయవాది 25 మందికి ఓటు వేయాలి

ఒక్కో న్యాయవాది పోటీలో ఉన్న 25 మంది న్యాయవాదులకు ఓటు వేయాలి. మొదటి ప్రిఫరెన్షియల్ ఓట్లు ఎవరికి ఎక్కువ పడతాయో వారే గెలిచినట్టు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ చేసిన వారికే ఓటు వేసే హక్కు ఉంది. దేశంలోని అన్ని బార్ కౌన్సిళ్లకు నిర్ణీత సమయంలో ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే. దీనికి తగ్గట్టుగా ఏపీ బార్ కౌన్సిల్‌కు ఈ నెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

నువ్వు సాగుకు కేవీకే ప్రోత్సాహం

రైతేరాజు

నందిగామ గ్రామీణం, వత్సవాయి, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు అవకాశం ఉన్న నువ్వు సాగుకు గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా రబీ సీజన్‌లో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను సైతం పంపిణీ చేస్తోంది. పంట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేవీకే శాస్త్రవేత్తలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.



ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త వెంకటరెడ్డి

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం పల్లగిరి, గోళ్లమూడి, పెనుగంచిప్రోలు మండలం శనగపాడు, వత్సవాయి మండలం కన్నెవీడు, గ్రామాల రైతులకు శాస్త్రవేత్తలు నువ్వు విత్తనాలు సరఫరా చేసి సాగు చేయిస్తున్నారు. గత ఏడాది రబీ సీజన్‌లో వైఎల్ఎం-66 రకం విత్తనాలను 50 మంది రైతులు పంపిణీ చేయగా.. వారు 50 ఎకరాల్లో సాగు చేశారు. క్వింటా విత్తనాలు ఉచితంగా ఇచ్చారు. ఎకరానికి మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. విజయనగరం జిల్లా యలమంచిలి ఆర్ఏఆర్ఎస్ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఈ రకం విత్తనాన్ని మరింతగా అభివృద్ధి చేసి వైఎల్ఎం-146 రకం విత్తనాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత రబీ సీజన్‌లో గతంలో ఎంపిక చేసిన గ్రామాలతో పాటు జగ్గయ్యపేట మండలం పోచంపల్లి రైతులకు ఈ విత్తనం ఉచితంగా పంపిణీ చేశారు. వైఎల్ఎం-146 రకం నువ్వు విత్తనాలు 50 ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు.

హెక్టారుకు 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి: వైఎల్ఎం-146 రకం నువ్వు హెక్టారుకు 7-10 క్వింటాళ్ల దిగుబడినిస్తుందని గరికపాడు కేవీకే వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త ఐ.వెంకటరెడ్డి తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద వీటిని ఇచ్చామన్నారు. తక్కువ పెట్టుబడితో సాగుచేసే ఈ పంట ద్వారా రైతులకు రాబడి బాగుంటుందని చెప్పారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను ఎంపికచేసి ఆసక్తి ఉన్న రైతులతో సాగు చేయిస్తున్నామని వివరించారు. గత ఏడాది రబీ సీజన్‌లో వైఎల్ఎం-66 రకం విత్తనాలను సాగుచేసిన కొంతమంది రైతులు మాట్లాడుతూ ఎకరాకు రెండు కిలోల విత్తనాలు వేశామని, సాగు ఖర్చులు సుమారు రూ.15 వేలు అయ్యాయని తెలిపారు. మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, క్వింటా రూ.8 వేలకు పైగా విక్రయించగా.. మూడు క్వింటాళ్లపై ఖర్చులన్నీ పోను రూ.10 వేలు ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో వైఎల్ఎం-146 రకం వేశామని అంతకంటే ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రశ్న: మిరప పంటలో రకాలను వివరించండి?

- ఎం.రంగయ్య, రైతు, శ్రీకాకుళం



సమాధానం: మిరపపంటలో రకాలు: జి-3: పొడవు కాయలు, వర్షాధారపు పైరుకు అనుకూలం. దిగుబడి వర్షాధారంగా హెక్టారుకు 6-7 క్వింటాళ్లు. నీటి వసతి కింద హెక్టారుకు 15-18 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది.

జి-4(భాగ్యలక్ష్మి): కాయలు సన్నగా, పొడవుగా ఉంటాయి. పచ్చిమిర్చి, ఎండుమిర్చికి అనుకూలం. వైరస్‌ను తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 40-45 క్వింటాళ్లు వస్తుంది.

సి.ఎ.(సింధూరు): కాయలు పొడవుగా, లావుగా ఉంటాయి. పచ్చిమిర్చికి, ఎండుమిర్చికి అనుకూలం. నీటి వసతి కింద వేయదగిన రకం. త్వరగా కాపునకు వస్తుంది. కారం తక్కువ. వేసవి పైరుకు అనుకూలమైన రకం. దిగుబడి హెక్టారుకు 50-55 క్వింటాళ్లు వస్తుంది.

యల్.సి.ఎ.235 (భాస్కర్): కాయలు పొడవు తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాధారంగా, నీటివసతి కింద సాగుకు అనుకూలం. వైరస్‌ను బాగా తట్టుకుంటుంది. అన్ని జిల్లాలకు అనుకూలం. దిగుబడి హెక్టారుకు 50-60 క్వింటాళ్లు వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

మేలైన దిగుబడికి ఊతం

టమాటా సాగులో ఇదే కీలకం



మొక్కలకు దన్నుగా ఏర్పాటు చేశారిలా.. (పాత చిత్రం)

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: టమాటా సాగుకు సమయం ఆసన్నమైంది. మెట్ట ప్రాంతాల్లో కూరగాయలు పండించే రైతులు దీని సాగుకు సమాయత్తమవుతున్నారు. విత్తన ఎంపిక, శుద్ధి, నేలను సిద్ధం చేయడంలో తగు జాగ్రత్తలతో పాటు, మొక్కలకు కర్రలతో ఊతం ఏర్పాటు చేయడం అత్యంత కీలకమని చెబుతున్నారు బాపులపాడు మండల ఉద్యానాధికారి సుందరం జోసెఫ్.

☛ పొడవుగా పెరిగే హైబ్రిడ్ రకం మొక్కలతో పాటు, దేశవాళీ టమాటా మొక్కలకు సైతం ఊతం ఏర్పాటు చేయాలి. ☛ ప్రతి మొక్క పక్కన ఓ కర్ర పాతి, పురికొసతో కడితే..దానిని ఆసరాగా చేసుకుని పెరుగుతుంది. ☛ దీని వల్ల కాయలు నేలకు తగిలి పాడవకుండా ఉండడంతో పాటు, మంచి పరిమాణంతో దిగుబడి వస్తుంది. ☛ గాలి, వెలుతురు బాగా తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది.

40శాతం వరకు రాయితీ: టమాటా సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహం అందిస్తుంది. హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్ పథకంలో భాగంగా, విత్తనాలు, నారు, సేంద్రియ, రసాయన ఎరువుల కొనుగోలు, సమీకృత తెగుళ్ల నివారణకు అవసరమయ్యే మందుల ఖర్చులో 40 శాతం వరకు రాయితీ అందిస్తున్నారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా హెక్టారుకు రూ.24 వేల వరకు ప్రోత్సాహం లభిస్తుంది. సాగుకు సమాయత్తమయ్యే ముందు సమీపంలోని ఉద్యానాధికారుల్ని సంప్రదించి, తగు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

వంగలో తెగుళ్లు అరికడదాం



- ఘంటసాల, న్యూస్‌టుడే

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: వంగలో సస్య రక్షణ చర్యల ద్వారా తెగుళ్లను సులువుగా అరికట్టవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి మానస తెలిపారు. ప్రస్తుతం వంగ తోటలో రసం పీల్చే పురుగు ఉంది. అది ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చేస్తుంది. దీంతో ఆకులు పసుపు రంగులోకి మారి పైకి ముడుచుకుని ఎండిపోతాయి. దిగుబడులపై ప్రభావం చూపుతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ అధికంగా ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రాముల మందు.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలో ఎర్రనల్లి ప్రభావంతో ఆకులు పాలిపోయి తెల్లగా మారతాయి. ఆకులపై సాలె గూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

వసుంధర

vasundhara@eenadu.in

యూకేలో 'స్టెమ్' చదువులకు ఉపకారవేతనం!



ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల్లో చదవాలన్న కోరిక ఉన్నా, ఆర్థిక పరిస్థితి సహకరించని పరిస్థితి చాలామంది అమ్మాయిలది. ఇలాంటి నేపథ్యం నుంచి వచ్చినవాళ్లకు యూకేలోని ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి స్టెమ్ రంగాల్లో మాస్టర్స్ చేసేందుకు స్కాలర్‌షిప్ అందిస్తోంది బ్రిటిష్ కౌన్సిల్. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ. ఇప్పటివాళ్లకి పెద్దగా అవకాశాలు రావడంలేదు. ఈ లోటుని పూడ్చటానికి బ్రిటిష్ కౌన్సిల్ ఆర్థికంగా స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. దీన్లో భాగంగా ఏడాది నిడివి ఉండే మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసే అవకాశం కల్పిస్తారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబాటున్న విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. దాదాపు రూ.40 లక్షల విలువైన ఆర్థిక సాయం అందుతుంది. ట్యూషన్ ఫీజు, ప్రయాణ, వీసా ఖర్చులు, ఆరోగ్య బీమా... ఇవన్నీ దీనిలో భాగం. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దక్షిణాసియా నుంచి 25 మందికి స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. మరిన్ని వివరాలకు బ్రిటిష్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను సందర్శించండి.

'బంగారు' తల్లులు!

చదువుల్లో ప్రతిభ కనబరచాలని, బంగారు పతకం అందుకోవాలని చాలామంది విద్యార్థులు కలలు కంటుంటారు. కానీ, దాన్ని సొంతం చేసుకోగలిగేది కొందరే. ఏళ్లుగా, కఠోర శ్రమలతో తమ చుట్టూ ఉన్న అనేక సవాళ్లను దాటి, పతకాల పంట పండించారీ 'బంగారు' తల్లులు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో జరిగిన స్నాతకోత్సవాల్లో పసిడి పతకాలతో మెరిసిన వీళ్లను పలకరిస్తే...

సాగుకు సాంకేతికతను అందించేలా...

మేడిబావి స్నేహలత



మాది నారాయణపేట జిల్లా నిడ్జింత గ్రామం. వ్యవసాయ కుటుంబం. పదో తరగతిలో మండల స్థాయిలో మొదటి ర్యాంక్ వచ్చింది. అందరూ నన్ను డాక్టర్‌ని కమ్మని సూచించారు. చిన్నప్పటి నుంచి మా తల్లిదండ్రులు పడుతున్న కష్టం చూసి వాటిని తీర్చేలా చదువుకోవాలని, కొత్త యంత్రాలు కనిపెడతానని చెప్పా. ఆ తర్వాత సంగారెడ్డిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా కోర్సు నోటిఫికేషన్ పడింది. అందులో చేరతానన్నా. మా ఇంటికి 200 కిలోమీటర్ల దూరంలో ఉంది కాలేజీ. మొదట భయపడినా... జాగ్రత్తలు చెప్పి పంపించారు. మూడేళ్ల కోర్సు పూర్తిచేశాక అగ్రిసెట్ రాశా. రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి అగ్రిబీటెక్‌లో చేరా. అందులో చేరాకే దాని ప్రాధాన్యం తెలిసింది. అన్నదాతలకు సాయం అందించే కోణంలో చదివాను. థియరీతోపాటు ప్రాక్టికల్స్, క్షేత్రసందర్శనలు, ప్రయోగాల్లో ఎన్నో విషయాలు నేర్చుకొని పరీక్షలు రాశా. ఈ కష్టం నాకు ఏడు బంగారు పతకాలను అందించింది. ప్రస్తుతం ఐఐటీ ముంబయిలో ఎంటెక్ చేస్తున్నా. వ్యవసాయంలో నూతన సాంకేతికత సాయంతో అన్ని పనులు చేసే యంత్ర పరికరాల రూపకల్పనే నా లక్ష్యం.

ఆవిష్కరణలపై ఆసక్తి...:

అల్లంరాజు శ్రీవల్లి



మాది హైదరాబాద్. నాన్న సత్యనారాయణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అమ్మ భారతి. తనలాగే నన్నూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చూడాలని ఉందనేవారు నాన్న. అందుకే ఇంటర్ తర్వాత జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో చేరా. కేవలం చదవడం కాదు, ఏదైనా సాధించాలి అనుకునేదాన్ని. ఫస్ట్ ఇయర్ పూర్తయ్యేసరికి కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి ఏర్పడింది. దీంతో అంకుర సంస్థల ఉత్పత్తులు, కొత్త సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి వంటి అంశాలను తెలుసుకున్నా. ప్రొఫెసర్ల నుంచి ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేసుకునేదాన్ని. రోజూ 3గం. కచ్చితంగా చదివేదాన్ని. మూడో సంవత్సరం నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలపై దృష్టిపెట్టా. ప్లేస్‌మెంట్ విభాగం నుంచి సమాచారం సేకరించుకున్నా. సాఫ్ట్‌వేర్ సంస్థల్లో జీపీఏతోపాటు నైపుణ్యాలూ ముఖ్యమే. అందుకే జావా, కోడింగ్, ఏఐ వంటి నైపుణ్యాలు నేర్చుకున్నా. కాబట్టే, ప్రాంగణ నియామకాల్లో ఒక బహుళజాతి సంస్థలో ఉద్యోగాన్నీ సాధించా. ఉద్యోగమొచ్చినా చదువుని నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి చదివి ప్రథమ ర్యాంకు సాధించడంతోపాటు బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచా. నాలుగు బంగారు పతకాలూ అందుకున్నా.

కూలీల కొరత తీర్చాలని...

గన్నేరపు నవ్య



మాది హనుమకొండ జిల్లా నడికుడ మండలం రాయపర్తి. నాన్న శ్రీనివాస్ పెట్రోలు బంక్‌లో చిరుద్యోగి, అమ్మ రజిత, ఆశా కార్యకర్త. మాకు వ్యవసాయ భూమి లేకున్నా ఊళ్లో పొలాలు, రైతులు, కూలీల జీవితాల్ని దగ్గరగా చూసి ఆ రంగం మీద మక్కువ పెంచుకున్నా. వ్యవసాయ కోర్సులో చేరతానని చెబితే అమ్మానాన్నలు మొదట ఆశ్చర్యపోయారు. సంగారెడ్డిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ప్రథమస్థానంలో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేశా. ఆపై అగ్రిసెట్ రాసి అందులోనే బీటెక్‌లో చేరా. విస్తృతస్థాయి పరిశోధనలు, ప్రయోగాలతో పాటు ఆధునికత సాంకేతికతపై పట్టు సాధించా. దీనికి అనుగుణంగా పరీక్షల్లో రాణించి ఆరు బంగారు పతకాలను సాధించాను. భవిష్యత్తులో రైతులు ఎదుర్కొంటున్న కూలీల కొరతతోపాటు ఇతర సమస్యలకూ పరిష్కారం చూపించడమే నా లక్ష్యం.

– ఆకారపు మల్లేశం, హైదరాబాద్

పగలు ఉద్యోగి... సాయంత్రం విద్యార్థి:

కాకాని స్పందన



మా సొంతూరు ఖమ్మం జిల్లాలోని గూడూరుపాడు. అమ్మానాన్నలు పుచ్చకాయల ప్రభాకర్, విజయలక్ష్మి. పెళ్లయ్యాక హైదరాబాద్‌లో స్థిరపడ్డా. మావారు హరీశ్... స్కూల్‌కి డైరెక్టర్‌గా చేస్తున్నారు. నాకు సొంత సాఫ్ట్‌వేర్ సంస్థను ప్రారంభించాలని కోరిక. అందు కోసం ఎంబీఏ చేయాలనుకున్నా. నేను అప్పటికే క్యాప్ జెమినీలో ఉద్యోగం చేస్తున్నా. దాన్ని పక్కన పెట్టాలనుకోలేదు. అందుకే, జేఎన్‌టీయూ సాయంత్రం కళాశాలలో చేరా. పగలు ఉద్యోగం చేస్తూ సాయంత్రం యూనివర్సిటీ విద్యార్థిగా రెండు పడవలపై ప్రయాణం చేశా. తెల్లవారుజామున 3గం.కు లేచి మధ్యాహ్న భోజనం విరామం వరకూ ఇంట్లో పనులు, ఆఫీసు పని చేసేదాన్ని. ఆపై తరగతులకు హాజరయ్యేదాన్ని. బాబు బాధ్యత పూర్తిగా అత్తయ్యే తీసుకున్నారు. ఓసారి పరీక్షలప్పుడు డెంగీ జ్వరం వచ్చి, బాధపెడుతున్నా.. పట్టుదలతో పరీక్షలు రాశా. ఫైనల్ ఇయర్ పరీక్షలప్పుడు నిండు గర్భిణిని. అయినా రాయాలనే నిశ్చయించుకున్నా. ప్రసవం ముందురోజూ పరీక్ష రాశా. నా కష్టానికి గుర్తింపుగా బంగారు పతకం సాధించడం మరింత ఆనందాన్నిచ్చే విషయం. సంస్థను ప్రారంభించాలా... మా మామయ్య నిర్వహిస్తున్న ఎడ్యుటెక్ కంపెనీ విస్తరణలో భాగస్వామి అవ్వాలా అన్న ఆలోచనలో ఉన్నా.

– బొరెల్లి సునీల్ కుమార్, హైదరాబాద్

డియర్ వసుంధర

మా వారు ఈ మధ్య రోడ్డు ప్రమాదంలో మరణించారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భర్త తాను సంపాదించిన ఆస్తులన్నింటికీ తల్లిని నామినీగా పెట్టడం, ఆమె పేరు మీద కొనడం చేసేవారు. సెంటిమెంట్ అనడంతో నేనూ ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడు ఆయన చనిపోయాక... మా మరిది ప్రోద్బలంతో అవన్నీ తనవే అంటున్నారావిడ. వాటిపై మాకు ఎలాంటి హక్కూ లేదా? మేమెలా బతకాలి? – ఓ సోదరి



జి. వరలక్ష్మి
న్యాయవాది

అమ్మ సెంటిమెంట్‌తో పెట్టారు... ఆవిడ ఇవ్వనంటున్నారు!

అయ్యో... నిజంగానే మీకు అన్యాయం జరిగింది. హిందూ వివాహచట్టంలోని సెక్షన్-14 ప్రకారం స్త్రీకి తల్లిదండ్రుల ద్వారా కానీ, పిల్లల ద్వారా కానీ, పెళ్లప్పుడు వచ్చిన బహుమతులన్నీ ఆవిడ అబ్సల్యూట్ ప్రాపర్టీ అవుతాయి. అంటే వాటిని స్వార్జితం కింద పరిగణిస్తారు. మీ వారు కొన్నట్లు ఆధారాలు ఏమైనా ఉన్నాయా? అంటే అతడి జీతం కటింగ్స్ లేదా అకౌంట్స్ నుంచి మనీ ట్రాన్స్‌ఫర్... ఇలాంటివి ఉంటే వాటిని మీ భర్తే కొనుగోలు చేశారని నిరూపిస్తూ గృహహింస నిరోధక చట్టం కింద ఇంట్లో నివసించే హక్కులు అడగొచ్చు. దాంతోపాటు మీరు పెళ్లప్పుడు ఇచ్చిన కట్నకానుకలు, మీ పిల్లల భవిష్యత్తుకోసం సెక్షన్-22 ప్రకారం శాశ్వత పరిహారం కూడా కోరవచ్చు. ముందుగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి ఏదైనా మీడియేషన్ సెంటర్ సాయం తీసుకోండి. ప్రతి జిల్లా కోర్టులోనూ ఒక మధ్యవర్తిత్వ కేంద్రం ఉంటుంది. మీ అత్తగారు, మీ మరిది ప్రోద్బలంతో అలా అంటూ ఉండొచ్చు. కౌన్సెలింగ్ చేస్తే పిల్లల కోసం అయినా ఇవ్వడానికి ఇష్టపడవచ్చు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కాకపోతే కోర్టుకి గృహహింస చట్టం ద్వారా వెళ్లొచ్చు. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

రంగు బట్టి తెలిసిపోతుంది..!

వాటర్ బాటిల్‌కున్న మూత రంగును బట్టి నీళ్ల గుణాన్ని చెప్పొచ్చు అన్న సంగతి మీకు తెలుసా? విటమిన్లను బట్టే మూత రంగులు నిర్ణయిస్తారట. ఏ రంగు మూత ఏం చెబుతుందో తెలియాలంటే ఇది చదవాల్సిందే...



- నీళ్ల సీసాకు బ్లూ రంగు మూత ఉంటే... వాటిని సాధారణ ఆర్‌వో నీళ్లగానే పరిగణిస్తారు. అంటే శుద్ధి చేసిన నీళ్లన్నమాట. చాలా బ్రాండ్లు ఇదే రకం రంగు మూతల్ని వాడతాయి.
- పచ్చ రంగు... అది పర్యావరణానికి అనుకూలమైన నీటిగా గుర్తు. అంటే ఫ్లేవర్లు, నిర్దిష్ట ఖనిజాలు ఎక్కువగా ఉన్న నీళ్లని అర్థమట.
- ఆల్కలైన్ స్థాయిలు ఎక్కువగా ఉంటే నలుపు రంగు మూతల్ని వాడతారు. ఇవి ఆరోగ్యానికి మేలుచేస్తాయి.
- సాధారణ, ప్యూరిఫైడ్ నీళ్లను అందించే సంస్థలు తెలుపు రంగు మూతల్ని వాడతాయి.
- విటమిన్లతోపాటు ఇతర పోషకాలు అధికంగా ఉన్న నీళ్ల బాటిళ్లకు పసుపు రంగు మూతలు పెడతారు.

అయితే అన్ని సంస్థలు ఈ నియమాల్ని పాటిస్తున్నాయా లేదా అనేది చెప్పడం కష్టమే. అందుకే నీళ్ల బాటిళ్లని కొనేటప్పుడు ఐఎస్ఐ మార్క్, లైసెన్స్ నంబర్, ప్యాకింగ్, ఎక్స్‌పైరీ డేట్, బ్రాండ్ వంటివి చూసి కొనడం మంచిది.

ఆ సమాధానం విని భావోద్వేగానికి గురయ్యా!

కుటుంబం, పిల్లలు, బాధ్యతలతో సతమతం అవుతూ... కెరియర్‌తో రాజీపడుతున్న మహిళలెందరో. కొందరు వీటన్నింటినీ దాటి ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నా, అనుకోని అవసరాలు, అనారోగ్యాలు వాళ్లని ఎప్పటికప్పుడు వెనక్కి లాగుతూనే ఉన్నాయి. అలాంటి పరిస్థితే నెదర్లాండ్స్‌లో పనిచేస్తున్న అశ్వినీ థామ్కేకు ఎదురైంది. ముంబయిలో ఉంటున్న తన కుటుంబ సభ్యులకు ఆరోగ్యం పాడై... అత్యవసరంగా భారత్‌కు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందట. 'సంకోచిస్తూనే మేనేజర్ దగ్గరకు వెళ్లా. నా పరిస్థితి వివరించా. టీమ్ అవసరాల దృష్ట్యా వీలైతే ఇంటి నుంచి పని చేసే అవకాశం ఇవ్వాల్సిందిగా కోరాను. దానికి మా మేనేజర్ 'మీ వీలునుబట్టి ఇంటి నుంచి సేవలందించండి. లేదా సెలవు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దండి. పనికన్నా కుటుంబమే ముఖ్యం' అని చెప్పారు. ఆ సమాధానం విని భావోద్వేగానికి గురయ్యా' అంటూ సామాజిక మాధ్యమాల వేదిక తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకున్నారు అశ్విని. అలానే మన దేశంలో మహిళలు వృత్తి రీత్యా వెనుకంజలో ఉండటానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఇంటాబయటా మద్దతు లేకపోవడం, సెలవుల్ని బట్టి వాళ్ల పనిసామర్థ్యాల్ని లెక్కించడమే. ఇప్పటికీ మన దగ్గర మహిళలు సెలవు అడగాలంటే ఎంతో ఆలోచించాల్సిందే. అలాంటిది దేశం కాని దేశంలో నాకు ఇంత మద్దతు దొరకడం సంతోషంగా అనిపించింది అంటూ రాసుకొచ్చింది. ఇప్పుడా పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దాన్ని చదువుతున్న నెటిజన్లు.. ఆడవాళ్లు కెరియర్‌లో రాణించడానికి ఈ మాత్రం మద్దతు ఉంటే చాలు. వాళ్ల కెరియర్‌కు బ్రేక్ పడదు, అసంతృప్తి ఉండదు. ఇవన్నీ వాళ్లలో ఆత్మవిశ్వాసం కలిగిస్తాయి అంటూ కామెంట్లు పెడుతున్నారు. నిజమే కదూ!



అంతా మన మంచికే!



వంట ఆలస్యమైంది. దాన్ని సరిచేసుకుని బయటికి వచ్చేసరికి ఎక్కాల్సిన బస్సు వెళ్లిపోయింది. ఎక్కడికో అర్జెంటుగా వెళ్తున్నాం... బండిని ఎడమవైపునకి తిప్పాల్సింది పోయి, కుడివైపు పోనిచ్చాం. ఇంకేం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాం. వంట మాడిపోవడం, వస్తుందనుకున్న ఉద్యోగం ఆఖరి నిమిషంలో చేజారడం, ఎక్కడికో వెళ్తుంటే క్యాబ్ ఆగిపోవడం... ఇలాంటివి మనకు అప్పుడప్పుడూ ఎదురవుతూనే ఉంటాయి కదూ! అలాంటప్పుడు ఏమనిపిస్తుంది? ఛీ టైమ్ బాగోలేదు, ఈరోజు అస్సలు బాలేదు అనే కదా! ఇప్పుడు ఇంకో కోణంలో చూద్దాం. బస్సు వెళ్లిపోయిందని మరోదానికోసం ఎదురు చూస్తున్నారు. అప్పుడు ఫ్రెండ్ నుంచి మెసేజ్ 'మా ఆఫీసులో ఖాళీలున్నాయి. ఈరోజు వస్తే ఉద్యోగం ఖాయం. జీతం కూడా ఎక్కువే' అని! ట్రాఫిక్‌లో ఓ వ్యక్తి పరిచయం అయ్యారు. మీరు పెట్టాలనుకుంటున్న వ్యాపారమే చేస్తున్నారు. మాటల్లో స్నేహంగా మారి సాయం కూడా చేస్తానన్నారు. ఇప్పుడేమనిపిస్తోంది? దురదృష్టం అనుకున్న సందర్భాలే అనుకోని అవకాశాలు తెచ్చిపెట్టాయి కదా!

జీవితంలో చిన్న చిన్న అసంతృప్తులు మామూలే. ఆ మాత్రం దానికే మనల్ని మనం, పరిస్థితుల్ని తిట్టుకుంటూ కూర్చుంటే మనసు, రోజు పాడవడం తప్ప ఏమీ ఉండదు. ఇదే చెబుతుంది 'బర్న్ టోస్ట్ థియరీ'. ఎలాగూ మీరేం చేయాలనుకున్నారో అది కుదరలేదు. కాబట్టి, ఒక దీర్ఘశ్వాస తీసుకుని దాన్ని మర్చిపోండి. తరవాత ఏం చేయాలో ఆలోచించండి. అన్నిసార్లూ మ్యాజిక్ జరగకపోవచ్చు. కానీ ఇలా ఆలోచించినప్పుడు ఒత్తిడి మాయం అవుతుంది. పైగా ధ్యాస మళ్లిస్తాం కదా... దీంతో కొత్త ఆలోచనలు వస్తాయి. కాబట్టి, ప్రతి చిన్నదాన్నీ కష్టంగా భావించి జీవితాన్ని భారం చేసుకోవడమెందుకు? అన్నీ మన చేతిలో ఉండవు అనుకుంటూ ముందుకు వెళితే సరి... కొత్త అవకాశాలు దొరుకుతాయి. ఏం జరిగినా అంతా మన మంచికే అని పెద్దలూ ఊరికే అనలేదు.

వ్యాయామం చేయలేకపోతున్నారా?

ఈ రోజుల్లో వ్యాయామం చేయడం ప్రతి ఒక్కరికీ అవసరం. ముఖ్యంగా ఇల్లు, ఆఫీసు బాధ్యతలతో సతమతమయ్యే మహిళలు తప్పనిసరిగా కొంత సమయాన్ని ఇందుకోసం కేటాయించుకోవాలి. అయితే, చాలా గట్టి తీర్మానం చేసుకున్నా ఆచరణలో అమలు చేయలేకపోతారు చాలామంది. అలాంటివారిలో మీరూ ఉన్నారా? అయితే ఇలా చేసి చూడండి.




- వ్యాయామం చేయాలంటే పొద్దున్నే నిద్రలేవాలి. ఆలస్యంగా నిద్రపోయే అలవాటు ఉన్న చాలామందికి ఇది చాలా కష్టమైన పని. ఇంకొందరికేమో ఉదయాన్నే వంట చేయాలి. పిల్లల్ని స్కూలుకి పంపాలి... ఇలా బోలెడు పనులుంటాయి. మీదీ అదే పరిస్థితా? అలాగని వర్కవుట్‌లకు దూరమైతే ఎలా? రోజులో కనీసం అరగంటైనా సమయం దొరుకుతుందేమో చూడండి. అప్పుడే కేటాయించుకోండి. ఇవేవీ కాదంటూ ఇంటి పనుల్లో భాగంగానే... ఏ పని చేస్తే ఎంత వ్యాయామ ఫలితం వస్తుందో చూసి దాన్ని ఒత్తిడితో కాకుండా మైండ్ ఫుల్‌గా చేయండి.
- ఆఫీసుకి వెళ్లేటప్పుడు మెట్లెక్కడం, తిరిగి వచ్చేటప్పుడు నడవడం బాగానే ఉంటుంది కానీ... అందుకు అవసరమైన శక్తి మీకుందో లేదో చూసుకోండి. లేదంటే మీ డైట్‌లో ప్రొటీన్ శాతం పెంచండి. అప్పుడే కేవలం అది ఆలోచనగా మారిపోకుండా ఎనర్జీతో ముందడుగు వేయగలరు.
- నిజానికి ఉదయం నిద్రలేస్తే చాలా సమస్యలు దూరమవుతాయి. ఇందుకోసం ముందు రోజు షెడ్యూల్‌ని కాస్త ముందుకు జరిపితే.... త్వరగా పడుకోగలరు. అలానే రోజూ మీరు ఆరింటికి నిద్రలేస్తుంటే... 5.30కే లేచి ఓ వారం రోజులు అలా టెర్రస్ మీదో, వీధి అరుగుమీదో కూర్చోండి. క్రమంగా శరీరం ఆ సమయానికి అలవాటు పడుతుంది. నెమ్మదిగా ఆ టైమ్‌ని కసరత్తుల కోసం ఉపయోగించుకోండి. అలానే పొద్దున్నే హడావుడీ, ఒత్తిడీ లేకుండా ఉండాలంటే... కొన్నిపనులు ముందు రోజు చేసి పెట్టుకుంటే చాలు.
- నిద్రలేచిన వెంటనే నడకకో, జిమ్‌కో నేరుగా వెళ్తున్నారా? దానివల్ల రోజూ వ్యాయామం చేయాలన్న ఆసక్తి తగ్గుతుంది. రాత్రంతా మీరు మంచినీళ్లు తాగకుండా ఉంటారు. దానివల్ల శరీరానికి డీహైడ్రేషన్ ఎదురవుతుంది. నిద్రలేచాక గ్లాసు మంచినీళ్లు తాగండి. చిన్నచిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి. ఇవన్నీ చేయడం మొదలుపెడితే...క్రమంగా వ్యాయామం చేయడానికి అలవాటు పడతారు.

నగా నట్రా: కుందనపు బొమ్మకి... కుందన్ బుట్టలు!

ఆమె నవ్వితే... అవి నాట్యం చేస్తాయి. ఊసులాడితే... ఊకొడుతున్నట్లే కనిపిస్తాయి. తలతిప్పినప్పుడల్లా వయ్యారంగా ఊగుతూ ముచ్చటగొలుపుతాయి. ఇదంతా చెవి బుట్టల గురించే! దక్షిణాది ఆడపిల్లల ఆభరణాల్లో వీటిది ప్రత్యేక స్థానం. చాలా కుటుంబాల్లో సంప్రదాయం. అందుకే, కాలం మారినా, తరాలు వెళ్లిపోయినా... బుట్టలపై మోజు తగ్గనే లేదు. అభిప్రాయమూ మారలేదు. అయితే, కాస్త మార్పు చెందాయి. ఆధునికతను అద్దుకుని మరింత అందంగా మెరిసిపోతున్నాయి. అచ్చంగా బంగారంతో చేసినవీ, టెంపుల్ డిజైన్లతో తీర్చిదిద్దినవీ కాస్త పక్కకెళ్లి... కుందన్ పనితనం(అన్‌కట్ డైమండ్స్, పోల్కీ, పచ్చలు, ముత్యాలు, మీనాకారీ)తో చేసినవి సందడి చేస్తున్నాయి. రాచరికపు హంగులతో, హస్తకళాకారుల పనితనంతో ఆకట్టుకుంటున్న ఈ శైలి మొగలుల కాలం నాటిది. కానీ బ్రైడల్ వేర్‌గా భలే ఆకట్టుకుంటోంది. అన్ని వయసుల వారినీ మెప్పించేందుకు ట్రెడిషనల్ వేర్‌గానూ ఎన్నో డిజైన్లలో వస్తున్నాయి. వాటి సోయగాన్ని మీరూ చూసేయండి.













అందంగా... పర్యావరణ హితంగా!

జనపనారతో బ్యాగులు, ఆఫీస్ ఫైల్స్, గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అంతేకాదు ఇంటినుంచి పనిచేస్తూ ఆదాయం పొందుతున్నారీ ఒడిశా మహిళలు.

పూరీలోని నిమపాడలోని బిసిమాత్రి గ్రామంలో కొంతమంది మహిళలు ఇంటి అవసరాలకోసం టైలరింగ్ నేర్చుకున్నారు. అయితే ఆ పనితో వాళ్లకి సరిపడా ఆదాయం వచ్చేది కాదు. అదే సమయంలో అమియా పోడార్ అక్కడి మహిళలకు జనపనారతో ఉత్పత్తుల్ని తయారుచేయడం నేర్పించారు. దాంతో అక్కడి మహిళలు జూట్‌తో వివిధ కళాకృతుల్ని తయారుచేయడం మొదలుపెట్టారు. తొలుత యంత్రాల అవసరం లేకుండా కుట్టు మెషీన్‌తో వీటిని కుట్టేవారు. అనతికాలంలోనే వారి కళాకృతులకు ప్రజాదరణ లభించడంతో యంత్రాలతో వీటిని తయారుచేయడం మొదలుపెట్టారు. చిన్నగా ప్రారంభించినా ఇప్పుడు బాగా అభివృద్ధి చెందడంతో జాదేశ్వర్ జూట్ ఇండస్ట్రీ పేరుతో ప్రజల డిమాండ్ మేరకు వస్తువుల్ని తయారుచేస్తున్నారు ఇక్కడి మహిళలు. వీటి తయారీకి అవసరమయ్యే ముడి సరకుని కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుంటారు. 'ఒడిశాలో పెద్ద పెద్ద విద్యాసంస్థలు నిర్వహించే కార్యక్రమంలో అతిథుల టేబుల్స్‌పై జనపనారతో చేసిన ఫోల్డర్లను ఉపయోగించడంతో మా వ్యాపారం ఇంతగా అభివృద్ధి చెందింది. ఇవి అందంగానే కాదు, పర్యావరణానికి అనుకూలంగానూ ఉంటాయి. అందువల్ల ఒడిశాతోపాటు, హైదరాబాద్, కోల్‌కతా నుంచి కూడా మాకు ఆర్డర్లు వస్తున్నాయి. నెలకు రూ.50వేల నుంచి 2లక్షల వరకూ టర్నోవర్ ఉంటుంది. సుభద్ర శక్తి మేళా, బలియాత్ర, రథయాత్ర మేళాలో మా జూట్ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ వ్యాపారం కోసం ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాం. అయితే ఎక్కువమంది మహిళలు కలిసి పనిచేయడానికి కుదరడం లేదు. అందువల్ల ఈ సంస్థలో పనిచేసే 50మంది మహిళలూ ఇంటి దగ్గర నుంచే ఉత్పత్తుల్ని తయారుచేస్తున్నారు. బ్యాంకులు నుంచి రుణాలు తీసుకుని యంత్రాలతో జూట్ ఉత్పత్తుల్ని తయారుచేస్తున్నా మా సంస్థకు ప్రత్యేక స్థలం లేదు. అందువల్ల మా ఉత్పత్తిని పెంచలేకపోతున్నాం. ప్రభుత్వం సాయం చేస్తే మా వ్యాపారాన్ని మరింత విస్తరించుకోగలుగుతాం' అంటున్నారు ఇక్కడి మహిళలు.



ఈటీవీ భారత్

ఒంటెల క్యాట్‌వాక్



హరియాణాలోని కురుక్షేత్రలో నిర్వహించిన ఒంటెల క్యాట్‌వాక్ పలువురిని ఆకట్టుకుంది. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ఒంటెలు ఇందులో పాల్గొన్నాయి. భారీగా అలంకరించిన ఒంటెలు సంగీతానికి అనుగుణంగా నృత్యం చేశాయి. మహేంద్రగఢ్ నుంచి వచ్చిన ఒంటె మొదటి బహుమతిని గెలుచుకుంది. దీనికి ప్రత్యేకంగా చేయించిన హెయిర్ కట్ ఆకట్టుకుంది.

కుబేర్ @ రూ.21 కోట్లు!

హరియాణాలోని పశువుల మహా ప్రదర్శనలో ఎన్నో ప్రత్యేకతలు దర్శనమిచ్చాయి. దేశం నలుమూలల నుంచి వేల పశువులు ఈ ప్రదర్శనకు తరలివచ్చాయి. అందులో రూ.21 కోట్ల విలువైన ముర్రా జాతికి చెందిన కుబేర్ అనే దున్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హరియాణాలోని ఫతేహాబాద్ జిల్లా నాగోడి గ్రామం నుంచి ఇది వచ్చింది. అది భారీగా ఉండటమే కాకుండా ధర రూ.21 కోట్లని యజమాని వికాస్ చెప్పారు. అంటే 20 లగ్జరీ కార్లంత ధరన్నమాట. ఇటీవల జరిగిన పుష్కర్ ప్రదర్శనలో పాల్గొన్న ఇది.. అంతర్జాతీయ స్థాయిలో



అత్యంత ఖరీదైన దున్నగా రికార్డు సృష్టించిందని వికాస్ తెలిపారు. దీని వీర్యాన్ని డోస్‌కు రూ.500 చొప్పున విక్రయిస్తానని, నెలకు రూ.20 లక్షల ఆదాయం వస్తోందని వివరించారు.

టీ20 ప్రపంచ కప్‌నకు చేనేత చీర బహుమతి



మన దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ప్రపంచ కప్ మ్యాచ్‌లు జరుగుతుంటే దేశమంతా ఉర్రూతలూగుతుంది. రకరకాల ప్రయత్నాల ద్వారా పలువురు తమ అభిమానాన్ని చాటుకుంటారు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ సందర్భంగా గుర్తుండిపోయేలా ఏదైనా చేయాలనుకున్నారు వారణాసికి చెందిన చేనేతకారులు. అందులో భాగంగా బనారసీ మోడల్లో క్రికెటర్ చీరను రూపొందించారు. వెండి జరీతో దానిని తయారు చేశారు. దానిపై పురుషుల, మహిళల టీ20 కప్‌లు కనిపించేలా నేశారు. దీనిని తయారు చేయడానికి తమకు 20 రోజులు పట్టిందని చేనేతకారులు తెలిపారు. దాని ధర రూ.35,000 వరకూ ఉంటుందని వివరించారు.

చంద్రయాన్‌-4 దిగే చోటు ఖరారు!

బెంగళూరు: చందమామపైకి తదుపరి చేపట్టబోయే చంద్రయాన్‌-4 మిషన్ కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కసరత్తు ముమ్మరం చేస్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంపై ఈ వ్యోమనౌకను దించాల్సిన ప్రదేశాన్ని తాజాగా ఖరారు చేసింది. జాబిల్లి నుంచి నమూనాలను భూమికి తీసుకొచ్చేలా చంద్రయాన్‌-4ను ఇస్రో రూపొందిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. చందమామపైకి ఇస్రో చేపట్టిన మిషన్లంటిలోకీ ఇదే అత్యంత సంక్లిష్టమైంది. 2028 నాటికి దీన్ని ప్రయోగించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. జాబిల్లిపైనున్న మాన్స్ మౌటన్ (ఎంఎం) అనే ప్రదేశంలోని ఎంఎం-1, 3, 4, 5 అనే నాలుగు ప్రదేశాలను ల్యాండింగ్ కోసం ఇస్రో పరిశీలించింది. అందులో ఎంఎం-4ను ఎంచుకున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. చందమామ కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్‌-2 ఆర్బిటర్‌లోని హై రిజల్యూషన్ కెమెరా (ఓహెచ్ఆర్‌సీ) అందించిన చిత్రాల ఆధారంగా ఈ ఎంపిక చేసినట్లు వివరించారు.



ఓపికతోనే గొప్ప నిధి


స్టాక్‌మార్కెట్‌లో ప్రతిరోజూ ట్రేడింగ్ చేయడం ద్వారా కంటే మంచి పెట్టుబడులు పెట్టి సహనంగా వేచి చూడడం ద్వారానే గొప్ప నిధి సమకూరుతుంది. మార్కెట్‌లో హెచ్చుతగ్గులు చక్రభ్రమణం వంటివి. ముఖ్యంగా మార్కెట్ స్తబ్దుగా ఉన్నప్పుడు ఏదో ఒకటి చేయాలనుకుంటూ ట్రేడింగ్ చేస్తే మీ పెట్టుబడి మొత్తం కోల్పోతారు.

– స్వప్నిల్ కొమ్మావర్, రచయిత

డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ముమ్మాటికీ 'భారీ చోరీలు/బందిపోటు దోపిడీలే'నని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి ఒక పకడ్బందీ 'ప్రామాణిక నిర్వహణ విధానం' (ఎస్ఓపీ) రూపొందించాలని సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. డిజిటల్ అరెస్టు మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో కుమ్మక్కు కావడం వల్ల జరుగుతుండొచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు మధ్య మన దేశంలో రూ.52వేల కోట్లకు పైగా సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని



గుర్తు చేస్తూ ..'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

- ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను అరికట్టడానికి 4వారాల్లోగా కార్యాచరణను సిద్ధం చేయాలని హోం శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.
- దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్టు కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది.
- డిజిటల్ అరెస్టుల కేసుల్లో విచారణకు అనుమతులను సీబీఐకి వెంటనే మంజూరు చేయాలని దిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది.
- డిజిటల్ అరెస్టు బాధితులకు పరిహార విధానాన్ని సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సమావేశం కావాలని ఆదేశించింది.
- కేవలం రూ.15-20 వేల పింఛను తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే బ్యాంకుల ఏఐ టూల్స్ ఎందుకు అప్రమత్తం చేయడం లేదని ప్రశ్నించింది.

సర్‌కు ఆటంకాలు సృష్టించనివ్వం

- సుప్రీంకోర్టు ఉద్ఘాటన

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను హడావిడిగా నిర్వహిస్తున్నారని, అనేక మంది అర్హుల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఆటంకాలు సృష్టించేందుకు ఎవరినీ అనుమతించబోమని నొక్కిచెప్పింది. ఈ విషయాన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. సర్ సజావుగా సాగేందుకు ఎలాంటి ఉత్తర్వులు/వివరణలు అవసరమైనా జారీకి తాము సిద్ధమని తెలిపింది. సర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో సర్ గురించి మమత వేసిన పిటిషన్ కూడా ఇందులో ఉంది. బెంగాల్‌లో సర్ ప్రక్రియను పట్టాలు తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అక్కడ కొందరు దుండగులు తమ నోటీసులను దహనం చేశారని పేర్కొంటూ ఈసీ దాఖలు చేసిన ప్రమాణపత్రాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో అఫిడవిట్ సమర్పించాలని బెంగాల్ డీజీపీని ఆదేశించింది. మరోవైపు- ఓటరు జాబితా సవరణపై తుది నిర్ణయాలను ఎలక్టోరల్ రోల్ అధికారులే తీసుకుంటారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సర్ కోసం బెంగాల్ సర్కారు కేటాయించిన 8,505 మంది గ్రూప్-బి అధికారులకు సంబంధిత శిక్షణనివ్వాలని సూచించింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకల్లా వారంతా జిల్లా ఎలక్టోరల్ అధికారి లేదా ఈఆర్‌వోకు రిపోర్ట్ చేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

12న దేశవ్యాప్త సమ్మె

దిల్లీ: ఈనెల 12న దేశవ్యాప్త సమ్మె నిర్వహించి తీరుతామని 10 కేంద్ర కార్మిక సంఘాలు సోమవారం ఉమ్మడి ప్రకటన వెలువరించాయి. ఈ సమ్మెలో కనీసం 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని ఆ సంఘాలు తెలిపాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, దేశ వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల పద్ధతులను నిరసిస్తూ గత సంవత్సరం జనవరి 9న కూడా ఈ కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సమ్మె నిర్వహించాయి. "ఈసారి వచ్చే గురువారం నిర్వహించనున్న సమ్మెలో కనీసం 30 కోట్ల మంది పాల్గొంటారు. గత సంవత్సరం 25 కోట్ల మంది పాల్గొన్నారు" అని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు.

తరగతి గదిలో విద్యార్థిని హత్య

- తుపాకీతో కాల్చి చంపిన సహ విద్యార్థి
- అనంతరం ఆత్మహత్యాయత్నం

చండీగఢ్: పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. న్యాయశాస్త్ర విద్యార్థి ఒకరు తోటి విద్యార్థినిని తరగతి గదిలోనే తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం తానూ కాల్చుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. సీఆర్‌పీఎఫ్ విశ్రాంత ఉద్యోగి కుమారుడైన ప్రిన్స్ రాజ్(20), సందీప్ కౌర్(19) లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఉదయం క్లాసుల ప్రారంభానికి ముందు ప్రిన్స్‌రాజ్ తుపాకీతో సందీప్ కౌర్‌పై కాల్పులు జరిపాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు అదే తుపాకీతో కాల్చుకున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సందీప్ కౌర్‌ను ప్రిన్స్‌రాజ్ కొన్ని రోజులుగా వేధిస్తున్నాడని విచారణలో తేలింది. సందీప్ కౌర్‌కు ఇప్పటికే వేరే వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం.

ఏఐని చూసి భయపడకండి

- దానిపై పట్టు సాధించండి..
- మొబైళ్లకు బానిసలుగా మారొద్దు
- 'పరీక్షా పే చర్చా'లో విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ను చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ సాంకేతికతతో నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. 'పరీక్షా పే చర్చా' రెండో ఎపిసోడ్‌లో భాగంగా సోమవారం ఆయన వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు. "కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు వచ్చినప్పుడు ఏదో జరగనుందన్న చర్చ జరిగింది. ఇలాంటి భయాలు వీడండి. కొందరు చిన్నారులు మొబైళ్లకు బానిసలుగా మారుతున్నారు. స్మార్ట్‌ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. సాంకేతికతను నైపుణ్యాలు పెంచుకోవడానికి వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పారు.

మంచి నాయకుడి లక్షణాలేంటి?

మోదీ: నాయకుడిగా ఎదగాలంటే ఎవరూ సాహసించని పనులు చేయాలి. నాయకుడు అంటే ఎన్నికల్లో పోటీ చేయడం, పార్టీలు పెట్టడం కాదు. మీ అభిప్రాయాలను పదిమందికి అర్థమయ్యేలా చెప్పగలగాలి.

స్టార్టప్ ఎలా ప్రారంభించాలి?

స్టార్టప్‌నకు వయసుతో సంబంధం లేదు. విద్యార్థి దశలోనూ ప్రారంభించొచ్చు. ఇందు కోసం మీరు ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయండి. పారిశ్రామికవేత్తలను కలవండి. మీ ఆలోచనలు వారితో పంచుకోండి. ఆ ప్రయాణంలో మీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. అవి మీకు ఉపయోగపడతాయి.

పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

మంచి విద్యార్థిగా మారాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించాలి. గొప్ప క్రీడాకారుడు నిరంతరం సాధన చేస్తాడు. పడతాడు.. లేస్తాడు.. విజయం సాధిస్తాడు. చదువూ అంతే. సాధన కీలకం.

క్రమశిక్షణ, ప్రేరణ.. ఏది ముఖ్యం?

రెండూ ముఖ్యమే. క్రమశిక్షణ లేకపోతే స్ఫూర్తి ఎంత ఉన్నా ఫలితం శూన్యం.

మణిపుర్‌లో ఇళ్లకు నిప్పు

- మిలిటెంట్ల దుశ్చర్య



ఉఖ్రుల్ జిల్లాలో మంటల్లో కాలిపోతున్న ఓ ఇల్లు

ఇంఫాల్: మణిపుర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లిటాన్ సరిఖోంగ్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తాంగ్‌ఖుల్ నాగా వర్గానికి చెందిన వారి ఇళ్లకు సాయుధ మిలిటెంట్లు నిప్పుపెట్టారు. కుకీ తెగ ప్రజలు అధికంగా నివసించే ఈ గ్రామంలో అంతకు ముందు తాంగ్‌ఖుల్ నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి జరిగింది. అనంతరం తాంగ్‌ఖుల్ నాగా, కుకీ వర్గాల ప్రజలు ఆదివారం సాయంత్రం పరస్పరం రాళ్ల దాడికి పాల్పడటంతో జిల్లా యంత్రాంగం నిషేధాజ్ఞలు విధించింది. ఈ క్రమంలోనే కుకీ తెగకు చెందిన మిలిటెంట్లు ఇళ్లకు నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు వెల్లడించారు.

ముస్లింలకు వ్యతిరేకంగా

ప్రజలను రెచ్చగొట్టేలా హిమంత వీడియోలు

- గౌరవ్ గొగొయ్ ఆరోపణ



గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తన వీడియోలతో ముస్లింలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ ఆరోపించారు. తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని హిమంత ఆదివారం చేసిన వ్యాఖ్యలపై గువాహటిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గొగొయ్ స్పందించారు. "2013 నాటి పాక్ పర్యటనపై సిట్ అధికారులు నన్ను ఎన్నడూ ప్రశ్నించలేదు. ఆ ఏడాది డిసెంబరులో నా భార్యతో కలిసి తక్షశిల(తక్సిలా) సందర్శనకు వెళ్లాను. ప్రజల మధ్య మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమంత ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. నా భార్య, పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసిన ఆయన ముఖ్యమంత్రి పదవికి అనర్హుడు" అని గొగొయ్ వ్యాఖ్యానించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసేలా ఉన్న హిమంత వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

- మరోవైపు, పాకిస్థాన్‌లోని రావల్పిండి జిల్లా పర్యటనపై వివరణ ఇవ్వాలని గౌరవ్ గొగొయ్‌ని హిమంత బిశ్వశర్మ డిమాండ్ చేశారు. "పాకిస్థాన్ ఇమ్మిగ్రేషన్ నియమాల ప్రకారం వీసా లేకుండా ఇతర ప్రాంతాలకు ప్రయాణించలేం. లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్‌లకు వెళ్లడానికే వీసా అనుమతి వచ్చినప్పుడు పంజాబ్‌లోని రావల్పిండిలో ఉన్న తక్షశిలకు ఎలా వెళ్లారు?" అని హిమంత ప్రశ్నించారు.

హాంకాంగ్‌లో మీడియా ప్రముఖునికి 20 ఏళ్ల జైలు

హాంకాంగ్: బ్రిటిష్ పౌరుడైన హాంకాంగ్ మీడియా ప్రముఖుడు, ప్రచురణకర్త, ప్రజాస్వామ్య సమర్థకుడు జిమ్మీ లాయ్ (78)కి ఇక్కడి ఓ కోర్టు సోమవారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. హాంకాంగ్‌లో తాను స్థాపించిన 'యాపిల్ డైలీ' పత్రిక ద్వారా లాయ్ చైనా ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టేవారు. 2020లో రూపొందించిన భద్రతా చట్టం కింద ఆయనపై కేసు నమోదు చేశారు. తదనంతరం ఆయన పత్రికకు చెందిన పలువురు జర్నలిస్టుల్ని హాంకాంగ్ నాయకత్వం కటకటాలపాలు చేసింది. దీంతో పత్రిక 2021లో మూతపడింది. లాయ్ ఆ పత్రికను హాంకాంగ్ చైనాలో విలీనం కావడానికి రెండేళ్ల ముందు 1995లో స్థాపించారు. లాయ్‌కి శిక్ష విధించడం తనకు బాధ కలిగించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను చైనా అధినేత షి జిన్‌పింగ్‌తో మాట్లాడానని, శిక్షకు గురైన మీడియా ప్రముఖుణ్ని విడుదల చేయాల్సిందిగా కోరానని ట్రంప్ పేర్కొన్నారు. లాయ్ బ్రిటిష్ పౌరుడు కాబట్టి ఆయనను తక్షణం విడుదల చేయాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. శిక్ష అమలు జరిగితే తన తండ్రి జైలులోనే అమరుడవుతారని లాయ్ కుమార్తె క్లైయిర్ పేర్కొన్నారు. నిర్భయంగా తన అభిప్రాయాలు వ్యక్తీకరించిన మీడియా ప్రముఖునికి విధించిన శిక్షపై పలు విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేయగా.. చైనా, హాంకాంగ్‌ల అధినాయకత్వాలు మాత్రం సమర్థించాయి. లాయ్ విదేశీ శక్తులతో కుమ్మక్కై దేశద్రోహపూరితమైన వార్తా కథనాలను హాంకాంగ్‌లో ప్రచురించారని గత డిసెంబరులో కోర్టు నిర్ధారించింది. ఆయనతో పాటు అదే ఆరోపణను ఎదుర్కొంటున్న మరికొందరికి ఆరేళ్ల మూడు నెలల నుంచి పదేళ్ల వరకూ జైలుశిక్ష విధించారు. లాయ్‌ని వెంటనే విడుదల చేయాలని పలు దేశాల ప్రభుత్వాలు డిమాండ్ చేశాయి. అయితే చైనా విదేశాంగ శాఖ ఆయనను తమ దేశ పౌరునిగా పేర్కొంది. తమ సార్వభౌమాధికారాన్ని, హాంకాంగ్‌లో చట్టపాలనను గౌరవించాలని విదేశీ ప్రభుత్వాలను కోరింది.



జిమ్మీ లాయ్

జైల్లో ఉగ్ర నిందితుడు అబ్దుల్ రెహమాన్ హత్య

- హరియాణాలో ఘటన

ఫరీదాబాద్: హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర నిందితుడు అబ్దుల్ రెహమాన్ జైలులో హత్యకు గురయ్యాడు. నీమ్కా జైలులో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణ ఈ ఘటనకు దారితీసింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన అరుణ్ చౌదరి అనే ఖైదీ పదునైన వస్తువుతో రెహమాన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడు జైలు ప్రాంగణంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రెహమాన్‌ను గతేడాది ఉగ్రవాద కేసులో అరెస్టు చేసి జైలులో పెట్టారు. అయోధ్యలో పేలుడుకు కుట్ర, ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు అతనిపై అభియోగాలున్నాయి.

దిల్లీలో 15 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో దాదాపు 15 పాఠశాలలకు సోమవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. 2001 నాటి పార్లమెంటు దాడి సూత్రధారి అఫ్జల్ గురుకు గుర్తుగా, దిల్లీ, పంజాబ్‌లను ఖలిస్థాన్‌గా మారుస్తామని దుండగులు మెయిల్‌లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో ఈ నెల 13న మధ్యాహ్నం 1:11 గంటలకు పేలుడు సంభవిస్తుందని హెచ్చరించారు. దీంతో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. పాఠశాలల నుంచి సమాచారం అందుకున్న అధికారులు బాంబు నిర్వీర్య దళాలు, జాగిలాలతో ఘటనా స్థలాలకు చేరుకున్నారు. విద్యార్థులను, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి తనిఖీలు ప్రారంభించారు. ఇప్పటివరకూ అనుమానాస్పదంగా ఏదీ లభించలేదని తెలిపారు. తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

బిహార్, హరియాణా కోర్టులకు..

బిహార్‌లోని పట్నా సివిల్ కోర్టు, భాగల్‌పుర్ కోర్టుతో పాటు హరియాణాలోని పంచకుల జిల్లా కోర్టుకూ సోమవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే తనిఖీలో అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు. పట్నా సివిల్ కోర్టులో ఆ రోజు జరగాల్సిన కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో పూర్ణియా నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 10కి వాయిదా పడింది.

ఆంక్షలున్న చమురు నౌకలోకి అమెరికా సైన్యం

వాషింగ్టన్: హిందూ మహా సముద్ర జలాల్లో పయనిస్తున్న ఆంక్షలున్న చమురు నౌకలోకి అమెరికా సైన్యం ప్రవేశించింది. కరీబియన్ నుంచి వస్తున్న ఆక్విలా-2 అనే ఈ నౌకను ట్రాక్ చేసిన సైన్యం దానిలోకి ప్రవేశించినట్లు సోమవారం పెంటగాన్ వెల్లడించింది. అందులో సరకుగానీ, చమురుగానీ లేవని నౌక నుంచి వచ్చిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ నౌక పనామా జెండాతో ఉంది. హాంకాంగ్ యజమానికి చెందినది.

ఆయుధ పరిశ్రమలో సహకారానికి భారత్-గ్రీస్ దేశాల నిర్ణయం

దిల్లీ: ఆయుధ పరిశ్రమలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్, గ్రీస్ దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు రెండు దేశాల ప్రతినిధులు ఓ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. దిల్లీలో భారత్, గ్రీస్ దేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నికోలాస్ జార్జియోస్ డెండియాస్ మధ్య సోమవారం చర్చల అనంతరం ఇరు దేశాలు ఈ అవగాహనకు వచ్చాయి.

నక్సలిజంతో ఏ సమాజమూ బాగుపడలేదు

- మిగిలిన మావోయిస్టులూ లొంగిపోవాలి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



జగదల్‌పుర్ (ఛత్తీస్‌గఢ్): నక్సలిజం వల్ల ఏ సమాజం బాగుపడలేదని, అది ఉన్న చోటల్లా విధ్వంసమే జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పుర్‌లో నిర్వహించిన 'బస్తర్ పండుమ్-2026' సాంస్కృతిక ముగింపు వేడుకకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నక్సలిజాన్ని మార్చి 31 నాటికి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికీ కొందరు మావోయిస్టులు గిరిజన యువతులను తమ దళంలో కొనసాగిస్తుండడంపై అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన మావోయిస్టులందరూ లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని, వారికి గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని సూచించారు. అలా కాదని ఇంకా ఆయుధాలతో విధ్వంసం సృష్టిస్తామంటే మాత్రం తామూ ఆయుధాలతోనే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. 'మేం ఎవరితో పోరాడాలని అనుకోవట్లేదు. గిరిజన సోదరులు, అక్కా చెల్లెళ్లను కాపాడుకోవాలనేది మా లక్ష్యం. ప్రస్తుతం బస్తర్ ప్రాంతం అభివృద్ధి మార్గంలో నడుస్తోంది. పాఠశాలలు తెరవడంతో పాటు రోడ్లు, మొబైల్ టవర్లు, పోస్టాఫీసులు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తున్నాం" అని అమిత్ షా వెల్లడించారు.

అద్నాన్ సమీతో భోంచేయడం దేశ వ్యతిరేక చర్యే

- ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్‌పై కాంగ్రెస్ ఆగ్రహం



ముంబయి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్.. ప్రముఖ గాయకుడు అద్నాన్ సమీతో కలిసి భోజనం చేయడంపై కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ వ్యతిరేక చర్యగా దీన్ని అభివర్ణించింది. అద్నాన్ సమీ తండ్రి అర్షద్ సమీ ఖాన్.. పాకిస్థాన్ వైమానిక దళంలో పైలట్‌గా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. '1965లో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంలో అర్షద్ సమీ పాల్గొన్నాడు. పఠాన్‌కోట్ సైనిక స్థావరంపై జరిగిన దాడిలోనూ అతని పాత్ర ఉందంది. అతడి కుమారుడైన అద్నాన్ సమీతో మోహన్ భాగవత్ భోజనం చేస్తున్నారు' అంటూ కాంగ్రెస్ ఎక్స్ వేదికగా విమర్శించింది. ఇలాంటి పనులు చేసి దేశానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు. కాగా, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో భాగవత్‌తో కలిసి భోంచేస్తున్న ఫొటోలను అద్నాన్ సమీ ఎక్స్‌లో పంచుకున్నారు.

జపాన్‌లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పునఃప్రారంభం



టోక్యో: ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను జపాన్ సోమవారం పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాతి పరిస్థితుల్లో.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావించింది. 2050 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించడానికి, కృత్రిమ మేధ (ఏఐ) అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కర్మాగారంలోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చేనెలలో సమగ్ర తనిఖీ ముగిశాక ఈ ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కర్మాగారంలో మొత్తం ఏడు రియాక్టర్లు ఉన్నాయి.

వాంగ్‌చుక్ ఆరోగ్యం నిలకడగానే ఉంది

సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం

దిల్లీ: పోలీసు కస్టడీలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌కు ఎయిమ్స్ జోధ్‌పుర్‌లో నాణ్యమైన చికిత్స అందిస్తున్నామని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదించింది. జెన్‌జీని అల్లర్లకు దిగేలా రెచ్చగొడుతున్నారని పేర్కొంటూ గత ఏడాది సెప్టెంబరు 26న జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద వాంగ్‌చుక్‌ను కేంద్రం నిర్బంధంలోకి తీసుకున్న విషయం విదితమే. వాంగ్‌చుక్ ఆచూకీ కోరుతూ ఆయన భార్య వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై వాదనలు జరుగుతున్నాయి. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన నిర్బంధాన్ని పునఃసమీక్షించాలని ధర్మాసనం గత వాదనల సందర్భంగా సూచించింది. సోమవారం మరోసారి విచారణ జరగగా కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కేఎం నటరాజ్ స్పందిస్తూ.. ఆయనకు లద్దాఖ్‌లో కంటే జోధ్‌పుర్ ఎయిమ్స్‌లోనే నాణ్యమైన చికిత్స అందుతుందని, తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ప్రస్తుతానికి లేదని అన్నారు. దీనికి జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం స్పందిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై వాదిస్తున్నప్పుడు ఇలా మాట్లాడకూడదని సూచించింది.

భూసేకరణ పరిహారంపై అపీళ్లకు లిమిటేషన్ యాక్ట్ ప్రతిబంధకం కాదు: సుప్రీం

దిల్లీ: భూసేకరణ చట్టం కింద ప్రకటించిన పరిహారంపై అపీళ్లకు కాలపరిమితి చట్టం (లిమిటేషన్ యాక్ట్) ప్రతిబంధకం కాదని.. అపీళ్ల దాఖలులో జరిగిన ఆలస్యాన్ని హైకోర్టు ఉపేక్షించవచ్చని సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. 2013 నాటి పునరావాస, పునరాశ్రయ చట్టంలోని సెక్షన్-74, సెక్షన్-103ల కింద భూసేకరణలో పారదర్శకత, న్యాయమైన పరిహారం పొందే హక్కుకు 1963 నాటి లిమిటేషన్ చట్టానికి మధ్య నెలకొన్న వైరుధ్యాలకు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్.సి.శర్మల ధర్మాసనం సమాధానం చెప్పింది. 2013 నాటి చట్టం అమలులోకి వచ్చాక జారీ చేసిన పరిహార అవార్డులన్నిటికీ ఆ చట్టంలోని సెక్షన్ 24(1)(ఎ) వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. 1894 నాటి భూసేకరణ చట్టం కింద ప్రారంభించిన భూసేకరణ ప్రక్రియలో పరిహార అవార్డు నిర్ణయం కానప్పుడు.. 2013 చట్టంలోని నిబంధనల కింద పరిహారం నిర్ధారించవచ్చని సెక్షన్ 24(1)(ఎ) చెబుతోంది. 2013 నాటి చట్టం కింద ఏర్పాటైన భూసేకరణ, పునరావాస, రీసెటిల్మెంట్ ప్రాధికార సంస్థ ప్రకటించిన పరిహార అవార్డుపై కక్షిదారులు హైకోర్టులో అపీలు దాఖలు చేయవచ్చని ధర్మాసనం పేర్కొంది.

ఛాంపియన్



టీ20 ప్రపంచకప్ తొలి రెండు రోజుల్లో భారత్ సహా పెద్ద జట్లన్నీ చిన్న జట్ల నుంచి సవాలు ఎదుర్కొన్నా.. మూడో రోజు దక్షిణాఫ్రికా మాత్రం ఏ ఇబ్బందీ లేకుండా కెనడాను ఓడించింది. కెప్టెన్ మార్‌క్రమ్ జట్టును ముందుండి నడిపించడంతో ప్రత్యర్థికి 214 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన సఫారీ జట్టు.. ఎంగిడి విజృంభణతో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు కట్టడి చేసి, ఘనవిజయాన్నందుకుంది.

సఫారీ.. సాఫీగా

● టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం

● తొలి మ్యాచ్‌లో కెనడాపై ఘనవిజయం


మార్‌క్రమ్ 59

అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటైన దక్షిణాఫ్రికా.. టోర్నీని భారీ విజయంతో ఆరంభించింది. సోమవారం ఆ జట్టు 57 పరుగుల తేడాతో కెనడాను చిత్తు చేసింది. మార్‌క్రమ్ (59; 32 బంతుల్లో 10×4, 1×6), డేవిడ్ మిల్లర్ (39 నాటౌట్; 23 బంతుల్లో 1×4, 3×6), ట్రిస్టన్ స్టబ్స్ (34 నాటౌట్; 19 బంతుల్లో 2×4, 2×6), ర్యాన్ రికిల్‌టన్ (33; 21 బంతుల్లో 3×4, 1×6) మెరుపులతో మొదట దక్షిణాఫ్రికా 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు సాధించింది. అన్ష్ పటేల్ (3/31) మినహా కెనడా బౌలర్లందరూ తేలిపోయారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లుంగి ఎంగిడి (4/31), మార్కో యాన్సెన్ (2/30)ల ధాటికి కెనడా 156/8కు పరిమితమైంది. నవ్‌నీత్ ధలివాల్ (64; 49 బంతుల్లో 7×4, 1×6), హర్ష్ థాకర్ (33; 29 బంతుల్లో 2×4, 2×6) పోరాడారు. ఎంగిడి తన తొలి రెండు ఓవర్లలో ఓపెనర్లు దిల్‌ప్రీత్ బజ్వా (0), యువరాజ్ సమ్రా (12)లతో పాటు నికోలస్ కిర్టన్ (4)లను ఔట్ చేయడంతో కెనడా ఛేదన పేలవంగా ఆరంభమైంది. శ్రేయస్ మొవ్వ (9)ను రబాడ ఔట్ చేయడంతో ఆ జట్టు 45/4తో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో ధలివాల్, హర్ష్ జోడీ పోరాడి జట్టుకు ఘోర పరాభవాన్ని తప్పించారు. చివరి 5 ఓవర్లలో ఇంకో 4 వికెట్లు పడ్డప్పటికీ.. ధలివాల్ చివరి ఓవర్ వరకు నిలవడంతో ఆ జట్టు గౌరవప్రదంగా ఓడింది.


ఎంగిడి 4/31

కెప్టెన్ ముందుండి..: టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాను కెప్టెన్ మార్‌క్రమ్ ముందుండి నడిపించాడు. మరో ఓపెనర్ డికాక్ తన శైలికి భిన్నంగా కొంచెం ఆచితూచి ఆడుతుంటే.. మార్‌క్రమ్ మాత్రం చెలరేగిపోయాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి దక్షిణాఫ్రికా 65/0తో నిలిచింది. 22 బంతులాడి 2 ఫోర్లే కొట్టిన డికాక్ (25), స్పిన్నర్ దిల్‌ప్రీత్ బౌలింగ్‌లో బౌల్డ్ కాగా.. మార్‌క్రమ్ జోరు కొనసాగించాడు. అతను 28 బంతుల్లోనే అర్ధశతకం అందుకున్నాడు. దీంతో సఫారీ జట్టు పదో ఓవర్లోనే వంద మార్కును అందుకుంది. రికిల్‌టన్ కూడా దూకుడుగా ఆడడంతో ఒక దశలో ఆ జట్టు 126/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. అయితే స్పిన్నర్ అన్ష్ పటేల్ ఆ జట్టును గట్టి దెబ్బ తీశాడు. ముందుగా మార్‌క్రమ్ అతడి బౌలింగ్‌లో బౌండరీ వద్ద హేలింగర్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరగ్గా.. రికిల్‌టన్, బ్రెవిస్ (6) స్వల్ప వ్యవధిలో ఔటవడంతో దక్షిణాఫ్రికా 138/4తో ఇబ్బందుల్లో పడింది. కానీ తర్వాత ఆ జట్టు ఒక్క వికెట్టూ కోల్పోలేదు. మిల్లర్, స్టబ్స్ జోడీ చెలరేగి ఆడి జట్టుకు భారీ స్కోరును సాధించి పెట్టింది. అభేద్యమైన అయిదో వికెట్‌కు ఈ జోడీ 37 బంతుల్లోనే 75 పరుగులు జోడించింది.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) హేలింగర్ (బి) అన్ష్ 59; డికాక్ (బి) దిల్‌ప్రీత్ 25; రికిల్‌టన్ (సి) హర్ష్ (బి) అన్ష్ 33; బ్రెవిస్ (సి) కిర్టన్ (బి) అన్ష్ 6; మిల్లర్ నాటౌట్ 39; స్టబ్స్ నాటౌట్ 34; ఎక్స్‌ట్రాలు 17 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **213; వికెట్ల పతనం:** 1-70, 2-126, 3-137, 4-138; **బౌలింగ్:** కలీమ్ సనా 4-0-38-0; హేలింగర్ 1-0-13-0; సాద్ బిన్ జాఫర్ 3-0-38-0; దిల్‌ప్రీత్ బజ్వా 4-0-40-1; జస్కరన్ సింగ్ 4-0-49-0; అన్ష్ పటేల్ 4-0-31-3

కెనడా ఇన్నింగ్స్: దిల్‌ప్రీత్ (సి) డికాక్ (బి) ఎంగిడి 0; యువరాజ్ (సి) డికాక్ (బి) ఎంగిడి 12; ధలివాల్ (సి) స్టబ్స్ (బి) బోష్ 64; కిర్టన్ (సి) రబాడ (బి) ఎంగిడి 4; శ్రేయస్ (బి) రబాడ 9; హర్ష్ థాకర్ (సి) రబాడ (బి) ఎంగిడి 33; జాఫర్ (సి) బోష్ (బి) యాన్సెన్ 11; జస్కరన్ (సి) స్టబ్స్ (బి) యాన్సెన్ 0; హేలింగర్ నాటౌట్ 4; కలీమ్ సనా నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **156; వికెట్ల పతనం:** 1-0, 2-22, 3-26, 4-45, 5-114, 6-133, 7-133, 8-150; **బౌలింగ్:** ఎంగిడి 4-0-31-4; యాన్సెన్ 4-0-30-2; రబాడ 4-0-40-1; బోష్ 4-0-27-1; కేశవ్ మహరాజ్ 4-0-28-0

హర్షిత్‌కు శస్త్రచికిత్స

దిల్లీ: భారత ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాకు మోకాలి శస్త్రచికిత్స విజయవంతమైంది. సోమవారం అతడు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు. "మోకాలి శస్త్రచికిత్స పూర్తయింది. ఇప్పుడు త్వరగా కోలుకుని, నాకు ఇష్టమైన ఆటలోకి వచ్చేందుకు దృష్టి పెట్టాను" అని రాణా చెప్పాడు. మోకాలి గాయం కారణంగా ఈ పేసర్ చివరి నిమిషంలో టీ20 ప్రపంచకప్‌నకు దూరమవడంతో.. మహ్మద్ సిరాజ్ జట్టులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

మనుకు రజతం, ఇషాకు కాంస్యం

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్


మను బాకర్


ఇషా సింగ్

దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కాంస్యంతో మెరిసింది. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా 30 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. స్టార్ షూటర్ మను బాకర్ త్రుటిలో స్వర్ణం కోల్పోయింది. రెండో స్థానంలో నిలిచి రజతం గెలిచింది. నుయెన్ ట్రాంగ్ (వియత్నాం) విజేతగా నిలిచింది. ఫైనల్లో మను, ట్రాంగ్‌ల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇద్దరూ 35 పాయింట్లతో సమానంగా నిలవగా.. షూటాఫ్‌లో నుయెన్ పైచేయి సాధించింది. మను, ఇషా, సాంగ్వాన్ త్రయం (1751) టీమ్ విభాగంలో స్వర్ణం గెలిచింది. చైనీస్ తైపీ (1735), వియత్నాం (1729) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

8 నెలల గర్భంతో బరిలోకి..


మేఘన సజ్జనార్

దిల్లీ: గర్భం దాల్చితే ఆటల్లో కొనసాగడం చాలా కష్టం. అలాంటిది 8 నెలల గర్భంతో బరిలోకి దిగడమే కాక.. పతకాలూ గెలిచింది మేఘన సజ్జనార్. కర్ణాటకకు చెందిన 32 ఏళ్ల ఈ షూటర్.. ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, టీమ్‌లో స్వర్ణం కైవసం చేసుకుంది. "కొందరు అథ్లెట్లు ఒలింపిక్స్‌లో గర్భంతోనూ పోటీపడ్డారు. కానీ భారత్ లాంటి దేశంలో అలా ఆడడాన్ని అందరూ సమ్మతించరు. 'ప్రసవించే ముందు రోజు వరకు కూడా ఆడొచ్చు' అని వైద్యులు ఇచ్చిన సలహా మేరకు ధైర్యంగా షూటింగ్‌లో కొనసాగాను. టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకున్నా. షూటింగ్‌లో ఎంతో ఏకాగ్రత కావాలి. ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయినా సవాల్‌గా తీసుకుని బరిలో దిగా. పోటీల సమయంలో ఒక్కోసారి ఊపిరి తీసుకోవడం కష్టంగా అనిపించేది" అని మేఘన చెప్పింది. బిడ్డకు జన్మనిచ్చాక.. సెప్టెంబరులో ఆసియా క్రీడల సమయానికి పునరాగమనం చేయాలని మేఘన లక్ష్యంగా పెట్టుకుంది.

భారత్‌తో ఆడతాం

ప్రకటించిన పాకిస్థాన్ ● బహిష్కరణపై వెనక్కి

లాహోర్: సంక్షోభానికి తెరపడింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ షెడ్యూల్ ప్రకారమే జరగనుంది. ఆ మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొంది. భారత్, పాక్ మ్యాచ్ ఈ నెల 15న కొలంబోలో జరగనుంది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ), ఐసీసీ మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పునరాలోచించాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని కోరాయి. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు తాను విజ్ఞప్తి చేసినట్లు బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ చెప్పాడు. శ్రీలంక ప్రధాని అనుర కుమార కూడా పాక్ ప్రధాని షరీఫ్‌తో ఫోన్లో మాట్లాడారని పాక్ ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్‌తో ముక్కోణపు సిరీస్ నిర్వహించాలన్న పీసీబీ డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ప్రపంచకప్‌నకు దూరం కావడంతో బంగ్లాకు కలిగిన ఆర్థిక నష్టాన్ని పూడ్చేందుకు పీసీబీ ఈ ప్రతిపాదన చేసింది. భారత్‌తో ద్వైపాక్షిక క్రికెట్ పునరుద్ధరణకు కూడా పీసీబీ డిమాండ్ చేసింది. కానీ అది ఐసీసీ చేతుల్లో లేని విషయం. అయితే వచ్చే అండర్-19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను బంగ్లాకు కట్టబెట్టే అవకాశాన్ని ఐసీసీ పరిశీలించే అవకాశముంది. భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడేందుకు తిరస్కరించినందుకు బంగ్లాదేశ్‌పై ఎలాంటి ఆంక్షలు విధించబోమని ఐసీసీ స్పష్టం చేసింది.

అదరగొట్టిన స్కాట్లాండ్

ఇటలీపై ఘనవిజయం

కోల్‌కతా


లియాస్క్ 4/17

బంగ్లాదేశ్ వైదొలగడంతో చివరి నిమిషంలో టీ20 ప్రపంచకప్ ఆడే అవకాశాన్ని దక్కించుకున్న స్కాట్లాండ్.. టోర్నీలో తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్-సి మొదటి మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన ఆ జట్టు.. సోమవారం రెండో మ్యాచ్‌లో 73 పరుగుల తేడాతో ఇటలీని చిత్తు చేసింది. మొదట స్కాట్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోరు చేసింది. జార్జ్ మన్సీ (84; 54 బంతుల్లో 13×4, 2×6) సత్తా చాటాడు. మైకేల్ జోన్స్ (37)తో కలిసి మన్సీ తొలి వికెట్‌కు 126 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌కు గట్టిపునాది వేశాడు. సెంచరీ చేసేలా కనిపించిన మన్సీ ఔటైనా.. మెక్‌ములన్ (41 నాటౌట్), లియాస్క్ (22 నాటౌట్) ధాటిగా ఆడడంతో స్కాట్లాండ్ స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో డ్రాకా, స్టివార్ట్, స్మట్స్, హసన్ తలో వికెట్ తీశారు. మైకేల్ లియాస్క్ (4/17) విజృంభించడంతో ఛేదనలో ఇటలీ 16.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. బెన్ మానెంటి (52; 31 బంతుల్లో 5×4, 1×6) మాత్రమే పోరాడాడు.

ఇటలీ తడబాటు: టీ20 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసిన ఇటలీ ఛేదనలో ఆరంభం నుంచే తడబడింది. తొలి బంతికే మోస్కా (0) వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. 40/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో సోదర ద్వయం బెన్ మానెంటి, హ్యారీ మానెంటి (37) జట్టును ఆదుకున్నారు. దీంతో ఇటలీ 12 ఓవర్లకు 113/3తో కోలుకుంది. మళ్లీ స్కాట్లాండ్ బౌలర్లు విజృంభించడంతో ఇటలీ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. 21 పరుగుల వ్యవధిలో 7 వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు ఓటమి చవిచూసింది.

స్కాట్లాండ్ ఇన్నింగ్స్: జార్జ్ మన్సీ (సి) హెన్రీ మానెంటి (బి) స్టివార్ట్ 84; మైకేల్ జోన్స్ (సి) హ్యారీ మానెంటి (బి) స్మట్స్ 37; మెక్‌ములన్ నాటౌట్ 41; రిచీ బెరింగ్టన్ (సి) మియాడ్ (బి) అలీ హసన్ 15; టామ్ బ్రూస్ (సి) మోస్కా (బి) డ్రాకా 1; లియాస్క్ నాటౌట్ 22; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 207; **వికెట్ల పతనం:** 1-126, 2-136, 3-184, 4-185; **బౌలింగ్:** అలీ హసన్ 4-0-21-1; స్టివార్ట్ 4-0-44-1; థామస్ డ్రాకా 2-0-37-1; స్మట్స్ 4-0-38-1; బెన్ మానెంటి 2-0-20-0; హ్యారీ మానెంటి 1-0-15-0; క్రిషాన్ 3-0-32-0

ఇటలీ ఇన్నింగ్స్: జస్టిన్ మోస్కా (సి) మన్సీ (బి) లియాస్క్ 0; ఆంథోని మోస్కా (సి) మన్సీ (బి) వాట్ 13; స్మట్స్ (సి) బారింగ్టన్ (బి) కర్రీ 22; హ్యారీ మానెంటి (సి) మన్సీ (బి) లియాస్క్ 37; బెన్ మానెంటి (సి) జోన్స్ (బి) డేవిడ్‌సన్ 52; గ్రాంట్ స్టివార్ట్ (సి) మన్సీ (బి) లియాస్క్ 2; మీడ్ (సి) మెక్‌ములన్ (బి) లియాస్క్ 0; క్రిషాన్ నాటౌట్ 3; డ్రాకా (సి) మెక్‌ములన్ (బి) వాట్ 2; అలీ హసన్ (సి) బెరింగ్టన్ (బి) వీల్ 0; మ్యాథ్యూ అబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (16.4 ఓవర్లలో ఆలౌట్) 134; **వికెట్ల పతనం:** 1-0, 2-32, 3-40, 4-113, 5-129, 6-129, 7-130, 8-133, 9-134; **బౌలింగ్:** మైకేల్ లియాస్క్ 4-0-17-4; బ్రాడ్ కర్రీ 2-0-12-1; బ్రాడ్ వీల్ 2.4-0-29-1; మార్క్ వాట్ 4-0-24-2; డేవిడ్‌సన్ 3-0-39-1; మెక్‌ములన్ 1-0-13-0

అక్కడ క్రికెట్... 233 ఏళ్ల ముందే

ఈనాడు క్రీడావిభాగం

ఈసారి టీ20 ప్రపంచకప్‌లో కొత్త జట్టు ఒక్కటే. అదే.. ఇటలీ. అయితే ఇప్పుడు ప్రపంచ క్రికెట్లో ఇటలీ పసికూనే. ప్రపంచకప్ కూడా దానికి కొత్తే కావచ్చు. కానీ రెండు శతాబ్దాల ముందే క్రికెట్ ఆడిన చరిత్ర ఆ దేశానికి ఉండడం విశేషం. 1793లో, అంటే 233 ఏళ్ల కిందట అక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. బ్రిటిష్ అధికారి హొరాషియో నెల్సన్ ఆ మ్యాచ్‌ను నిర్వహించాడట. అప్పట్లో నౌకాశ్రయంలో ఓడలన్నీ నిలిపి ఉంచిన సమయంలో వాటిలో పని చేసే, ప్రయాణించే వాళ్లంతా కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడారట. తర్వాత కూడా అడపా దడపా కొన్ని మ్యాచ్‌లు జరిగాయి. 1893లో ఇటలీ పురాతన ఫుట్‌బాల్ క్లబ్బుల్లో ఒకటైన జెనోవా.. మొదట జెనోవా క్రికెట్ అండ్ అథ్లెటిక్ క్లబ్‌గా ఏర్పాటైంది. కాలక్రమంలో అది జెనోవా క్రికెట్ అండ్ ఫుట్‌బాల్ క్లబ్‌గా మారింది. మరో ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ 'ఏసీ మిలన్' సైతం 1899లో 'మిలన్ ఫుట్‌బాల్ అండ్ క్రికెట్ క్లబ్'గా మొదలైంది. అయితే తర్వాతి కాలంలో క్రమంగా ఆ దేశంలో క్రికెట్ కనుమరుగైంది. ముఖ్యంగా 1922-43 మధ్య ఇటలీని నియంత అయిన ముసోలిని పాలించిన కాలంలో క్రికెట్ పూర్తిగా అంతరించింది. ఫుట్‌బాల్‌కే అగ్రతాంబూలం దక్కింది. అయితే గత కొన్నేళ్లలో అసోసియేట్ దేశాలకు ఐసీసీ మంచి ప్రోత్సాహం అందిస్తుండడం, ఐరోపాలో టీ20, టీ10 క్రికెట్ లీగ్స్‌కు ఆదరణ పెరగడం ఇటలీలో క్రికెట్ అభివృద్ధికి దోహదం చేసింది. స్థానికంగా క్రికెట్ ఆడే, కెరీర్‌గా ఎంచుకునే వారి సంఖ్య పెరిగింది. వీరికి వలస క్రికెటర్లు కూడా తోడవడంతో ఇటలీ ప్రపంచ క్రికెట్లో తనకంటూ ఓ స్థానం సంపాదించుకుంది. అయితే అమెరికా మాదిరి పూర్తిగా వలస క్రికెటర్లతో నిండిపోలేదు ఇటలీ జట్టు. జస్టిన్ మోస్కా, ఆంటోనీ మోస్కా, థామస్ డ్రాకా, జియాన్ మీడ్ లాంటి క్రికెటర్లు ఇటలీ దేశస్థులే. వీరికి తోడు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్లు బెన్ మానెటి, హ్యారీ మానెటి.. ఇంగ్లాండ్ ఆటగాళ్లు గ్రాంట్ స్టివార్ట్, వేన్ మ్యాడ్సన్.. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జేజే స్మట్స్ లాంటి ఆటగాళ్లతో ఇటలీ మెరుగ్గానే కనిపిస్తోంది. ఐరోపా క్వాలిఫయర్స్‌లో ఉత్తమ ప్రదర్శన చేసి, స్కాట్లాండ్ లాంటి పేరున్న జట్టు కంటే ముందు ఆ జట్టు టీ20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించడం విశేషం. తొలి మ్యాచ్‌లో సరిగా ఆడలేక స్కాట్లాండ్ చేతిలో ఓడింది కానీ.. ఇటలీ ఇంకా మెరుగైన ప్రదర్శన చేయగల సత్తా ఉన్న జట్టే. మరి తర్వాతి మ్యాచ్‌ల్లో ఆ జట్టు బలమైన ముద్ర వేస్తుందేమో చూద్దాం.

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

మ్యాచ్	వేదిక
నెదర్లాండ్స్ × నమీబియా	వేదిక: దిల్లీ, ఉ॥ 11.00
న్యూజిలాండ్ × యూఏఈ	వేదిక: చెన్నై, మ॥ 3.00
పాకిస్థాన్ × అమెరికా	వేదిక: కొలంబో, రా॥ 7.00

గ్రేడ్ 'బి'లోకి కోహ్లి, రోహిత్

ఎ+ గ్రేడ్‌ను రద్దు చేసిన బీసీసీఐ

దిల్లీ: బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల్లో సీనియర్ సూపర్‌స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల స్థాయిని ఊహించినట్లే తగ్గించారు. వన్డే క్రికెట్లో మాత్రమే కొనసాగుతున్న నేపథ్యంలో వాళ్లకు గ్రేడ్ బి కాంట్రాక్ట్ దక్కింది. రూ.7 కోట్లు ఫీజుగా ఉండే ఎ+ విభాగాన్ని బీసీసీఐ రద్దు చేసింది. బోర్డు సోమవారం మొత్తం 30 మంది పురుష, 21 మంది మహిళా క్రికెటర్లకు వార్షిక సెంట్రల్ కాంట్రాక్టులను ప్రకటించింది. రెండు ఫార్మాట్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ పేసర్ బుమ్రా, ఆల్‌రౌండర్ జడేజాలకు ఎ గ్రేడ్ లభించింది. వివిధ గ్రేడ్‌ల కింద ఎంత చెల్లించేది బీసీసీఐ వెల్లడించలేదు. కిందటి సీజన్ వరకు ఎ, బి, సి గ్రేడ్‌లలోని ఆటగాళ్లు వరుసగా రూ.5 కోట్లు, రూ.3 కోట్లు, రూ.1 కోటి పొందేవాళ్లు. వెటరన్ పేసర్ షమి, వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌లకు కాంట్రాక్టులు దక్కలేదు. గత సీజన్‌లో వీళ్లు ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడమే అందుకు కారణం. నితీశ్ కుమార్ రెడ్డికి గ్రేడ్ సి కాంట్రాక్ట్ దక్కింది.

జెమీమాకు 'ఎ' గ్రేడ్: మహిళ విభాగంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, స్మృతి మంధానలు తమ 'ఎ' గ్రేడ్‌ను నిలబెట్టుకున్నారు. ప్రపంచకప్‌లో అదరగొట్టిన జెమీమాకు 'బి' నుంచి 'ఎ'కు ప్రమోషన్ లభించింది. స్నేహ్ రాణా, షెఫాలి వర్మ, రిచా ఘోష్, రేణుక సింగ్‌లకు గ్రేడ్ 'బి' కాంట్రాక్ట్ దక్కింది. తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతి రెడ్డిలతో పాటు రాధ, అమన్‌జోత్, ప్రతీక, ఉమ, క్రాంతి, యాస్తిక, హర్లీన్, కష్వీ, కమలిని, వైష్ణవి, తేజల్ గ్రేడ్ సి లో ఉన్నారు. ఇప్పటివరకు గ్రేడ్-ఎలోని అమ్మాయిలకు రూ.50 లక్షలు ఇచ్చారు. బి, సి గ్రేడ్‌లలో ఉన్న క్రికెటర్లు వరుసగా రూ.30 లక్షలు, రూ.10 లక్షలు అందుకున్నారు.

ఎవరెక్కడ..

గ్రేడ్ ఎ: గిల్, బుమ్రా, జడేజా

గ్రేడ్ బి: కోహ్లి, రోహిత్, సుందర్, రాహుల్, సిరాజ్, హార్దిక్, రిషభ్ పంత్, కుల్‌దీప్, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్

గ్రేడ్ సి: అక్షర్ పటేల్, తిలక్ వర్మ, రింకు సింగ్, శివమ్ దూబె, సంజు శాంసన్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఆకాశ్‌దీప్, ధ్రువ్ జురెల్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్‌రెడ్డి, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, రవి బిష్ణోయి, రుతురాజ్ గైక్వాడ్.

సయ్యద్ మోదీ హోదా తగ్గింపు

కౌలాలంపూర్: భారత్‌కు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) షాకిచ్చింది. 2027-2030 సీజన్‌కు సంబంధించి నూతన షెడ్యూల్‌లో భారత్‌కు కేటాయించాల్సిన టోర్నీల సంఖ్యను నాలుగు నుంచి రెండుకు తగ్గించింది. లఖ్‌నవూలో జరిగే సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీ హోదాను సూపర్ 300 నుంచి 100కు కుదించింది. 2023లో ప్రారంభమైన గువాహటి, ఒడిశా సూపర్ 100 టోర్నీలను క్యాలెండర్ నుంచి తప్పించింది. అయితే ఇటీవల నిర్వహణ లోపాలపై విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ.. ప్రతిష్ఠాత్మక ఇండియా ఓపెన్ తన సూపర్ 750 హోదాను నిలబెట్టుకుంది. బ్యాడ్మింటన్‌ను ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీడబ్ల్యూఎఫ్ పేర్కొంది. చైనా వంటి అగ్రదేశానికి కూడా కేవలం మూడు ఈవెంట్లే దక్కాయని సంజయ్ గుర్తుచేశాడు. సయ్యద్ మోదీ పురాతన టోర్నీల్లో ఒకటి కావడంతో.. దాన్ని సూపర్ 100 హోదాతోనైనా లఖ్‌నవూలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించాడు. 2027-2030 కాలానికి బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్‌లో 36 టోర్నీలు ఆరు అంచెల్లో జరగనున్నాయి. సూపర్ 1000 టోర్నీలను నాలుగు నుంచి అయిదుకు పెంచారు. ఒక ప్రపంచ టూర్ ఫైనల్స్, అయిదు 750, తొమ్మిది 500.. ఎనిమిదేసి 300, 100 టోర్నీలు నిర్వహించనున్నారు.

యువ షూటర్ శంభాజీ దుర్మరణం

ముంబయి: భారత యువ షూటర్ శంభాజీ పాటిల్ దుర్మరణం పాలయ్యాడు. అతడి వయసు 27 ఏళ్లు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ముంబయి- అహ్మదాబాద్ హైవేపై సోమవారం కారు ప్రమాదంలో శంభాజీ మరణించాడు. తీవ్రంగా గాయపడిన శంభాజీని ఆసుపత్రికి తరలించగా.. అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. కారును నడిపిన అతడి మిత్రుడు యశ్ చౌదరికి గాయాలయ్యాయి. 2016 జూనియర్ ప్రపంచకప్‌లో శంభాజీ 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణం సాధించాడు.

మెరిసిన బెనెట్

ఒమన్‌పై జింబాబ్వే విజయం


బెనెట్ 48 నాటౌట్

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వే శుభారంభం చేసింది. బౌలర్ల చక్కటి ప్రదర్శనకు ఓపెనర్ బెనెట్ (48 నాటౌట్; 36 బంతుల్లో 7×4) మెరుపులు తోడవడంతో సోమవారం గ్రూప్-బి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన ఒమన్ తడబడింది. ముజరబాని (3/16), రిచర్డ్ ఎంగరవ (3/17), బ్రాడ్ ఎవాన్స్ (3/18) ధాటికి 19.5 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. వినాయక్ శుక్లా (28) టాప్ స్కోరర్. ఓ దశలో 27 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఒమన్‌ను శుక్లా, సుఫియాన్ (25) ఆదుకున్నారు. వాళ్లు ఆరో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. ఒమన్ బ్యాటర్లలో శుక్లా, సుఫ్యాన్ కాకుండా నదీమ్ ఖాన్ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగాడు. బెనెట్ చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని జింబాబ్వే 13.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. మరుమాని (21; 11 బంతుల్లో 5×4) ధాటిగా జింబాబ్వే 3 ఓవర్లలో 30/0తో నిలిచింది. షకీల్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో అతడు వరుసగా నాలుగు ఫోర్లు బాదాడు. తర్వాతి ఓవర్లో బెనెట్ వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. అయితే నాలుగో ఓవర్లో సుఫియాన్.. మరుమాని, మేయర్స్ (0)లను వెనక్కి పంపి జింబాబ్వేను దెబ్బ తీశాడు. కానీ ధాటిగా బ్యాటింగ్ చేసిన బెనెట్.. ఒమన్‌కు తమపై ఒత్తిడి పెంచే అవకాశం ఇవ్వలేదు. బ్రెండన్ టేలర్ (31 రిటైర్డ్ హర్ట్) సహకారంతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీలైనప్పుడల్లా బంతిని బౌండరీ దాటిస్తూ జింబాబ్వేను లక్ష్యం దిశగా నడిపించాడు. మూడో వికెట్‌కు 68 పరుగులు జోడించాక.. టేలర్ తొడకండరాల గాయంతో మైదానాన్ని వీడాడు. సికందర్ రజా (5 నాటౌట్)తో కలిసి బెనెట్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ముజరబానికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు... ఒమన్: 19.5 ఓవర్లలో 103 ఆలౌట్ (వినాయక్ శుక్లా 28, సుఫియాన్ మహమూద్ 25, నదీమ్ ఖాన్ 20; ముజరబాని 3/16, రిచర్డ్ ఎంగరవ 3/17, బ్రాడ్ ఎవాన్స్ 3/18); **జింబాబ్వే:** 13.3 ఓవర్లలో 106/2 (బ్రయాన్ బెనెట్ 48 నాటౌట్, టేలర్ 31, మరుమాని 21; సుఫియాన్ 2/12)

జమ్ముకశ్మీర్.. తొలిసారి రంజీ సెమీస్‌కు



ఇందౌర్: రంజీ ట్రోఫీలో మరో రెండు సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. జమ్ముకశ్మీర్ తొలిసారి సెమీస్ చేరి చరిత్ర సృష్టించగా.. ముంబయిని ఓడించి కర్ణాటక సెమీస్ బెర్తు సొంతం చేసుకుంది. ఆకిబ్ నబి (5/70) విజృంభించడంతో క్వార్టర్‌ఫైనల్లో జమ్ముకశ్మీర్ 56 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్‌ను ఓడించింది. 67 సంవత్సరాల కిందట రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన జమ్ముకశ్మీర్ సెమీస్ చేరడం ఇదే తొలిసారి. 291 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 87/5తో నాలుగో రోజు ఉదయం ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 194.. మధ్యప్రదేశ్ 152 పరుగులకు ఆలౌటయ్యాయి. జమ్ముకశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 248 పరుగులు సాధించింది. మరోవైపు రాహుల్ (130) సెంచరీతో కదంతొక్కడంతో కర్ణాటక సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం ఆ జట్టు 4 వికెట్ల తేడాతో 42సార్లు ఛాంపియన్ ముంబయిని ఓడించింది. 325 పరుగుల లక్ష్యాన్ని ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదటి ఇన్నింగ్స్‌లో ముంబయి 120.. కర్ణాటక 173 పరుగులకు ఆలౌటయ్యాయి. ముంబయి రెండో ఇన్నింగ్స్‌లో 377 పరుగులు చేసింది.

ఆంధ్ర ఆశలు గల్లంతు: రంజీ ట్రోఫీలో ఆంధ్ర సెమీఫైనల్ ఆశలు దాదాపుగా గల్లంతయినట్లే! సుదీప్‌కుమార్ ఘరామి (299; 596 బంతుల్లో 31×4, 6×6) కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడటంతో బెంగాల్ సెమీస్ బెర్తు దిశగా దూసుకెళ్లింది. ఓవర్‌నైట్ స్కోరు 418/6తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 629 పరుగులకు ఆలౌటైంది. సుదీప్‌కుమార్ ఒకేఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. షేక్ రషీద్ (4/63) బౌలింగ్‌లో తక్కువ ఎత్తులో వచ్చిన బంతికి ఘరామి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 299 పరుగుల వద్ద ఔటైన భారత తొలి క్రికెటర్‌గా.. ప్రపంచంలో మార్టిన్ క్రో, మైక్ పావెల్ తర్వాత మూడో ఆటగాడిగా నిలిచాడు. హబీబ్ గాంధీ (95), మహ్మద్ షమి (53) కూడా సత్తాచాటడంతో బెంగాల్‌కు 334 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 3 వికెట్లకు 64 పరుగులు సాధించింది. మంగళవారం మ్యాచ్‌కు చివరి రోజు కావడంతో ఈ మ్యాచ్‌లో బెంగాల్‌ను ఆంధ్ర ఓడించడం అసాధ్యం! తొలి ఇన్నింగ్స్ ఆధారంగా బెంగాల్ సెమీస్‌కు చేరుకోవడం లాంఛనమే.

కాలం చెల్లిన చట్టాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కంప్యూటర్లు, డేటా సెంటర్లు భవిష్యత్తులో సాంకేతికంగా పెనుమార్పులు తెస్తాయి. రోజువారీ జీవితంలోనూ టెక్ టెక్నాలజీ వాడకం పెరుగుతుంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులోనూ ఏఐ ద్వారా ఆర్థిక వృద్ధి ఎలా సాధించవచ్చు, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వాడకం ప్రభావం ఎలా ఉంటుంది, వాటిని ఏయే దేశాలు ఎలా అందిపుచ్చుకుంటున్నాయో చర్చించానని చంద్రబాబు వివరించారు.

ఆత్మహత్యలకు కారణాలపై ఆడిట్

'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించాం. ఉద్యాన సాగును పూర్వోదయ లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద ప్రోత్సహిస్తాం. సాగునీటి వసతి పెంచి రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా మారుస్తాం. ఉద్యాన సాగు రంగంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకురానున్నా'మని చంద్రబాబు వివరించారు. 'వైకాపా ప్రభుత్వంలో సేద్యం దెబ్బతిని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. దీన్ని చక్కదిద్దుతున్నాం. రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటే, అందుకు కారణాలు ఆడిట్ చేయాలని ఆదేశించాం. తద్వారా ఆత్మహత్యల నివారణకు విధానపరమైన పరిష్కారాలు కనిపెట్టాల'ని సీఎం పేర్కొన్నారు. పొగాకు, మామిడి, కోకో, ఉల్లి, తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతుంటే, ప్రభుత్వం జోక్యం చేసుకుని రూ.1,100 కోట్లు అందించిందని, కోస్తాంధ్రలో మత్స్య, వాణిజ్య పంటల సాగును పెంచి, సత్ఫలితాలు సాధించిందని వివరించారు.

గడువులోగా పోలవరం, అమరావతి

అమరావతి శ్మశానమని, ఎడారి అని వైకాపా నాయకులు చేసిన విమర్శలు, విన్యాసాలన్నీ పటాపంచలై నేడు రాజధాని పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, మూడేళ్లలో అమరావతికి ఓ రూపాన్ని తీసుకొస్తామని సీఎం పేర్కొన్నారు. మోస్ట్ లివబుల్ సిటీగా మారే అమరావతి వంటి నగరాలు అవసరమని కేంద్రం చెప్పినట్లు సీఎం గుర్తుచేశారు. 'వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో కొట్టుకుపోయిన పోలవరం డయాఫ్రం వాల్‌ను రూ.వెయ్యి కోట్లతో మళ్లీ నిర్మిస్తున్నాం. ఇది మార్చిలో పూర్తవుతుంది. 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేసి, జాతికి అంకితమిస్తామ'ని పునరుద్ఘాటించారు.


ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఆత్మీయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సంపూర్ణంగా చెత్త తొలగింపు

'వైకాపా హయాంలో గుంతల్లో, మైదానాల్లో చెత్త వేసి, వాటిని కాలుష్యమయం చేశారు. మే మొదట్లో 105 లక్షల టన్నుల వ్యర్థాలు తొలగించాం. మార్చిలోగా 100 శాతం తొలగిస్తాం. రూ.1,000 కోట్లతో రోడ్లకు మరమ్మతులు చేశాం. మరో రూ.3 వేల కోట్ల నిధులిస్తాం. పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.4 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. కేంద్రం కొత్తగా తెచ్చిన జీరామ్‌జీ అమలు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పడే అదనపు ఆర్థిక భారాన్ని, పనులకు అవసరమైన ఆస్తుల్ని సృష్టించే పనులు చేపడతాం. జలజీవన్ మిషన్ పథకాన్ని కొనసాగిస్తాం. రూ.25 వేల కోట్లతో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తామ'ని సీఎం పేర్కొన్నారు.

గూగుల్‌దే అతిపెద్ద పెట్టుబడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మొదటిసారిగా విశాఖ ఉక్కు పరిశ్రమ లాభాలబాట పట్టిందని, తాజాగా రూ.54 కోట్ల ఆదాయం వచ్చిందని సీఎం వెల్లడించారు. 'విశాఖ ఏఐ హబ్‌గా మారబోతోంది. అక్కడ గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టబోతోంది. దేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టాక వచ్చిన అతిపెద్ద పెట్టుబడి ఇదే. రాష్ట్రంలో 5 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయి. ప్రపంచంలో అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు శంకుస్థాపన చేశామ'ని సీఎం వివరించారు.

మేం నాలుగు గోడల మధ్య ఉండే వ్యక్తులం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఆయా శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో చివరి స్థాయి ఉద్యోగి వరకు జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని తెలిపారు. ఆర్థిక పరిమితులన్నీ దాటి ఉన్న తక్కువ వనరులతో కీలకమైన అభివృద్ధి పనుల్ని చేస్తున్నాం. ప్రధాని మోదీ సహకారం, నాయకత్వం, సీఎం చంద్రబాబు అనుభవంతో ముందుకు వెళుతున్నాం. ఈ కార్యక్రమాల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించేలా అధికారులు పనిచేయాలి' అని స్పష్టం చేశారు.

రూ.11,328 కోట్లతో అభివృద్ధి పనులు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన మీద దృష్టి పెట్టాం. పల్లె పండుగ 1.0 కింద రూ.2,500 కోట్లు, 2.0 కింద రూ.5,700 కోట్లు ఖర్చు చేశాం. అడవి తల్లి బాట పథకం కింద గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.1005 కోట్లను వెచ్చించాం. సాస్కీ నిధులు రూ.2,123 వేల కోట్లతో పనులు చేపట్టాం. మొత్తంగా రూ. 11,328 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. జలజీవన్ మిషన్ కింద రూ.28 వేల కోట్ల పనులకు అనుమతులు లభిస్తే, అందులో రూ.10 వేల కోట్లతో పనులను ప్రారంభించాం. అటవీశాఖ పరిధిలో రూ.200 కోట్లతో నగర వనాలను ఏర్పాటు చేస్తున్నాం. చేపట్టిన ప్రతి పనిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి. ప్రభుత్వ నిర్ణయాల అమలులో క్షేత్రస్థాయి సిబ్బందిదే బృహత్తర బాధ్యత. పనులు సకాలంలో పూర్తి చేసే విషయంలో కిందిస్థాయి సిబ్బందికి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయాలి' అని సూచించారు.

అది నెయ్యి కాదు.. రసాయనాలమయం

(మొదటి పేజీ తరువాయి)

ఏజెన్సీస్, సుమతి ట్రేడర్స్‌కు సరఫరా చేసింది. అవి రాష్ట్రంలోని పలు దేవస్థానాలకు ఈ రసాయన మిశ్రమాన్నే నెయ్యి పేరిట సరఫరా చేశాయి. వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలన్నింటికీ ఈ కల్తీ వ్యాపించింది. ఈ వివరాలన్నింటినీ సిట్ అభియోగపత్రంలో పేర్కొంది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు ఈ కల్తీ నెయ్యి తయారీ కోసం ఏయే రసాయనాలను ఎలా, ఎక్కడి నుంచి కొన్నారనే వివరాలన్నీ అభియోగపత్రంలో పొందుపరిచింది.

కొబ్బరి నూనె, పామాయిల్ పేరిట రసాయనాల కొనుగోలు

■ కల్తీ నెయ్యి తయారీ కోసం కావాల్సిన మోనో గ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ వంటి రసాయనాలను భోలేబాబా డెయిరీ.. తమ అనుబంధ సంస్థలైన హర్ష్ ట్రేడింగ్, హర్ష్ ఫ్రెష్ డెయిరీ ఫుడ్స్ పేరిట కొనుగోలు చేసింది. దిల్లీ పంజాబ్‌బాగ్‌లో ఉన్న సుగంధ్ ఆయిల్ అండ్ కెమికల్స్ సంస్థ యజమాని అజయ్‌కుమార్ సుగంధ్ పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్, కొబ్బరి నూనెల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించారు. ఆ ముసుగులో ఈ రసాయనాలను భోలేబాబా డెయిరీకి సరఫరా చేశారు. ఈ ఒక్క సంస్థే ఏకంగా 6.51 లక్షల కిలోల రసాయనాలు అందించింది.

■ సుగంధ్ ఆయిల్ అండ్ కెమికల్స్ నుంచి పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్, కొబ్బరి నూనెలు కొన్నట్లు, అందుకోసం జీఎస్టీ మినహాయించి రూ.7.94 కోట్లు చెల్లించినట్లు భోలేబాబా రికార్డుల్లో ఉండటంతో సిట్ అధికారులు సుగంధ్ ఆయిల్ కంపెనీ ప్రాంగణం, గోదాముల్లో సోదాలు చేపట్టారు. అయితే అక్కడెక్కడా పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్, కొబ్బరి నూనెల జాడే లేదు. వారు వాటితో వ్యాపారం చేస్తున్నట్లు ఆనవాళ్లే కనిపించలేదు. అక్కడ 200 కిలోల సామర్థ్యం కలిగిన నీలం రంగు ఇనుప డ్రమ్ముల్లో కొరియా నుంచి దిగుమతి చేసుకున్న మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ వంటి రసాయనాలు లభించాయి. అవే రసాయనాలు భోలేబాబా డెయిరీలో తనిఖీల్లోనూ పట్టుబడ్డాయి.

తప్పుడు ఇన్వాయిస్‌లతో సరఫరా

■ దిల్లీలో శివాన్ష్ ట్రేడింగ్ కంపెనీ, నేషనల్ ఆయిల్స్ అండ్ కెమికల్స్ కంపెనీలను నిర్వహించే మహేష్‌కుమార్ రోహిరా.. ఏఎంజీ 90 (డిస్టిలేటెడ్ మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్), మైవాసెట్ సాఫ్ట్ 400 (ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ ఆఫ్ మోనో అండ్ డై గ్లిజరైడ్స్ ఆఫ్ ఫ్యాటీ యాసిడ్స్) రసాయనాలు 30 వేల కిలోలను భోలేబాబా డెయిరీకి సరఫరా చేశారు. 44,800 కిలోల పామాయిల్ సరఫరా చేసినట్లు తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి, వాటి ముసుగులో ఈ రసాయనాలు సరఫరా చేశారు.

■ మహేష్‌కుమార్ రోహిరా ఆదేశాల మేరకు ఆయన సోదరుడు అర్పిత్ రోహిరా ఆధ్వర్యంలోని కంపెనీ అయిన జీఆర్ ఇంపెక్స్ ద్వారా 70 వేల కిలోల మైవాసెట్ సాఫ్ట్‌ను భోలేబాబాకు సరఫరా చేశారు. 85,800 కిలోల పామాయిల్ సరఫరా చేసినట్లు తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి, ఈ రసాయనాలు సరఫరా చేశారు.

■ దిల్లీలోని అరిస్టో కెమికల్స్ నుంచి 8,900 కిలోల లబ్సా (లీనియర్ ఆల్కైల్ బెంజీన్ సల్ఫోనిక్ యాసిడ్), లాక్టిక్ యాసిడ్ కొన్నారు. ఈ రసాయనాలను సరఫరా చేసిన వారందర్నీ సిట్ నిందితులుగా గుర్తించింది.

ఇలా కొని.. అలా అమ్మేసినట్లు..

భోలేబాబా డెయిరీ ప్రతినిధులు పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్ 57.56 లక్షల కిలోలు కొని వేరే సంస్థలకు హర్ష ట్రేడింగ్ ద్వారా విక్రయించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. అలా కొన్న మొత్తాన్ని కల్తీ నెయ్యి తయారీకి వాడారు.

కల్తీ నెయ్యి తయారీకి వాడిన రసాయనాలు

■ పామాయిల్ ■ పామ్‌కెర్నెల్ ఆయిల్ ■ లాక్టిక్ యాసిడ్ ■ లబ్సా (లీనియర్ ఆల్కైల్ బెంజీన్ సల్ఫోనిక్ యాసిడ్) ■ ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ ఫుడ్‌గ్రేడ్ ■ మోనోగ్లిజరైడ్స్, డైగ్లిజరైడ్స్

కల్తీ నెయ్యి తయారీ కోసం కొనుగోలు చేసిన రసాయనాలివే..

సంస్థ	అక్కడి నుంచి కొన్న రసాయనాలు (కిలోల్లో)
సుగంధ్ ఆయిల్ అండ్ కెమికల్స్, దిల్లీ	6,51,000
శివాన్ష్ ట్రేడింగ్ కంపెనీ, దిల్లీ	1,00,000
జీఆర్ ఇంపెక్స్, దిల్లీ	70,000
అరిస్టో కెమికల్స్, దిల్లీ	8,900
మొత్తం	8,30,000

2019-24 వరకూ వైకాపా హయాంలో తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా ఇలా..

డెయిరీ	సరఫరా చేసిన కల్తీ నెయ్యి (కిలోల్లో)	దుర్వినియోగమైన తితిదే సొమ్ము (రూ.ల్లో)
భోలేబాబా ఓరెగానిక్ డెయిరీ మిల్క్	9,90,450	31,61,91,960
వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్	33,31,701	129,53,79,445
మాల్‌గంగా మిల్క్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్	15,81,210	71,81,27,048
ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్	68,420	1,54,34,172
మొత్తం	59,71,781	234,51,32,625

అంబటికి బెయిలు.. మరో కేసులో మళ్లీ జైలు

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ మంజూరు చేశారు. జైలు నుంచి విడుదలయ్యాక రెండు నెలలపాటు ప్రతి రెండో శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని, క్రిమినల్ వ్యవహారాల్లో పాల్గొనరాదని, పోలీసుల దర్యాప్తునకు అందుబాటులో ఉండాలని, కేసులో సాక్షులను ప్రభావితం చేయరాదని షరతులు విధించారు.

పీపీపీపై ఆందోళనలో పోలీసులపై దౌర్జన్యం చేసినందుకు..

పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి వ్యతిరేకంగా గతేడాది నవంబరు 12న అంబటి రాంబాబు తన అనుచరులైన కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, ఆచారి, నర్సిరెడ్డి, కోటి, రవియాదవ్, భాను, అనిల్, వెంకటరెడ్డి, సైదా తదితరులతో కలిసి గుంటూరులో ఆందోళన చేశారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నా... పోలీసులపై దౌర్జన్యం చేసి ప్రదర్శన నిర్వహించారంటూ పట్టాభిపురం ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సోమవారం మధ్యాహ్నం అంబటిని పీటీ వారంట్‌పై రాజమహేంద్రవరం జైలు నుంచి తీసుకొచ్చి భారీ బందోబస్తు నడుమ స్థానిక ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తనపట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని రాంబాబు న్యాయమూర్తికి తెలిపారు. రిమాండ్ విధించవద్దని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. రాంబాబుపై ఇప్పటికే 19 కేసులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జడ్జి రాంబాబుకు ఈ నెల 20 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం ఆయన తరఫున న్యాయవాదులు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై లిఖితపూర్వక అభ్యంతరం వ్యక్తం చేసేందుకు సమయం కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరడంతో విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. రిమాండ్ విధించడంతో అంబటి రాంబాబును భారీ బందోబస్తు మధ్య రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. పలువురు వైకాపా నేతలు, కార్యకర్తలు కోర్టు వద్దకు తరలివచ్చారు.

లోక్‌సభ స్పీకరుపై అవిశ్వాస తీర్మానం!

(మొదటి పేజీ తరువాయి)

భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో ఈ డిమాండును విపక్షాలు తెరపైకి తీసుకువస్తున్నాయి. రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో.. తృణమూల్, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొని ఈ నిర్ణయానికి వచ్చాయి. లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు దీనిని ఎప్పుడు సమర్పించాలో మంగళవారం నిర్ణయిస్తారు. ఇది జరిగితే సిట్టింగ్ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం నాలుగోసారి అవుతుంది. గతంలో ముగ్గురిపై ప్రవేశపెట్టినవి వీగిపోయాయి.

వీటిపై మాట్లాడనివ్వండి

రాహుల్, మరికొందరు విపక్ష ఎంపీలు సోమవారం ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో ప్రతిష్టంభన తొలగింపుపై చర్చించారు. రాహుల్ తాను లేవనెత్తదలచిన అంశాలను వివరించారు. వాటిపై మాట్లాడనిస్తే చర్చకు సిద్ధమేనని చెప్పారు. రాహుల్ వెంట వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టి.ఆర్.బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి చెబుతానని స్పీకర్ వారికి తెలిపారు. కొన్ని నిమిషాల్లోనే ఈ సమావేశం ముగిసిపోయింది. రాహుల్ ఒక్కరే మాట్లాడి మిగిలినవారికి అవకాశం కల్పించకపోతే కుదరదని ప్రభుత్వం పేర్కొంటోంది. ఎంపీల నుంచి ప్రధానికి ముప్పు ఉన్నట్లయితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ విలేకరులకు చెప్పారు. ప్రధానిని సభ్యులు బెదిరించబోతున్నారన్న ఆలోచనే ఎంతో కలవరపెడుతోందని, అలాంటి ప్రశ్నకే తావులేదని స్పష్టం చేశారు. నరవణె పుస్తకాన్ని తాను ఇస్తానని మోదీ భయపడిపోతున్నారని చెప్పారు.


పార్లమెంటు హౌస్‌లో భేటీ అయిన కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, జైరాం రమేశ్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, తదితరులు

ఆ పదవిపై గౌరవం ఉంది

"మాజీ ప్రధానులపై అసభ్యకరంగా మాట్లాడిన భాజపా ఎంపీలపై మీరు ఎలాంటి చర్య తీసుకోలేదు. మీరు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని అర్థమవుతోంది. మీపై మాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. మీరు నిరంతరం అధికార పార్టీ ఒత్తిడిలో ఉంటున్నారు. కష్టకాలంలో సరైన నిర్ణయాలు తీసుకున్న వ్యక్తిగా చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకోవాలి" అని మహిళా ఎంపీలు లేఖలో పేర్కొన్నారు. 'మేం సభకు వెళ్లడం, వెంటనే బయటకు రావడం చాలా విచారకరం. ఇది ప్రజాస్వామ్యం కాదు. మేం ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లు?' అని ప్రియాంక విలేకరుల వద్ద అన్నారు. ప్రధానిపై ఏ ఒక్క ఎంపీ చేయిచేసుకునే పరిస్థితే లేదన్నారు.

రాజ్యసభ నుంచి విపక్షం వాకౌట్

పార్లమెంటులో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. రాహుల్‌ను మాట్లాడనివ్వాలనే డిమాండులో సభను విపక్షం స్తంభింపజేసింది. ఇరుపక్షాలూ తమతమ వాదనలు వినిపించాయి. చివరకు సభ మంగళవారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఇదే అంశంపై ఖర్గే మాట్లాడటానికి అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ సహా విపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభకు సంబంధించిన అంశాన్ని ఎగువసభలో ప్రస్తావించడం కుదరదని ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ తేల్చిచెప్పారు. వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌పై డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ.. సభాహక్కుల తీర్మాన నోటీసు ఇచ్చారు. సభలో సంఖ్యాబలం తమకున్న దృష్ట్యా ఏ బిల్లునైనా ఆమోదించుకోవడంలో ఇబ్బంది ఉండదని, చర్చ జరగకపోతే ప్రతిపక్షానికే నష్టమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. స్పీకర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టినా ఆయన్ని తొలగించడానికి కావాల్సినంత బలం విపక్షాలకు లేదని చెప్పారు.

'నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు'

స్పీకర్‌పై అధికారపార్టీ ఒత్తిడి ఉందని, ఆయన సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆరోపించారు. ఆయనను ఉద్దేశించి ఈ మేరకు లేఖ రాశారు. "సభకు ప్రధాని మోదీ గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, మీరు అధికార పార్టీ ఒత్తిడి మేరకు మాపై నిరాధార ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా మీరు వ్యవహరించాలి" అని వారు ఓం బిర్లాను కోరారు.

దిల్లీ చేరిన చంద్రబాబు

- నేడు ఐదుగురు కేంద్ర మంత్రులతో భేటీ

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం రాత్రి దిల్లీ చేరుకున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై మంగళవారం దిల్లీలో ఐదుగురు కేంద్ర మంత్రులతో ఆయన సమావేశం కానున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్, హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలవనున్నారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం, తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారం, పూర్వోదయ పథకం అమలు, 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా రాష్ట్రంపై పడిన ఆర్థిక ప్రభావం, దాన్ని సర్దుబాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వపరంగా చేయాల్సిన సాయం తదితర అంశాల గురించి చర్చించే వీలుంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు లాంజ్‌లోనే పార్టీ ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు.

సచిన్, చంద్రబాబు కలయిక


ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయంలో దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌ను యాదృచ్ఛికంగా కలిశారు. ఇద్దరూ కొద్దిసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా దిల్లీకొచ్చారు.

పెళ్లి పేరిట చెల్లిపై అత్యాచారం

- నిందితుడికి మరణించే వరకూ జైలు శిక్ష
- విజయవాడ పోక్సో కోర్టు తీర్పు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సమాజం దిగ్భ్రాంతి చెందేలా సొంత చెల్లిని పెళ్లి చేసుకొని, ఆమె గర్భానికి కారణమైన యువకుడికి విజయవాడ పోక్సో కోర్టు జీవితకాలం కారాగార శిక్ష విధించింది. ఓ కుటుంబానికి చెందిన దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుటుంబ గొడవల కారణంగా తల్లిదండ్రులు విడిగా ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలతో తల్లి కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడలో ఉంటుండగా, కుమారుడితో కలిసి తండ్రి ప్రకాశం జిల్లా కొండపి మండలం పెంట్లూరులో స్థిరపడ్డాడు. 2023లో వారి కుమారుడు(21) తల్లి, చెల్లెళ్ల వద్దకు వెళ్తున్నట్లు చెప్పి మంటాడకు వచ్చాడు. పెద్ద చెల్లి(17)తో సన్నిహితంగా ఉన్న ఫొటోలు తీసుకొని బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. 2024లో క్రిస్మస్ సందర్భంగా మంటాడకు వచ్చి.. నాన్న దగ్గరకు వెళ్దామని చెప్పి చెల్లిని విజయవాడలో ఓ చర్చికి తీసుకెళ్లి తాళి కట్టాడు. తర్వాత ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లాడు. అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు.

గర్భం దాల్చాక ఒంగోలు బస్టాండులో వదిలేసి: ఇదంతా తెలియని తల్లి.. కుమారుడికి ఫోన్ చేసి చెల్లిని పంపించాలని చెప్పింది. గతేడాది ఫిబ్రవరిలో తండ్రి, కొడుకు బాలికను ఒంగోలు బస్టాండులో వదిలేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఇంటికి చేరిన బాలిక కొద్దిరోజులకు జ్వరం, వాంతులతో అస్వస్థతకు గురైంది. తల్లి వైద్యపరీక్షలు చేయించగా గర్భిణిగా తేలింది. ప్రశ్నించగా.. జరిగిందంతా వివరించింది. తల్లి ఫిర్యాదు మేరకు పమిడిముక్కల పోలీసులు ఆ యువకుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ నిందితుడిని అప్పట్లోనే పెంట్లూరులో అరెస్టు చేశారు. స్పీడ్ ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణ పూర్తయింది. విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వి.భవానీ సోమవారం తీర్పు వెలువరిస్తూ.. బాధ్యుడైన యువకుడికి మరణించేంత వరకు జైలుశిక్ష, రూ.6 వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.30 వేలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి బాలికకు రూ.5 లక్షల సాయం త్వరగా అందేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు.

పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. పురపాలక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అనంతపురం ఆర్డీని విచారణాధికారిగా నియమించారు. పుత్తూరు తహసీల్దారు సైతం విచారణ జరిపారు. ఆయన అక్రమంగా కుల ధ్రువీకరణపత్రం పొందారని తేలడంతో హరిని ఆ పదవి నుంచి తొలగించారు. రాజకీయకక్ష సాధింపుతోనే తనపై ఫిర్యాదు చేశారని హరి ఆరోపించగా.. అందుకు సంబంధించిన ఆధారాలేవీ ఆయన సమర్పించలేదు.

ఫ్రీహోల్డ్ భూములపై విచారణకు మరో నెల గడువు

- రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఏకు సంబంధించిన భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చడం, భూ ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై విచారణ గడువును మరో నెల రోజులు పొడిగిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణకు ఇంతకుముందు మూడు నెలల గడువు ఇచ్చారు. ఆ కాలపరిమితి సోమవారంతో ముగిసింది. ఇప్పటికీ విచారణ ముగించి సంబంధిత నివేదికలు సమర్పించనందున విచారణ గడువు పొడిగించారు. అలాంటి భూముల రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా ఇంతకుముందే నిలిపివేశారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన పత్రాలకు క్రమసంఖ్య కేటాయించవద్దని గతంలోనే ఆదేశించారు. అవి కొనసాగుతాయి. జిల్లా కలెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని సాయిప్రసాద్ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

జైల్లో ఉన్నది తొమ్మిది నెలలేగా!

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఉత్తర్వులిచ్చింది.

ఆ ఒక్క కారణంతోనే బెయిల్ నిరాకరించారు

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ.. 'ఇందులో పిటిషనర్‌కు ప్రస్తుతం పరారీలో ఉన్న ఏ7 (ముప్పిడి అవినాష్‌రెడ్డి)తో సన్నిహిత సంబంధాలున్నాయన్న ఒకే ఒక్క కారణంతో హైకోర్టు బెయిల్ తిరస్కరించింది. పరారీలో ఉన్న అతను ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంటే కోర్టు కొట్టేసింది. పిటిషనర్ దీర్ఘకాలంగా నిర్బంధంలో ఉన్నందున బెయిల్ మంజూరు చేయండి' అని కోరారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ.. ఆరోపణల ప్రకారం మీరు ఎంత సొమ్ము చేసుకున్నారని ప్రశ్నించారు. రూ.732 కోట్లని నాగముత్తు బదులిచ్చారు. జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ రూ.700 కోట్లకు రాజ్ కెసిరెడ్డి లోపలున్నది 9 నెలలే కదా అని వ్యాఖ్యానించారు. సీజేఐ స్పందిస్తూ 'మీరేం (రాజ్ కెసిరెడ్డి) చిన్నస్థాయి వ్యక్తి కాదు. అధికారంలో ఉన్నప్పుడు అత్యంత ముఖ్యమైన స్థానంలో ఉన్నారు. భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు.. దర్యాప్తు తర్వాత మీపై కచ్చితమైన ఆరోపణలున్నాయి' అని పేర్కొన్నారు. తాము కేసు మెరిట్స్ జోలికి పోవడం లేదని, ఇప్పుడు తమ వాదనంతా ఈ కేసులోని ప్రధాన నిందితులందరికీ బెయిల్ ఇచ్చి, తమకు ఇవ్వలేదన్నదానిపైనే అని నాగముత్తు చెప్పారు. మేం కొందరు నిందితులకు బెయిలిచ్చాం కానీ వారంతా చిన్న చేపలు అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఏ34పై పిటిషనర్ కంటే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని, అయినా బెయిల్ వచ్చిందని గుర్తుచేశారు. సీజేఐ బదులిస్తూ.. ఇందులో మీరే ప్రధాన కుట్రదారు.. ఓఎఫ్ఎస్ కేటాయింపులను ప్రభావితం చేసి, అనుకూల బ్రాండ్లను ప్రమోట్ చేసి నెలకు రూ.50-60 కోట్ల లంచాలు వసూలు చేశారని పేర్కొన్నారు. మిగతా నిందితులపైనా దాదాపు అలాంటి ఆరోపణలే ఉన్నాయన్న నాగముత్తు వాదనలతో ఆయన విభేదించారు. మీరు రూ.732 కోట్లు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలున్నాయని గుర్తుచేశారు.

రూ.750 కోట్లు డొల్ల కంపెనీలో దాచారు

జస్టిస్ బాగ్చి స్పందిస్తూ 'మీరు రూ.750 కోట్లు దాచిన షెల్ కంపెనీని ఏ7 (అవినాష్‌రెడ్డి) ద్వారా మీరే నేరుగా నియంత్రిస్తున్నారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. దాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఏ6, ఏ34లతో పోలిస్తే మీ పరిస్థితి పూర్తి భిన్నం' అన్నారు. కెసిరెడ్డి కంటే తీవ్రమైన ఆరోపణలు ఉన్నవారికి బెయిల్ వచ్చిందని నాగముత్తు మరోసారి చెప్పుకొచ్చారు. సీజేఐ దాంతో విభేదిస్తూ.. కొన్ని రోజులు వేచి ఉండండని సూచించారు. 'ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయమని చెప్పండి. పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలూ లేవని నిరూపిస్తాం' అని నాగముత్తు వాదించారు. సీజేఐ స్పందిస్తూ 'మీరు మహా అయితే ఇతరులకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసేలా ఆధారాలు చూపొచ్చు. అంతమాత్రాన మీకు బెయిల్ ఇవ్వడం కుదరదు' అని స్పష్టం చేశారు. నాగముత్తు బదులిస్తూ ఇదివరకు హైకోర్టు నిందితుల బెయిల్ రద్దు చేస్తే సుప్రీంకోర్టే స్టే ఇచ్చిందని, ఈ కేసును కూడా ఆ పిటిషన్లతో జత చేయాలని కోరారు. ఆ పిటిషన్లపై ఇప్పటికే విచారణ ముగించామని ధర్మాసనం తేల్చిచెప్పింది. వారికిచ్చిన డిఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేస్తూ తిరిగి కింది కోర్టుకు వెళ్లాలని చెప్పామని, అంతవరకూ వారికి మధ్యంతర బెయిల్ మాత్రమే పొడిగించామని జస్టిస్ బాగ్చి గుర్తుచేశారు.

సోమవారానికి శుక్రవారానికి ఏం మారిపోతుంది?

ఈ పిటిషన్‌లో మెరిట్స్‌పై వాదనలు వినిపించడానికి తనకు కొంత సమయం కావాలని, అందువల్ల శుక్రవారానికి వాయిదా వేయాలని నాగముత్తు కోరారు. సోమవారం- శుక్రవారాల మధ్య తేడా ఏం ఉంటుంది, వాదించాలనుకుంటే ఇప్పుడే వాదించండని సీజేఐ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని, మళ్లీ కొత్తగా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండని తేల్చిచెప్పారు. కనీసం తన కోసమైనా మంగళవారం లేదా మరేదైనా రోజు విస్తృతంగా వాదనలు వినాలని నాగముత్తు కోరగా ధర్మాసనం అంగీకరించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ వినతిపై నిర్ణయం తీసుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం


ఈనాడు, అమరావతి: వైద్య చికిత్సలకు ధరలను ఖరారు చేసే ముందు తమతోపాటు, నిపుణులతో సంప్రదింపులు జరపాలని కోరుతూ గత ఏడాది డిసెంబర్ 18న ప్రభుత్వానికి ఇచ్చిన వినతిపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలంటూ ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ ఇచ్చిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, తదితరులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

సామాజిక మాధ్యమాల వినియోగంపై

16 ఏళ్ల లోపు పిల్లలకు నియంత్రణ!

వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు

- మహిళల భద్రతకు అగ్రప్రాధాన్యం
- రోడ్డు ప్రమాదాలు తగ్గించాలి
- శాంతిభద్రతలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



సమావేశానికి హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 16 ఏళ్ల లోపు బాలబాలికలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిని వదిలిపెట్టొద్దని, కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీనికోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గతంలో సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పేట్రేగిపోయిన వారిని కొంత నియంత్రించగలిగామని గుర్తుచేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, అత్యంత సురక్షిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని సూచించారు. తరచూ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు.

హింసాత్మక నేరాలు తగ్గాయ్
-డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

రాష్ట్రంలో వివిధ రకాల నేరాలు, వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను డీజీపీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

■ రాష్ట్రంలో 2024తో పోలిస్తే 2025లో హింసాత్మక నేరాలు 12.09%, ప్రాపర్టీ నేరాలు 1.87%, మహిళలపై నేరాలు 4.49% తగ్గాయి. రోడ్డు ప్రమాద మరణాలు 3.41%, ఆత్మహత్యలు 4.82% పెరిగాయి.


■ డ్రోన్ పెట్రోలింగ్ సత్ఫలితాలిస్తోంది. వీటితో పలు కేసులు ఛేదించగలిగాం. సీసీ కెమెరాల వినియోగం ద్వారా ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ప్రాపర్టీ నేరాలు 39.8%, మహిళలపై నేరాలు 15.1% తగ్గించగలిగాం. నేరాల ఛేదన రేటు 8.35 శాతానికి పెరిగింది.

■ పోలీసింగ్‌లో ఏఐ వాడకం పెంచేందుకు 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరుతో 3 జిల్లాల్లో 8 మాడ్యూల్స్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం.

■ రాష్ట్రంలో ఆత్మహత్యలు స్వల్పంగా పెరిగాయి. ఎక్కువగా 30-60 ఏళ్ల వయసున్న వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కారణాలు అధ్యయనం చేస్తున్నాం.

■ ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ 'గతంలో జాతీయ స్థాయిలో జరిగే సమావేశాల్లో గంజాయి సాగు, రవాణాకు ఆంధ్రప్రదేశ్‌ను మూలకేంద్రంగా ప్రస్తావించే వారు. ఇప్పుడు గంజాయి విధ్వంసానికి, కట్టడికి ఏపీని మార్గదర్శిగా చూపుతున్నారు' అని చెప్పారు.

■ మహిళా భద్రతా విభాగం ఐజీ రాజకుమారి మాట్లాడుతూ 112 నంబరుకు శక్తియాప్‌ను ఇంటిగ్రేట్ చేశామని, ఆ యాప్‌లోకి వెళ్తే నేరుగా 112కు కాల్ చేయడానికి అవకాశముందని వివరించారు.



ముఖ్యమంత్రి కీలక ఆదేశాలివి..

▼ రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గించాలి. పోలీసు, రవాణా శాఖలు ఉమ్మడిగా కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలి.

▼ హింసాత్మక నేరాల కట్టడిలో కొన్ని జిల్లాలు మెరుగుపడాలి. మెతక వైఖరి సరికాదు. తప్పు చేస్తే శిక్ష తప్పదని చూపించేలా కఠిన చర్యలుండాలి.

▼ పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచి, నేరాల ఛేదనలో ఉపయోగించుకోవాలి.

▼ గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేసినప్పటికీ, వాటి వ్యసనపరులను విముక్తి కేంద్రాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనూ చికిత్స అందించాలి.

▼ ఆత్మహత్యలకు ఎక్కువగా కుటుంబ కలహాలే కారణమవుతున్నాయి. బాధితులను తొలిదశలోనే గుర్తించి, కౌన్సెలింగ్ ఇవ్వాలి.

▼ 108, 104 తరహాలో పోలీసింగ్‌కు సంబంధించిన విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

తాడేపల్లిలో హెలిప్యాడ్ కోసం..

స్థలం ఇవ్వలేదని బలవంతంగా లాక్కున్నారు

నాటి ముఖ్యమంత్రి అక్రమంగా నిషేధిత జాబితాలో పెట్టించారు

చాలా దస్త్రాలకు బ్యాక్ ఫైల్సే లేవు: సీఎం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. 'నాటి ముఖ్యమంత్రి తాడేపల్లిలో తన ఇంటి పక్కన హెలిప్యాడ్ నిర్మాణం కోసం ఓ వ్యక్తి నుంచి స్థలాన్ని బలవంతంగా లాక్కున్నారు. స్థలం అవసరమైతే ఓకే తీసుకోవచ్చు లేదా కొనుగోలు చేయాలి. కానీ ఆ వ్యక్తి స్థలం ఇవ్వలేదని 22ఏ(నిషేధిత జాబితా)లో పెట్టారు. చట్టాలను అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఆ భూమిని 22ఏలో పెట్టారు. ఇది ఆనాటి సర్కారు తీరుకు నిదర్శనం' అని విరుచుకుపడ్డారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. స్థలాన్ని నిషేధిత జాబితాలో పెడితే ఎందుకు మీరు పోరాడలేదని ఆ వ్యక్తిని అడిగితే 'ముందు నా ప్రాణాలు ముఖ్యం. ఎప్పటికైనా పోరాటం చేసుకోవచ్చని వదిలేశా. ఏమీ మాట్లాడలేకపోయా' అని వివరించారని చెప్పారు. బాధితుడు ఇచ్చిన రికార్డుల్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. 'ఇలాంటివి తాడేపల్లి ఒక్క చోటే కాదు. వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల జరిగింది. మౌఖిక ఆదేశాల ద్వారా నిర్ణయాలు తీసుకున్నప్పుడు దానికి కారణాలుండాలి. కొన్ని రికార్డులకు బ్యాక్ ఫైల్స్ లేవు. రెవెన్యూ దస్త్రాల్ని తారుమారు చేశారు. ఇప్పుడు పకడ్బందీగా సర్వే చేసి ఏడాదిలో అన్ని భూ రికార్డులను తప్పుల్లేకుండా తీసుకొస్తాం. క్యూఆర్ కోడ్ పెట్టాం. బ్లాక్‌చైన్ సాంకేతికతను తీసుకొచ్చి ట్యాంపరింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని సీఎం పేర్కొన్నారు.

సమర్థింపులు కావు.. రాబడి పెరగాలి

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో రాబడికి సంబంధించి సాధించింది బాగానే ఉందన్న సమర్థింపులు, సానుకూల నివేదికలు కాదు కావాల్సింది.. ఎంత రాబడి సాధించే అవకాశం ఉంది? ఎంత సాధించామనేది ముఖ్యం. అధిక ఆదాయం సాధిస్తేనే మనం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో స్థిరత్వం వస్తుంది. దీన్ని అర్థం చేసుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో సోమవారం మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఆదాయార్జన శాఖలపై ఆయన సమీక్షించారు.

సీఎం సూచనలిలా..

■ రాష్ట్రంలో జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగింది. పెట్టుబడులు వస్తున్నాయి. పోలవరం, అమరావతి నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రానికి ఎంత రాబడి రావాలో డేటా సిద్ధం చేయాలి. ఆ మేరకు వస్తుందో లేదో తనిఖీ చేయాలి. అందుకుతగ్గ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి.

■ పరిశ్రమలు, సేవారంగం, మౌలిక సౌకర్యాల కల్పన రంగాల నుంచి ఎంత మేర ఆదాయం రావాలో అంచనాలు రూపొందించి, సమన్వయం చేసుకోవాలి.

■ వ్యాపారులను వేధించొద్దు.. వారు కట్టాల్సిన పన్నులు చెల్లించేలా చూడాలి. రిజిస్ట్రేషన్లలో 25% రాబడి పెరిగింది. భూముల విలువ పెంచడంతో పాటు కొనుగోళ్లపై నమ్మకం ఏర్పడటంతో ఇది సాధ్యమైంది. వాణిజ్య పన్నులు, పట్టణాలు, నగరాల్లో వసూళ్లకు సంబంధించి 20% వృద్ధి నమోదైంది. పంచాయతీరాజ్‌లో 50% పెంచగలిగాం.

■ ఎర్రచందనం నుంచి ఆదాయం సాధించలేకపోతున్నాం. అధికారులు పరిష్కారాలు వెతకాలి.

రూ.83,500 కోట్లు సాధించాం..

● సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఇచ్చిన ప్రజంటేషన్‌లో పలు వివరాలు వెల్లడించారు.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడి లక్ష్యం ప్రత్యేక మార్జిన్‌తో కలిపి రూ.1,34,208 కోట్లు కాగా, జనవరి నెలాఖరు వరకు రూ.83,500 కోట్లు వచ్చాయి.

● కిందటి ఏడాదితో పోలిస్తే జీఎస్టీలో 3%, స్టాంపులు-రిజిస్ట్రేషన్లలో 27%, రవాణాలో 6%, గనుల్లో 33% అధికంగా రాబడి సాధించాం

● ఆర్థిక సంఘం గ్రాంట్లు కిందటి ఏడాది కన్నా 16% అధికంగా వచ్చాయి.

ఇకపై ప్రతి నెలా మంత్రులు, కార్యదర్శుల సమావేశం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నెలకొకసారి మంత్రులు, కార్యదర్శుల సమావేశం ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. దీనికి వర్చువల్‌గా కలెక్టర్లు, ఆర్డీవోలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగులు పాల్గొంటారని వివరించారు. 'మూడు నెలలకొకసారి కలెక్టర్ల సమావేశం ఉంటుంది. ఏడాదికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై నెల, త్రైమాసికాల వారీగా సీఎం సమీక్షిస్తారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరు.. సకాలంలో నిధుల విడుదలపై చర్చిస్తారు. వివిధ పథకాలకు జిల్లా స్థాయిలో ఖర్చు తీరు, జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్, శాంతిభద్రతలపై చర్చించి దిశానిర్దేశం చేస్తారు' అని వివరించారు.



ఈ విషయాలను పాటించండి

చాలా మంది తేలిగ్గా తీసుకునే కొన్ని అలవాట్లను మీరు కచ్చితంగా పాటించండి. అవి.. ✦ డబ్బు సంబంధ విషయాలను అధ్యయనం చేయడం ✦ ప్రతి నెలా తప్పక పొదుపు, మదుపు చేయడం ✦ ఆ అలవాట్లను దీర్ఘకాలం కొనసాగించడం ✦ మీరు కోరుకునే జీవితం కోసం కెరీర్ ప్రారంభంలోనే ప్రణాళిక వేసుకోవడం.. ఈ అలవాట్లు దీర్ఘకాలంలో మీ ముందు అద్భుతాలు సృష్టిస్తాయి.

– జాన్ హెన్రీ, ఇన్వెస్టర్

ప్రతి 5 ఏళ్లకూ తలసరి ఆదాయం రెట్టింపవ్వాలి

ఏ ఒక్కరి నిర్లక్ష్యంతోనూ రాష్ట్రం దెబ్బ తినకూడదు

- ఐఏఎస్ పూర్తిచేశాం.. అన్నీ తెలుసని కాకుండా నిరంతరం నేర్చుకోవాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: ప్రతి ఐదేళ్లకూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో జాతీయ ఆర్థిక సర్వే, జీఎస్‌డీపీ, జీడీపీలపై చర్చించారు. సీఎం మాట్లాడుతూ.. "గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14% వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని, వడ్డీ తగ్గించుకునేలా రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నాం. 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు ఒకటో తేదీన ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు దాన్ని గాడిలో పెట్టాం. సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో కుంకుమపువ్వు ఉత్పత్తికి అవకాశాలున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు చేస్తున్నాం. కాఫీ సాగు పెంచడంతో పాటు అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాం" అని వెల్లడించారు.

సలహాలు ఇవ్వడం కాదు.. చేయాలి

"విభాగాధిపతులు సలహాలివ్వడం కాదు.. ఏం చేశారో చూపించి సలహాలిస్తే.. మేము సైతం అమలు చేస్తాం. సలహా ఇచ్చేసి వెళ్లిపోతే నిధులు లేవు. సూపర్ సిక్స్‌తో పాటు కొన్ని హామీలిచ్చాం. అవన్నీ చేయాలి. ఒక తేదీ ప్రకారం పథకాలు అమలు చేయాలి. చేయకపోతే మా క్రెడిబులిటీ పోతుంది. ఐఏఎస్ పూర్తిచేసి వచ్చాం.. మాకు అన్నీ తెలుసు అని కాకుండా నిరంతరం నేర్చుకోవాలి. ప్రజాప్రతినిధుల కంటే మెరుగ్గా పనిచేయాలి. ఎవరెవరు సరిగా పనిచేయడం లేదో నా దగ్గర వివరాలున్నాయి. అవగాహన లేకపోయినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఫలితాలు రావు. ప్రతిఒక్కరూ నేర్చుకోవాలి. ఏ ఒక్కరి నిర్లక్ష్యం, తెలియనితనం వల్ల రాష్ట్రం దెబ్బ తినకూడదు" అని పేర్కొన్నారు.

తెదేపా ప్రభుత్వంలోనే అధికం..

◆ 2014-15 నుంచి 2025-26 వరకు పదేళ్ల జీఎస్‌డీపీ పరిశీలిస్తే వృద్ధిరేటు 2015-16, 2017-18, 2025-26లలో అధికంగా ఉంది.

◆ 2015-16లో వృద్ధిరేటు 12.16% ఉండగా.. ఇప్పుడు 9.88%.

◆ ఏపీ తలసరి ఆదాయం 2025-26 ముందస్తు అంచనాల ప్రకారం రూ.2,94,507 ఉంది.

◆ 2019-24 సమయంలో జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.5% తగ్గింది. దీంతో రూ.70 వేల కోట్ల ఆదాయం తగ్గింది.

◆ 2047 నాటికి తలసరి ఆదాయం రూ.54,60,748కి చేరాలి. ఇది 2029-30 నాటికి రూ.5,74,769గా ఉండాలి

విశాఖ టాప్..

● జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తిలో 2025-26లో విశాఖపట్నం మొదటి స్థానంలో ఉండగా.. రెండు, మూడు స్థానాల్లో ఎన్టీఆర్, కృష్ణా ఉన్నాయి.

● అట్టడుగు నుంచి మూడు స్థానాల్లో పోలవరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి.

● విశాఖపట్నం తలసరి ఆదాయం 2025-26లో రూ.6,58,091 ఉండగా.. అట్టడుగున ఉన్న పార్వతీపురం మన్యం తలసరి ఆదాయం 1,56,977గా ఉంది.

● అన్నమయ్య జిల్లా తలసరి ఆదాయంలో 22వ స్థానంలో ఉంది. తెలుగుగంగ నీళ్లు తీసుకువెళ్లినా గతేడాది కంటే ఇప్పుడు రెండు స్థానాలు కిందకు పడిపోయింది.

● రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం పీ4. మార్గదర్శులు, బంగారు మిత్రలను నియమించుకోవాలి. వారి ద్వారా పేద కుటుంబాలను ఆదుకోవాలి.

ఉగాది నుంచి పాఠశాలల్లో డిజిటల్ గ్రీన్ టెక్నాలజీ పార్కులు

ఈనాడు, అమరావతి: ఉగాది నుంచి పాఠశాలల్లో గ్రీన్ కవర్ కోసం దేశీయ మొక్కల పెంపకంపై కార్యాచరణ రూపొందించాలి. అన్ని బడుల్లో అటవీ శాఖతో కలిసి డిజిటల్ గ్రీన్ టెక్నాలజీ పార్కులను ప్రారంభించాలి. ఎకరం లెక్కన ఇందుకయ్యే వ్యయాన్ని అంచనా వేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూరగాయలు కొనేందుకయ్యే ఖర్చును ఈ పార్కులు నిర్వహించే వారికి ఇవ్వడం సాధ్యమవుతుందేమో పరిశీలించాలి. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను కూడా వీటి నిర్వహణలో భాగస్వాములను చేయాలి. పరిశ్రమల సహకారం తీసుకోవాలి' అని సీఎం సూచించారు.

● తీర ప్రాంతంలో కోత నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాజెక్టు అభినందనీయమని సీఎం ప్రశంసించారు. సముద్రపు ఒడ్డున ఆర్కిడ్స్ సాగు ద్వారా రైతులకు ఆదాయం రావడంతో కోత నివారించవచ్చని సూచించారు.

విద్యార్థుల ఆత్మహత్యలు ఉండకూడదు

● విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. ఇవి తగ్గాలంటే విద్యార్థులతో కలెక్టర్లు తరచూ సమావేశం కావాలి. పరీక్షలంటే ఒత్తిడి లేని విధంగా కార్యాచరణ ఉండాలి. ● పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు కావాలి. ● వయోజనవిద్యలో మెరుగైన ఫలితాల సాధనకు డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. వీరిలో చైతన్యం కలిగించేందుకు ప్రతి ఆరు నెలలకు ఓ కార్యక్రమం చేపడదాం. ● ఏ రైతూ బలవన్మరణానికి పాల్పడకూడదు. ఒకవేళ ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడితే. ఆడిట్ చేయండి. ఎక్కడైనా మన లెక్కల్లో తప్పు ఉంటే, వాటిని సరిదిద్ది రైతుల్లో ఆత్మస్థైర్యం తీసుకొద్దాం. ● రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ చేసేందుకు మైక్రో ఇరిగేషన్ ఆటోమేషన్ విధానం అమలు చేస్తున్నాం.

చాలా సమస్యల్ని పరిష్కరించాం... ఫలితాలు కనిపిస్తున్నాయి

కలెక్టర్లు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి: సీఎం

ఈనాడు, అమరావతి: నిధుల కొరత ఎదుర్కొనే రహదారులు, సాగు నీటి ప్రాజెక్టులు, పర్యాటక ప్రాజెక్టులు, తదితర నిర్మాణాలను వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, పీపీపీ విధానంలో చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'సమావేశం ద్వారా అన్ని అంశాలపై పూర్తి స్పష్టత నిచ్చాం. దీని ఆధారంగా కలెక్టర్లు పనిచేస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది. 'వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులన్నీ పూర్తిగా వినియోగించాలి. మరిన్ని నిధులను కేంద్రం నుంచి తెచ్చుకోవాలి. నిధులు లేవనేది సాకు మాత్రమే. మనసుంటే మార్గం ఉంటుంది. ఇప్పటికే చాలా సమస్యల్ని అధిగమించి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను ముందుకు తీసుకెళుతున్నాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. అధికారులందరూ అశ్రద్ధ లేకుండా పాజిటివ్‌గా పనిచేస్తే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయి. తరచూ సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి. వాటికి తగ్గట్టు చర్యలు తీసుకోవాలి' అని దిశానిర్దేశం చేశారు.

వసతిగృహాల్లో ఆహారం, నీరు కలుషితమైతే సీరియస్‌గా తీసుకుంటాం

ఏప్రిల్ నుంచి జనాభా మేనేజ్‌మెంట్ పాలసీ అమలు

- ఆందోళనకరంగా సిజేరియన్లు..
- సాధారణ ప్రసవాలు పెరగాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: 'జనాభా మేనేజ్‌మెంట్ పాలసీని వచ్చే నెలలో ప్రణాళిక, వైద్యఆరోగ్యశాఖలు రూపొందించాలి. ఏయే ప్రోత్సాహకాలు ఇవ్వాలనేది సిద్ధం చేయాలి. వీలైతే ఈ పాలసీని అసెంబ్లీ సమావేశాల్లోనే పెట్టండి. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ పాలసీని అమలు చేద్దాం. దీనిని ప్రతి మూడు నెలలకు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేద్దాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సుల్లో 'స్వర్ణాంధ్ర-2047కి పది సూత్రాల'పై ఆయాశాఖల కార్యదర్శులు ప్రజంటేషన్ ఇచ్చిన సందర్భంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. యూరప్‌లోని 20 దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరిగిపోయిందని, కనీసం సామాజిక వేడుకలు కూడా నిర్వహించుకోవడంలేదని పేర్కొన్నారు. మన వద్ద జనాభా మేనేజ్‌మెంట్ పాలసీతో సంతానోత్పత్తి పెంచాల్సి ఉందని తెలిపారు. ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఆందోళనకరంగా ఉన్నాయని, వాటిని తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

అన్నింటా పోషకాహారం అందించాలి: మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాల్లో కూడా పోషకాహారం అందేలా చూడాలి.

▼ అన్న క్యాంటీన్లలో పెట్టే ఆహారంతో కార్బోహైడ్రేట్లు పెంచేస్తున్నారు. అక్కడ కూడా పోషకాహారం అందించడంపై దృష్టి పెట్టండి. అవిస, మునగ, వివిధ ఆకుకూరల్లో సమృద్ధిగా పోషకాహారం లభిస్తుంది.

వసతిగృహాల్లో కలుషిత ఆహారంపై మంత్రి, కార్యదర్శిదే బాధ్యత: కలుషిత ఆహారం, నీరుతో వసతిగృహాల విద్యార్థులు ఆసుపత్రుల్లో చేరాల్సిన పరిస్థితి రాకూడదు. సంక్షేమశాఖలన్నీ అప్రమత్తంగా ఉండాలి.

▼ పునరావృతమైతే మంత్రి, కార్యదర్శి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. నిరంతరం జరిగితే సీరియస్‌గా తీసుకోవాల్సి వస్తుంది.

▼ జూన్‌కు కుటుంబ ఆరోగ్యకార్డులు, వ్యక్తిగత ఆరోగ్యకార్డులు అందుబాటులోకి తీసుకురావాలి.

వచ్చే ఏడాది ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ఏపీ: మౌనాన్ని వీడండి.. ఎయిడ్స్ గురించి మాట్లాడండి.. అని ఎప్పుడో చెప్పాను. వచ్చే ఏడాదికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటించనున్నాం. దీనిని సాధించేందుకు 25 ఏళ్లు పట్టింది. ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడంతో ఇది సాధ్యమైంది.

నెలలో 3, 4 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

■ మీ శాఖలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రతి శాఖ మంత్రి, కార్యదర్శి, శాఖాధిపతులు నెలలో మూడు, నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.

■ వేసవిలో ఎక్కడా నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఇప్పటినుంచే వేసవి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.


■ రాష్ట్రంలో 38,608 చెరువులున్నాయి. వేటిలో నీరుందని తెలుసుకునేందుకు శాటిలైట్ డేటా తీసుకోండి. దీని ద్వారానే ఆక్రమణలు ఎన్ని ఉన్నాయనేది కూడా గుర్తించాలి. చెరువులో పూర్తిస్థాయిలో నీరు నింపితే.. సగం ఆక్రమణలు పోతాయి.

■ గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే.. ఈసారి 0.63 శాతం భూగర్భజలాలు పెరిగాయి. ఈసారి ఖరీఫ్‌నకు మే 15న నారుమళ్లు వేసుకోవాలి. జూన్ నుంచి రెగ్యులర్‌గా నీరివ్వాలి. ఖరీఫ్ అయ్యేనాటికి 60 శాతం నీరు అందుబాటులో ఉండాలి.

■ పంచాయతీరాజ్‌లో నీటిసంరక్షణ చర్యలు, రోడ్లు, గోకులం షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలి.

అగ్రభాగాన విజయవాడ పశ్చిమ.. అట్టడుగున గుంటూరు పశ్చిమ

పనితీరు ఆధారంగా నియోజకవర్గాలకు గ్రేడింగ్



వివిధ అభివృద్ధి సూచికల ఆధారంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రభుత్వం కేటాయించిన గ్రేడ్‌లలో విజయవాడ పశ్చిమ మొదటి స్థానంలో నిలిచింది. జనవరి నెల వరకు సేకరించిన డేటా ఆధారంగా పనితీరును ప్రభుత్వం మదింపు చేసింది. మొత్తంగా ఏ+ గ్రేడ్‌లో 21, ఏ- గ్రేడ్‌లో 153 నియోజకవర్గాలు నిలవగా, కేవలం గుంటూరు పశ్చిమ ఒక్కటే బి- గ్రేడ్‌లో ఉండటం గమనార్హం. రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ నియోజకవర్గాల వారీగా గ్రేడ్‌లను వెల్లడించారు.

ఇదీ గ్రేడింగ్ ప్రాతిపదిక

పనితీరు ఆధారంగా స్కోర్ 90% కంటే ఎక్కువ సాధించిన నియోజకవర్గాలకు ఏ+ గ్రేడ్, 89%-75% ఉంటే ఏ- గ్రేడ్, 74%-50% మధ్య ఉంటే బి- గ్రేడ్ కేటాయించింది. దేశంలో మొదటిసారిగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ) విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఎమ్మెల్యే, ప్రత్యేక అధికారి, నాలెడ్జ్ పార్టనర్, యంగ్ ప్రొఫెషనల్‌తో పాటు మరో ఐదుగురు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని నియమించారు. ఆయా నియోజకవర్గాల్లో అన్ని శాఖల లక్ష్యాలు, సాధన ఆధారంగా పాయింట్లు కేటాయించారు. మొత్తం 685 సూచికలు ఉండగా.. కొన్ని నియోజకవర్గాలకు కొన్ని సూచికలు మాత్రమే వర్తిస్తాయి. లక్ష్యాలను చేరుకున్న తీరును బట్టి వాటికి స్కోర్ ఇచ్చి, గ్రేడ్‌లు కేటాయించారు. వివిధ రంగాలతో పాటు ఫిర్యాదుల పరిష్కారం, పీ4, అభివృద్ధి పనులను పరిగణనలోకి తీసుకున్నారు.

ఏ+ గ్రేడ్‌తో ఉత్తమ పనితీరు కనబరిచిన 13 నియోజకవర్గాలు..

జిల్లా	నియోజకవర్గం	సూచికలు	స్కోర్
ఎన్టీఆర్	విజయవాడ పశ్చిమ	69	93
విశాఖపట్నం	గాజువాక	78	92
కాకినాడ	కాకినాడ సిటీ	77	92
ఎన్టీఆర్	విజయవాడ తూర్పు	75	91
శ్రీసత్యసాయి	హిందూపురం	141	91
శ్రీసత్యసాయి	పెనుగొండ	134	91
విశాఖపట్నం	విశాఖపట్నం పశ్చిమ	69	91
అనకాపల్లి	మాడుగుల	132	91
కాకినాడ	పిఠాపురం	129	91
కోనసీమ	రామచంద్రాపురం	108	91
కాకినాడ	జగ్గంపేట	126	91
తూర్పు గోదావరి	గోపాలపురం (ఎస్సీ)	134	91
ఏ- గ్రేడ్‌లో అట్టడుగు నియోజకవర్గాలు..			
ప్రకాశం	కొండపి (ఎస్సీ)	126	79
ప్రకాశం	కందుకూరు	137	78
నెల్లూరు	కావలి	139	78
ప్రకాశం	ఒంగోలు	122	77
బి- గ్రేడ్‌లో..			
గుంటూరు	గుంటూరు పశ్చిమ	127	73

ఇంకా 55% సేవలు ఆఫ్‌లైన్‌లోనేనా?

అధికారుల తీరుపై సీఎం అసహనం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ శాఖలు ఇప్పటికీ ఆఫ్‌లైన్‌లోనే 55 శాతం సేవలు అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు, ప్రభుత్వ విభాగాధిపతులు సాంకేతికతను భూతంలా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులో ఉన్నా.. ఇంకా కొన్ని శాఖలు పాతకాలం విధానాలనే అనుసరిస్తున్నాయని ఆక్షేపించారు. సాంకేతికతపై ప్రతి ప్రభుత్వ శాఖ హెచ్‌వోడీ దృష్టి పెట్టాలని, ఈ ఏడాది మార్చి నాటికి ఆన్‌లైన్‌లో సేవల విషయంలో అన్ని ప్రభుత్వ శాఖలు స్పష్టమైన పురోగతి చూపాల్సిందేనని నిర్దేశించారు. అప్పుడే స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ సాధ్యమవుతుందన్నారు. సచివాలయంలో మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆర్టీజీఎస్, డేటా లేక్, అవేర్ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడారు.

■ మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ అమలు చేస్తున్నా.. ప్రజలను ఇంకా ఎందుకు కార్యాలయాలకు రప్పించుకుంటున్నారు? వాట్సప్ గవర్నెన్స్‌లో దేవాదాయ శాఖ చాలా వెనుకబడింది. కనీసం దర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఉంచకపోతే ఎలా? ■ వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలి. దీనికోసం మీసేవ నిర్వాహకులను వినియోగించుకునే అంశాన్ని పరిశీలించండి. ■ అన్ని ప్రభుత్వ విభాగాలు ఏఐ యూజ్ కేసులకు డబ్బులు ఖర్చు చేయడానికి అనుమతులిచ్చేలా ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేయాలి. ■ ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో బ్లాక్ చైన్ టెక్నాలజీతో అందుబాటులో ఉంటాయి. డేటా లేక్‌లో ఉన్న ఈ ధ్రువీకరణలను మళ్లీ ఏ ప్రభుత్వ శాఖా అడగక్కర్లేదని ఉత్తర్వులు జారీ చేయాలి. ■ క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమాన్ని 6.12 కోట్ల మంది ఆన్‌లైన్‌లో చూశారు. 'క్వాంటమ్ సాంకేతికత ఆధారంగా మొదటి అప్లికేషన్ రూపొందించాం. క్వాంటమ్ డిక్రిప్షన్ పాస్‌వర్డ్‌లు బ్రేక్ చేయలేం. ఇదే విధానాన్ని అన్ని అప్లికేషన్లు, వెబ్‌సైట్లకు అనుసరిస్తాం. అవేర్ అప్లికేషన్ డేటా ఎనాలసిస్ ద్వారా ఈ ఏడాది ఎల్‌నినో సంవత్సరంగా గుర్తించాం. వర్షాలు తక్కువగా, ఆకస్మిక వరదలు, వడగాడ్పులు అధికంగా ఉంటాయి' అని వివరించారు.

గుత్తేదారు సంస్థపై సీఎం ఆగ్రహం

అవేర్ ద్వారా అందించే సేవల గురించి ఐటీ శాఖ కార్యదర్శి వివరిస్తూ.. రిజర్వాయర్‌లో నీటిమట్టం తెలుసుకునే సెన్సర్లు ఇంకా కొన్ని చోట్ల ఏర్పాటు కాలేదన్నారు. రిజర్వాయర్లు మారుమూల ప్రాంతంలో ఉండటంతో కొన్ని చోట్ల సెన్సర్లు అమర్చడంలో అహ్మదాబాద్‌కు చెందిన గుత్తేదారు సంస్థ ఆలస్యం చేస్తోందని సీఎంకు అధికారులు వివరించారు. దీంతో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రిజర్వాయర్ సెన్సింగ్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను పిలిపించి, పనులు వెంటనే పూర్తి చేయాలని చెప్పండి. వాళ్లు రాకుంటే పోలీసులను పంపి గట్టి చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

అమ్మవారని తలచి.. కోవెల నిర్మించి!



ఆలయం ముందు అల్లింబీ

దేవతామూర్తులకు పూజలు చేస్తున్న షేక్ అల్లింబీ

అమ్మవారిపై భక్తితో ఏకంగా గుడి నిర్మించి పూజిస్తున్నారు నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన షేక్ అల్లింబీ. గుంటూరు జిల్లా రేవేంద్రపాడుకు చెందిన అల్లింబీకి చిన్నప్పటి నుంచి అమ్మవారు అంటే బాగా నమ్మకం. ఆమె గ్రామంలోని ఇంటి వద్దే పండ్ల దుకాణం నిర్వహిస్తుండేవారు. రెండేళ్ల క్రితం దుకాణ ప్రాంగణంలో పెద్ద చీమల పుట్ట ఏర్పడింది. అది రేణుకా అమ్మవారి రూపంలో ఉండడంతో దుకాణం తీసేసి ఓ మందిరం కట్టించారు. అమ్మవారి విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్య పూజలతో పాటు పర్వదినాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తమ కుటుంబం ముస్లిం పండగలతోపాటు హిందూ ఉత్సవాలను సైతం ఆచరిస్తుందని అల్లింబీ చెబుతున్నారు. - న్యూస్‌టుడే, రేవేంద్రపాడు(దుగ్గిరాల)

మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు ఆర్ఎఫ్‌పీ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: మచిలీపట్నంలో నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రం ఏర్పాటుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్-ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ఏపీ మారిటైం బోర్డుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) విధానంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు అనుమతించాలని మారిటైం బోర్డు సీఈవో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ● మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ సుమారు రూ.1,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సుమారు 200 ఎకరాల భూమి కేటాయించాలని కోరింది. ● యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. ● ఇప్పటికే రూ.4,735.18 కోట్ల వ్యయంతో మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటిలో రూ.1,761 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 2026 డిసెంబరు నాటికి పోర్టు కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మృత్యుగంటలు!



పగలు పెద్ద సంఖ్యలో వాహనాలు పరుగులు పెడుతుంటాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రోడ్లు.. ఇలా ఎటువంటి రహదారుల్లోనైనా పగలే వాహన రద్దీ ఎక్కువగా ఉంటుంది.

కానీ ప్రమాదాలు మాత్రం సాయంత్రం తర్వాత ఎక్కువ జరుగుతున్నాయి.

రోజులో ఉండే 24 గంటలను.. ప్రతి మూడు గంటల చొప్పున విభజించి.. ఏయే సమయాల్లో యాక్సిడెంట్లు జరిగాయనేది అధికారులు పరిశీలిస్తారు. ఇందులో కొన్నేళ్లుగా ఏటా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య జరిగే ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నట్లు నమోదవుతోంది.

● 2023లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య రాష్ట్రంలో అత్యధికంగా 4,255 ప్రమాదాలు జరిగాయి.

● 2024లో సైతం ఎక్కువగా ఆ సమయంలోనే 4,282 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

● 2025లో అక్టోబరు వరకు పరిశీలిస్తే అదే వేళలో 3,330 ప్రమాదాలు జరిగాయి.

మే, జూన్ నెలల్లో..

ఏడాదిలో అన్ని నెలలతో పోలిస్తే.. మే, జూన్ నెలల్లో ఎక్కువ ప్రమాదాలు, మరణాలు చోటుచేసుకుంటున్నాయి. 2023లో ప్రతినెలా సగటున 1,662 చొప్పున ప్రమాదాలు జరగ్గా.. మేలో అత్యధికంగా 1,951 ప్రమాదాలు, జూన్‌లో 1,785 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో మేలో 794 మంది, జూన్‌లో 744 మంది ప్రాణాలు కోల్పోయారు.

నేరుగా ఉన్న రోడ్లపై...

సాధారణంగా మలుపులు ఉన్న రోడ్లలో ప్రమాదాలు ఎక్కువని అనుకుంటాం. కానీ అత్యధిక ప్రమాదాలు ఎలాంటి మలుపులు లేని స్ట్రైట్ రోడ్లపై ఎక్కువగా జరుగుతున్నాయి. 2023లో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. నేరుగా ఉండే రోడ్లలో అత్యధికంగా 15,641 ప్రమాదాలు జరిగి 6,313 మంది చనిపోయారు. వంతెనల వద్ద 762 ప్రమాదాలు జరిగి, 302 మంది మరణించారు.

ఎందుకిలా..?

● సాయంత్రం వెలుతురు పోయి చీకటిపడిన తర్వాత పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. ముఖ్యంగా డివైడర్లు లేకుంటే... రెండు వరుసలు, ఒక వరుసతో ఉండే రహదారుల్లో మరింత ప్రమాదకరం. అయినా సరే వాహనదారులు సాయంత్రం 6 గంటల వరకు ఎంత వేగంగా వాహనాన్ని నడిపారో అదే వేగాన్ని చీకటిపడిన తర్వాత కూడా కొనసాగిస్తూ దూసుకెళ్లడమే కారణమని నిపుణులు చెబుతున్నారు.

● హైవేలు, ప్రధాన రహదారుల పక్కన అనేకచోట్ల వాహనాలు నిలుపుతారు. దగ్గరకు వచ్చే వరకు అవి కనిపించవు. వాటిని గమనించే సరికి... ఆకస్మికంగా ఆగి ఉన్న వాహనాన్ని గుర్తించే లోపే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హైవేపై ముందు వెళ్తున్న వాహనాన్ని కుడివైపు కాకుండా, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసేందుకు చూస్తుంటారు. ఇలా చేసే సమయంలో, ఎడమవైపు రోడ్డు పక్కన ఆగి వున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.



● సాయంత్రం చీకటిపడే సమయంలో నగరాలు, పట్టణాల్లో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే ఉద్యోగులు, ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, పట్టణాల్లో పనులు ముగించుకుని పల్లెకు వెళ్లే గ్రామీణ ప్రజలు ఎక్కువగా ఉంటారు. ప్రమాదాలు సాయంత్రం తర్వాత ఎక్కువగా జరగడానికి ఇదీ ఒక కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

● గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, మేకలు, గొర్రెలను మేతకు తీసుకెళ్లి.. సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకెళ్తుంటారు. వాటిని తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

అంతా బాగున్నప్పుడే...

సాధారణ వాతావరణంలో, వర్షం పడుతున్న వేళ, మంచు కురిసే సమయం.. ఇలా ఎటువంటి వేళల్లో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనేది పరిశీలిస్తే..

● సాధారణ వాతావరణంలో 15,525 ప్రమాదాలు జరిగితే 6,204 మంది చనిపోయారు.

● వర్షం కురిసే సమయంలో 1,093 ప్రమాదాలు జరగ్గా, 426 మంది మరణించారు.

● మంచు కురుస్తున్న వేళ.. 1,556 వాహన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇందులో 700 మంది చనిపోయారు.

● వడగళ్లు పడుతున్నపుడు వాహనాలు అదుపుతప్పి ప్రయాణించడం వల్ల 101 ప్రమాదాలు జరిగి 34 మంది మరణించారు.

గత రెండేళ్లలో ఏ సమయంలో ఎన్ని ప్రమాదాలు

సమయం	2024	2025 (అక్టోబరు వరకు)
ఉదయం 6 నుంచి 9 గంటల వరకు	2,168	1,566
ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గం.వరకు	2,800	2,236
మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు	2,968	2,292
మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గం.వరకు	3,436	2,767
సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు	4,282	3,330
రాత్రి 9 నుంచి 12 గంటల వరకు	2,029	1,756
అర్ధరాత్రి 12 నుంచి 3 గంటల వరకు	915	647
తెల్లవారుజామున 3 నుంచి ఉ.6గంటల వరకు	959	858

- ఈనాడు, అమరావతి

బడ్జెట్ సమావేశాల తొలిరోజు సభకు వైకాపా సభ్యులు

ఈనాడు, అమరావతి: బడ్జెట్ సమావేశాల తొలిరోజైన బుధవారం సభకు హాజరుకావాలని వైకాపా నిర్ణయించింది. ఆ రోజున ఉదయం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు సభకు వెళ్లాలని ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. గతేడాది కూడా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన రోజు మాత్రమే వైకాపా అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. అప్పుడు సభలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసి, మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు కూడా గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో వారు సభకు వస్తున్నారు. తర్వాత సమావేశాలకు హాజరవుతారా లేదా అనే విషయమై స్పష్టత లేదని వైకాపా వర్గాలు తెలిపాయి.

ఏపీ వైద్య మండలి ఎన్నికల్లో 55% పోలింగ్

నేడు ఓట్ల లెక్కింపు

ఈనాడు, అమరావతి: ఏపీ వైద్య మండలి (ఏపీఎంసీ) ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఉదయం 8 గంటల నుంచి మొదలై.. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉండగా.. సర్వర్ మొరాయించడంతో మూడు గంటల పాటు సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో ఓటర్లకు ఓటీపీలు సకాలంలో వెళ్లలేదు. వైద్య సంఘాలు, ఓటర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు రాత్రి 8 గంటల వరకు ఓట్లు వేసేందుకు వెసులుబాటు కల్పించారు. పోలింగ్ ప్రక్రియ రాత్రి 8.30 గంటలకు ముగిసింది. 13 మంది సభ్యులను ఎన్నుకోవడానికి నిర్వహించిన ఈ ఎన్నికల్లో 84 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మొత్తం 56,156 మంది ఓటర్లలో 30,773 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 55 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. ఒక్కో ఓటరు 13 మంది అభ్యర్థులకు ఓట్లు వేసుకునే వీలుంది. మొత్తం 3,27,750 ఓట్లు పోలవ్వగా, వీటిలో నోటాకు 244 ఓట్లు పడ్డాయి. మంగళవారం ఉదయం తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ కార్యాలయంలో ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తామని రిటర్నింగ్ అధికారి చక్రధర్‌బాబు వెల్లడించారు.

వధువుకు 14.. వరుడికి 54

● రూ.2 లక్షలకు బేరం.. రూ.50 వేలు అడ్వాన్సు
● చిన్నాన్న సాయంతో బయటపడ్డ బాలికా వధువు

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వరకట్నాల గురించి మనం వినే ఉంటాం. అయితే ఎప్పుడో కాల గర్భంలో కలిసిపోయిన కన్యాశుల్కానికి మళ్లీ బీజం వేసిందో తల్లీ. రూ.2 లక్షలకు కన్నబిడ్డనే బేరం పెట్టింది. రూ.50 వేలు అడ్వాన్సుగా తీసుకొని 14 ఏళ్ల చిన్నారిని 54 ఏళ్ల వ్యక్తికిచ్చి వివాహం జరిపించింది. అభం శుభం ఎరుగని ఆ చిన్నారి పెళ్లికూతురు వరుడి వేధింపులు భరించలేక చిన్నాన్న సాయంతో బయటపడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఉదంతం వెనుక వివరాలివి.

● అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలికను కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు చెందిన రాజశేఖర్(54) అనే వ్యక్తికిచ్చి పది రోజుల క్రితం వివాహం జరిపించారు. బాలిక తల్లిదండ్రులు ఘర్షణ పడి కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. తండ్రికి తెలియకుండా తల్లికి ఎదురుకట్నం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుని ఇదంతా జరిపించారు. వివాహం అనంతరం వరుడి వేధింపులు తాళలేక బాలికా వధువు చిన్నాన్నకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. అతను సోమవారం పోలీసులకు ఈ విషయం చెప్పడంతో వారి సాయంతో బాలిక.. తండ్రి చెంతకు చేరింది. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా పెద్దకుమార్తెకు తల్లి వివాహం చేసిందని తండ్రి, బంధువులు చెబుతున్నారు. అన్ని అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అటువంటి మహిళలు కాఫీ తాగొద్దు

గర్భం కోసం ప్రయత్నించే మహిళలు కాఫీని త్యాగం చేయడం ఉత్తమం. ఎందుకంటే తరచూ కాఫీ సేవిస్తుంటే ఆకలి బాగా మందగిస్తుంది. దీంతో ఆహారం తీసుకోవడం తగ్గిపోతుంది. ఈ పరిస్థితితో శరీరానికి తగిన పోషకాలు అందవు. తద్వారా గర్భానికి చేటు కలిగే అవకాశం ఉంది.

- ప్రీతి కసిరెడ్డి, మామ్ ఎక్స్ 3 వ్యవస్థాపకురాలు

కొత్త రంగు అద్దుకున్న కారం!

● రాష్ట్రంలో సాగవుతున్న ఉత్తరాఖండ్ రకం ● మిరపలో బ్యాడిగ, పసుపు రకాలకు డిమాండ్

ఈనాడు, అమరావతి: కారం అంటే మనకు తెలిసింది ఎర్రగా.. ఘాటుగా ఉండేదే. పసుపు కారం గురించి విన్నారా? ఉత్తర భారతదేశంలో పండించే ఈ రకం మిరప ఇప్పుడు ఏపీ, తెలంగాణలోనూ సాగవుతోంది. మార్కెట్లో క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.42 వేల వరకు దక్కింది. ఇటీవల ధర తగ్గింది.. రూ.35 వేల లోపే లభిస్తోంది. మరోవైపు బ్యాడిగ(బైదగి) రకం మిరప క్వింటాల్‌కు రూ.50వేల నుంచి రూ.80 వేల వరకు పలుకుతోంది.

దేశంలో భౌగోళిక గుర్తింపు పొందిన మిరప రకాలు

గుంటూరు సన్నం(ఆంధ్రప్రదేశ్), ఖోలా(గోవా), హర్మాల్(గోవా), బైదగి (కర్ణాటక), ఎడయూర్ ములకు (కేరళ), భివాపూర్ (మహారాష్ట్ర), మిజో (మిజోరాం), రామంతపురం ముండు(తమిళనాడు), వరంగల్ చపాటా(తెలంగాణ)

ఎర్రటి రంగు, కాసింత కారం, కాసింత తీపి..

నక్షత్ర హోటళ్లకు వెళ్తే వెజ్, నాన్‌వెజ్ వంటకాలు ఎర్రగా కన్పిస్తుంటాయి. కానీ కారం తక్కువగా ఉంటాయి. వీటిలో ఉపయోగించేది బ్యాడిగ మిరప. అధిక రంగు, తక్కువ ఘాటు, కాసింత తీపిగా ఉండటం దీని ప్రత్యేకత. కర్ణాటకలోని బ్యాడిగ ప్రాంతంలో ఈ రకం మిరప సాగు అధికం. అందుకే ఆ పేరు వచ్చింది.

● పచ్చళ్ల తయారీలోనూ.. ఈ రకం కారాన్ని రంగు కోసం వాడుతున్నారు. ఘాటు రకాలతో కలిపి బ్యాడిగ రకం కారాన్ని వినియోగిస్తున్నారు.

కారం.. ఎన్నెన్నో రకాలు

దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన మిరప రకాలు ఎన్నో ఉన్నాయి. రంగు, ఘాటుకు అనుగుణంగా వాటి వినియోగం ఉంటుంది. బ్యాడిగ రకం మిరప బాగా ముదురు ఎరుపు రంగుకు ప్రత్యేకం.

మిరపలో రంగు, ఘాటు పరిమాణం

మిరప	రంగు (ఏఎస్‌టీఏ)	ఘాటు(%)
బైదగి	159.9	0.03%
గుంటూరు సన్నం	32.11	0.226%
కశ్మీరి చిల్లీ	54.10	0.325%

● గోళ్ల రంగులు, లిప్‌స్టిక్‌లు, నౌకలకు రంగుల్లోనూ దీన్ని వాడుతున్నారు.

● కర్ణాటకలో ఈ రకం మిరప సాగు అధికం. బైదగి అనేది హావేరీ జిల్లాలో ఉంటుంది. దాని పేరుతోనే మిరప రకం ఏర్పడింది. దీనికి 2 శతాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. కడ్డీ, డబ్బీ బ్యాడిగ రకాలున్నాయి. దావణగెరె అనే రకమూ ఉంది. ఎకరాకు 2 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాల్ రూ.80వేల పైనే పలుకుతోంది. ఇటీవల వచ్చిన హైబ్రిడ్ రకాలు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి ఇస్తున్నా.. నాటు రకంతో పోలిస్తే ధర తక్కువే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ ఈ రకాల మిరప సాగు చేస్తున్నారు.

● పచ్చళ్ల తయారీకి ఇటీవల కశ్మీరీ కారం వినియోగిస్తున్నారు. ఘాటు తక్కువగా.. రంగు ఎక్కువగా ఉంటుంది. ఘాటు ఎక్కువగా ఉండే సన్న రకాలతో కలిపి వాడుతున్నారు.

ఈ కారం.. పసుపు పచ్చగా

పసుపు రంగు మిరపకే.. లఖోరి మిర్చి అనే పేరుంది. ఉత్తరాఖండ్‌లో అల్మోరా జిల్లా లఖోరా గ్రామం నుంచి వచ్చిన అరుదైన రకం ఇది. దీనితో తయారు చేసే కారాన్ని చాట్, చానా మసాల, పెరుగు ఆవడ తదితర పదార్థాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. మొఘలాయ్ వంటకాల్లోనూ ఉపయోగిస్తారు. ఉత్తరభారతదేశంలో ఈ కారం ఎక్కువ ఉపయోగిస్తారు. కిలో రూ.700 నుంచి రూ.1,000 వరకు ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో సాగు అధికం. ఈ సీజన్లో అక్కడ పంట దెబ్బతినడంతో ఏపీ, తెలంగాణలో సాగు చేస్తున్న ఈ రకం కాయలకు డిమాండు పెరిగింది. అయితే వినియోగం పరిమితంగానే ఉంటుంది. ఈ ఏడాది డిమాండు ఉందని వచ్చే ఏడాది సాగు పెంచితే ధరలు దక్కకపోవచ్చని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి.

కెనడాలో దుండగుల కాల్పులు.. బెంగళూరు టెకీ మృతి



చందన్‌కుమార్

ఈనాడు, బెంగళూరు: కెనడాలోని టొరంటోలో శనివారం దుండగులు జరిపిన కాల్పుల్లో బెంగళూరుకు చెందిన టెకీ చందన్‌కుమార్(37) మృతిచెందారు. ఈ మేరకు అక్కడి పోలీసులు ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కర్ణాటకలోని బెంగళూరు గ్రామీణ జిల్లా త్యామగొండ్లు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నందన్‌కుమార్ ఏకైక కుమారుడు చందన్‌కుమార్ ఏడేళ్లుగా కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3.31 గంటలకు టొరంటో పరిధిలోని ఓ షాపింగ్ సెంటర్‌లో కాల్పులు జరిగినట్లు టొరంటో పోలీసు సర్వీస్(టీపీఎస్) సిబ్బందికి ఫోన్‌కాల్ వచ్చింది. వారు అక్కడికి వెళ్లేసరికే ఓ వాహనంలో శరీరమంతా బుల్లెట్ గాయాలతో చందన్‌కుమార్ కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించారు. దుండగులు ముందుగా అనుకున్న కుట్రలో భాగంగానే ఈ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికైతే కాల్పులకు కారణాలు తెలియలేదని ప్రకటించారు. టొరంటోలో ఈ ఏడాది జరిగిన మూడో హత్య ఇది.

జాతి విద్వేషాలే కారణమా?

కెనడాలో జాతి విద్వేషాలు హింసాత్మకంగా మారుతున్నాయని భారతీయ కన్నడ సంఘాల సమాఖ్య ధ్వజమెత్తింది. చందన్‌కుమార్ టొరంటోలో కన్నడ సంఘం సమన్వయకర్తగా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా పనిచేసేవారని ఈ సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ వివరించారు. ఆయన బ్రాంప్టన్ కార్పొరేషన్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించడంతోపాటు అక్కడి మేయర్‌పై పోస్టులు పెట్టేవారని చెప్పారు. కెనడా రాజకీయాల్లో స్థానికేతరుల ప్రభావం అక్కడి పౌరుల్లో జాతి విద్వేషాన్ని పెంచేలా చేస్తోందని నవీన్‌గౌడ అభిప్రాయపడ్డారు.

తల్లికి నిప్పంటించిన కొడుకు

చికిత్స పొందుతూ మృతి



సుందరమ్మ   జాకోబ్

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో తల్లిని చూసుకోవాల్సిన కొడుకే ఆమెకు పెట్రోలు పోసి నిప్పంటించాడు. ఈ దారుణ ఘటన వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలో చోటుచేసుకుంది. పోట్లదుర్తికి చెందిన చాప సుందరమ్మ (90), అబ్రహం దంపతుల కుమారుడు జాకోబ్(60). ఈయనకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామంలో ఇంటి నిర్మాణానికి తన కుమార్తె లత వద్ద జాకోబ్ రూ.18 లక్షలు అప్పు చేశాడు. ఈ విషయమై కుమార్తెతో ఆయన తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనవరాలికి ఇవ్వాల్సిన డబ్బును చెల్లించాలని కుమారుడు జాకోబ్‌కు సుందరమ్మ సూచించారు. దీంతో ఆగ్రహించిన అతడు ఆదివారం ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన సుందరమ్మను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అలిపిరి గరుడ కూడలి వద్ద నినాదాలు చేస్తున్న సాధువులు, స్వామీజీలు, హిందూ సంఘాల నేతలు

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి.. కల్తీనెయ్యి దోషులను శిక్షించాలి

సాధువులు, హిందూ సంఘాల నేతల డిమాండ్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: అతి పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన గత ప్రభుత్వంలోని పెద్దలను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి త్వరితగతిన శిక్షలు విధించాలని పలువురు సాధువులు, స్వామీజీలు, హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వైకాపా పాలనలో తిరుపతి, తిరుమలలో జరిగిన అనేక అంశాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. సోమవారం అలిపిరిలోని గరుడ కూడలి వద్ద వారు నిరసన తెలిపారు. వైకాపా అబద్ధాలు ప్రచారం చేస్తోందని, నెయ్యి కల్తీకి పాల్పడి, లేదని బుకాయించడం ఆ పార్టీ నేతలకే చెల్లిందని మండిపడ్డారు. కల్తీ నెయ్యిలో ప్రమాదకర రసాయనాలు కలిసిన విషయాన్ని సిట్ నివేదిక వెల్లడించినా వైకాపా నేతలు ప్రగల్భాలు పలకడం దారుణం అంటూ విమర్శించారు. సాధుసంతువుల సమన్వయకర్త అట్లూరి నారాయణరావు, తిరుక్షేత్రాల అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, శివకామేశ్వరి పీఠం అధిపతి శివానంద స్వామి, రాజేశ్వరానంద స్వామి, కాలభైరవ స్వామి, నీలకంఠ, అంజలి మాతాజీ, ఓంశ్రీ మాతాజీ, పలువురు హిందూ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ 'ఘోర అపచారం'

● తెలిసీ కొనసాగించడం అత్యంత బాధ్యతారాహిత్యం
● మనోభావాలు దెబ్బతిన్నాయని పెద్దజీయంగార్ ఆవేదన
● ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ



ఈనాడు డిజిటల్- తిరుపతి: న్యూస్‌టుడే- తిరుమల: తిరుమల వేంకటేశ్వర స్వామివారికి నివేదించే అత్యంత పవిత్రమైన లడ్డూ ప్రసాదాల తయారీలో కల్తీనెయ్యి వాడకంపై తిరుమల పెద్ద జీయంగార్ మఠాధిపతి శఠగోప రామానుజ పెద్దజీయర్ స్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. కోట్ల మంది భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకైన లడ్డూ ప్రసాదాల తయారీలో వాడే నెయ్యి కల్తీ అయినట్లు సీబీఐ నిర్ధారించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి, మనోవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. నిత్యం స్వామివారికి కైంకర్యాలు, ప్రసాదాలు నివేదించే తమకు ఇది శరాఘాతం వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ జరిగిందని తెలిసి కూడా అదే నెయ్యిని పవిత్ర ప్రసాదాల తయారీలో కొనసాగించడం ఘోర అపచారమన్నారు. అది ధర్మానికి విరుద్ధమైన, అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యగా భావించాలని పెద్దజీయర్ తన లేఖలో స్పష్టం చేశారు. అత్యంత పవిత్ర హృదయంతో భక్తులు స్వీకరించే ప్రసాదం విషయంలో ఇటువంటి అవకతవకలు చోటుచేసుకోవడం సనాతన హిందూధర్మాన్ని అనుసరించేవారి మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవారికి పరమ భక్తులని, భవిష్యత్తులో తిరుమలలో ఇటువంటి అపచారాలకు తావులేకుండా ఆయన అత్యంత పటిష్ఠమైన వ్యవస్థను నెలకొల్పుతారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల పవిత్రతను కాపాడే దృఢసంకల్పాన్ని, ధర్మాన్ని పరిరక్షించే శక్తిని ఆ దేవదేవుడు ముఖ్యమంత్రికి ప్రసాదించాలని ఆకాంక్షించారు. తన లేఖలను తితిదే ఈవో, అదనపు ఈవోలకు కూడా పంపారు.

ఇంత దారుణానికి ఎలా ఒడిగట్టారు?

ఏపీ సాధుపరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



విలేకర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి తదితరులు

విశాఖపట్నం (అల్లిపురం, న్యూస్‌టుడే): వైకాపా ప్రభుత్వంలో భక్తులు తిరుమల నుంచి ప్రసాదం లడ్డూలను ఇంటికి తీసుకొచ్చే క్రమంలో ప్రయాణంలోనే విరిగిపోయేవని, రుచి కూడా మారిపోయేదని, అంతకముందు అలా జరిగేది కాదని ఏపీ సాధుపరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి పేర్కొన్నారు. ఏపీ సాధు పరిషత్తు ఆధ్వర్యంలో విశాఖలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం ఎంత గొప్పదో.. లడ్డూ ప్రసాదాన్నీ అంతే పవిత్రంగా ప్రజలు భావిస్తారు. అలాంటిది కల్తీ నెయ్యితో కోట్ల లడ్డూలు తయారు చేసినట్లు బయటపెట్టిన సిట్ నివేదిక చూస్తే ఇంత ఘోరం జరిగిందా అంటూ మనసు కలచివేస్తోంది. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అసలు ఇంత దారుణానికి ఎలా ఒడిగట్టారు? ఈ వ్యవహారంలో సిట్ నివేదికలో పేర్కొన్న వారి మీద కేసులు నమోదు చేసి వెంటనే శిక్షించాలి. కూటమి ప్రభుత్వం బాధ్యులను శిక్షించడంలో ఎటువంటి తాత్సారం చేయకూడదు. కల్తీ జరిగితే వేంకటేశ్వరస్వామి ఎవర్నీ విడిచిపెట్టడు. వడ్డీతో సహా చెల్లించేస్తాడు. రసాయనాలు కలపడం వల్ల కోట్ల మంది హిందువులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదముంది' అని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. లడ్డూ విషయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న రాజకీయ చర్చలు బాధ కలిగిస్తున్నాయన్నారు. దీన్నొక రాజకీయ అంశంగా చూడకుండా సిట్ నివేదిక ఆధారంగా ముందుకెళ్లాలని శ్రీనివాసానంద సరస్వతి సూచించారు.

తితిదేనే నెయ్యి ఉత్పత్తి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న రాధామనోహర్ దాస్

విశాఖపట్నం (గురుద్వారా), న్యూస్‌టుడే: తితిదేనే నెయ్యి ఉత్పత్తి చేసి, ప్రసాదాల్లో వినియోగించాలని హిందూ ధర్మ ప్రచారకులు రాధామనోహర్ దాస్ సూచించారు. విశాఖ నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తితిదే నెయ్యి ఉత్పత్తి చేయకపోవడం తప్పన్నారు. ప్రభుత్వ భూముల్లో గోశాలలు నిర్మించి, గోవుల్ని సంరక్షించాలని ప్రభుత్వానికి సూచించారు. రోజూ అనేక ఆవులు చనిపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టిసారించి గోవుల్ని రక్షించాలని కోరారు. గోవులను భారీగా పెంచి తద్వారా తిరుమలలో నెయ్యి కరవు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అన్ని పార్టీల ప్రతినిధులతో తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించాలన్నారు. సాధువులు, పీఠాధిపతులతో సమావేశం ఏర్పాటు చేసి, తిరుమల ఖ్యాతి రెట్టింపు చేయాలన్నారు. వేంకటేశ్వరస్వామి బొమ్మ కాదని నిజమైన దేవుడని.. తిరుమలకు బొట్టు పెట్టుకొని వెళ్లాలని కోరారు.

EENADU Vol: 52, Issue: 181 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

sukhi@eenadu.in
సుఖీభవ
ఈనాడు
15 మంగళవారం ఫిబ్రవరి 10, 2026



గుండె బెంబేలెత్తిస్తోంది. చిన్నవయసులోనే పోటెత్తుతోంది. దీంతో గుండె పరీక్షలు చేయించుకోవటమూ ఎక్కువైంది. ఇది మంచిదే కావొచ్చు గానీ ఏ పరీక్ష ఎవరికి ఎక్కువ ఉపయోగమో తెలుసుకోవటమూ ముఖ్యమే. కార్డియాక్ చెకప్ ప్యాకేజీల పేరుతో గంపగుత్తగా చేసే పరీక్షల్లో కొన్ని వారి వయసుకు తగినవి కాకపోవచ్చు. ఫలితాల విషయంలో కొందరికి కొన్ని వ్యత్యాసాలు ఉండొచ్చు. ఇది తెలియక కంగారు పడి, తీవ్ర ఆందోళనకు గురవుతుంటారు. ఫలితాలు నార్మల్ అయితే 'అంతా బాగానే ఉంది, గుండెపోటు రానే రాదు' అనే ధీమాతోనూ ఉంటారు. ఈ రెండూ తగవు. ఆయా పరీక్షలను నిశితంగా పరిశీలిస్తేనే ముప్పు కచ్చితంగా తెలుస్తుంది. కాబట్టి గుండె పరీక్షల విషయంలో పక్కాగా ఉండటం అత్యవసరం.

గుండె పరీక్షలు పక్కాగా

ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (ఈసీజీ)

తరచూ చేసే పరీక్ష ఇది. ఇప్పుడు కంప్యూటరైజ్డ్ ఈసీజీ అందుబాటులో ఉంది. ఇది చిన్న తేడానూ అబ్‌నార్మల్‌గా చూపిస్తుంది. దీంతో కంగారు పడుతుంటారు. నిజానికి ఈసీజీలో వ్యక్తుల పరంగా కొన్ని వ్యత్యాసాలు ఉండొచ్చు. కొందరికి పుట్టుకతోనే గుండె కొట్టుకునే తీరు తేడాగా ఉండొచ్చు. దీనికి కంగారు అవసరం లేదు. ఆడవారిలో కొన్ని వ్యత్యాసాలను (టీ ఇన్‌వర్షన్స్) కంప్యూటర్ ఇస్కీమియాగా పేర్కొంటుంది. కంప్యూటర్‌కు ఇవేవీ తెలియకపోవటం వల్ల అబ్‌నార్మల్‌గా భావిస్తుంది. డాక్టర్ మాత్రమే ఏది నార్మలో, కాదో కచ్చితంగా చెబుతారు. తమకుతామే పరీక్ష చేయించుకొని, కంగారు పడటం తగదు.

● ఛాతీనొప్పి వచ్చినవారిలో చాలామంది పరీక్ష కేంద్రానికి వెళ్లేసరికే నొప్పి తగ్గిపోవచ్చు. అప్పుడు ఈసీజీ నార్మల్‌గానే ఉంటుంది. అంతా బాగానే ఉందనుకొని, ఇంటికొస్తే కొంతసేపటికి తీవ్ర గుండెపోటు రావొచ్చు. ఈసీజీ నార్మల్‌గా ఉన్నంత మాత్రాన గుండె రక్తనాళాల్లో పూడికలు లేవని చెప్పలేం. కాబట్టి గుండెపోటును అనుమానిస్తే ఆసుపత్రిలో చేర్చి, ప్రతి రెండు గంటలకోసారి ఈసీజీ తీయాల్సి ఉంటుంది. ఇలా 12-24 గంటల వరకూ ఈసీజీ నార్మల్‌గా ఉంటేనే బాగుందని నిర్ధారిస్తారు. కొన్నిసార్లు ఈసీజీలో విద్యుత్ ప్రసార అడ్డంకులూ (LBBB, RBBB) పూడికల మాదిరిగా తికమక పడేలా చేస్తాయి. కాబట్టి నిశిత పరిశీలన అవసరం.

ఎకోకార్డియోగ్రామ్ (ఎకో)

తల్లి కడుపులో ఉన్న శిశువు దగ్గరి నుంచి వృద్ధుల వరకూ గుండెజబ్బుల నిర్ధారణకు తోడ్పడేది ఇదే. గుండె ఎలా పంప్ చేస్తుంది? కవాటాలు ఎలా పనిచేస్తున్నాయి? గుండె గదుల్లో ఎంత పీడనం ఉంది? అనేవి దీంతో తెలుస్తాయి. పూడికలు తప్ప గుండెకు సంబంధించిన సమగ్ర చిత్రాన్ని అందిస్తుంది. చాలామంది ఎకో చేయించుకొని, రిపోర్టు నార్మల్‌గా రాగానే ఎలాంటి సమస్య లేదనుకుంటారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు రక్తనాళాల్లో పూడికలున్నా ఎకో ఫలితాలు నార్మల్‌గా ఉండొచ్చని తెలుసుకోవాలి.

ట్రెడ్‌మిల్ పరీక్ష

ఆయా వ్యక్తుల శక్తి మేరకు ట్రెడ్‌మిల్ మీద వేగంగా నడిపించి లేదా పరుగెత్తించి.. అదే సమయంలో ఈసీజీ తీయటం దీనిలోని కీలకాంశం. ఇది 10-15 నిమిషాల్లోనే పరీక్ష పూర్తవుతుంది. చాలా విలువైన సమాచారాన్ని అందిస్తుంది. పరీక్ష చేస్తున్నప్పుడు ఛాతీ నొప్పి వచ్చినా, ఈసీజీలో మార్పులు తలెత్తినా, బీపీ పడిపోయినా ఏదో సమస్య ఉందని అర్థం. వీరికి పూడికలు ఉండే అవకాశం ఎక్కువ. కాకపోతే ఇది 60 శాతమే కచ్చితంగా ఫలితాన్ని చూపిస్తుంది. పూడికలున్నా 40% మందిలో ఫలితం నార్మల్‌గా ఉండొచ్చు. పూడిక 70% కన్నా ఎక్కువగా రక్తనాళాన్ని ఆక్రమిస్తేనే సమస్యగా భావిస్తుంది. అంతకన్నా చిన్నవాటిని నార్మల్‌గా పరిగణిస్తుంది. అంటే ట్రెడ్‌మిల్ పరీక్ష ఫలితం నార్మల్‌గా ఉన్నంత మాత్రాన పూడికలు అసలే లేవనుకోలేం. కొందరు శ్రమను తట్టుకోలేక మధ్యలోనే ట్రెడ్‌మిల్ మీద నడవటం ఆపేయొచ్చు. అప్పుడూ సమస్యను గుర్తించటం అసాధ్యం.

మరో ముఖ్యమైన విషయం- ఆడవారికి ట్రెడ్‌మిల్ పరీక్ష అంతగా ఉపయోగపడక పోవటం. చాలామంది ఆడవారికి.. ముఖ్యంగా గ్రామీణులకు దీని గురించి తెలియదు. ట్రెడ్‌మిల్ మీదికి ఎక్కగానే తీవ్ర ఒత్తిడి, ఆందోళనకు గురవుతుంటారు. దీంతో ఆరంభంలోనే ఈసీజీ గతి తప్పుతుంది. కంగారుతో నడుస్తుంటే ఇంకా అబ్‌నార్మల్ అవుతుంది. అందువల్ల వీరికి ట్రెడ్‌మిల్‌కు బదులు డోబుటమిన్ స్ట్రెస్ ఎకో (DSE) పరీక్ష మేలు. దీన్ని ఆసుపత్రిలో నిపుణుల సమక్షంలోనే చేస్తారు. ఇందులో డోబుటమిన్ ఇంజెక్షన్ ఇచ్చి, గుండె వేగం పెరిగేలా చేస్తారు. నడవాల్సిన అవసరం లేకుండా, పడుకొని ఉండగానే గుండె వేగంగా కొట్టుకునేలా చేస్తారు. ఎకోతో పాటు ఈసీజీ కూడా చేయటం వల్ల మరింత కచ్చితంగా సమస్యను గుర్తించొచ్చు. స్ట్రెస్ ఎకో పరీక్ష ఫలితం నార్మల్‌గా ఉంటే తర్వాత రెండేళ్లలో గుండెపోటు వచ్చే అవకాశం దాదాపు ఉండదనే చెప్పుకోవచ్చు. ఏదైనా శస్త్రచికిత్స చేసే ముందు గుండె దాన్ని ఎంతవరకూ తట్టుకుంటుందో తెలుసుకోవటానికీ స్ట్రెస్ ఎకో పరీక్ష ఉపయోగపడుతుంది.

● ఛాతీనొప్పి వచ్చినవారికి వారం వరకూ ట్రెడ్‌మిల్ పరీక్ష చేయటం తగదు. కొందరు తెలియకుండా మర్నాడే చేయించుకుంటారు. ఇది ప్రమాదకరం. విషమ సమస్యలకు దారితీయొచ్చు.

● ట్రెడ్‌మిల్ పరీక్ష చిన్నవయసువారికి, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేసేవారికి అక్కర్లేదు. మధుమేహం, అధిక రక్తపోటు, కుటుంబ చరిత్ర, పొగ తాగటం వంటి గుండెజబ్బు ముప్పు కారకాలు గలవారు ప్రతి రెండేళ్లకోసారి దీన్ని చేయించుకుంటే మంచిది.

● 'ట్రెడ్‌మిల్, ఎకో రెండూ నార్మల్‌గానే ఉన్నాయి కదా. ఇక గుండె పోటు వచ్చే అవకాశం ఉండదా?' అని చాలామంది అడుగుతుంటారు. ఇవి శరీరాన్ని శ్రమకు గురిచేసినప్పుడు గుండె ఎలా పనిచేస్తుందో తెలిపే పరీక్షలు. తీవ్ర భావోద్వేగాలకు, మానసిక ఒత్తిడికి గురైనప్పుడు తలెత్తే రకం గుండెపోటును అంచనా వేయలేవని గుర్తించాలి.

సీటీ క్యాల్షియం స్కోర్



ఇది ఇటీవల బాగా ప్రాచుర్యం పొందింది. చాలామంది తమకు తామే సొంతంగా చేయించుకుంటున్నారు. క్యాల్షియం స్కోరు ఎక్కువగా ఉందనగానే ఆందోళన చెందుతుంటారు. దీని స్కోరు 0-100 ఉంటే గుండె పోటు ముప్పు తక్కువగా భావిస్తారు. 100-300 ఉంటే ఒక మాదిరిగా, 300 దాటితే ముప్పు ఎక్కువని పరిగణిస్తారు. కాకపోతే క్యాల్షియం స్కోరు వయసును బట్టి మారుతుంటుంది. 40 ఏళ్లు దాటినవారికి నెమ్మదిగా క్యాల్షియం మోతాదు పెరుగుతూ వస్తుంటుంది. కాబట్టి 40-50 ఏళ్లవారికిది బాగా ఉపయోగపడుతుంది. అలాగే 30ల్లో, 40ల్లో ఉన్నవారైతే అప్పటికే కుటుంబంలో ఎవరికైనా గుండె పోటు వచ్చి ఉన్నట్టయితే ఒకసారి క్యాల్షియం స్కోర్ పరీక్ష చేయించుకోవటం మంచిది. ఇది సున్నాగా ఉంటే వచ్చే ఐదేళ్లలో గుండెపోటు వచ్చే అవకాశం దాదాపు ఉండదు.

● 70 ఏళ్లు దాటినవారు సీటీ క్యాల్షియం చేయించుకుంటే స్కోరు 300 కన్నా ఎక్కువగానే ఉండొచ్చు. దీనికి కంగారు పడాల్సిన అవసరం లేదు. ఆ వయసుకు అది పెద్ద సమస్యేమీ కాదు. పైగా అప్పటికే కొందరు స్టాటిన్స్ వేసుకుంటూ ఉండొచ్చు. వీటిని వేసుకునేవారికి క్యాల్షియం స్కోరు ఎక్కువగానే ఉంటుంది. అందువల్ల ఛాతీనొప్పి, ఆయాసం వంటి లక్షణాలు లేనప్పుడు ఒక్క క్యాల్షియం స్కోరు ఎక్కువున్నంత మాత్రాన కంగారు పడాల్సిన పనిలేదు. హఠాత్తుగా యాంజియోగ్రామ్ చేయాల్సిన అవసరం లేదు.

● క్యాల్షియం స్కోర్ పరీక్షలో కొవ్వు తెలియదు. క్యాల్షియం లేకుండా కేవలం కొవ్వుతో కూడిన పూడికలూ ఏర్పడుతుంటాయి. ముఖ్యంగా మనదేశంలో ఇలాంటివి ఎక్కువ. కాబట్టి క్యాల్షియం స్కోర్ సున్నాగా ఉన్నా ప్రమాదం అసలే లేదనుకోవటానికీ లేదు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు వంటి ముప్పు కారకాలు గలవారికి క్యాల్షియం స్కోర్ సున్నా అయినా లోపల కొవ్వు పూడికలు ఉండే అవకాశముంది. వీటిని గుర్తించటానికి స్ట్రెస్ థాలియం, స్ట్రెస్ ఎకో వంటి ఇతరత్రా పరీక్షలు అవసరం.

సీటీ కరోనరీ యాంజియోగ్రామ్

ఇది చాలా ఉపయోగకరమైన పరీక్ష. పది నిమిషాల్లోనే పూర్తవుతుంది. రక్తనాళాల్లో పూడికలు, అడ్డంకులుంటే స్పష్టంగా కనిపిస్తాయి. కాకపోతే రేడియేషన్ ప్రభావం పడుతుంది. అధునాతన పరికరాలతో ఇదీ చాలావరకు తగ్గిందనుకోండి. యాంజియోగ్రామ్ పరీక్షతో సమానంగానే ఇదీ ఫలితాలు చూపిస్తుంది. పైగా ఇందులో చిన్న చిన్న పూడికలూ తెలుస్తాయి. పూడిక గుండెపోటుకు దారితీసే అవకాశముందో కూడా తెలుస్తుంది.

● ఇది పూడికలు లేవని తెలుసుకోవటం కోసం చేసే పరీక్ష మాత్రమే. పూడికలు ఉన్నాయో, లేవో అనే సందిగ్ధం వచ్చినప్పుడు ఉపయోగపడుతుంది. రెండు మూడు రోజులు రకరకాల పరీక్షలు చేయటం కన్నా నేరుగా సీటీ కరోనరీ యాంజియోగ్రామ్‌తో అప్పటికప్పుడే సమస్యను గుర్తించొచ్చు. అనవసరంగా ఆసుపత్రిలో చేరటం తప్పుతుంది.

● ఇది పూడికలను అతిగా అంచనా వేస్తుంది. ఇందులో 70% పూడిక ఉన్నట్టు తేలినా యాంజియోగ్రామ్‌లో 50 శాతమే ఉండొచ్చు. అందువల్ల కంగారు పడాల్సిన పనిలేదు.

● ఊపిరితిత్తిలో రక్తం గడ్డలు (పల్మనరీ ఎంబాలిజమ్) ఏర్పడటం, బృహద్ధమని లోపలి పొర చీలిపోవటం (డిసెక్షన్ ఆఫ్ అయోర్టా) కూడా దీని ద్వారా బయటపడతాయి (ట్రిపుల్ రూల్‌అవుట్).

కరోనరీ యాంజియోగ్రామ్

పూడికల నిర్ధారణకు ఇదే ప్రామాణిక పరీక్ష. కాకపోతే కొంత ముప్పు ఉంటుంది. పరీక్ష ఫలితాలను విశ్లేషించటమూ కీలకమే. పూడిక 70% కన్నా మించితే అక్కడిక్కడే స్టెంట్ వేయొచ్చు. మూడు రక్తనాళాల్లోనూ పెద్ద పూడికలున్నట్టయితే బైపాస్ శస్త్రచికిత్స అవసరం.

● 70% కన్నా చిన్న పూడికలైతే మందులు, జీవనశైలి మార్పులతో అదుపులో ఉంచుకోవచ్చు. అలాగే మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు వంటివీ నియంత్రణలో ఉంచుకోవాలి. పూడికలు చిన్నగా (20-50%) ఉన్నా ప్రమాదమేమీ లేదనుకోవటానికి లేదు. తీవ్రంగా భావోద్వేగాలకు గురైనప్పుడో, శక్తికి మించి విపరీతంగా వ్యాయామాలు చేస్తున్నప్పుడో రక్తపోటు ఉన్నట్టుండి పెరిగి, పూడిక అడుగు భాగం కదిలిపోవచ్చు. దీంతో రక్తనాళం పొర చిట్లిపోయి, రక్తం గడ్డకట్టి గుండెపోటు తలెత్తొచ్చు. ఎంత ఆరోగ్యంగా ఉన్నప్పటికీ 50 ఏళ్లు దాటినవారిలో ఎంతోకొంత స్థాయిలో పూడికలు ఉంటాయనే సంగతి మరవరాదు. కాబట్టి మంచి జీవనశైలిని పాటించటం, ఒక మాదిరి వ్యాయామం, ధ్యానం, యోగా చేయటం చాలా ముఖ్యం.

● యాంజియోగ్రామ్‌లో అసలు పూడికలే లేనివారికి గుండెపోటు దాదాపుగా రాదనుకోవచ్చు. అలాగని అసలే రాదని చెప్పలేం. తీవ్ర భావోద్వేగాలూ గుండెపోటుకు దారితీయొచ్చు. దీనికి కారణం అడ్రినలిన్, నార్‌అడ్రినలిన్ హార్మోన్లు ఉన్నట్టుండి పెరగటం వల్ల గుండె రక్తనాళాలు కుంచించుకుపోవటం. దీంతో కొద్ది నిమిషాల సేపు గుండెకు రక్తం అందదు. పంపింగ్ సామర్థ్యం గణనీయంగా పడిపోతుంది. ఇందులోనూ గుండెపోటు మాదిరిగానే సమస్యలు తలెత్తుతాయి. దీన్నే స్ట్రెస్ కార్డియోమయోపతీ అంటారు. కాబట్టి వీలైనంత వరకూ తీవ్ర భావోద్వేగాలకు గురికాకుండా చూసుకోవాలి. శక్తికి మించిన కఠినమైన వ్యాయామాలకు, శ్రమకు దూరంగా ఉండాలి.



డా॥ ఎ.వి.ఆంజనేయులు, సీనియర్ కార్డియాలజిస్ట్, ఫోకస్ డయాగ్నొస్టిక్ సెంటర్ పంజాగుట్ట, హైదరాబాద్

గజ్జల్లో దురదేల?

సమస్య సలహా

సమస్య: నాకు రెండు నెలలుగా గజ్జల్లో దురద, దద్దు, ఎరుపు, తామర లాంటి మచ్చలు వస్తున్నాయి. ఒక పూత వాడుతున్నా. దీన్ని రాసుకున్నప్పుడు సమస్య తగ్గుతుంది. ఆపేస్తే లక్షణాలు తిరిగి మొదలవుతున్నాయి. చర్మ నిపుణుడిని సంప్రదించి, సమస్య గురించి చెప్పాలంటే సిగ్గుగా అనిపిస్తోంది. నాకు తగిన పరిష్కారం సూచించండి.

– శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్

సలహా: మీరు చెప్పిన లక్షణాలను బట్టి తామర (టీనియా ఇన్‌కాగ్నిటో) సమస్యగా అనిపిస్తోంది. ఇదో ఫంగల్ ఇన్‌ఫెక్షన్. దీన్ని కచ్చితంగా నిర్ధారణ చేయటం.. యాంటీఫంగల్ మాత్రలు, లేపనాలు వాడుకోవటం చాలా ముఖ్యం. మీరు పూర్తిగా నయమయ్యేంతవరకూ, దాదాపు ఒకటిన్నర నెలల పాటు మందులు వాడుకోవాల్సి ఉంటుంది. వీటి క్రమం తప్పినా, మధ్యలో మానేసినా మళ్లీ తిరగబెడుతుంది. మీరు ఇప్పటికే ఆలస్యం చేశారు. సొంతంగా పూత మందు కొనుక్కొని, వాడుకొని పెద్ద తప్పు చేశారు. దురద అనగానే దుకాణాల్లో స్టిరాయిడ్ పూత మందు ఇస్తుంటారు. ఇది వాపుప్రక్రియను అణచి పెట్టటం ద్వారా దురద తగ్గేలా చేస్తుంది. కానీ ఫంగస్ వృద్ధి చెందటానికి ఆస్కారం కలిగిస్తుంది. దీంతో పూత మందు ఆపగానే ఫంగస్ ఇన్‌ఫెక్షన్ తిరగబెడుతుంది. ఈసారి మరింత తీవ్రమవుతుంది కూడా. అప్పుడు జబ్బు స్వరూపమూ మారుతుంది. నిర్ధారణ చేయటమే కష్టమవుతుంది. మనదేశంలో ఇదో పెద్ద సమస్యగా మారింది. దీని వల్ల సమాజానికి చాలా హాని కలుగుతోంది. మందులు పనిచేయని స్థితి తలెత్తుతోంది. ఇప్పటికైనా మీరు సిగ్గు, బిడియం లేకుండా చర్మ నిపుణుడిని సంప్రదించండి. సమస్యను నిర్ధారించి అవసరమైన మందులు సూచిస్తారు. మందులు వాడుకోవటంతో పాటు గజ్జల భాగం శుభ్రంగా ఉంచుకోవటం.. తడి దుస్తులు, జీన్స్ ధరించకపోవటం, ఇంట్లో ఉన్నప్పుడు గాలి ఆడేలా చూసుకోవటం వంటి జాగ్రత్తలూ తీసుకోవాలి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు కుటుంబంలో ఒకరి నుంచి మరొకరికి తేలికగా వ్యాపిస్తాయి. అప్పుడు కుటుంబమంతటికీ చికిత్స అవసరమవుతుంది. కాబట్టి మీరు వాడే దుస్తులను.. ముఖ్యంగా లోదుస్తులను వేడి నీటితో శుభ్రంగా ఉతుక్కోవాలి. ఇతరుల దుస్తులతో కలవనీయొద్దు. దుప్పట్లు, తువ్వాళ్ల వంటివి తరచూ ఉతుక్కోవాలి.




- డా॥ జి.నరసింహారావు నేత, సీనియర్ డెర్మటాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

చదువులకు కాలుష్యం దెబ్బ

పిల్లలు బాగా చదువుకోవాలని, అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులంతా కోరుకుంటారు. చదువుల మీద ధ్యాస చూపితేనే ఇది సాధ్యం. ఇందుకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి చాలా ముఖ్యం. వీటి కోసం రకరకాల ప్రయత్నాలు చేసి ఉంటారు. స్వచ్ఛమైన గాలి, ఆహారంలో యాంటీఆక్సిడెంట్ల మీదా ఓసారి దృష్టి సారించండి. ఇవి పిల్లల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగటానికి తోడ్పడుతున్నట్టు బీఎంసీ పబ్లిక్ హెల్త్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం చెబుతోంది.

కాలేయ కొవ్వు అంచనా తేలిగ్గా..



రోజురోజుకీ మద్యంతో సంబంధం లేని కాలేయ కొవ్వు (ఫ్యాటీ లివర్) సమస్య గణనీయంగా పెరుగుతోంది. ఇందులో తొలిదశలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. అందువల్ల ముందుగా పట్టుకోవటం పెద్ద సవాలుగా నిలుస్తోంది. దీన్ని గుర్తించటానికి ట్రైగ్లిజరైడ్లు, గ్లూకోజు, నడుం చుట్టుకొలత-ఎత్తు నిష్పత్తి సంయుక్త సూచి (టీవైజీడబ్ల్యూహెచ్‌టీఆర్) తోడ్పడగలదని తాజా అధ్యయనం పేర్కొంటోంది. కాలేయ కొవ్వుకు ఇన్సులిన్ నిరోధకత, బొజ్జ దారితీస్తుంటాయి. కాబట్టి ఈ సూచి జీవక్రియలు, శరీర కొలతలను పట్టి చూపుతుంది. సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాలేయ జబ్బు ముందస్తు పరీక్షలు చేయరు. అందువల్ల చాలామందిలో సమస్య తీవ్రమయ్యేంత వరకూ బయటపడటం లేదు. మామూలు రక్త పరీక్షలు, శరీర కొలతలతోనే టీవైజీడబ్ల్యూహెచ్‌టీఆర్ సూచిని తెలుసుకోవచ్చు. అందువల్ల ఆసుపత్రుల్లో, సమాజ స్థాయిలో కాలేయ కొవ్వు ముప్పు గలవారిని గుర్తించటానికిది తేలికైన సాధనంగా ఉపయోగపడగలదు. కాలేయ కొవ్వు ముప్పును అంచనా వేయటంలో సంప్రదాయ సూచికలతో పోలిస్తే టీవైజీడబ్ల్యూహెచ్‌టీఆర్ ముందుంటున్నట్టు తేలటం గమనార్హం.

మెదడుతీరు తెలుసా



మెదడు అత్యద్భుతమైంది. అన్ని అవయవాలూ ఇది చెప్పినట్టే నడచుకుంటాయి. నాడీ కణాలు, వీటి మధ్య అనుసంధానాల మూలంగానే మనం పనులు చేయగలుగుతున్నాం. మరి మెదడు గురించి మీకు ఎంత తెలుసు? ఈ క్విజ్ ద్వారా ప్రయత్నించి చూడండి.

1 కాఫీ తాగితే జ్ఞాపకశక్తి, విషయగ్రహణ పనితీరు మెరుగవుతాయా?
అ. అవును ఆ. కాదు

2 సంగీతం వింటే మెదడులో డొపమీన్ ఉత్పత్తి పెరిగి మూడ్, ఉత్సాహం పెరుగుతాయా?
అ. అవును ఆ. కాదు

3 ఒకేసారి ఎక్కువ పనులు ముందేసుకుంటే మెదడు సామర్థ్యం ఇనుమడిస్తుందా?
అ. అవును ఆ. కాదు

4 క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం ద్వారా తీవ్ర మతిమరుపు తెచ్చిపెట్టే అల్జీమర్స్ జబ్బు ముప్పును తగ్గించుకోవచ్చా?
అ. అవును ఆ. కాదు

5 పాలపుంతలోని నక్షత్రాల కన్నా మన మెదడులో నాడీకణాల మధ్య అనుసంధానాల సంఖ్యే ఎక్కువా?
అ. అవును ఆ. కాదు

6 మన శరీరంలో ఎంత శాతం శక్తిని మెదడు వాడుకుంటుంది?
అ. 5% ఆ. 16% ఇ. 20%

7 మెదడులో ఏ భాగం మన వ్యక్తిత్వాన్ని ఎక్కువగా రూపుదిద్దుతుంది?
అ. ముందు మెదడు ఆ. మధ్య మెదడు ఇ. వెనక మెదడు ఈ. పక్కల మెదడు

8 ప్రపంచవ్యాప్తంగా ఎంత మంది డిమెన్షియాతో జీవిస్తున్నారని భావిస్తున్నారు?
అ. 12 మిలియన్లు ఆ. 38 మిలియన్లు ఇ. 55 మిలియన్లు

జవాబులు

1 అ. కాఫీలోని కెఫీన్‌తో జ్ఞాపకశక్తి, మూడ్, చురుకుదనం వంటి మెదడుకు సంబంధించిన పలు పనులు మెరుగవుతాయి. కాకపోతే మితం పాటించటం ముఖ్యం. అతిగా కాఫీ తాగితే ప్రతికూల ప్రభావం పడుతుంది.

2 అ. సంగీతం వినటానికీ డొపమీన్ విడుదల కావటానికీ సంబంధముంది. ఈ నాడీసమాచార వాహకం ఆనందం కలగటానికి తోడ్పడుతుంది. దీంతో మూడ్, ఉత్సాహం పెరుగుతాయి. నొప్పీ తగ్గుతుంది.

3 ఆ. ఒకేసారి చాలా పనులు చేస్తే మెదడు సామర్థ్యం పుంజుకుంటుందని చాలామంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. ఒకే సమయంలో ఎక్కువ పనులు ముందేసుకుంటే ఉత్పాదకత తగ్గుతుంది. విషయగ్రహణ నైపుణ్యం లోపిస్తుంది. ఒక సమయంలో ఒక పని చేస్తే మెదడు మరింత సమర్థంగా, ప్రభావవంతంగా పనిచేస్తుంది.

4 అ. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం.. ముఖ్యంగా గుండె, శ్వాస వేగాలను పెంచే ఏరోబిక్ వ్యాయామాలతో అల్జీమర్స్ ముప్పు తగ్గుతున్నట్టు పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. వ్యాయామంతో మెదడుకు రక్త సరఫరా పుంజుకుంటుంది. మెదడు కణాల ఆరోగ్యానికి తోడ్పడే వృద్ధి కారకాల విడుదల పెరుగుతుంది.

5 అ. విశ్వంలో అత్యంత సంక్లిష్టమైంది మెదడే. ఇందులో సుమారు 10వేల కోట్ల నాడీకణాలుంటాయి. ప్రతి ఒక్కటీ లక్షలాది ఇతర కణాలతో అనుసంధానమవుతుంది. ఆ లెక్కన 100 ట్రిలియన్ల నుంచి 1 క్వాడ్రిలియన్ల అనుసంధానాలు ఏర్పడొచ్చని అంచనా. పాలపుంతలో 10వేల కోట్ల నుంచి 40వేల కోట్ల నక్షత్రాలు ఉంటాయని అంచనా.

6 ఇ. మన శరీర బరువులో మెదడు బరువు కేవలం 2 శాతమే గానీ 20% శక్తిని అదే వాడుకుంటుంది. మెదడు కణాలు నిరంతరం.. చివరికి మనం నిద్రిస్తున్నప్పుడూ చురుకుగా ఉంటాయి. శరీరంలో ఇతర కణాల కన్నా ఎక్కువ శక్తిని వాడుకునేవి ఇవే.

7 అ. మన వ్యక్తిత్వం ప్రధానంగా ముందు మెదడు (ఫ్రాంటల్ లోబ్) మీద ఆధారపడి ఉంటుంది. మనం మనలా ఉండటానికి కారణం ఇదే.

8 ఇ. మనదేశంలో 60 ఏళ్లు, అంతకు మించిన వయసువారిలో సుమారు 8.8 మిలియన్ల మందికి డిమెన్షియా ఉందని అంచనా. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనా ప్రకారం అన్నిదేశాల్లో కలిపి సుమారు 55 మిలియన్ల మంది దీంతో జీవిస్తున్నారు. ఈ సంఖ్య 2050 నాటికి 152 మిలియన్లకు ఎగబాకే ప్రమాదముండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

అయినా అలసటేల?



రాత్రి సమయానికే పడుకున్నారు. దాదాపు 8 గంటలు నిద్రించారు. అయితే ఉదయం లేవగానే ఏదో అలసట. ఎందుకిలా? ఎక్కువసేపు నిద్రపోతే ఎక్కువ హుషారుగా ఉండాలి కదా. అన్నిసార్లూ ఇది నిజం కావాలని లేదు. ఎంతసేపు నిద్రించారనే దాని కన్నా ఎంత గాఢంగా నిద్రించారనేది ముఖ్యం. తగినంత సేపు నిద్రపోయినా మర్నాడు నీరసంగా ఉండటానికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

నిద్ర సమస్య: పగటిపూట మత్తుగా, అలసటగా ఉండటానికి నిద్రలో కాసేపు శ్వాస ఆగటం (స్లీప్ అప్నియా) కారణం కావొచ్చు. ఈ సమస్య గలవారిలో నిద్రిస్తున్నప్పుడు గొంతు వెనకాల భాగం వదులై, శ్వాసమార్గానికి అడ్డుపడుతుంది. అప్పుడు ఊపిరి ఆడక గట్టిగా గురక పెడుతూ శ్వాస తీసుకుంటారు. దీంతో మెలకువ వస్తుంది. గాఢ నిద్ర కొరవడుతుంది. ఇలా రాత్రంతా చాలాసార్లు జరుగుతూనే ఉంటుంది. నిద్ర మత్తులో ఇది తెలియదు. కంటి నిండా నిద్ర పట్టకపోవటం, శ్వాస ఆగటం వల్ల రక్తంలో ఆక్సిజన్ స్థాయులు తగ్గటం వల్ల తెల్లారి అలసటగా అనిపిస్తుంది. నిద్రలేమి, కాళ్లలో చిరచిర వంటి సమస్యలూ దీనికి కారణం కావొచ్చు.

● **ఇతర జబ్బులు:** నిద్ర ఒక్కటే కాదు. దీర్ఘకాల సమస్యలు, హార్మోన్ల మార్పుల వంటివీ నిస్సత్తువకు దారితీయొచ్చు. థైరాయిడ్ సమస్యలు, విటమిన్ల లోపాల వంటివీ హుషారును తగ్గించొచ్చు.

పడకగది వాతావరణం: పడుకునే చోట చుట్టుపక్కల పరిస్థితులూ నిద్రకు భంగం కలిగించొచ్చు. చప్పుడు, వెలుగు, ఉష్ణోగ్రత వంటివీ గాఢ నిద్ర మీద ప్రభావం చూపుతాయి మరి. గది చాలా వేడిగా ఉన్నా, ఏదైనా చప్పుడు చేస్తున్నా, వెలుగు మరీ ఎక్కువగా ఉన్నా తెలియకుండానే తరచూ మెలకువ వచ్చేస్తుంది. ఎక్కువ వెలుతురుతో నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ మోతాదులు తగ్గి, కునుకు పట్టటాన్ని దెబ్బతీస్తుంది. పడకగదిలో టీవీ, పీసీ, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ల వంటివీ నిద్రకు విఘాతం కలిగిస్తాయి.

ఆహారం, పానీయాలు: మనం తినే ఆహారం, తాగే పానీయాలూ గాఢ నిద్రను దెబ్బతీయొచ్చు. ఉదాహరణకు- పడుకునే ముందు కడుపు నిండా భోజనం చేశారనుకోండి. జీర్ణక్రియ ఉత్తేజితమై త్వరగా నిద్ర పట్టకుండా చేయొచ్చు. అలాగని కడుపు మాడ్చుకొని నిద్రించాలని కాదు. పడుకోవటానికి రెండు గంటల ముందే భోజనం ముగించాలి. ఒకవేళ కుదరకపోతే తక్కువ మొత్తంలో తినటం మంచిది. కెఫీన్‌తో కూడిన కాఫీ, కూల్‌డ్రింకులు.. మద్యం కూడా నిద్రను దెబ్బతీస్తాయి. కెఫీన్ మెదడును ఉత్తేజితం చేస్తే, మద్యం తరచూ మెలకువ వచ్చేలా చేస్తుంది.

మానసిక సమస్యలు: నిద్రకూ మానసిక ఆరోగ్యానికీ విడదీయరాని బంధముంది. నిద్రలేమితో మానసిక సమస్యలు చుట్టుముట్టొచ్చు. మానసిక సమస్యలు నిద్రనూ దెబ్బతీయొచ్చు. ఒత్తిడి, ఆందోళన వంటివి రాత్రంతా మెదడును చురుకుగా ఉంచేలా చేస్తాయి. దీంతో స్వతహాగా నిద్ర పట్టే ప్రక్రియ నిలిచిపోతుంది. దిగులు, నిరాశ, కుంగుబాటు వంటి ఇతర మానసిక సమస్యలూ నిద్రాభంగం కలిగించొచ్చు. ఫలితం మర్నాడు హుషారు తగ్గటం.

ఐరన్ తగ్గటం: ఒంట్లో ఐరన్ మోతాదులు తగ్గటమూ నీరసానికి కారణమవుతుంది. ఐరన్ లోపంతో రక్తహీనత మాత్రమే కాదు, కాళ్లలో చిరచిర (రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్) సమస్య కూడా తలెత్తొచ్చు. ఈ చిరచిర సమస్య గలవారికి కాళ్లు కదలకుండా ఉన్నప్పుడు లోపల ఏవో పాకుతున్నట్టు అనిపిస్తుంటుంది. దీంతో అదేపనిగా కాళ్లు కదిలిస్తుంటారు. ఇది రాత్రిపూటా ఇబ్బంది పెడుతుంది. నిద్రకు విఘాతం కలిగిస్తుంది.

డాక్టర్ దగ్గరికి ఎప్పుడు?: తగినంత సేపు నిద్రిస్తున్నా ఉదయం అలసటగా ఉంటున్నట్టు అనిపిస్తే కొన్ని జాగ్రత్తలు మేలు చేస్తాయి. రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం.. పడకగదిని చల్లగా, ప్రశాంతంగా ఉంచుకోవటం.. పడుకోవటానికి రెండు గంటల ముందు నుంచే గదిలో వెలుతురును తగ్గించుకోవటం.. వేళకు భోజనం చేయటం వంటివి కంటి నిండా నిద్ర పట్టటానికి తోడ్పడతాయి. అప్పటికీ ఫలితం కనిపించకపోతే డాక్టర్‌ను సంప్రదించాల్సిందే. స్లీప్ అప్నియా, థైరాయిడ్ సమస్యలు, హార్మోన్ల అస్తవ్యస్తం వంటివేవైనా ఉన్నాయేమో చూస్తారు. అవసరమైతే స్లీప్ స్టడీ, రక్త పరీక్షలు చేస్తారు. తగిన పరిష్కారం చూపిస్తారు.

ఈనాడు సినిమా

షేర్ ఆయా...!



ఈ వేసవిలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతున్న చిత్రాల్లో 'ది ప్యారడైజ్' ఒకటి. ప్రస్తుతం పరిచయ గీతం చిత్రీకరణ జరుగుతోంది. 'ఆయా షేర్...' అంటూ సాగే ఈ పాటని నానితోపాటు, వందలాది మంది డ్యాన్సర్ల నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. విజయవంతమైన 'దసరా' తర్వాత ఆదే కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మోహన్‌బాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన ప్రత్యేకమైన సెట్‌లో ప్రస్తుతం పాటని తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ స్వరపరిచిన ఈ పాటని, సుధన్ నృత్య దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని కనిపించే విధానం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని, పరిచయ గీతం సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు తెలిపాయి. రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.

ప్రేమ శాపమా..?

బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, త్రిప్తి డిమ్రీ జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ'రోమియో'. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే యాక్షన్ అవతారంలో షాహిద్‌ని పరిచయం చేసిన చిత్రబృందం.. సోమవారం ఈ సినిమాలో త్రిప్తి ఫస్ట్ లుక్‌ని పంచుకుంది. 'ప్రేమ అనేది.. అఫ్సాన్‌ని పట్టుకున్న ఓ శాపం' అనే వ్యాఖ్యతో పోస్టర్‌ని ఇన్‌స్టా వేదికగా ఆవిష్కరించింది. థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో త్రిప్తి అఫ్సాన్ అనే పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది. విక్రాంత్ మాస్సే, తమన్నా, దిశా పటానీ, నానా పటేకర్, అవినాశ్ తివారీ తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషిస్తున్నారు.



త్రిప్తి దిమ్రీ

ఓటీటీలో ఈ వారం

వినోదాలు పంచేందుకు కొత్త వారం రానే వచ్చింది. ఈసారి ఎంటర్‌టైన్ చేయనున్న కథలేంటోనని ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు సినీప్రియులు. ఓటీటీలు కూడా క్రేజీ కాంబోలు, వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సన్నద్ధమయ్యాయి. భావోద్వేగాలు పంచే సినిమాల నుంచి సీటు అంచున కూర్చోబెట్టే సిరీస్‌ల వరకు ఈ వారం వీక్షకులను అలరించేందుకు కొత్త కంటెంట్‌తో సిద్ధంగా ఉన్నాయి ఓటీటీలు.

కోహరా సీజన్ 2(సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
బేబీ గర్ల్(సినిమా)	గురువారం	సోనీలివ్
ప్రిడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్(సినిమా)	గురువారం	జియోహాట్‌స్టార్
జోస్ కాలేజ్ రోడ్ ట్రిప్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
లవ్ మీ లవ్ మీ(సినిమా)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ది ఆర్ట్ ఆఫ్ సారా(సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ది కంజురింగ్: లాస్ట్ రైట్స్(సినిమా)	శుక్రవారం	జియోహాట్‌స్టార్

శ్రీరామ్‌కి ఎదురైన సవాళ్లేంటి?



ఒక ఫ్యామిలీ ఇంత భయంకరంగా ఉంటుందని మొదటిసారి మిమ్మల్ని చూసిన తర్వాతే తెలిసిందని అంటున్నాడు నటుడు అలీ. మరి ఆయన చూసిన ఆ కుటుంబం ఎవరిది? తెలుసా? ఇంకెవరు మన శ్రీరామ్ ఫ్యామిలీ. గవర్నమెంట్ ఉద్యోగం చేసే శ్రీరామ్... భయపెడుతూ ఉండే భార్య, వైలెంట్ ఆలోచనల ముద్దుల కొడుకుతో సంతోషంగా ఉంటాడు. కానీ, ఇంతలోనే ఓ క్రైమ్ వాళ్ల జీవితంలో కొత్త సవాళ్లని తెచ్చిపెడుతుంది. మరి.. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియాలంటే శివాజీ, లయ ప్రధానపాత్రల్లో నటించిన 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రాన్ని చూడాల్సిందే. క్రైమ్ కామెడీ నేపథ్యంలో ఈ చిత్రాన్ని సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. ఈ సినిమాలో శ్రీరామ్ పాత్రలో శివాజీ ప్రేక్షకుల్ని అలరించనున్నాడు. భయపెడుతూనే నవ్విస్తున్న ఈ కుటుంబ కథాకమామీషు తెలుసుకోవాలంటే ఈ గురువారం నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రసారం కానున్న ఈ సినిమాని మీరూ చూసేయండి.

చారులత మనసుని రాజు గెలిచాడా?



బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక కష్టాలు తొలగిపోయి జీవితంలో స్థిరపడిపోవచ్చనుకుంటాడు రాజు. దాంతో చారులత మనసుని గెలుచుకోవాలని ప్రయత్నిస్తాడు. మరి, ఆ తర్వాత చారు తన జీవితంలోకి వచ్చిందా? రాజు కష్టాలు తొలగిపోయాయా? తెలియాలంటే నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'అనగనగా ఒక రాజు' చూడాల్సిందే. 'నాకు కాబోయే మావ గారికి ఇద్దరు, ముగ్గురు పిల్లలుంటే ఆయన ఎఫెక్షన్స్ డివైడ్ అయిపోతాయంటూ' ముగ్గుల పండక్కి థియేటర్లలో నవ్వుల పూయించాడు నవీన్. బాక్సాఫీస్ వద్ద రూ.వంద కోట్ల వసూళ్లు చేసిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయనుంది. బుధవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా వీక్షకులకు అందుబాటులోకి రానుంది.

ప్రేక్షకులకు 'హై' ఇవ్వాలి

"విభిన్నమైన స్క్రీన్‌ప్లేతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే సినిమా 'హై'" అన్నారు దర్శక నిర్మాత ఎస్.కృష్ణ. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో అనన్య శర్మ, పల్లవి దొర, కృష్ణ కమల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. హరీశ్ పెద్ది, శేఖర్ దివ్వెల నిర్మాణ భాగస్వాములుగా ఉన్నారు. సాయి కృష్ణ, రేవంత్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో వెంకటేశ్ సోమవారం ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



సురేశ్‌బాబు, అనిల్ రావిపూడి, ఎస్.కృష్ణ, దిల్‌రాజు, అనన్య

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కొత్త జానర్‌లో విభిన్నమైన స్క్రీన్‌ప్లేతో తీసిన చిత్రమిది. సంగీత పరంగానూ మరో స్థాయిలో ఉంటుంది. ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్లే ప్రేక్షకులకు మంచి హై ఇవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు. "దర్శకుడు, నటుడు, రచయిత, నిర్మాత.. ఇలా నాలుగు పాత్రలతో పరిచయమవుతున్న సాయికి శుభాకాంక్షలు. ఈ చిత్రంతో అందరికీ హై రావాలని కోరుకుంటున్నా" అన్నారు నిర్మాత దిల్‌రాజు. ఈ కార్యక్రమంలో హరీశ్ పెద్ది, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



అలియా భట్

ఎంత ఎత్తుకు ఎగురుతామనేది కాదు.. ఎంత దూరం వెళ్తున్నాం.. ఎంత కాలం ముందుకు సాగుతున్నామనేదే ముఖ్యమని అంటోంది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. వైవిధ్యమైన పాత్రలతో అలరించే ఈమె సందడి తెరపై కనిపించక ఏడాది కావొస్తుంది. ఇప్పుడా లోటును భర్తీ చేయడానికి ఈ సంవత్సరం వరుస సినిమాలతో మురిపించడానికి సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం 'ఆల్ఫా' చిత్రీకరణలో ఉన్న అలియా.. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది.

"ఈ వృత్తిలో ప్రతి ఒక్కరికీ సామాజిక మాధ్యమాల వల్ల ఒత్తిడి ఉంటుందనేది తెలిసిందే. నాకూ ఒక్కోసారి నిద్రలేవగానే ఈ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనిపిస్తుంది. కేవలం నటనపై దృష్టి పెట్టి ఒక నటిగా మాత్రమే ఉండాలని అనుకుంటా. నిరంతరం ఏదో ఒక చర్చలో పాల్గొనడం నాకు నచ్చదు. కానీ కెరీర్ ప్రారంభం నుంచి నన్ను ప్రోత్సహించిన ఎంతో మంది అభిమానులతో నాకున్న సంబంధాలు తెగిపోతాయి. అందుకే ఆ పని చేయలేకపోతున్నా. ప్రజల దృష్టిలో ఉండటమనేది నా వృత్తిలో భాగమైపోయింది. కానీ తల్లి అయిన తర్వాత నేను పంచుకోవడానికి సిద్ధంగా ఉన్న విషయాల పట్ల కొన్ని పరిమితులు విధించుకున్నా. ఎందుకంటే ఇప్పుడు నా వ్యక్తిగత జీవితం చాలా పర్సనల్ అయిపోయింది".

అందుకే ఆ పని చేయలేకపోతున్నా!

అవి తప్పుదోవ పట్టిస్తాయి

"నా వివాహ జీవితం గురించి ఎన్నో విధాలుగా మాట్లాడుకుంటారు ప్రేక్షకులు. మా పెళ్లికి సంబంధించిన మీమ్స్, విమర్శల్ని చూసి నేను, నా భర్త రణ్‌బీర్ నవ్వుకుంటాం. కానీ చాలా సార్లు వాటిని చూడము. అవన్నీ మా దాకా చేరవు. ఎందుకంటే అవి నిజం కాదు. సోషల్ మీడియా ద్వారా మా జీవితంలోని కొన్ని క్షణాల్ని మాత్రమే చూస్తారు. వాటిని సందర్భం లేకుండా చూసినప్పుడు అవి తప్పుదోవ పట్టించే అవకాశం ఉంటుంది. మా జీవితంలోకి చింత అనే మాటే రాదు. మీరు యాభై మంది ఉన్న గదిలో ఉంటే.. కేవలం నలుగురు మాత్రమే మిమ్మల్ని పట్టించుకుంటారు. మీ గురించి మాట్లాడుకుంటారు. కానీ వాళ్లు అనే మాటలు మీరు వినలేరు. దాని వల్ల మీ కుటుంబ సంబంధాలు ఏమైనా దెబ్బతింటున్నాయా? కలల్ని నిజం చేసుకోలేకపోతున్నారా? రోజూ కృతజ్ఞతా భావంతో నిద్రపోలేకపోతున్నారా? ఈ ప్రశ్నలకు నూటికి నూరు శాతం కాదనే సమాధానమే చెప్తా".

ఆయనే ఉదాహరణ

"కెరీర్‌లో మీరు ఒకటి, రెండు సార్లు విజయం సాధిస్తేనే సరిపోదు. నిరంతరం స్థిరంగా ఉంటూ విజయం సాధించాలి. అగ్రహీరో అమితాబ్ బచ్చన్‌నే ఉదాహరణగా తీసుకుందాం. ఆయన రాత్రికి రాత్రే స్టార్ కాలేదు. సంవత్సరాలుగా నిలకడగా ఉండటం వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నారు. నా భవిష్యత్తు గురించి ఒక్క విషయం కచ్చితంగా చెప్పగలను. నేను తప్పకుండా సినిమా సెట్‌లో ఉండాలి. ఎందుకంటే నేను నటించకుండా ఉండలేను. నటనతో పాటు నా సొంత నిర్మాణ సంస్థ కూడా నా భవిష్యత్తే. అన్ని విషయాలపై పట్టు సాధించి.. పదేళ్ల తర్వాత నేను అందరూ ఇష్టపడే సినిమాలు తీస్తానని ఆశిస్తున్నా".

నిర్మాణం ఎన్నో నేర్పింది

"'డార్లింగ్స్' సినిమాతో నిర్మాతగా తొలి అడుగు వేసిన నాకు.. చిత్ర నిర్మాణం ఎన్నో విషయాలను నేర్పింది. నా పాత్రను మాత్రమే కాకుండా స్క్రిప్ట్‌ను మొత్తం చూడటం, ప్రతి పాత్ర నుంచి సినిమాను ఊహించడం.. ఇలా సినిమాను చూసే విధానమే మారిపోయింది. ఒకరోజు షూటింగ్‌ను పూర్తి చేయడం ఎంత కష్టమో అర్థమయ్యింది. నిర్మాతల పట్ల గౌరవం పెరిగింది. సెట్‌లో నటీనటులు సౌకర్యవంతంగా ఉండటానికి నిర్మాతలు తెరవెనుక ఎలా కష్టపడుతున్నారో అనుభవపూర్వకంగా తెలుసుకున్నా".

నాకు అంతా మా నాన్నే!



అయానా, హేమంత్ కుమార్, గోపిక

హేమంత్ కుమార్ కథానాయకుడిగా నటిస్తూ... ఆయనే ఆనంద్‌కుమార్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'ఆల్ఫా'. అయానా, గోపిక సురేశ్ కథానాయికలు. విజయ్.ఎస్ దర్శకత్వం వహించారు. కన్నడ, తెలుగు భాషల్లో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. 'నేను బరిలోకి కొత్తగా వచ్చాను... ఆటకు కాదు', 'నాకు పాస్ట్, ప్రజెంట్, ఫ్యూచర్... అంతా మా నాన్నే' అంటూ హీరో చేసిన సందడి ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది. వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ "కన్నడ నుంచి వస్తున్న హీరోలంతా ఇక్కడ మంచి విజయాల్ని అందుకుంటున్నారు. యశ్, రిషబ్‌శెట్టిలా హేమంత్ కూడా తెలుగు ప్రేక్షకులకు చేరువవుతాడనే నమ్మకం ఉంది. ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది" అన్నారు. కథానాయకుడు, నిర్మాత హేమంత్‌కుమార్ మాట్లాడుతూ "నాకు తెలుగు సినిమాలంటే ఎంతో ఇష్టం. తెలుగులో నా సినిమా విడుదల అవుతుండడం ఆనందంగా ఉంది. కన్నడలో మా ట్రైలర్‌ని చూసి ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకొచ్చారు రవిశంకర్. తప్పకుండా ప్రేక్షకులకు వినోదం పంచుతాం" అన్నారు. ఈ చిత్రంలో పోలీసు అధికారి పాత్రలో నటించినట్టు చెప్పారు అయానా. తాను ఆకాంక్ష అనే యువతిగా కనిపిస్తానన్నారు గోపికా సురేశ్. ఈ కార్యక్రమంలో రవిశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీల్ని అమలు చేయాల్సిందే

సినీ కార్మికుల వేతనాలతోపాటు... ఇతర సమస్యలకు సంబంధించి గతేడాది సమ్మె సమయంలో ఇచ్చిన హామీల్ని పక్కాగా అమలు చేయాల్సిందే అని, లేదంటే మార్చి 1 నుంచి నిరసనకు దిగుతామంటూ పలు కార్మిక సంఘాలు కలిసి సినీ కార్మిక సమాఖ్యకు లేఖ రాశాయి. చలన చిత్ర వాణిజ్య మండలి, ప్రభుత్వ యంత్రాంగంతో చర్చలు జరిపి తమ సమస్యల్ని పరిష్కరించాలంటూ ఆయా సంఘాలు కార్మిక సమాఖ్యని కోరాయి. సమ్మె సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ చొరవ తీసుకున్నా ఇప్పటివరకూ తమ సమస్యలు పరిష్కారం కాలేదని, 11 విభాగాలకు చెందిన కార్మికులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ లేఖలపై కార్మిక సమాఖ్య కూడా స్పందించి ఈ నెలాఖరులోపు సమస్యల్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేయనున్నట్టు బదులిచ్చిందని స్పష్టం చేశారు.

చిత్రీకరణ మొదలు కాకుండానే తప్పుడు వార్తలు సృష్టిస్తున్నారు!



ప్రకాశ్‌రాజ్

ప్రభాస్ చిత్రం 'స్పిరిట్' సినిమాకి సంబంధించి తనపై నెట్టింట వస్తున్న వార్తలపై నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో ఏర్పడ్డ సృజనాత్మక విభేదాల వల్ల ఆయన ఈ చిత్రం నుంచి తప్పుకున్నట్లు గత రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రకాశ్‌రాజ్ సోమవారం సామాజిక మాధ్యమాల వేదికగా స్పష్టత ఇచ్చారు. "స్పిరిట్ చిత్రంపై విషపూరితంగా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న వాళ్లందరికీ ఒక్కటే చెబుతున్నా. ఈ సినిమాలో నా పాత్రకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణను మేమింకా ప్రారంభించలేదు. కానీ, వాట్సప్ ఫ్యాక్టరీలో ఊహాజనిత కథల్ని అల్లేస్తున్నారు. జీవితంలో బాధ్యతగా మాట్లాడండి" అంటూ తప్పుడు వార్తలు సృష్టిస్తున్న వారికి నవ్వుతూనే చురకలు అంటించారు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం పవర్‌ఫుల్ పోలీసు యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రకాశ్‌రాజ్‌తో పాటు వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అమ్మా.. నీ ఒడిలోకి తీసుకో

'ప్రపంచం భరించలేనంత భారంగా అనిపించినప్పుడు.. మనసు 'ఓ మాయిరీ' అని పిలుస్తుందీ అంటూ రెండవ గీతాన్ని విడుదల చేసింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' చిత్ర బృందం. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలోకి రానున్న సందర్భంగా చిత్ర బృందం సామాజిక మాధ్యమాల వేదికగా ఈ గీతాన్ని పంచుకుంది. విమర్శలు, వివాదాల నడుమ విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను రాబట్టిన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని కామాఖ్య నారాయణ్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా, అదితి భాటియా కీలకపాత్రలు పోషిస్తున్నారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన "అమ్మా.. నన్ను నీ ఒడిలోకి తీసుకో.. నా కలలు కాటుకలోనే జారిపోతున్నాయి.. ఎన్నో రాత్రులు నిద్రపోలేదు.. ఈ నిశ్శబ్దం భయంకరంగా ఉంది.. నిన్ను కౌగిలించుకుని ఏడవలేకపోతున్నా అమ్మా.." అంటూ సాగుతున్న ఈ పాట తల్లిదండ్రుల ప్రేమలో గారాబంగా పెరిగిన కూతురు నేపథ్య సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. తల్లిదండ్రులకు దూరంగా ఏదో సమస్యలో ఇరుక్కున్న యువతిగా ఉల్కాగుప్తా.. మదిని కదిలించే సన్నివేశాలతో ప్రేక్షకుడిలో భావోద్వేగాల్ని రేకెత్తించేలా ఉంది. శ్రేయా ఘోషల్ ఆలపించిన ఈ గీతానికి మనోజ్ సాహిత్యమందించారు. మన్నన్ షా స్వరాలు సమకూర్చారు.



'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'

'విప్లవ వీరుడు' ప్రారంభం



జైశ్వర్, సోనాలి

స్వతంత్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడిన ఓ సామాన్య యువకుడి కథతోనే 'విప్లవ వీరుడు' చిత్రం రూపొందుతోందని చెప్పారు సీనియర్ కథానాయిక ఇంద్రజ. ఆమె కీలక పాత్రలో... జైశ్వర్, సోనాలి జంటగా రూపొందుతున్న చిత్రమిది. ఎస్.నాగరాజ్ రావు దర్శకత్వం వహిస్తున్నారు. ఏవీ జయరాం నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ క్లాపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇంద్రజ మాట్లాడుతూ "సామాన్యులు విప్లవవీరులుగా అవతరించిన తీరు స్ఫూర్తిని రగిలిస్తుంది. నేను రాణి భవానిదేవి పాత్రలో కనిపిస్తాన"న్నారు. కథానాయకుడు జైశ్వర్ మాట్లాడుతూ "చరిత్రలో నిలిచిపోయే చిత్రమిది. బ్రిటిషర్లని ఎదురొడ్డిన విప్లవవీరుడి పాత్రని పోషిస్తుండడం ఎంతో గర్వంగా ఉంది" అన్నారు. చారిత్రక కథతో, తామందరం ఓ కలల సినిమాగా భావించి 'విప్లవవీరుడు'ని తెరపైకి తీసుకొస్తున్నామని చెప్పారు దర్శకుడు. "టిప్పు సుల్తాన్ కాలంనాటి కథ ఇది. చరిత్రని చెబుతూనే, నేటితరానికి ఓ గొప్ప సందేశం ఇచ్చే చిత్రం అవుతుంది" అన్నారు నిర్మాత ఏవీ జయరాం. పటేల్ అశోక్‌రెడ్డి, కిశోర్, రాగిణి ప్రజ్వల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మాధ్యూరాజన్, సంగీతం: ఉదయ్, కూర్పు: ఎమ్.ఎన్.ఆర్.

ట్రంప్ నిర్ణయం దెబ్బకు తిరుగు ప్రయాణం



తరుణ్ భాస్కర్, ఫరియా

అమెరికా వెళ్లాలన్నది ఆ యువకుడి కల. తాను కోరుకున్నట్టే విమానం ఎక్కేశాడు. కానీ విధి వక్రీకరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఓ నిర్ణయంతో ఆ యువకుడి ప్రయాణం యూటర్న్ తీసుకుంది. ఎలా వెళ్లాడో అలాగే తిరిగొచ్చేశాడు. ఆ తర్వాత అతనికి ఎదురైన పరిస్థితులు ఎలాంటివో తెలియాలంటే 'గాయపడ్డ సింహం' చూడాల్సిందే. తరుణ్ భాస్కర్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. ఫరియా అబ్దుల్లా కథానాయిక. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కల్యాణ చక్రవర్తి మంతెన, భానుకిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ నిర్మాతలు. పవన్ సాదినేని సమర్పకులు. వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని ఆవిష్కరించారు. పెళ్లిచూపులుపై నీ అభిప్రాయం ఏమిటి? అన్న సంభాషణ ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది. వేడుకని ఉద్దేశించి తరుణ్‌భాస్కర్ మాట్లాడుతూ "కొంతమందికి అమెరికా వెళ్లాలనే లక్ష్యం ఉంటుంది. నా స్నేహితుల్లోనే చాలామంది ఉన్నారు. కానీ చాలాసార్లు వీసాలు తిరస్కరణకు గురవుతుంటాయి. దానివెనక కారణాలు కొన్నిసార్లు నవ్వుకునేలా ఉంటాయి. అలాంటి అంశాలతోనే కశ్యప్ ఈ కథని రాసుకున్నాడు. తను కథ చెప్పగానే నాకు నచ్చేసింది. తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. థియేటర్లలో నవ్వులే నవ్వులు. పవన్ ఈ చిత్రానికి సమర్పకుడు కావడం ఆనందంగా ఉంది. మా నిర్మాతలకి కృతజ్ఞతలు. ఈ సినిమా చేయడం నాకు దక్కిన ఓ మంచి అవకాశంగా భావించా. ఫరియాతో నటించడం మంచి అనుభవం. చాలా మంచి సినిమా ఇది. అందరూ చూసి ఆస్వాదించేలా ఉంటుంది" అన్నారు. కథానాయిక ఫరియా మాట్లాడుతూ "చాలా అద్భుతమైన కథ ఇది. ప్రేక్షకుల్లో ఒకరిగా ఈ కథని విన్నా. చాలా నవ్వుకున్నా. ఈ సినిమా ప్రయాణం గుర్తుండిపోతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథ సిద్ధమయ్యాక నాకు తరుణ్ భాస్కర్ గుర్తొచ్చారు. ఆయనకు చెబితే ముందు చేయనన్నారు. కథ విని, తర్వాత నిర్ణయం తీసుకోమన్నా. కథ విన్న వెంటనే ఆయన సినిమా చేయడానికి అంగీకారం తెలిపార"న్నారు. నిర్మాతలు విజయ్‌కృష్ణ, భానుకిరణ్ మాట్లాడుతూ "స్నేహితులందరం కలిసి చేసిన ఓ మంచి సినిమా ఇది. హాస్యంతోపాటు, వినోదం ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

ఈనాడు బిజినెస్

11న ఎగుమతిదార్లతో గోయల్ సమావేశం

దిల్లీ: ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమ సంఘాలతో ఈ నెల 11న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమావేశం కానున్నారు. అమెరికా, ఐరోపా సమాఖ్యతో వాణిజ్య ఒప్పందాలు ఖరారు కానున్న నేపథ్యంలో ఆయన చర్చలు జరుపనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న తర్వాత, ఈ సమావేశం కీలకం కానుంది. ఈ ఒప్పందం ప్రకారం భారత ఎగుమతులపై సుంకాలను 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది.

● వాహనాలపై కోటా ఆధారిత సుంకం తగ్గింపు: అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై కోటా ఆధారిత సుంకం మినహాయింపును భారత్ ఇవ్వనుంది. ఆల్కహాలిక్ బెవరేజెస్‌పై ఇదే రకం సుంకాలను తగ్గించనుంది. ఇందుకు కనీస దిగుమతి ధర ఆధారిత పరిమితులను పరిగణనలోకి తీసుకోనుంది. ఒప్పందం ప్రకారం.. 30.94 బిలియన్ డాలర్ల భారత ఎగుమతులపై సుంకాలు 50% నుంచి 18 శాతానికి తగ్గనున్నాయి. మరో 10.03 బి.డాలర్ల ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను తొలగించనున్నారు.

అరబిందో ఫార్మా లాభం రూ.910 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 2025-26 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం గడిచిన ఇదే కాలంతో పోలిస్తే 7.6 శాతం వృద్ధితో రూ.910.29 కోట్లకు చేరింది. 2024-25 మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.845.81 కోట్లుగా ఉంది. కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.7,978.52 కోట్ల నుంచి 8.4 శాతం వృద్ధితో రూ.8,646 కోట్లకు చేరింది. ఐరోపా మార్కెట్, యూఎస్ రెగ్యులేటెడ్ విభాగాల్లో విక్రయాలు ఈ వృద్ధికి దోహదం చేశాయి. అమెరికా మార్కెట్లో రూ.3,729 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 9 ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. ఐరోపా ఆదాయం 27.4 శాతం పెరిగి, రూ.2,703 కోట్లకు చేరింది. ఏపీఐ వ్యాపారం 4.3 శాతం క్షీణించి, రూ.963 కోట్లకు పరిమితమైంది. విద్యుత్ ఖర్చుల ఆదాలో భాగంగా గడచ రెన్యూవబుల్స్‌లో రూ.66 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఖర్చులను తగ్గించుకునే దిశలో భాగంగా తన అనుబంధ సంస్థ ఆరో వ్యాక్సిన్స్‌లో మరో అనుబంధ సంస్థ క్యూరిటెక్ బయోలాజిక్స్‌ను విలీనం చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా పునీత్ కుమార్ సిన్హాను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 'మా ప్రధాన మార్కెట్లైన అమెరికా, ఐరోపాల్లో గిరాకీ నిలకడగా ఉంది. దీంతో ఈ త్రైమాసికంలో స్థిరమైన పనితీరు కనబరిచింది. భవిష్యత్తులోనూ వృద్ధి వ్యూహాత్మకంగా ముందుకెళ్తాం' అని సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానంద రెడ్డి వెల్లడించారు.

కోడి గుడ్డు


10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	515
తూ/ప గోదావరి	485
విశాఖపట్నం	490
చిత్తూరు	563

2026-27లో భారత వృద్ధి 6.4%

దిల్లీ: భారత వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో 6.4 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. తద్వారా జీ-20 దేశాల్లో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తుందని తెలిపింది. దేశీయంగా బలమైన గిరాకీ పరిస్థితులు, విధానపరమైన నిర్ణయాలు, బ్యాంకింగ్ వ్యవస్థలో స్థిరత్వం లాంటి అంశాలు ఇందుకు దోహదం చేస్తాయని విశ్లేషించింది. ఆస్తుల నాణ్యత విషయంలో భారత బ్యాంకింగ్ వ్యవస్థ ప్రదర్శన మెరుగ్గా ఉంటుందని తెలిపింది.

సాఫ్ట్‌వేర్‌కు ఇబ్బందేమీ లేదు



● ఏఐ టూల్స్ వల్ల ఉత్పాదకత పెరుగుతుంది
● ఆవిష్కరణలు వేగవంతమవుతాయి
● నూతన ఉత్పత్తులకు నిపుణులు కావాల్సిందే

ఈనాడు వాణిజ్య విభాగం: సాఫ్ట్‌వేర్‌తో పాటు సాఫ్ట్‌వేర్ టూల్స్‌కు కృత్రిమమేధ (ఏఐ) సాంకేతికత, దాని ఆధారిత అధునాతన టూల్స్ ప్రత్యామ్నాయంగా మారతాయన్న ఆందోళనలు అంతర్జాతీయంగా పెరుగుతున్నాయి. ఐటీ కంపెనీల భవితకు పెను ముప్పు ముంచుకొస్తోందని, వాటిల్లో పనిచేసే లక్షల మంది నిపుణులకు పని లేకుండా పోతుందని ఆందోళనలు రేగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లు మరింత ఎక్కువగా స్పందిస్తున్నందున, ఐటీ కంపెనీల షేర్లు నష్టపోతున్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌కు వచ్చిన ఇబ్బందేమీ ఉండదనే భరోసాను గూగుల్, ఎన్‌విడియా వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల సీఈఓలతో పాటు.. ప్రస్తుత ఆందోళనకు కారణమైన ఆంథ్రోపిక్ సంస్థ సహ వ్యవస్థాపకురాలే స్వయంగా విశదీకరిస్తున్నారు.

ఇదీ నేపథ్యం

'వివిధ రంగాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ నిపుణులు చేసే పనులను' తమ అధునాతన క్లాడ్ కోవర్క్ ప్లాట్‌ఫామ్ స్వతంత్రంగా చేయగలదని అమెరికాకు చెందిన ఏఐ డెవలపర్ సంస్థ ఆంథ్రోపిక్ ప్రకటించడం, ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంపై అమిత ప్రభావం చూపింది. 2030 కల్లా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభస్థాయి ఉద్యోగాలను సగం వరకు ఏఐ భర్తీ చేయొచ్చని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమొడెయి పేర్కొనడం సంచలనమైంది. ఇప్పటికే వినియోగిస్తున్న ఏఐ టూల్స్ కేవలం ఇచ్చిన డేటా నుంచి కావాల్సిన సమాచారాన్ని ఇవ్వడం, క్రమపద్ధతిలో అమర్చడం వంటివి చేస్తున్నాయి. అయితే ఆంథ్రోపిక్ టూల్ మాత్రం కావాల్సిన సమాచారాన్ని కూడా అదే ఎంచుకుని, పనిని పూర్తి చేస్తుందని ప్రకటన వచ్చింది.

దిగ్గజాల భరోసా

చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఎన్‌విడియా సీఈఓ జెన్‌సన్ హువాంగ్ మాత్రం సాఫ్ట్‌వేర్‌కు ఏఐ ప్రత్యామ్నాయం అవుతుందనే వాదనను తోసిపుచ్చుతున్నారు. ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ఆధారితంగానే ఏఐ పనిచేస్తుందని సిస్కో సిస్టమ్స్ నిర్వహించిన సదస్సులో జెన్‌సన్ వివరించారు. జనరల్ - ఆర్టిఫిషియల్ రోబో అయినా ఉన్న టూల్స్ వినియోగిస్తుందే కానీ, కొత్త టూల్స్ కనిపెట్టదని ఆయన పేర్కొన్నారు.

● గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ నిపుణుల ఉత్పాదకత పెరుగుతుందని, వారు మరింత ప్రభావవంతంగా పని చేసేందుకు ఉపకరిస్తాయని చెబుతున్నారు. ఒకే తరహా పనులను మళ్లీమళ్లీ చేయాల్సిన అవసరం లేకుండా, ఆటోమేట్ చేయడానికి ఏఐ ఉపయోగ పడుతుందని బ్లూమ్‌బర్గ్ టెక్ సమావేశంలో పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆటోమేషన్ వల్ల ఉద్యోగులు అవసరం ఉండకుండా పోవచ్చనే వాదనలు గత 20 ఏళ్లుగా వినిపిస్తూనే ఉన్నాయని.. అయితే ఏటా కొత్త ఉద్యోగాలు టెక్నాలజీ రంగంలో వస్తూనే ఉన్నాయని సుందర్ పిచాయ్ గుర్తు చేశారు. గూగుల్ కోడ్‌లో 30% ఏఐ నుంచే జరుగుతోందని, కొత్త ఉత్పత్తి ఆవిష్కరణను ఏఐ వేగవంతం చేస్తోందని సుందర్ పిచాయ్ వివరించారు. కొత్త ఉత్పత్తి కోసం మరింత మంది ఉద్యోగులు కావాల్సి వస్తారని విశ్లేషించారు. మనిషితో సమానంగా/అంత కంటే మెరుగ్గా కార్యకలాపాలను నిర్వహించే ఏఐ వ్యవస్థ అయిన ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) సాకారం చేయొచ్చా అన్న ప్రశ్నకు 'ఇప్పటివరకు దీనిపై ఎవరికీ స్పష్టత ఉందని నేననుకోను' అని సుందర్ పిచాయ్ బదులిచ్చారు.

కోడింగ్‌కు ప్రాధాన్యం తగ్గుతోంది.. ఉద్యోగులకు కాదు

ఏఐ టూల్స్ అంతకంతకూ సమర్థంగా మారుతున్నందున, కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గుతోందని.. అయితే ఉద్యోగులకు కాదని ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకురాలు డేనియల అమోడెయ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సాహిత్యం చదివిన ఆమె, తదుపరి ఓపెన్‌ఏఐలో పనిచేసి, తదుపరి తన సోదరుడితో కలిసి ఆంథ్రోపిక్‌ను ప్రారంభించారు. ఏఐ కంపెనీలు ఎలాంటి ఉద్యోగులను నియమించుకుంటాయో ఆమె వివరించారు. పూర్తిగా టెక్నాలజీ నైపుణ్యాలున్న వారి కంటే కమ్యూనికేషన్, కల్పనాశక్తి కలిగినవారికి, కొత్తవాటిపై అమితాసక్తి కనబరచేవారికి ఏఐ కంపెనీలు నియామకాల్లో ప్రాధాన్యమిస్తాయని వివరించారు. ఉద్యోగులను ఏఐ భర్తీ చేయనుందంటూ వచ్చిన వార్తలు పూర్తిగా అతిశయోక్తితో కూడుకున్నవని స్పష్టం చేశారు. 'మనుషుల ప్రమేయం లేకుండా, పూర్తిగా ఏఐ చేయగల పనులు అత్యంత స్వల్పం' అని ఆమె స్పష్టం చేశారు. మేము కూడా ఆంథ్రోపిక్ కోసం ఉద్యోగులను నియమించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కమ్యూనికేషన్స్ సామర్థ్యాలు కలిగిన వారిని, భావోద్వేగాలను అర్థం చేసుకుని, ఉపయోగించగలిగిన వారిని, ఇతరుల పట్ల సానుకూల/దయార్ద్ర హృదయంతో స్పందించే వారికి ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణులు, ఏఐ కలిస్తే మరింత మెరుగైన ఉత్పాదకత లభిస్తుందని వివరించారు. కఠిన సవాళ్లను, ఆసక్తికర ఆవిష్కరణలను సాధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఈ ఏడాది చివరికి మెడికవర్ ఐపీఓ

రూ.150 కోట్లతో కోకాపేటలో హాస్పిటల్



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ కోకాపేటలో కొత్త హాస్పిటల్‌ను నెలకొల్పింది. ఆంకాలజీ సహా అన్ని రకాల స్పెషాలిటీ విభాగాలతో ఈ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు, మెడికవర్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ జి.అనిల్ కృష్ణ తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టామని, మరో రూ.50 కోట్లు అవసరమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో కలిపి మొత్తం 24 ఆసుపత్రులున్నాయని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ రంగానికి రూపాయి భారం: డాలరుతో పోలిస్తే రూపాయి విలువ క్షీణించడంతో పాటు మరికొన్ని కారణాల వల్ల వైద్య ఉపకరణాలు, ఇంప్లాంట్ల ధరలు బాగా పెరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా కేంద్ర బడ్జెట్లో బయోఫార్మా, ఆరోగ్య సేవలకు ఆర్థిక మంత్రి తగిన ప్రాధాన్యం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. కేన్సర్‌తో పాటు అరుదైన వ్యాధుల చికిత్సలో వినియోగించే మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించినందున, ఎంతో మంది రోగులకు మేలు జరుగుతుందన్నారు. వైద్య సేవల నిపుణులకు తగిన శిక్షణ ఇవ్వడానికి రూ.100 కోట్ల నిధి ఏర్పాటు ఆహ్వానించదగిన నిర్ణయమని పేర్కొన్నారు.

వార్షికాదాయం రూ.2,100 కోట్లు

మెడికవర్ హాస్పిటల్స్ ఐపీఓ సన్నాహాలపై స్పందిస్తూ, ఈ సంవత్సరాంతానికి పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2,100 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసే అవకాశం ఉందని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ.2,800 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు.



తొలి కారును జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్, టీఎంపీవీ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్

తమిళనాడులో టీఎంపీవీ ప్లాంట్

ఈనాడు-చెన్నై: తమిళనాడులోని రాణిపేట జిల్లా పనపాక్కంలో కొత్త తయారీ ప్లాంట్ కార్యకలాపాలను ప్రారంభించినట్లు టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ప్రకటించింది. విద్యుత్ కార్లు సహా కొత్త తరం టీఎంపీవీ, జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) కార్లను ఇక్కడ తయారు చేయనున్నారు. ఈ తయారీ ప్లాంట్‌పై రూ.9,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు టీఎంపీవీ వెల్లడించింది. దీంతో వచ్చే 5-7 ఏళ్లలో మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 2.5 లక్షల కార్లకు పెరగనుంది ఈ ప్లాంట్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. ఇక్కడ తొలిసారిగా తయారైన జేఎల్ఆర్ రేంజ్ రోవర్ ఎవోక్ కారును స్టాలిన్‌తో కలిసి టాటా సన్స్, టీఎంపీవీ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ జెండా ఊపి ప్రారంభించారు.

యూపీఐ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ కోసం

కొత్త ఈపీఎఫ్ఓ యాప్



దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులు, తమ ఈపీఎఫ్‌లో ఉన్న సొమ్మును యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఉపసంహరించుకునే సదుపాయం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుంది. ఇందు కోసం సరికొత్త ఈపీఎఫ్ఓ మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈపీఎఫ్‌లో కొంత భాగం మినహా మెజారిటీ వాటాను చందాదారులు తమ బ్యాంకు ఖాతాలోకి యూపీఐ ద్వారా ఉపసంహరించుకునే సౌలభ్యాన్ని తీసుకొచ్చే ప్రాజెక్టుపై కార్మిక శాఖ పనిచేస్తుంది. ఈపీఎఫ్ఓ సరికొత్త మొబైల్ యాప్‌ను తీసుకురానుందని, ఇందులో సభ్యులు యూపీఐ ద్వారా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని, పాస్‌బుక్ బ్యాలెన్స్ వంటి ఇతర సేవలను కూడా పొందొచ్చని వెల్లడించాయి. కొత్త మొబైల్ యాప్‌లో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసేందుకు ఎంత ఈపీఎఫ్ మొత్తం అందుబాటులో ఉంది అనే వివరాలను చందాదారులు తెలుసుకోవచ్చు.

● చందాదారులు లావాదేవీలను పూర్తి చేయడానికి, వారి బ్యాంక్ ఖాతాలకు నిధులు భద్రంగా వెళ్లడానికి లింక్ చేసిన యూపీఐ పిన్‌ను వినియోగించాలి. సేవలను మెరుగుపరచడానికి, సాంకేతిక లోపాలను తొలగించడానికి ప్రస్తుతం 100 డమ్మీ ఖాతాలతో ఈపీఎఫ్ఓ ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ యాప్‌ను తీసుకొచ్చేందుకు కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది.

పెరిగిన అపోలో మైక్రో సిస్టమ్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: రక్షణ రంగంలోని అపోలో మైక్రో సిస్టమ్స్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలో అత్యధికంగా రూ.252.22 కోట్ల ఆదాయంపై రూ.22.88 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.148.39 కోట్లు, నికర లాభం రూ.18.24 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 70%, నికర లాభం 25% వరకూ పెరిగాయి. 9 నెలల కాలానికి రూ.611 కోట్ల ఆదాయం, రూ.70.59 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఫలితాల సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి స్పందిస్తూ.. ఆర్డర్ బుక్‌ను సమర్థంగా అమలు చేయడం, అనేక హై-వాల్యూ సిస్టమ్స్ ఉత్పత్తి దశకు చేరుకోవడం వల్లే ఈ రికార్డు స్థాయి ఆదాయం సాధ్యమయ్యిందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 45-50 శాతం వరకూ వృద్ధిని సాధిస్తామని పేర్కొన్నారు.

తగ్గిన కావేరీ సీడ్స్ లాభం

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో కావేరీ సీడ్ కంపెనీ లిమిటెడ్ రూ.217.91 కోట్ల ఆదాయంపై, రూ.12.68 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.2.76గా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.185.41 కోట్లు, నికర లాభం రూ.14.85 కోట్లుగా ఉన్నాయి. మొత్తం తొమ్మిది నెలల కాలంలో ఆదాయం రూ.1,311.13 కోట్లు, నికర లాభం రూ.323.64 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.63.50గా నమోదయింది. గ్రూపు అనుబంధ సంస్థ డిసెంబరు 31 నాటికి రూ.5.31 కోట్ల నష్టాలను చవిచూసింది. ఈ కంపెనీ ప్రస్తుత అప్పులు దాని ఆస్తుల కంటే ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల ఆ సబ్సిడరీ కార్యకలాపాలు కొనసాగించడంపై అనిశ్చితి ఉందని ఆడిటర్ల నివేదిక పేర్కొంది.

తాజ్ జీవీకే లాభం రూ.37 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఆతిథ్య రంగంలోని తాజ్ జీవీకే హోటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.138.31 కోట్ల ఆదాయం, రూ.36.99 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.128.66 కోట్లు, నికర లాభం రూ 41.18 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం పెరిగింది. నికర లాభం తగ్గింది. మొత్తం తొమ్మిది నెలల కాలంలో ఆదాయం రూ.355.72 కోట్లు, నికర లాభం రూ.90.52 కోట్లుగా ఉన్నాయి. ముంబయిలోని తాజ్ శాంతాక్రూజ్ హోటల్‌ను నిర్వహించే గ్రీన్‌వుడ్స్ ప్యాలెసెస్‌లో కంపెనీ తన వాటాను 51 శాతానికి పెంచుకోనుంది. దీనికోసం రూ.16.09 కోట్లు వెచ్చించనుంది. ఈ ప్రక్రియ పూర్తయితే, అది జాయింట్ వెంచర్ కంపెనీ నుంచి అనుబంధ సంస్థగా మారుతుంది. అతిథులకు మెరుగైన సేవలను అందించేందుకు కంపెనీ మరమ్మతు పనులు చేపట్టింది. హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్, చండీగఢ్‌లోని తాజ్ చండీగఢ్, చెన్నైలోని తాజ్ క్లబ్ హౌస్‌లో గదులను ఆధునీకరించినట్లు వెల్లడించింది.

ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఆదాయం రూ.1,943 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా (బజాజ్ ఎలక్ట్రానిక్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,943 కోట్ల ఆదాయాన్నీ, రూ.29.65 కోట్ల నికర లాభాన్నీ నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.1,807.44 కోట్లు, నికర లాభం రూ.33.50 కోట్లుగా ఉన్నాయి. 2025-26 మొత్తం 9 నెలల కాలంలో ఆదాయం రూ.5,276.75 కోట్లు, నికర లాభం రూ.67.40 కోట్లుగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఐక్యూ రిటెయిల్ స్టోర్లను విక్రయించినట్లు సంస్థ పేర్కొంది. కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా సంస్థ ఉద్యోగుల ప్రయోజనాలకు రూ.4.2 కోట్లను ఈ త్రైమాసికంలో కేటాయించారు. ఇది లాభాలపైన ప్రభావం చూపించిందని సంస్థ వివరించింది.

విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు

గత రెండేళ్లలో జారీ చేసిన డీజీసీఏ

దిల్లీ: గత రెండేళ్లలో పలు నిబంధనల ఉల్లంఘన కారణంగా వాణిజ్య విమానయాన సంస్థలకు మొత్తంగా 352 షోకాజ్ నోటీసులను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసింది. 2024 జనవరి 1 నుంచి 2025 డిసెంబరు 31 వరకు ఇండిగోకు 98, ఎయిరిండియాకు 84 షోకాజ్ నోటీసులు వచ్చాయని రాజ్యసభకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమర్పించిన వివరాల ప్రకారం తెలుస్తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు 65, స్పైస్‌జెట్‌కు 45, ఆకాశ ఎయిర్‌కు 17, అలయన్స్ ఎయిర్‌కు 23, ఫ్లై బిగ్‌కు 12, ఏఐఎక్స్ కనెక్ట్‌కు 8, స్టార్ ఎయిర్‌కు ఒకటి చొప్పున షోకాజ్ నోటీసులు అందాయి. అయితే వీటిల్లో ఏఐఎక్స్ కనెక్ట్ ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో విలీనం అయ్యింది. ఈ 352 షోకాజ్ నోటీసుల్లో 139 నోటీసులకు సంబంధించి విమానయాన సంస్థలకు జరిమానా విధించారు. మరో 113 షోకాజ్ నోటీసుల వ్యవహారంలో విమానయాన సంస్థలకు డీజీసీఏ హెచ్చరిక ఆదేశాలను జారీ చేసింది. కేవలం 7 నోటీసుల విషయంలో సంతృప్తికర వివరణ అందినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది.

● 2024-25లో భారత విమానయాన సంస్థల మొత్తం నష్టం రూ.5,289.73 కోట్లుగా నమోదైందని రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా గ్రూపు ఒక్కటే రూ.9,808.12 కోట్ల నష్టాన్ని చవిచూసిందని వెల్లడించారు. ఇందులో ఎయిరిండియా నష్టం రూ.3,975.75 కోట్లు కాగా.. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నష్టం రూ.5,832,37 కోట్లు. అలాగే ఆకాశ ఎయిర్ రూ.1,986.25 కోట్ల నష్టాన్ని నమోదుచేసింది. మొత్తం 11 విమానయాన సంస్థల్లో నాలుగే- ఇండిగో, బ్లూ డార్ట్, స్టార్ ఎయిర్, ఇండియావన్ ఎయిర్ లాభాలను నమోదు చేశాయి.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో కంపెనీల చట్టం నిబంధనల ఉల్లంఘనకు గాను 703 కంపెనీలపై మొత్తంగా రూ.55 కోట్ల జరిమానా విధించినట్లు లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. ఇందులో రూ.7.51 కోట్లే వసూలైనట్లు వెల్లడించారు.

● ధరల పెంపు విషయంలో ఉక్కు తయారీ సంస్థలు కుమ్మక్కయ్యాయనే ఆరోపణల వ్యవహారంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తు నిర్వహిస్తోందని ప్రభుత్వం తెలిపింది. అలాగే యాంటీ కాంపిటీటివ్ విధానాల కింద 54 కేసులు నమోదయ్యాయని, 149 విలీన దరఖాస్తులు వచ్చాయని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

మార్కెట్లకు వాణిజ్య ఒప్పందం జోష్

రూ.6.03 లక్షల కోట్లు పెరిగిన కంపెనీల మార్కెట్ విలువ

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.2,254.64 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4.15 కోట్లు



సెన్సెక్స్ ▲ 485 84066 | నిఫ్టీ ▲ 174 25867

భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో టారిఫ్ అనిశ్చితులు సమసిపోయి దేశీయ మార్కెట్లలో జోష్ కనిపించింది. ఎఫ్ఐఐలు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడం కలిసొచ్చింది. పీఎస్‌యూ బ్యాంకులు ఊహించిన దాని కంటే మంచి పని తీరు కనబరుస్తుండటంతో పీఎస్‌యూ బ్యాంక్ సూచీ రాణించింది. ఫలితంగా వరుసగా రెండో రోజూ దేశీయ సూచీలు రాణించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఒక పైసా నష్టపోయి 90.66 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.81 శాతం తగ్గి 67.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు కూడా ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.03 లక్షల కోట్లు పెరిగి, రూ.473.34 లక్షల కోట్ల (5.24 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

● సెన్సెక్స్ ఉదయం 84,177.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,580.40 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 83,860.42 పాయింట్ల కనిష్ఠాన్ని తాకినా, 84,314.68 పాయింట్ల గరిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. చివరకు 485.35 పాయింట్ల లాభంతో 84,065.75 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 173.60 పాయింట్లు లాభపడి 25,867.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,922.25-25,780.90 పాయింట్ల మధ్య కదలాడింది.

● సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. ఎస్‌బీఐ 7.46%, టైటన్ 2.78%, టాటా స్టీల్ 2.56%, అల్ట్రాటెక్ సిమెంట్ 2.52%, ఎటర్నల్ 1.91%, బీఈఎల్ 1.85%, కోటక్ బ్యాంక్ 1.52%, ట్రెంట్ 1.30% చొప్పున పెరిగాయి. పవర్‌గ్రిడ్ 1.11%, ఐటీసీ 1.07%, ఎన్‌టీపీసీ 0.89%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.68%, ఇన్ఫోసిస్ 0.65% మేర నష్టపోయాయి.

● త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో **జేకే టైర్** షేరు బీఎస్ఈలో 2.42% లాభపడి రూ.555.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఒక దశలో 6.91% పెరిగి రూ.579.90 స్థాయిని కూడా తాకింది.

● డిసెంబరు త్రైమాసిక లాభం 90.36 శాతం పెరిగి రూ.416.29 కోట్లకు చేరడంతో, **కల్యాణ్ జువెలర్స్** షేరు బీఎస్ఈలో 15.26 శాతం పెరిగి రూ.437.75 వద్ద ముగిసింది.

● దేశంలో అధిక గిరాకీ ఉన్న లాజిస్టిక్స్ హబ్‌లలో విద్యుత్ వాహన (ఈవీ) ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు **జియో-బీపీతో** ఒప్పందం కుదుర్చుకున్నట్లు విద్యుత్ వాణిజ్య వాహన తయారీ సంస్థ **యూలర్ మోటార్స్** వెల్లడించింది.

● యూనికార్న్ **జెట్వెర్క్** ఎలక్ట్రానిక్స్ వ్యాపార అధిపతి జోష్ ఫౌల్గర్ కంపెనీకి రాజీనామా చేసి, దాని పోటీ సంస్థ డిక్సన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ పాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీఈపీఎల్)లో చేరారని నియంత్రణ సంస్థలకు సమాచారం అందింది.

● ఇ-కామర్స్ దిగ్గజం **ఫ్లిప్‌కార్ట్** బిజినెస్ ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా విపిన్ కపూరియా, మానవ వనరుల వైస్ ప్రెసిడెంట్‌గా యోగితా షాన్‌బాగ్‌లను నియమించింది. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది.

● **ఆయ్ ఫైనాన్స్** ఐపీఓకు మొదటి రోజు 12 శాతమే స్పందన లభించింది.

● **ఫ్రాక్టల్ అనాలటిక్స్** ఐపీఓకు మొదటి రోజు 9 శాతం స్పందన లభించింది.

ఎస్‌బీఐ అదుర్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంతో, బీఎస్ఈలో షేరు 7.46 శాతం పెరిగి రూ.1,145.95 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో రూ.1,148 స్థాయిని కూడా తాకింది. ఇది 52 వారాల గరిష్ఠ స్థాయి కావడం విశేషం.

శాఫ్రాన్‌లో 60 మంది టెక్నీషియన్ల నియామకం

హైదరాబాద్: ఎయిర్‌బస్ ఏ320 నియో, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో వినియోగించే లీప్ ఇంజిన్ల కోసం ఏర్పాటు చేసిన నిర్వహణ మరమ్మత్తు ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) యూనిట్ కోసం 60 మంది టెక్నీషియన్లను శాఫ్రాన్ నియమించుకుంది. గతేడాది నవంబరులో హైదరాబాద్‌లో శాఫ్రాన్ ఎంఆర్ఓను ప్రారంభించారు. ఈ ఏడాదిలో కార్యకలాపాలు మొదలుకానున్నాయి. ఏడాదికి 300 ఇంజిన్‌లను నిర్వహించే సామర్థ్యం ఇక్కడ ఉంది. పూర్తి సామర్థ్యంలో యూనిట్ మొదలైతే, 250 మందికి పైగా ఉద్యోగులు పనిచేయనున్నారు.

సంక్షిప్తాలు

● **స్పెషాలిటీ ఉక్కు**కు మూడో విడత ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా 55 కంపెనీలతో 85 ఎంఓయూలను ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈ 55 కంపెనీలు మొత్తంగా రూ.11,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు హామీ ఇచ్చాయి.

● గత సంవత్సరం రైల్వేల ద్వారా 5.85 లక్షల కార్లను సరఫరా చేసినట్లు **మారుతీ సుజుకీ ఇండియా** తెలిపింది. 2024తో పోలిస్తే ఈ సంఖ్య 18 శాతం ఎక్కువ. కర్బన ఉద్గారాలు, దేశ చమురు దిగుమతులు తగ్గించేందుకు తోడ్పడే ఉద్దేశంతో రైళ్ల ద్వారా కార్ల సరఫరాను పెంచుతున్నట్లు వెల్లడించింది.

● గిఫ్ట్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ వద్ద అనుబంధ సంస్థ ఏర్పాటు నిమిత్తం సెబీ నుంచి అనుమతులు లభించాయని **ఐఐఎఫ్ఎల్ కేపిటల్ సర్వీసెస్** తెలిపింది.

● **మధ్య, చిన్న తరహా సంస్థలకు** (ఎంఎస్ఈలు) హామీ రహిత రుణాల మంజూరు పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. సంస్థల ఆర్థిక పరిస్థితి, సక్రమంగా రుణాల చెల్లింపును పరిగణనలోకి తీసుకొని రూ.25 లక్షల వరకు కూడా ఎంఎస్ఈలకు బ్యాంకులు రుణాలు ఇవ్వొచ్చని తెలిపింది.

● 2025-26 మార్కెటింగ్ సంవత్సరంలో భారత్‌లో వంట నూనెల ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులుగా ఉండొచ్చని **ఇండియన్ వెజిటబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్** (ఐవీపీఏ) అంచనా వేసింది. దేశీయ గిరాకీ అవసరాలను తీర్చేందుకు 16.6 మిలియన్ టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం సోయాబీన్ నూనెను అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి; పామాయిల్‌ను మలేసియా, ఇండోనేసియా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది.


● ఫ్రాన్స్ సంస్థ **థేల్స్** భారత్‌లో 450 మంది వృత్తి నిపుణులను నియమించుకునే యోచనలో ఉంది. బెంగళూరు, నొయిడా వద్ద ఉన్న కేంద్రాల్లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సిస్టమ్ డొమైన్స్‌కు సంబంధించిన విభాగాల్లో ఈ నియామకాలను చేపట్టాలని అనుకుంటోంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
బీఎస్ఈ	602	220	1,334	829
గ్లాక్సో స్మిత్‌క్లైన్ ఫార్మాస్యూటికల్స్	296	230	1,041	949
బాటా ఇండియా	66.1	58.70	944.68	918.79
రామ్‌కో సిమెంట్స్	385.63	181.58	2,105.68	1,983.45
జ్యోతి ల్యాబ్స్	81.12	87.41	739.61	703.71
జైడస్ లైఫ్‌సైన్సెస్	1,042.10	1,023.50	6,864.50	5,269.10
పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్	77	81	1,201	1,470
గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్	77.11	98.17	999.92	904.88
శ్రీ లోటస్ డెవలపర్స్	70.22	51.35	239.78	123.59
స్కై గోల్డ్ అండ్ డైమండ్స్	80.53	36.53	1,775.12	1,005.09
సీగాల్ ఇండియా	72.4	70.7	991.1	830.5
కెప్టెన్ పాలీప్లాస్ట్	9.47	6.73	127.22	90.90
సర్దా ఎనర్జీ అండ్ మినరల్స్	190	200	1,360	1,319

బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభం!

- స్టార్మర్‌కు పదవీ గండం
- పార్టీ నేతల శరణు కోరిన ప్రధాని
- ఎప్‌స్టీన్ ఫైళ్ల కలకలం



లండన్: రాజకీయ అనిశ్చితికి మారుపేరైన బ్రిటన్‌లో మళ్లీ సంక్షోభం తలెత్తింది. లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్న పార్టీ సీనియర్ నేత మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించిన ప్రధాని కీర్ స్టార్మర్ పదవీ గండాన్ని ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన పార్టీ ఎంపీల శరణు కోరారు. ప్రధానిగా స్టార్మర్ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నరే అయింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం వెలుగులోకి రాగానే మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించినా స్టార్మర్‌పై విమర్శల దాడి ఆగలేదు. ఆదివారం ప్రధాని చీఫ్ ఆఫ్ స్టాఫ్ మోర్గాన్ మెక్ స్వీనీ రాజీనామా చేశారు. బాధ్యతంతా తనదేనని అంగీకరించి ముప్పు తొలగించుకోవాలని చూశారు. క్రమంగా ఆయన లేబర్ పార్టీ ఎంపీల మద్దతును కోల్పోతున్నారు. దీంతో ఆయన ఎంపీలతో రహస్యంగా సమావేశమవుతున్నారు.

✦ మాండెల్సన్‌ను అమెరికా రాయబారిగా నియమించిన విషయంలో గత వారం స్టార్మర్ క్షమాపణలు చెప్పారు. తాను అతడి అబద్ధాలను నమ్మానని ఆవేదన వ్యక్తం చేశారు. మాండెల్సన్ నియామకానికి సంబంధించిన పత్రాలను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై ఆయన అబద్ధాలు చెప్పారని ఆరోపణలున్నాయి.

పోలీసుల దర్యాప్తు

15 ఏళ్ల కిందట సున్నితమైన ప్రభుత్వ సమాచారాన్ని ఎప్‌స్టీన్ అందజేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాండెల్సన్‌పై పోలీసు దర్యాప్తు జరుగుతోంది. ఇది నిరూపితమైతే ఆయనకు జీవిత ఖైదు పడే అవకాశముంది. అయితే మాండెల్సన్‌పై ఎటువంటి లైంగిక దాడుల ఆరోపణలు రాలేదు. దీంతో ఆయనను అరెస్టు చేయలేదు. అభియోగాలను మోపలేదు.

ప్రకంపనలతో స్వీనీ రాజీనామా

2020లో లేబర్ పార్టీ నేతగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్టార్మర్‌కు అత్యంత సన్నిహిత సహచరుడిగా మెక్ స్వీనీ ఉన్నారు. 2024 జులైలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఘన విజయంలో ఆయన పాత్ర ఎంతో ఉంది. ఆ తర్వాత ఆయన తీసుకున్న తప్పుడు నిర్ణయాలవల్ల పార్టీ ప్రతిష్ఠ మసకబారింది.

ప్రధానికి కొంత సమయం!

మెక్ స్వీనీ రాజీనామా చేయడంతో ప్రధాని స్టార్మర్‌కు కొంత సమయం లభించినట్లేనని లేబర్ పార్టీ నాయకులు కొందరు చెబుతున్నారు. ఈలోగా ఆయన పార్టీ నేతల్లో విశ్వాసాన్ని ప్రోది చేసుకునే అవకాశముందని అభిప్రాయపడ్డారు. మెక్ స్వీనీ విభజన రాజకీయాలు చేసేవారని, ఆయన వైదొలగడంతో పార్టీని మళ్లీ గాడిలో పెట్టడానికి అవకాశం లభించిందని సీనియర్ చట్టసభ సభ్యులు ఎమిలీ థార్న్‌బెర్రీ పేర్కొన్నారు. స్టార్మర్ మంచి నేతేనని, ఆయన బలమైన, స్పష్టత కలిగిన నాయకుడని ఆమె తెలిపారు. స్వీనీ రాజీనామాతో స్టార్మర్ బలహీనపడతారని మరికొంత మంది నేతలు అభిప్రాయపడుతున్నారు.

✦ స్టార్మర్ ఒకదాని వెంట మరొక తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రతిపక్ష టోరీ పార్టీ నేత కెమీ బడెనోక్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయనకు పదవీ గండం పొంచి ఉందని అభిప్రాయపడ్డారు.

✦ స్టార్మర్ రాజీనామా చేయాలని స్కాట్లాండ్ లేబర్ పార్టీ నేత అనాస్ సర్వర్ డిమాండ్ చేశారు.

పాలనలో తడబాటు

14ఏళ్ల పాలనలో చోటుచేసుకున్న పొరపాట్లను సరిదిద్దుతానని అధికారంలోకి వచ్చిన స్టార్మర్.. హామీలను నిలబెట్టుకోలేకపోతున్నారు. ఆర్థిక వృద్ధి, ప్రజాసేవల దిద్దుబాటు, జీవన వ్యయాన్ని తగ్గిస్తానన్న ఆయన విమర్శలకు గురవుతున్నారు. తప్పుడు నిర్ణయాలు, యూటర్న్‌ల ద్వారా అభాసు పాలవుతున్నారు.

మళ్లీ ఎన్నికలు అవసరం లేదు

బ్రిటన్ పార్లమెంటరీ వ్యవస్థలో ఒక ప్రధాని రాజీనామా చేసినా, పార్టీలో అసమ్మతి తలెత్తినా మళ్లీ ఎన్నికలు జరగాల్సిన అవసరం లేదు. ఆయన స్థానంలో మెజారిటీ ఉన్న పార్టీకి చెందిన ఎంపీలు.. మరో అభ్యర్థిని ఎన్నుకుంటారు.

✦ 2019 ఎన్నికల్లో గెలిచిన కన్జర్వేటివ్ పార్టీ తరఫున ముగ్గురు ప్రధానులుగా పని చేశారు. అందులో 49 రోజులు పని చేసిన లిజ్ ట్రస్‌తోపాటు భారత సంతతికి చెందిన రిషి సునాక్ ఉన్నారు.

వారసులెవరు?

ఒకవేళ స్టార్మర్ వైదొలగాల్సి వస్తే ఆయన వారసులెవరనే చర్చ అప్పుడే మొదలైంది. ఆరోగ్య మంత్రి వెస్ స్ట్రీటింగ్, మాజీ ఉప ప్రధాని ఏంజెలా రేనర్, మాజీ మంత్రి యాండీ బర్న్‌హామ్, హోం మంత్రి షబానా మహమూద్, ఇంధనశాఖ మంత్రి ఎడ్ మిలిబాండ్ రేసులో ఉన్నారు.

యువరాజు, యువరాణిల ఆవేదన

ఎప్‌స్టీన్ సెక్స్ స్కాండల్‌లో మైనారిటీ బాధితుల పక్షాన బ్రిటన్ యువరాజు విలియం, యువరాణి కేథరీన్ ఆవేదన వ్యక్తం చేశారు. 30 లక్షల పేజీల్లో ఎంతో మంది బాధితులు ఉండటం తమను కలచివేసిందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వారు పేర్కొన్నారు. అయితే ఈ కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ యువరాజు ఆండ్రూ పేరును వారు ప్రస్తావించలేదు.


పారిస్ కల్చరల్ సెంటర్ పదవికి రాజీనామా

పారిస్: ఎప్‌స్టీన్ ఫైళ్లలో పేరున్న ఫ్రాన్స్ మాజీ మంత్రి జాక్ లాంగ్.. పారిస్ కల్చరల్ సెంటర్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌తో ఆయనకు ఆర్థిక సంబంధాలున్నాయని వెల్లడైంది. ఫ్రాన్స్ మిట్టరాండ్ హయాంలో సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రిగా జాక్ లాంగ్ పని చేశారు. తమ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా 86 ఏళ్ల లాంగ్‌కు ఫ్రాన్స్ విదేశాంగశాఖ ఆదివారం సమన్లు జారీ చేసింది. కానీ ఆయన అంతకుముందే రాజీనామా చేశారు.

నార్వే రాయబారి..

ఓస్లో: ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య 1990లలో శాంతి కోసం ప్రయత్నాలు చేసిన నార్వే రాయబారి మోనా జూల్స్ రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపణలొచ్చిన నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆమె ఇటీవలి వరకూ జోర్డాన్‌లో పని చేశారు. ఇటీవలే ఆమె సస్పెండయ్యారు.

ఎప్‌స్టీన్ మరణ ప్రకటన ఒక రోజు ముందే తయారు చేశారా?



ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మన్‌హట్టన్ జైల్లో మృతి చెందారు. అయితే ఆయన మరణ ప్రకటన ఒక రోజు ముందే తయారు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ఆ తేదీ ఆగస్టు 9గా ఉండటం సంచలనంగా మారింది. ఎప్‌స్టీన్ తన జైలు గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని అప్పట్లో అధికారులు ధ్రువీకరించారు. అయితే అతడి మరణంపై అప్పటి నుంచే అనుమానాలున్నాయి. ఆగస్టు 9 రాత్రి 10.30 గంటల సమయంలో ఆరెంజ్ రంగు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి ఎప్‌స్టీన్ జైలు గదివైపు కదులుతున్నట్లుగా కొన్ని సీసీ టీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా విడుదలైన రికార్డుల్లో ఆ కదులుతున్న వ్యక్తి ఖైదీ కావొచ్చని పేర్కొనగా.. న్యాయశాఖ మాత్రం అతడు జైలు అధికారి అని చెబుతోంది. ఎప్‌స్టీన్ చనిపోయారని గుర్తించిన తర్వాత తీసిన ఫొటోలను తాజాగా బహిర్గతం చేశారు. ఎప్‌స్టీన్ మరణించారని గుర్తించిన 16 నిమిషాల తర్వాత స్ట్రెచర్‌పై ఉన్న అతడిని బతికించేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నట్లుగా ఓ చిత్రంలో కనిపించింది. ఉదయమే ఆయన మృతిని ధ్రువీకరించిన తర్వాత తీసిన ఫొటోల్లో ఆయన తప్పుగా రాయడం అనుమానాలకు తావిస్తోంది.

హైస్పీడ్ కారిడార్ల పనులు వేగవంతం

- మొదలైన రైల్వే మంత్రిత్వ శాఖ చర్యలు

దిల్లీ: దేశంలో కొత్తగా చేపట్టదలచిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల పనుల్ని వేగవంతం చేయడంపై రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. దేశంలో భారీ ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక కేంద్రాలను అనుసంధానించేలా హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణెల మధ్య, వారణాసి నుంచి దిల్లీ, సిలిగుడీకి, ముంబయి-పుణె, చెన్నై-బెంగళూరు మధ్య అధిక వేగంతో రైళ్లను నడిపే కారిడార్లు సిద్ధం చేయనున్నట్లు బడ్జెట్ ప్రతిపాదించిన నేపథ్యంలో రైల్వేబోర్డులో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ పనుల్లో ఫలితాలు పూర్తిగా కనిపించేలా తక్షణ కార్యాచరణ చేపట్టాలని 'నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్'ను ఆదేశించారు. నిధుల సాధ్యాసాధ్యాలపై కచ్చితమైన అంచనాలతో సవివర పథక నివేదిక (డీపీఆర్)లను తాజా పరచాలని, దేశవ్యాప్తంగా ఒకే తరహా వ్యవస్థలు ఉండేలా హైస్పీడ్ వ్యవస్థల్ని ప్రామాణీకరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా కీలక విభాగాలను ఏర్పాటుచేయాలని, నిర్మాణ పనులు మొదలయ్యేందుకు ముందే జరగాల్సిన రాతకోతలు సహా వివిధ పనులను ఆరంభించాలని తెలిపింది. భారీగా పనులు చేపట్టడానికి వీలుగా సుశిక్షితులైన సాంకేతిక సిబ్బందిని సమకూర్చుకునే ప్రణాళికలు రూపొందించాలంది.

థాయ్‌లాండ్ ఎన్నికల్లో పాలక పార్టీ ఆధిక్యం

బ్యాంకాక్: థాయ్‌లాండ్ పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన మంత్రి అనుటిన్ చార్న్ విరాకుల్ నాయకత్వంలోని మితవాద బూమ్ జైతే పార్టీ అత్యధిక సీట్లు గెలుచుకొన్నది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష ప్రోగ్రెసివ్ పార్టీ మెజారిటీ సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. ఆ పార్టీ రాజధాని బ్యాంకాక్, దాని పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువ సీట్లు గెలవగా, ఇతర ప్రాంతాల్లో పాలక బూమ్ జైతే పార్టీ ఆధిక్యం చాటుకుంది. 500 సీట్లు గల థాయ్ పార్లమెంటులో పాలక బూమ్ జైతే సోమవారం వరకు 193 స్థానాలు దక్కించుకుంది. ప్రోగ్రెసివ్ పార్టీ 118 సీట్లతో వెనుకబడి ఉంది. ప్రభుత్వం ఏర్పాటుకు 251 సీట్లు కావాలి.

పాదచారుల పైకి దూసుకెళ్లిన లంబోర్గిని..

- ఆరుగురికి తీవ్ర గాయాలు



కాన్పుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌లో ఓ యువకుడు లంబోర్గిని కారుతో బీభత్సం సృష్టించాడు. వేగంగా వచ్చి పాదచారుల పైకి దూసుకెళ్లాడు. మొదట ఓ ఆటోను ఢీకొట్టిన లగ్జరీ కారు.. అనంతరం పాదచారుల పైకి దూసుకువెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ఉండే ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్ర కుమారుడు శివమ్ మిశ్ర ఆదివారం మద్యం మత్తులో లంబోర్గినిని వేగంగా నడుపుతుండగా అదుపు తప్పి.. రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి దూసుకెళ్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో శివమ్ మిశ్ర పేరు లేదని, కానీ, అతడిని దర్యాప్తు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

ముగ్గురు భార్యల 'కథ'లో గందరగోళం!

- అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో కొత్త వాస్తవాలు

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల తండ్రి చేతన్ కుమార్ చెప్పే సమాధానాలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. తాను వివాహం చేసుకున్న మహిళలు ముగ్గురూ అక్కాచెల్లెళ్లని చేతన్ చెప్పగా, దర్యాప్తులో అది అవాస్తమని తేలింది. వారు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు కాదని, మూడో భార్య టీనా 2018లో అతడి వద్ద ఉద్యోగినిగా పని చేసినట్లు వెల్లడైంది. 2010లో సుజాతను వివాహం చేసుకున్నానని.. తమకు పిల్లలు పుట్టకపోవడంతో 2013లో హీనాను పెళ్లి చేసుకున్నట్లు చేతన్ తెలిపారు. కానీ, మొదటి భార్య కుమార్తెకు ప్రస్తుతం 16 ఏళ్ల వయసు ఉండడంతో అతడి మాటలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివాహ పత్రాల ఆధారంగా ముగ్గురితో చేతన్‌కు ఏ సంవత్సరాల్లో వివాహం జరిగిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా, 2015లో చేతన్ సహజీవన భాగస్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

- ఛాతీ ఇన్ఫెక్షన్‌గా నిర్ధారించిన వైద్యులు

పుణె: ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్(85) సోమవారం అస్వస్థతకు గురయ్యారు. దగ్గుతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఆయన్ను బారామతి నుంచి పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో శరద్ పవార్ వెంట ఆయన కుమార్తె, లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సూలే, ఆమె భర్త సదానంద్ సూలే ఉన్నారు. పవార్‌కు సీటీ స్కాన్ పరీక్ష నిర్వహించిన వైద్యులు ఆయనకు ఛాతీ ఇన్ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స కొనసాగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు చెప్పారు. గతంలో నోటి క్యాన్సర్ బారిన పడిన పవార్ పలు శస్త్ర చికిత్సల అనంతరం దాన్నుంచి కోలుకున్నారు.

వలసదారుల పడవ మునిగి 53 మంది మృతి!

- లిబియా తీరంలో ఘోర విషాదం

కైరో: అక్రమ వలసదారులతో ఐరోపా వెళుతున్న ఓ పడవ లిబియా తీరంలో మునిగి 53 మంది గల్లంతయ్యారు. ఇందులో ఇద్దరు శిశువులు కూడా ఉన్నారు. వీరంతా మరణించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. గురువారం రాత్రి లిబియాలోని జావియా నగరం నుంచి వీరు ప్రయాణిస్తున్న పడవ బయల్దేరింది. ఆరు గంటల తర్వాత మునిగిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు నైజీరియన్ మహిళలు ప్రాణాలతో బయటపడ్డారు. లిబియా అధికారులు వారిని రక్షించారు. దీంతో 2026లోనే ఇప్పటివరకూ ఈ మార్గంలో ప్రాణాలు కోల్పోయిన, లేదా గల్లంతైన వలసదారుల సంఖ్య 484కి చేరింది. ఆఫ్రికాలో వివిధ దేశాలకు చెందిన ప్రజలు మెరుగైన జీవితం కోసం ఐరోపాకు వెళ్లేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి లిబియా నుంచి చిన్న చిన్న పడవల్లో ప్రయాణిస్తారు. ఇవి తరచూ ప్రమాదానికి గురవుతుంటాయి.


కుల్దీప్ సెంగార్ కేసును 3 నెలల్లో తేల్చండి

- దిల్లీ హైకోర్టుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

దిల్లీ: ఉన్నావో అత్యాచార బాధితురాలి తండ్రి పోలీస్ కస్టడీలో మృతి చెందిన కేసులో తనను దోషిగా తేల్చి శిక్ష విధించడాన్ని సవాల్ చేసిన కుల్దీప్ సింగ్ సెంగార్ పిటిషన్‌పై సత్వరమే విచారణ జరపాలని దిల్లీ హైకోర్టును సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. మూడు నెలల్లోగా నిర్ణయం వెలువరించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం స్పష్టం చేసింది. సెంగార్ పిటిషన్‌తో పాటు అత్యాచార బాధితురాలి కుటుంబం అభ్యర్థనలు ఏమైనా ఉంటే వాటినీ పరిశీలించాలని తెలిపింది. తనకు విధించిన పదేళ్ల జైలు శిక్షను రద్దు చేయడానికి దిల్లీ హైకోర్టు నిరాకరించడంతో సెంగార్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత

- రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన మోదీ



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయిన సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ

దిల్లీ: హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య దిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం రూ. 1,500 కోట్ల (175 మిలియన్ అమెరికన్ డాలర్ల) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులతో సీషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా మోదీతో హెర్మినీ సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సుస్థిరత, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సీషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగు దేశమని ప్రధాని పేర్కొన్నారు. 'భారత్-సీషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సీషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం' అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు చెప్పారు.

నేడు, రేపు తాజ్‌మహల్ మూసివేత

సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ, తన భార్య వెరోనిక్ హెర్మినీతో కలిసి మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించనున్నారు. ఈ క్రమంలో ఉదయం 9:00 నుంచి 11:30 వరకు సాధారణ సందర్శకులకు ప్రవేశం నిలిపివేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా మంగళవారం థాయ్‌లాండ్ యువరాణి సిరివన్నవారీ నరీరతన కూడా ఆగ్రాకు రానున్నారు. ఆమె ఫిబ్రవరి 11 ఉదయం తాజ్ మహల్‌ను సందర్శిస్తారు. ఈ క్రమంలో భద్రత కారణాల వల్ల రెండురోజులపాటు పర్యాటకుల ప్రవేశం ప్రభావితమవుతుందని అధికారులు తెలిపారు.

ఫోర్బ్స్ స్టార్ నుంచి పోలీసు కస్టడీకి

- సీఈవో రూ.500కోట్ల స్కామ్..!



ఇంటర్నెట్ డెస్క్: గురుగ్రామ్‌లోని ప్రముఖ లగ్జరీ హబ్ '32 అవెన్యూ' ఇప్పుడు రూ.500 కోట్ల కుంభకోణానికి కేంద్ర బిందువైంది. రైజింగ్ బిజినెస్ స్టార్‌గా ఫోర్బ్స్ జాబితాలో చేరిన ఈ కంపెనీ సీఈవో ధ్రువ్ శర్మను పోలీసులు రియల్ ఎస్టేట్ మోసం కేసులో అరెస్ట్ చేయడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

స్కాం బయటపడిందిలా..

ధ్రువ్ శర్మ కంపెనీ తమను మోసగించిందంటూ ఈ ఏడాది జనవరి 2న ట్రామ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. 32 అవెన్యూ బిల్డింగ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న 3,000 చదరపు అడుగుల కమర్షియల్ యూనిట్‌ను రూ.2.5 కోట్లతో కొనుగోలు చేసేందుకు 2021 సెప్టెంబరులో తాము ధ్రువ్ శర్మ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు ట్రామ్ సంస్థ తెలిపింది. డబ్బులు పూర్తిగా చెల్లించినప్పటికీ.. ఇప్పటివరకూ ఆ ఆస్తిని తమ పేరు మీదకు బదలాయించలేదని పేర్కొంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఒకే ఆస్తిని పాతికమందికి అమ్మేసి..

ఇదే ఆస్తిని ధ్రువ్ శర్మ 2022-23 మధ్య 25 మందికి విక్రయించాడు. దీన్ని దాచిపెట్టేందుకు ప్రతిసారీ విక్రయం పూర్తయిన తర్వాత ఆ ప్రాపర్టీని 30 ఏళ్ల వరకు లీజుకు తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకోసం కొనుగోలుదారులకు ప్రతీనెలా అద్దె కూడా చెల్లించేవాడు. అయితే, 2025 ఆగస్టు నుంచి ఆ చెల్లింపులు ఆగిపోయాయి. బాధితులంతా '32 అవెన్యూ' ఆఫీసుకు వెళ్లగా ఈ మోసం బయటపడింది. దీంతో గురుగ్రామ్ ఆర్థిక నేరాల విభాగం దీనిపై కేసు నమోదు చేసుకొని గతవారం ధ్రువ్ శర్మను అరెస్టు చేసింది. అనంతరం కోర్టులో హాజరుపర్చగా.. న్యాయస్థానం అతడిని పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కుంభకోణం విలువ దాదాపు రూ.500కోట్లు ఉంటుందని పోలీసుల అంచనా. ఈ కేసును ఈడీకి అప్పగించాలని యోచిస్తున్నారు.

ఎవరీ ధ్రువ్ శర్మ..

34 ఏళ్ల ధ్రువ్ శర్మ అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి 2013లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ఆ మరుసటి ఏడాది భారత్‌కు తిరిగొచ్చి 'గెస్ట్‌హౌసర్' పేరుతో వెకేషన్ పోర్టల్‌ను ప్రారంభించాడు. 2015లో '32 అవెన్యూ'ను ఏర్పాటుచేసి ఓ లగ్జరీ హబ్‌గా మార్చాడు. ఈ భవనంలోని ప్రముఖ రెస్టరంట్లు, రిటైల్ అవుట్‌లెట్లు వంటివి స్థానికంగా బాగా ప్రాచుర్యం పొందాయి. 2019లో ఫోర్బ్స్ 30 అండర్-30 ఆసియా జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఈ కంపెనీకి దిల్లీ ఎన్సీఆర్, హైదరాబాద్, గోవాలో రియల్‌ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోలు ఉన్నాయి.

వెనెజువెలాలో మచాడో సన్నిహితుడి అపహరణ

కారకాస్: వెనెజువెలాలో తనకు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన హ్వాన్ పాబ్లో గ్వానీపా అపహరణకు గురైనట్లు ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరీనా మచాడో సోమవారం తెలిపారు. నికోలస్ మదురోను (వెనెజువెలా మాజీ దేశాధ్యక్షుడు) అమెరికా నిర్బంధించి తీసుకెళ్లిన అనంతరం కొలువుదీరిన డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వం పలువురు రాజకీయ ఖైదీలను ఆదివారం విడుదల చేసింది. అలా విడుదలైనవారిలో ఒకరైన గువానిపాను దేశ రాజధాని నగరంలోని ఒక ఆవాస ప్రాంతం నుంచి ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని మచాడో తన సోషల్ మీడియా ప్రకటనలో తెలిపారు. అపహరణకు గురైన గ్వానీపా గతంలో గవర్నర్‌గా పనిచేశారు. 8 నెలలుగా ఆయన నిర్బంధంలో ఉన్నారు. "మన దేశం పూర్తిగా మారిపోయిందని నేను నమ్ముతున్నాను. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిన దేశాన్ని నిర్మించుకోవడంపై మనందరం ఇక దృష్టి సారించాలి" అని జైలు నుంచి విడుదలైన వెంటనే ప్రకటించిన గ్వానీపా అంతలోనే అపహరణకు గురికావడం కలకలం రేపింది. ఫెరో పెనాల్ సంస్థకు చెందిన ఆల్ఫ్రెడో రోమిరో ఈ అపహరణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ''ఆయనను అపహరించింది ఎవరో ఇంకా తేలలేదు. గ్వానీపాను తక్షణం విడుదల చేస్తారని ఆశిస్తున్నాను'' అని ఆల్ఫ్రెడో పేర్కొన్నారు.

కారుణ్య నియామకాల్లో పారదర్శకతకు పాతర

- ప్రభుత్వ విభాగాలపై సమాచార కమిషన్ ఆగ్రహం

దిల్లీ: కారుణ్య నియామకాలపై వివిధ ప్రభుత్వ విభాగాలు పారదర్శకత లేకుండా వ్యవహరిస్తున్నాయని, ఇది పరిపాలనాపరమైన లోపాలకు దారితీస్తోందని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) పేర్కొంది. ఈ విషయంపై ప్రభుత్వ విభాగాల్లో పారదర్శకత లేమి అనేక వివాదాలకు, వ్యాజ్యాలకు, ఆర్టీఐ దరఖాస్తుల పెరుగుదలకు కారణమవుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక కారుణ్య నియామకానికి సంబంధించి కేంద్ర జీఎస్టీ విభాగం, లఖ్‌నవూలోని కేంద్ర ఎక్సైజ్ విభాగాలు నియామక స్క్రీనింగ్ కమిటీ రికార్డులను బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఇలాంటి వ్యవహారాల్లో గోప్యత జవాబుదారీతనానికి భంగకరమని సమాచార కమిషనర్ వినోద్‌కుమార్ తివారీ పేర్కొన్నారు. ఒక కారుణ్య నియామక విషయాన్ని ఏదైనా ప్రభుత్వ విభాగానికి సంబంధించిన స్క్రీనింగ్ కమిటీ పరిశీలనకై స్వీకరిస్తే అందుకు సంబంధించిన రికార్డులు ఆర్టీఐ పరిధిలోకి వస్తాయని తివారీ పేర్కొన్నారు. ఏదైనా కారుణ్య నియామక విషయాన్ని స్క్రీనింగ్ కమిటీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు అందుకు సంబంధించిన రికార్డులు, స్క్రీనింగ్ కమిటీ సమావేశ వివరాలు, మార్కింగ్ విధాన ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్టు సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్) పరిధిలోకి వస్తాయని కమిషన్ తెలిపింది. ఈ సమాచారం కోసం చేసిన దరఖాస్తులకు అస్పష్టమైన సమాధానాలు చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించడం పారదర్శకతకు పాతరేయడమేనని అభిప్రాయపడింది.

35 ఏళ్ల తర్వాత ఇంట ఆడ బిడ్డ జననం



ఈటీవీ భారత్: ఆ కుటుంబంలో 35 ఏళ్ల తర్వాత ఆడ బిడ్డ జన్మించింది. ఇంకేముంది.. సంబరాలు అంబరాన్నంటాయి. హరియాణాలోని సోనీపత్ జిల్లా మహ్లానా గ్రామంలో ఓ ఇంట 35 ఏళ్ల తర్వాత ఆడ బిడ్డ పుట్టడంతో జనవరి 6వ తేదీన సంబరాలు చేసుకున్నారు. సమీపంలోని 130 గ్రామాల నుంచి బంధు మిత్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆడ బిడ్డలు గర్వకారణమని చాటారు. ఆసుపత్రి నుంచి తల్లీ బిడ్డలను భారీ ర్యాలీ ద్వారా ఇంటికి తీసుకొచ్చారు. ఆ పాపకు మీనాక్షి అని పేరు పెట్టారు. ఆడ పిల్లలు మగ పిల్లలకు ఏ మాత్రం తీసిపోరని చాటిచెప్పడానికి ఈ పండగ జరిపామని పాప తండ్రి రోహిత్ తెలిపారు.

సామాజిక మాధ్యమాల్లో నరవణె పుస్తకం

- ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దిల్లీ పోలీసులు

దిల్లీ: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ" పుస్తకం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. "సంబంధిత అధికారుల అనుమతి లేకుండానే ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం సోషల్ మీడియా వేదికలు, ఆన్‌లైన్ వార్తా సంస్థల ద్వారా ప్రచారంలో ఉండటాన్ని దిల్లీ పోలీసులు పరిగణనలోకి తీసుకున్నారు'' అని ఓ అధికారిక ప్రకటన వివరించింది. ఈ పుస్తక ప్రచురణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి ఇంకా లభించాల్సి ఉందని కూడా తమ దృష్టికి వచ్చిందని పోలీసులు పేర్కొన్నారు. "దీనిపై విచారణ జరపగా పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రచురణకు ముందు రూపొందించిన పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్లలో అందుబాటులో ఉందని తేలింది. కొన్ని మార్కెటింగ్ వేదికలు ఈ పుస్తకానికి సంబంధించిన కవర్ పేజీని కూడా ప్రదర్శిస్తూ పుస్తకం కొనుగోలుకు అందుబాటులో ఉందన్న భావన కలిగిస్తున్నాయి'' అని పోలీసులు వివరించారు. దీనిపై ఒక ప్రత్యేక సెల్ కేసు నమోదు చేసిందని, ఈ వ్యవహారంపై సంపూర్ణంగా దర్యాప్తు జరుపుతామని వారు స్పష్టం చేశారు. చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద విషయాలు వెల్లడించిన ఈ పుస్తకం ఇంకా ప్రచురణకే నోచుకోలేదని లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొనగా, పుస్తకాన్ని మోదీకే అందిస్తానంటూ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దాని ప్రతిని సభకు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా ప్రచురణకు నోచుకోని పుస్తకంలోని విషయాలను సభలో ప్రస్తావించడానికి వీల్లేదంటూ స్పీకర్ పేర్కొన్నారు. ఈ పుస్తకంలో నరవణె వెల్లడించిన వివరాలపై లోక్‌సభలో గత వారం భారీ స్థాయిలో రచ్చ జరిగింది.

సూరజ్‌కుండ్‌లో ఆకట్టుకుంటున్న ట్రాన్స్‌జెండర్ స్టాల్

ఈటీవీ భారత్



హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఆత్మనిర్భర్ (క్రాఫ్ట్స్) మేళాలో ట్రాన్స్‌జెండర్ ఏర్పాటు చేసిన స్టాల్ పలువురిని ఆకట్టుకుంటోంది. రష్మీ అనే ట్రాన్స్‌జెండర్ ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆమె ఆర్టిఫీషియల్ ఆభరణాలు, పెయింటింగ్‌లు, మహిళల బ్యాగులను విక్రయిస్తున్నారు. రెండేళ్ల కిందట ఈ వ్యాపారానికి శ్రీకారం చుట్టానని, ఇప్పుడు విజయవంతంగా సాగుతోందని ఆమె వివరించారు. 15 ఏళ్లపాటు బిచ్చమెత్తుకుని బతికానని, ఇప్పుడు గౌరవంగా జీవిస్తున్నానని తెలిపారు. తన స్టాల్‌లో ఉన్న వాటిని తానే తయారు చేస్తానని వెల్లడించారు. తొలుత పెయింటింగ్ నేర్చుకున్నానని, ఆ తర్వాత ఆభరణాలను తయారు చేస్తున్నానని వివరించారు.

పొద్దున పాఠాలు.. మధ్యాహ్నం వ్యవసాయం



ఉద్యోగం చేస్తూనే వ్యవసాయం చేయడం లాభదాయకమని, అది ఉత్తమ ఉపాధి మార్గమని నిరూపిస్తున్నారు.. ఒడిశాకు చెందిన సైన్స్ లెక్చరర్. ఉదయం పాఠాలు మధ్యాహ్నం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ (కూరగాయలు, వరి, చేపలు పెంపకం ఇలా రకాల సాగు) చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు.

బాలేశ్వర్‌లోని తలనగర్ ప్రాంతానికి చెందిన ప్రమోద్ కుమార్ రౌత్ (44 ఏళ్లు) బహనగర్ కళాశాలలో సైన్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచే ఆయనకు వ్యవసాయం అంటే మక్కువ. దీంతో తనకున్న 6 ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ చేస్తున్నారు. కూరగాయలు, 3 నెలల సింధు వరి, బంతి పూలు, థాయ్ బొప్పాయి, ఆవాలు, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, పశు పోషణ, అరటి, ఆలుగడ్డ, ఉల్లిపాయ ఇలా అన్ని రకాల సాగును ఒకే చోట చేస్తున్నారు. ఈ వ్యవసాయం ద్వారా ఆయనకు సంవత్సరానికి రూ.5 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. ఆయన లేనప్పుడు భార్య ప్రియదర్శిని దాస్ వ్యవసాయాన్ని చూసుకుంటారు. రెండు చెరువుల్లో చేపలు, ఒక చెరువులో రొయ్యల పెంపకం చేపట్టారు. వీటితో ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. ఈ వ్యవసాయం ద్వారా మరో 10 మందికి ఆయన ఉపాధి కల్పించారు.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



★ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ఆర్‌వీఎన్ఎల్ అనేది రైల్వే మంత్రిత్వశాఖ పరిధి లోని ఓ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.)
జ: సలీం అహ్మద్

★ ఇజ్రాయెల్ శాంతి బహుమతి–2026ను ఎవరికి ప్రకటించారు? (80 ఏళ్లలో ఈ ఇజ్రాయెల్ అత్యున్నత పౌర గౌరవాన్ని ఇజ్రాయెల్‌కు చెందని వ్యక్తికి ప్రకటించడం ఇదే తొలిసారి.)
జ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

★ అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తిచేసిన రెండో భారత మహిళా క్రికెటర్‌గా ఇటీవల ఎవరు ఘనత సాధించారు? (ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్. అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తి చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా ఇంగ్లండ్ క్రీడాకారిణి ఛార్లెట్ ఎడ్వర్డ్స్ రికార్డు సృష్టించారు. మొత్తం మీద అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తిచేసిన నాలుగో క్రీడాకారిణిగా తాజాగా ఈ భారత మహిళా క్రికెటర్ నిలిచారు.)
జ: స్మృతి మంధాన

★ ఇండియన్ ఏఐ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐఏఐఆర్‌ఓ)ను పీపీపీ మోడల్‌లో రూ.300 కోట్ల వ్యయంతో ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?
జ: గుజరాత్

మరింత సమాచారం



JUNIOR INTER English

CHIEF SEATTLE'S LETTER - BY CHIEF SEATTLE

ANNOTATIONS



1. The earth does not belong to man; man belongs to earth.

Ans: a) i) Title of the Lesson: Chief Seattle's Letter

ii) Name of the writer: Chief Seattle

b) Reference: These deeply emotional and highly heart-touching and most inspiring words are extracted from the prescribed prose selection, "CHIEF SEATTLE'S LETTER", originally a motivating speech, delivered by CHIEF SEATTLE, also known as SEATHI, the chief of Squamish and Duwamish American native tribes lived around the Pacific Coast Bay. As a young warrior he was known for his courage and daring leadership. The present sea port city of Seattle is named after this great native American leader. **(4 Marks)**

Context and Explanation: These are the words uttered by Chief Seattle in his most inspiring speech delivered in 1854 addressing a vast gathering of his native tribes. The speaker Chief Seattle says with a deep emotion that humans are just a part of the earth but not its owner though ignorantly they feel so. He opposes the exploitation of the Native Americans by handing over their lands to the migrants in the name of rapid U.S. expansion in the mid-1850s. He urges the U.S. Government to stop the so called development at cost of their lives. He says in the context that their connection with the mother earth is inseparable and unquestionable. He says that he invites the growth collectively but not by yielding to the migrants.

Final Exams-2026 IMPORTANT Q & A

Critical Appreciation: These words carry the emotion that the speaker really feels for the sake of the native tribes. He opposes only the dominating attitude of the migrants by inviting growth collectively respecting one another.

PARAGRAPH ANSWERS (4 Marks)

1. Chief's Seattle mentions that "all things are connected." How does this concept apply to environmental issues today? (OR)

2. How might Chief Seattle's words be relevant to current discussions about climate change and environmental responsibility?

For more IMP Q & A



Writer: SHAIK ABDUL ZILANI

సుస్థిర ప్రగతికి అక్షయ వనరులు!

జనరల్ స్టడీస్ — ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణ పరిరక్షణతోపాటు స్థిరమైన అభివృద్ధి జరగాలంటే తరిగిపోని శక్తి వనరులు అత్యంత అవసరం. ఇవి శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి భూతాపాన్ని అదుపులో ఉంచుతాయి. ఇంధన భద్రతతోపాటు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయి. అందుకే వీటి ఉత్పత్తి, వినియోగానికి దేశంతోపాటు ప్రపంచం మొత్తంలోనూ ప్రాధాన్యం పెరుగుతోంది. అపరిమితంగా లభ్యమవుతూ, ఎన్నటికీ తరిగిపోని ఇలాంటి ఇంధన వనరులు, వాటి వినియోగం తీరుతెన్నులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. భారత్‌లో సౌరశక్తి, పవన శక్తి వాడకం గణనీయంగా అధికమవుతున్న తీరు, దానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలు, అందుకోసం అమలు చేస్తున్న పథకాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలను తెలుసుకోవాలి.



తరిగిపోని ఇంధన వనరులు

ఏదైనా ఒక సహజ వనరును శక్తి ఉత్పత్తికి వినియోగించినప్పుడు తరిగిపోకుండా మళ్లీ మళ్లీ ఉపయోగించే విధంగా ఉంటే, ఆ ఇంధన వనరులను 'పునరుత్పాదక ఇంధన వనరులు' అంటారు. సూర్యరశ్మి, గాలి (పవనం), నీరు, బయోమాస్, భూతాపశక్తి మొదలైనవి ఆ విభాగంలోకి వస్తాయి. అపారంగా (అక్షయంగా) అందుబాటులో ఉండే ఈ వనరులు పర్యావరణానికి హాని చేయవు. భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉన్న దేశం. 2025కి 262 గిగావాట్ల సామర్థ్యానికి చేరుకోగా, 2030 నాటికి 500 గిగావాట్లను లక్ష్యంగా నిర్దేశించుకుంది.

సౌరశక్తి: ఈ శక్తి తరగనిది, కాలుష్యం లేనిది. దేశం ఉష్ణమండల ప్రాంతంలో ఉండటంతో సంవత్సరంలో 300 రోజులు సూర్యరశ్మి లభిస్తుంది. ఏడాదికి 5000 ట్రిలియన్ కిలోవాట్ల సౌరశక్తిని పొందుతుంది. సౌర శక్తి ఉత్పత్తిలో రాజస్థాన్ అగ్రస్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ఉన్నాయి. ప్రస్తుతం (2026, జనవరి నాటికి) దేశంలోని సౌరవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లో అతిపెద్దది రాజస్థాన్‌లోని జోద్‌పుర్ జిల్లా బద్‌లా సోలార్ పార్క్. ఇది 14 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని స్థాపిత సామర్థ్యం 2,245 మెగావాట్లు. ప్రస్తుతం ప్రపంచంలోని అతిపెద్ద సౌరవిద్యుత్తు శక్తి కేంద్రం చైనాలోని సిన్‌జియాంగ్‌లో ఉంది. దీని స్థాపిత సామర్థ్యం 5 గిగావాట్లు. ■ దేశంలో సౌరశక్తి ఉత్పత్తిని మెరుగుపరచడానికి 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన (పీఎం ఎస్‌జీఎంబీవై)' 2024లో ప్రారంభమైంది. దీని ద్వారా కోటి ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. ■ వ్యవసాయ రంగంలో శిలాజ ఇంధన వాడకాన్ని తగ్గించడానికి 'ప్రధాన మంత్రి కుసుమ్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది.

పీఎంఎస్‌జీఎంబీవై


> ప్యారిస్ వాతావరణ ఒప్పందంలో భాగంగా 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుంచి 40% సంచిత విద్యుత్తు శక్తి సాధించాలని భారత్ నిర్ణయించింది. అయితే ఈ లక్ష్యాన్ని 2022 నాటికే చేరుకోవడంతో, అదే ఏడాది ఆగస్టులో లక్ష్యాన్ని 40% నుంచి 50% వరకు అని నవీకరించింది. ప్రస్తుతం దేశంలో శిలాజేతర ఇంధన ఉత్పత్తి వనరుల వాటా 46% ఉందని అంచనా.

బయోమాస్ ఎనర్జీ: ఇది జంతు, వృక్ష సంబంధ పదార్థాల నుంచి పొందే శక్తి. దీనిలో మున్సిపల్ వ్యర్థాలు, వ్యవసాయ, పారిశ్రామిక వ్యర్థాలు, సేంద్రియ, పదార్థాలు కుళ్లిపోవడం వల్ల వెలువడే వాయువు ద్వారా బయోమాస్ శక్తి ఉత్పత్తి అవుతుంది. దీనిని వంటకు, వెలుతురుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం భారత్‌లో 11.6 గిగావాట్ల (జీడబ్ల్యూ) బయోమాస్ శక్తి ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఈ శక్తి ఉత్పత్తిలో మహారాష్ట్ర ముందంజలో ఉండగా, తర్వాత స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, బిహార్ ఉన్నాయి.

సముద్ర తరంగాల శక్తి: సముద్ర తరంగాలు ఒడ్డుకు వచ్చి, తిరిగి లోపలికి వెళ్లే ప్రదేశాల్లో యంత్రాలు/టర్బైన్‌లను అమర్చడం ద్వారా శక్తిని ఉత్పత్తిచేసే పద్ధతిని టైడల్ ఎనర్జీ అంటారు. దేశ తూర్పు పశ్చిమ సముద్ర తీరప్రాంతం వెంబడి మొత్తం 40,000 మెగావాట్ల టైడల్ శక్తి ఉత్పత్తి సామర్థ్యం ఉంది. దేశంలో మొదటి టైడల్ ఎనర్జీ ప్లాంటు కేరళ పశ్చిమ తీరప్రాంతంలో విజింజమ్ వద్ద ప్రారంభమైంది. గుజరాత్‌లోని కచ్, గల్ఫ్ ఆఫ్ కంబాట్, తూర్పు తీరంలోని హుగ్లీ నదీ ముఖద్వారం, సుందర్‌బన్‌లు టైడల్ ఎనర్జీకి అనుకూల ప్రాంతాలు.

తేలియాడే సౌర విద్యుత్తు ప్లాంట్లు

సౌరవిద్యుత్తు ప్లాంట్ల స్థాపనలో ఇదొక వినూత్న ఆలోచన. ఇక్కడ ఫొటోవోల్టాయిక్ ప్యానెళ్లను జలాశయాలు, సరస్సులు, కాలువలు, నదులు, చెరువులు లాంటి నీటివనరులపై తేలియాడే ప్లాట్‌ఫామ్‌లపై అమరుస్తారు. దీనివల్ల విద్యుత్తు ప్లాంట్ల కోసం వ్యవసాయ క్షేత్రాలు, ఇతర భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదు. అంతేకాకుండా నీటి వనరులపై ప్యానెళ్లు ఉండటంతో ఆ నీరు ఎండ, వేడికి ఆవిరి కాకుండా వృథాను అరికట్టవచ్చు. తెలంగాణలోని రామగుండంలో ఈ తరహా ప్లాంటును 100 మెగావాట్ల సామర్థ్యంతో ఎన్‌టీపీసీ 2021లో ఏర్పాటు చేసింది. ఇది దేశంలోనే అతిపెద్ద, ఒకే ప్రాంతంలో ఉన్న తేలియాడే సౌరవిద్యుత్తు ప్లాంటు. మధ్యప్రదేశ్‌లోని ఓంకారేశ్వర్‌లో 600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంటు ప్రపంచంలోనే అతిపెద్ద తేలియాడే విద్యుత్తు ప్లాంటు. దీనిని 2024లో స్థాపించారు. ❖ దేశంలో 40 వేల మెగావాట్ల సౌరవిద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని స్థాపించే లక్ష్యంతో అల్ట్రా-మెగా సోలార్ పార్క్‌ల స్థాపనకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోంది. సీపీఎస్‌యూ పథకం కింద ప్రభుత్వ సంస్థలు, గృహ వినియోగదారులు వారి నివాస, కార్యాలయాలపై ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్తును ప్రభుత్వ గ్రిడ్‌కు కలిపి ప్రయోజనాలను కల్పిస్తోంది. అధిక సామర్థ్యం ఉన్న సోలార్ వోల్టాయిక్ ప్యానెళ్ల స్థానిక తయారీని ప్రోత్సహిస్తోంది.



రామగుండంలో తేలియాడే సౌరవిద్యుత్తు ప్లాంటు

పవన శక్తి: సంప్రదాయేతర ఇంధనాల్లో పవన విద్యుత్తు చౌకైనది. దీనిలో పవన గతి శక్తి విద్యుత్తుగా మారుతుంది. పురాతన కాలం నుంచి ఓడల్లో, పవన మరల్లో పవన శక్తిని ఉపయోగిస్తున్నారు. పవన విద్యుదుత్పత్తిలో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. ప్రస్తుతం దేశంలో పవన విద్యుదుత్పత్తి 52 గిగావాట్లు అని అంచనా. 2026-27 నాటికి 63 గిగావాట్లకు పెరిగే అవకాశం ఉంది. దేశంలో 2030 నాటికి 140 గిగావాట్లకు పవన శక్తి చేరాలన్నది లక్ష్యం. ◆ సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాముఖ్యతనిస్తూ పవన విద్యుత్తులో ముందున్న రాష్ట్రాల్లో గుజరాత్ అగ్రస్థానంలో ఉండగా, తర్వాత స్థానాల్లో తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. పవన శక్తి సాంకేతిక సంస్థను చెన్నైలో నెలకొల్పారు. నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ దేశంలో పవన శక్తి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది.

హైడ్రోజన్ శక్తి



హైడ్రోజన్ శక్తిని పరిశీలించడానికి దేశంలో హైడ్రోజన్ ఎనర్జీ బోర్డును ప్రభుత్వం స్థాపించింది. 2023లో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభమైంది. 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసి, తద్వారా ఇంధన దిగుమతులను, వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించాలనేది ఉద్దేశం. ప్రస్తుతం హైడ్రోజన్ శక్తి ఉత్పత్తిలో చైనా, సౌదీ అరేబియా, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా ముందు వరుసలో ఉన్నాయి.

భూతాప శక్తి

భూ అంతర్భాగం నుంచి వెలువడే వేడి ద్వారా ఉత్పత్తయ్యే శక్తిని జియోథర్మల్ ఎనర్జీ అంటారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మణికరణ్, లద్దాఖ్‌లోని పుగా వ్యాలీ, ఛత్తీస్‌గఢ్‌లోని టాటాపాని వద్ద ఈ శక్తి ఉత్పత్తికి ప్రాజెక్టులను ప్రారంభించారు. దేశంలో 10,600 మెగావాట్ల జియోథర్మల్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యం ఉందని అంచనా. దేశంలో 340 భూతాప శక్తి ఉత్పత్తి ప్రాంతాలు, 113 హాట్ స్ప్రింగ్‌లను గుర్తించారు.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

సూర్యుడు ఒక్కసారిగా అదృశ్యమైపోతే!

జనరల్ స్టడీస్ - ఫిజిక్స్

సృష్టిలో అత్యధిక వేగంతో ప్రయాణించగల శక్తి రూపమే కాంతి. విద్యుదయస్కాంత వికిరణం అయిన కాంతి వల్లనే జీవులన్నీ భౌతిక ప్రపంచాన్ని కళ్లతో చూడగలుగుతున్నాయి. నీడలు, ప్రతిబింబాలు, గ్రహణాలు, ఇంద్రధనుస్సు తదితరాలన్నీ కాంతి చేసే అద్భుతాలే. వక్రీభవనం, విక్షేపణం, పరిక్షేపణం, వివర్తనం మొదలైన కాంతి కారక దృశ్య ప్రభావాలు, భిన్నమైన దృగ్విషయాల గురించి పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. కాంతి ధర్మాల ఆధారంగా అందరూ నిత్యం వినియోగిస్తున్న వివిధ రకాల దర్పణాలు, కటకాలతో కూడిన పరికరాలు, కిరణాల కోణాలు, పతన కోణాల విలువలపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి.



కాంతి

1. కింది వాటిలో సహజ కాంతి జనకానికి ఉదాహరణ కానిది?




   1) మెరుపు 2) అరోరా (ధ్రువకాంతి)
   3) మిణుగురు పురుగు 4) చంద్రుడు

2. కాంతిని అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
   1) దృశా శాస్త్రం (ఆప్టిక్స్) 2) ఎకౌస్టిక్స్
   3) ఉష్ణగతిక శాస్త్రం 4) సెలినాలజీ

3. మాక్స్‌వెల్ ప్రకారం కాంతి అంటే?
   1) యాంత్రిక తరంగం 2) ఫోటాన్
   3) స్థిర తరంగం
   4) విద్యుత్తు అయస్కాంత తరంగం

4. మాక్స్ ప్లాంక్ ప్రకారం కాంతి అంటే?



   1) యాంత్రిక తరంగం
   2) ఫోటాన్ 3) స్థిర తరంగం
   4) విద్యుత్తు అయస్కాంత తరంగం

5. కాంతి వేగం శూన్యంలో..?
   1) 3×10^8 మీ./సె. 2) 8×10^8 మీ./సె.
   3) 3,00,000 కి.మీ./సె. 4) 1, 3

6. సూర్యుడు ఒక్కసారిగా అదృశ్యం అయితే భూమిపై ఏం జరుగుతుంది?
   1) వెంటనే భూమిపై చీకటి అవుతుంది.
   2) కచ్చితంగా చెప్పలేం.
   3) 1.3 సెకన్ల తర్వాత చీకటి అవుతుంది.
   4) 8.3 నిమిషాల తర్వాత చీకటి అవుతుంది.

7. కింది వాటిలో నిష్కాంతి జనకానికి ఉదాహరణ?
   1) చంద్రుడు 2) కొవ్వొత్తి మంట
   3) బెంథాస్ మండలంలోని జీవులు
   4) సూర్యుడు

8. నీడను ఏర్పరిచే వస్తువులు?
   1) కాంతి జనకాలు 2) అపారదర్శక వస్తువులు
   3) పారదర్శక వస్తువులు
   4) అర్ధపారదర్శక వస్తువులు

9. నీడ ఏర్పడేందుకు కావాల్సినవి?
   ఎ) అపారదర్శక వస్తువు బి) పారదర్శక వస్తువు
   సి) కాంతి జనకం డి) తెర
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, డి, బి 4) బి, సి, డి

10. ఎరుపు రంగు కాంతిలో ఆకుపచ్చని చెట్టు నీడ రంగు?
   1) తెలుపు 2) పసుపు పచ్చ
   3) ముదురు నీలం 4) రంగు ఉండదు

11. సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వీక్షించడానికి ఉపయోగపడే వస్తువు?



   1) పెరిస్కోపు 2) కెలిడయోస్కోపు
   3) భూతద్దం 4) పిన్‌హోల్ కెమెరా

12. పిన్‌హోల్ కెమెరా ఎలా పనిచేస్తుంది?
   1) కుంభాకార కటకంలా 2) కుంభాకార దర్పణంలా
   3) పుటకార కటకంలా 4) పుటాకార దర్పణంలా

13. పిన్‌హోల్ కెమెరాలో ప్రతిబింబం లక్షణం?
   1) నిజ, తలకిందులు, వివర్ధనం
   2) నిజ, తలకిందులు, ఆవర్ధనం
   3) మిథ్యా, నిటారు, వివర్ధనం
   4) మిథ్యా, నిటారు, ఆవర్ధనం

14. వాక్యం–(ఎ): పిన్‌హోల్ కెమెరా కాంతి రుజుమార్గం ప్రసరణ వల్ల ప్రతిబింబం ఏర్పాటు చేస్తుంది.
   వాక్యం–(బి): నీడలు అనేవి కాంతి రుజుమార్గం ప్రసరణ వల్ల ఏర్పడుతున్నాయి.
   1) ఎ, బి అసత్యం 2) ఎ, బి సత్యం
   3) ఎ సత్యం, బి అస్యతం
   4) ఎ అసత్యం, బి సత్యం

15. దర్పణాలు పనిచేసే సూత్రం?



   1) వక్రీభవనం
   2) రుజుమార్గ ప్రసరణం
   3) పరావర్తనం
   4) వివర్తనం

16. దర్పణంలో కనిపించే ప్రతిబింబం?
   1) నిజ ప్రతిబింబం 2) మిథ్యా ప్రతిబింబం
   3) 1, 2 4) చెప్పలేం

17. వాక్యం–(ఎ): నీడను చూసి వస్తువు గురించి కచ్చితంగా చెప్పగలం.
   వాక్యం–(బి): ప్రతిబింబాన్ని చూసి వస్తువు గురించి కచ్చితంగా చెప్పగలం.
   1) ఎ, బి స్యతం 2) ఎ సత్యం, బి అస్యతం
   3) ఎ అసత్యం, బి సత్యం 4) ఎ, బి అసత్యం

18. నీడల సహాయంతో అందరినీ ఆనందపరిచే కళ?



   1) తోలు బొమ్మలాట 2) షాడోగ్రఫీ
   3) సినిమా 4) 1, 2

19. ఒక కాంతి కిరణం దర్పణ తలంతో 90° కోణం చేస్తే పతన కోణం ఎంత?
   1) 90° 2) 60° 3) 30° 4) 0°

20. పతన, పరావర్తన కిరణాల మధ్య ఉండే 120° అయితే పతన కోణం ఎంత?
   1) 90° 2) 60° 3) 30° 4) 0°

21. ఒక కాంతి కిరణం లంబం వెంబడి ప్రయాణిస్తే పతన కోణం ఎంత?
   1) 90° 2) 60° 3) 30° 4) 0°

22. కాంతి కిరణం దర్పణంపై 30° కోణంతో పతనం చెందితే విచలన కోణం ఎంత?
   1) 90° 2) 120° 3) 60° 4) 30°

23. పరావర్తన సూత్రాలను పాటించే తలం?
   1) నున్నని తలం 2) గరుకు తలం
   3) వక్రతలం 4) పైవన్నీ

24. సమాన పరిమాణం ఉన్న మిథ్యా, నిటారు ప్రతిబింబాన్ని ఏర్పరిచే దర్పణం?
   1) కుంభాకార దర్పణం 2) పుటాకార దర్పణం
   3) సమతల దర్పణం 4) పైవన్నీ

25. వస్తువు ఎత్తు 10 సెం.మీ. అయితే దాని పూర్తి ప్రతిబింబాన్ని సమలత దర్పణంలో చూడాలంటే, దర్పణం ఎత్తు కనీసం ఎంత ఉండాలి?
   1) 5 సెం.మీ. 2) 10 సెం.మీ.
   3) 3 సెం.మీ. 4) 13 సెం.మీ.

26. ఒక దీర్ఘఘనాకార గదిలో పక్కపక్కనే ఉండే గోడలకు రెండు దర్పణాలు అమర్చారు. అయితే ఆ దర్పణాల మధ్య ఒక వ్యక్తి నిల్చొని ఉంటే అతడు ఎన్ని ప్రతిబింబాలను చూడగలడు?
   1) 2 2) 1 3) 3 4) 4

27. ఒక వ్యక్తి ఒక మ్యాజిక్ బాక్స్‌లో ఒక కొవ్వొత్తిని వెలిగిస్తే అతడు లెక్కలేనన్ని కొవ్వొత్తి ప్రతిబింబాలను గమనించాడు. అయితే ఆ బాక్స్‌లో ఉన్న రెండు దర్పణాల మధ్య కోణం ఎంత?



   1) 0°
   2) 20°
   3) 90°
   4) 180°

28. ఒక వ్యక్తి గదిలో రెండు పక్కపక్కనే ఉన్న గోడలకు తగిలించిన అద్దాల మధ్యలో నిల్చున్నప్పుడు తన ఐదు ప్రతిబింబాలను చూసుకున్నాడు. అయితే ఆ గది గోడల మధ్య ఉన్న కోణం ఎంత?
   1) 0° 2) 60° 3) 45° 4) 90°

29. జలాంతర్గామి, యుద్ధాల్లో సైనికులు పెరిస్కోపును ఉపయోగిస్తారు. ఇందులో ఉండే రెండు దర్పణాల మధ్య కోణం ఎంత ఉండొచ్చు?
   1) 90° 2) 45° 3) 0° 4) 180°

30. వస్త్రాలు, టైల్స్‌పై డిజైన్‌లను ఊహించడానికి కనిపెట్టిన పరికరం?
   1) పిన్‌హోల్ కెమెరా 2) కెలిడయోస్కోపు
   3) పెరిస్కోపు 4) టెలిస్కోపు

31. ఏ దర్పణం ఎక్కువ దృక్ క్షేత్రాన్ని కలిగి ఉంటుంది?
   1) కుంభాకార దర్పణం 2) పుటాకార దర్పణం
   3) సమతల దర్పణం 4) గోళాకార దర్పణం

32. వాహనాల్లో రియర్–వ్యూ మిర్రర్‌గా ఉపయోగపడేది?
   1) పుటాకార దర్పణం 2) కుంభాకార దర్పణం
   3) సమతల దర్పణం 4) గోళాకార దర్పణం

33. డాక్టర్ మిర్రర్ అని దేన్ని పిలుస్తారు?
   1) పుటాకార దర్పణం 2) కుంభాకార దర్పణం
   3) సమతల దర్పణం 4) గోళాకార దర్పణం

34. సమతల దర్పణం ఆవర్ధనం ఎంత?
   1) +1 2) -1 3) +2 4) -2

35. కింది వాటిలో సరికాని వాక్యం?
   1) కుంభాకార దర్పణాలు జాతీయ రహదారి టర్న్ (మూల మలుపు)ల్లో వాడతారు.
   2) కుంభాకార దర్పణం పార్కింగ్ మిర్రర్‌లా, రిసెప్షన్ మిర్రర్‌లా ఉపయోగిస్తారు.
   3) కుంభాకార దర్పణాన్ని ENT డాక్టర్ వాడతారు
   4) కుంభాకార దర్పణం ATM మిషన్‌పై ఉంటుంది.

36. వాహనాల హెడ్‌లైట్లు, సెర్చ్‌లైట్లు, ఫ్లడ్‌లైట్లలో ఉపయోగించే దర్పణం?
   1) పుటాకార 2) కుంభాకార
   3) సమతల 4) గోళాకార

37. పుటాకార దర్పణం ఏర్పరిచే ప్రతిబింబ లక్షణాలు..
   1) మిథ్యా, నిటారు, ఆవర్ధనం
   2) మిథ్యా, తలకిందులు, వివర్ధనం
   3) మిథ్యా, నిటారు, వివర్ధనం
   4) మిథ్యా, తలకిందులు, ఆవర్ధనం

38. కుంభాకార దర్పణం ఏర్పరిచే ప్రతిబింబలక్షణాలు?
   1) మిథ్యా, నిటారు, ఆవర్ధనం
   2) మిథ్యా, తలకిందులు, వివర్ధనం
   3) మిథ్యా, నిటారు, వివర్ధనం
   4) మిథ్యా, తలకిందులు, ఆవర్ధనం

39. కింది వాటిలో సరికాని వాక్యం?
   1) పుటాకార దర్పణాన్ని కేంద్రీకరణ దర్పణం అంటారు.
   2) పుటాకార దర్పణాన్ని 'బర్నింగ్ మిర్రర్' అంటారు.
   3) కుంభాకార దర్పణాన్ని 'వికేంద్రీకరణ దర్పణం' అంటారు.
   4) పుటాకార దర్పణాన్ని 'రియర్ వ్యూ మిర్రర్'గా వాడతారు.

40. పుటాకార దర్పణం ఆవర్ధనం..
   1) m> +1 2) m < +1 3) m = +1 4) పైవన్నీ

41. కుంభాకార దర్పణం ఆవర్ధనం..
   1) m> +1 2) m< +1 3) m = +1 4) పైవన్నీ

42. ఒక దర్పణ ఆవర్ధనం +1.2 దీని అర్థం ఏమిటి?
   1) మిథ్యా, నిటారు, ఆవర్ధనం
   2) మిథ్యా, నిటారు, వివర్ధనం
   3) నిజ, తలకిందులు, ఆవర్ధనం
   4) నిజ, తలకిందులు, వివర్ధనం

43. దర్పణ ఆవర్ధనం m = +1 దీని అర్థం ఏమిటి?
   1) వస్తుదూరం = ప్రతిబింబ దూరం
   2) వస్తువు ఎత్తు = ప్రతిబింబ ఎత్తు
   3) వస్తుదూరం > ప్రతిబింబ దూరం 4) 1, 2

సమాధానాలు

1-4; 2-1; 3-4; 4-2; 5-4; 6-4; 7-1; 8-2; 9-2; 10-4; 11-4; 12-1; 13-1; 14-2; 15-3; 16-2; 17-3; 18-4; 19-4; 20-2; 21-4; 22-2; 23-4; 24-3; 25-1; 26-3; 27-1; 28-2; 29-3; 30-2; 31-1; 32-1; 33-1; 34-1; 35-3; 36-1; 37-1; 38-3; 39-4; 40-1; 41-2; 42-1; 43-4.

అనంత విశ్వంలోనే కాకుండా కంటికి కనిపించని పరమాణువులోనూ శక్తి దాగుంది. ఆధునిక భౌతికశాస్త్రంలో పరమాణువులు, కేంద్రకాలు ముఖ్యమైన విభాగాలు. సృష్టిలోని ప్రతి పదార్థం అణువులు, పరమాణువులతో నిండి ఉంటుంది. అయితే పరమాణువు నిర్మాణం, వాటి నమూనాను తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేశారు. వీటిలో కొన్ని పరిశోధనా ఫలితాలు వాస్తవ పరిస్థితిని మానవాళికి వివరించడంలో సఫలమయ్యాయి. అణువు, పరమాణువు, కేంద్రకం తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.


పరివర్తనం చెందిన శక్తితో ఆ కేంద్రకానికి స్థిరత్వం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

బోర్ నమూనా

1912లో నీల్స్‌బోర్ అంతకుముందు వచ్చిన పరమాణు నమూనాల్లోని లోపాలను సవరిస్తూ, కొత్త పరమాణు నమూనాను ప్రతిపాదించారు. ఈయన ప్రతిపాదనల ప్రకారం...

- సూర్యుడి చుట్టూ గ్రహాలు భ్రమిస్తున్నట్లు కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు వృత్తాకార కక్ష్యలో తిరుగుతాయి.
- ఎలక్ట్రాన్లు నిర్ణీత స్థిర కక్ష్యల్లో మాత్రమే భ్రమిస్తాయి. అవి ఈ కక్ష్యలో ఉన్నంత వరకు తమ శక్తిని కోల్పోవు.
- ఎలక్ట్రాన్ ఒక కక్ష్య నుంచి మరొక కక్ష్యలోకి మారితే శక్తి శోషణం లేదా ఉద్గారం జరుగుతుంది.




- 1932లో జేమ్స్ చాడ్విక్ పరమాణువులోని కేంద్రకంలో న్యూట్రాన్లను కనుక్కున్నారు. ఇవి విద్యుత్‌పరంగా తటస్థంగా ఉంటాయని తెలియజేశారు. వీటితో పాటు ప్రోటాన్లు కూడా కేంద్రకంలో ఉంటాయి.
- ప్రోటాన్‌కు ధనావేశం ఉంటుంది. ఇది న్యూట్రాన్‌తో దాదాపు సమాన ద్రవ్యరాశిని కలిగి ఉంటుంది.
- ఎలక్ట్రాన్ ఒక రుణావేశ కణం. దీని ద్రవ్యరాశి న్యూట్రాన్లు లేదా ప్రోటాన్ల ద్రవ్యరాశితో పోల్చితే చాలా తక్కువ.
- ప్రోటాన్లు, న్యూట్రాన్లు కేంద్రకంలో ఉంటాయి. కాబట్టి వీటిని కేంద్రక కణాలు (Nucleons) అంటారు.

కేంద్రక శక్తి

వాయువుల ద్వారా విద్యుత్ ప్రసారంపై జె.జె.థామ్సన్ చేసిన ప్రయోగాల ఫలితంగా మూలక పరమాణువుల్లో రుణావేశిత కణాలుంటాయని కనుక్కున్నారు. వీటినే ఎలక్ట్రాన్లు అంటారు.

- పదార్థంలో రుణావేశంతోపాటే ధనావేశం కూడా ఉంటుందని ఊహించి, పుచ్చకాయను పోలిన పరమాణు నమూనాను థామ్సన్ 1898లో ప్రతిపాదించాడు. దీని ప్రకారం పుచ్చకాయలోని గింజలు ఎలక్ట్రాన్లను పోలి ఉంటే, మిగతా గుజ్జు ధనావేశాన్ని పోలి ఉంటుందని పేర్కొన్నారు.



- 1903లో లీనార్డ్ అనే శాస్త్రవేత్త తన ప్రయోగాల ద్వారా పరమాణువులో చాలా భాగం ఖాళీగా ఉంటుందని నిర్ధారించాడు. 1911లో రూథర్‌ఫర్డ్ పల్చని బంగారు రేకుపై ఆల్ఫా కిరణాల పరిక్షేపణం ప్రయోగం ఆధారంగా పరమాణువులో ధనావేశం మొత్తం అత్యల్ప పరిమాణంలో కేంద్రీకృతం అవుతుందని కనుక్కున్నారు. అదేవిధంగా ఈయన పరమాణువుకు సంబంధించి గ్రహ మండల నమూనాను ప్రతిపాదించాడు.
- పరమాణువులో ధనావేశం, ద్రవ్యరాశి కేంద్రీకృతమయ్యే భాగాన్ని 'కేంద్రకం' అంటారు.

పరమాణు సంఖ్య (Atomic Number)

పరమాణువులోని ప్రోటాన్ల సంఖ్యను పరమాణు సంఖ్య అంటారు. దీన్ని Z అనే అక్షరంతో సూచిస్తారు.

- ఒక తటస్థ పరమాణువులోని ఎలక్ట్రాన్ల సంఖ్యకు పరమాణు సంఖ్య సమానం.

పరమాణు ద్రవ్యరాశి సంఖ్య

పరమాణువులోని ప్రోటాన్ (Z), న్యూట్రాన్ల సంఖ్య (N) మొత్తాన్ని పరమాణు ద్రవ్యరాశి సంఖ్య లేదా ద్రవ్యరాశి సంఖ్య అంటారు. దీన్ని A అనే అక్షరంతో సూచిస్తారు.

$$A = Z + N$$

పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం (atomic mass unit - a.m.u):

తటస్థ కార్బన్ $6^{C^{12}}$ పరమాణు ద్రవ్యరాశిలో $\frac{1}{12}$ వ వంతును 1 a.m.uగా నిర్వచిస్తారు.

$$1\ a.m.u = 1.66 \times 10^{-24}\ గ్రామ్$$

- ఒక మూలకాన్ని (X) సంకేతాల్లో తెలిపేటప్పుడు దానికి ఇరువైపులా పరమాణు సంఖ్య (Z)ను, ద్రవ్యరాశి సంఖ్య(A)ను సూచిస్తారు.

$$^{A}_{Z}X$$

ఉదా: కార్బన్ పరమాణువును $^{12}_{6}C$ గా సూచిస్తారు.

ద్రవ్యరాశి లోపం (Mass Defect)

కేంద్రకంలోని సంఘటకాల (Constituents) విడి ద్రవ్యరాశుల మొత్తానికి, కేంద్రక ద్రవ్యరాశికి మధ్య ఉండే తేడాను ద్రవ్యరాశి లోపం అంటారు. ఈ ద్రవ్యరాశి లోపం కేంద్రకంలోని కేంద్రక కణాలను బంధించి ఉంచేందుకు ఉపయోగపడుతుంది.

- ద్రవ్యరాశి లోపం పరిమాణాన్ని అనుసరించి కేంద్రక స్థిరత్వాన్ని అంచనా వేయవచ్చు.

ఉదా: $^{4}_{2}He$ పరమాణు కేంద్రకాన్ని పరిశీలిస్తే 2 ప్రోటాన్లు, 2 న్యూట్రాన్లు ఉంటాయి. వాటి ద్రవ్యరాశిని లెక్కిస్తే,

ఒక ప్రోటాన్ ద్రవ్యరాశి 1.0078 amu

ఒక న్యూట్రాన్ ద్రవ్యరాశి 1.0087 amu

2 ప్రోటాన్ల ద్రవ్యరాశి $= 2 \times 1.0078 = 2.0156$ a.m.u

2 న్యూట్రాన్ల ద్రవ్యరాశి $= 2 \times 1.0087 = 2.0174$ a.m.u

మొత్తం ద్రవ్యరాశి = 4.0330 a.m.u

పై విధంగా హీలియం కేంద్రకం ద్రవ్యరాశి 4.0330 a.m.u ఉండాలి. కానీ సహజంగా లభించే హీలియం పరమాణు ద్రవ్యరాశిని కొలిచినప్పుడు 4.0026 a.m.uగా తేలింది. రెండింటి మధ్య భేదం 0.0304 a.m.u. అసలు ద్రవ్యరాశి కంటే తక్కువగా ఉన్నట్లు ప్రయోగాల ద్వారా నిరూపితమైంది. దీన్నే ద్రవ్యరాశి లోపం అంటారు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

ద్రవ్యరాశి - శక్తి మధ్య సంబంధం

1905లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ద్రవ్యరాశికి, శక్తికి మధ్య సంబంధాన్ని గుర్తించారు.

- ద్రవ్యరాశిలో మార్పు Δm, దాని ఫలితంగా శక్తిలో మార్పు E అయితే,

$E = \Delta mc^2$ అనే సూత్రం ద్వారా వాటి మధ్య సంబంధాన్ని తెలుసుకోవచ్చు.

ఇక్కడ c అంటే శూన్యంలో కాంతివేగం. దీని విలువ 3×10^8 m/s.

- కేంద్రక భౌతికశాస్త్రంలో శక్తి మార్పులు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంటూ, ద్రవ్యరాశిలో వచ్చే మార్పును కొలవగలిగేలా ఉంటాయి.

పై సమీకరణం ఆధారంగా...

- ద్రవ్యరాశి, శక్తి పరస్పరం పరివర్తనీయమైనవి.
- ఒకదానిపై మరొకటి ఆధారపడతాయి.

- పై సమీకరణాన్ని ద్రవ్యరాశి - శక్తి తుల్యత నియమం అంటారు.
- ద్రవ్యరాశిని శక్తిలోకి, శక్తిని ద్రవ్యరాశిలోకి పరివర్తనం చెందించవచ్చు. 1 కిలోగ్రామ్ ద్రవ్యరాశి 9×10^{16} జౌల్ శక్తిగా, 1 జౌల్ శక్తి 1.11×10^{-17} కిలోగ్రాముల ద్రవ్యరాశిగా మార్పు చెందుతుంది.
- హీలియంలో ద్రవ్యరాశి లోపం 0.0304 amu కూడా ఈ విధంగానే శక్తిగా మారుతుంది. ఈ శక్తి హీలియం కేంద్రకంలోని 2 ప్రోటాన్లు, 2 న్యూట్రాన్లను బంధించడానికి ఉపయోగపడుతుంది. దీన్నే 'కేంద్రక బంధన శక్తి' అంటారు.
- హీలియం కేంద్రకంలో $\Delta m = 0.0304$ a.m.u. కాబట్టి దీనికి సమానమైన శక్తి $E = \Delta mc^2$ సమీకరణం ప్రకారం 28.31 Mev లేదా 4.53×10^{-12} జౌల్స్.
- పరివర్తనం చెందిన శక్తి హీలియం పరమాణు కేంద్రకానికి స్థిరత్వాన్ని ఇస్తుంది. అయితే ఆ కేంద్రకాన్ని వాటి సంఘటనాల్లోకి విడగొట్టడానికి కూడా అంతే మొత్తంలో శక్తి అవసరం.
- ప్రామాణికంగా ఏ కేంద్రకంలోనైనా 1 a.m.u. ద్రవ్యరాశి నుంచి విడుదలయ్యే శక్తిని కింది విధంగా తెలియజేయవచ్చు.

$1\ a.m.u. = 931.5 \times 10^6\ eV$

$= 931.5\ MeV$

ఇక్కడ, MeV అంటే మిలియన్ ఎలక్ట్రాన్ వోల్ట్.

$1\ MeV = 10^6\ eV$ లేదా 1.6×10^{-13} జౌల్స్

- పై సమాచారం ఆధారంగానే శాస్త్రవేత్తలు ఏ పరమాణు కేంద్రకం ఎంత శక్తిని కలిగి ఉంటుందో లెక్కిస్తారు.

ఉదా: $_8O^{16}$ పరమాణు కేంద్రకం 15.995 a.m.u. ద్రవ్యరాశిని, $\Delta m = 0.137$ a.m.u. ద్రవ్యరాశి లోపాన్ని, 127.6 MeV బంధన శక్తిని కలిగి ఉంటుంది.

Word of the Day

917

Emphatic

Telugu meaning: బలమైన, శక్తిమంతమైన

English meaning: The word emphatic (ఇంఫ్యాటిక్) is an adjective that describes something expressed with strong feeling, force, or clarity.

Synonyms: Firm, Assertive

Antonyms: Weak, Hesitant

Usage: 1. The manager gave an emphatic warning that repeated mistakes would not be tolerated in the future.

2. She made an emphatic statement supporting equal opportunities for all employees.

Current Affairs



Prime Minister Narendra Modi held wide-ranging talks with his Malaysian counterpart Anwar Ibrahim in Kuala Lumpur on 8 February 2026. The talks covered political, defence and security cooperation, trade and investment, the digital economy, energy, education, tourism and regional issues. On this occation India and Malaysia inked 11 MoUs.



Japanese Prime Minister Sanae Takaichi's coalition swept to a historic election win on 8 February 2026. Her Liberal Democratic Party (LDP), alone won 316 seats in the 465-member Lower House.



India's Arjun Babuta and Elavenil Valarivan clinched a gold medal at the ongoing Asian Championship in New Delhi by winning the 10m air rifle mixed team event on 8 February 2026. They emerged victorious in the final with a score of 505.



Minister of Railways, Information & Broadcasting and Electronics & Information Technology, Ashwini Vaishnaw launched Qualcomm 2-nanometre (2 nm) semiconductor chip in Bengaluru on 7 February 2026. This marked a significant moment in advanced semiconductor design and India's Key Role in Global Engineering Operations.

For more Current Affairs: Scan QR code

ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవం

ఫిబ్రవరి 10
చరిత్రలో ఈనాడు

పప్పుధాన్యాలు ఆహారంలో అంతర్భాగం. ఇవి ముఖ్యమైన ప్రోటీన్ వనరు. పప్పుధాన్యాలు లెగ్యుమినేసి మొక్కలు కావడంతో అవి భూసారాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి. మానవ పోషణ, పర్యావరణ శ్రేయస్సు, సుస్థిర వ్యవసాయంలో పప్పుధాన్యాల పాత్రను గుర్తించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 10న 'ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవం'గా (World Pulses Day) నిర్వహిస్తారు. వీటిని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే బహుళ ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడంతోపాటు ఆహార భద్రత సాధనలో వీటి పాత్రను తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

పప్పుధాన్యాల అవసరం..

ఇవి లెగ్యుమినేసి జాతిలో ఉప సమూహం. పోషకాహారానికి పప్పుధాన్యాలు కీలకమైన వనరు. మాంసంతో పోలిస్తే తక్కువ ధరలోనే వీటి నుంచి ప్రోటీన్‌ను పొందొచ్చు. వీటి వినియోగం ద్వారా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది, రక్తంలో చక్కెల స్థాయులు సక్రమంగా ఉంటాయి. అధిక బరువు నియంత్రిత స్థాయిలో ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు.

ఉదా: కంది, మినుములు, పెసలు, శెనగలు, మసూర్ దాల్ మొదలైనవి.

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సిఫార్సు ప్రకారం, ప్రతి వ్యక్తి రోజుకు 80 గ్రాముల పప్పుధాన్యాలు వినియోగించాలి. వీటిని పేదల ప్రోటీన్‌గా పేర్కొంటారు.



చారిత్రక నేపథ్యం


ప్రజలు ఆరోగ్యకర జీవనాన్ని సాగించడంలో పప్పుధాన్యాలు ముఖ్య భూమిక పోషిస్తాయి. తక్కువ ఖర్చుతో మానవ శరీరానికి అవసరమైన ప్రోటీన్ వీటి ద్వారా లభిస్తుంది. వీటి వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి (యూఎన్‌ఓ) 2013, డిసెంబరులో 2016 ఏడాదిని 'అంతర్జాతీయ పప్పుధాన్యాల సంవత్సరం'గా ప్రకటించింది. అలాగే పప్పుధాన్యాల ప్రాముఖ్యతను మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 10న 'ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవం'గా జరుపుకోవాలని 2018, డిసెంబరులో యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 2019 నుంచి ప్రతి సంవత్సరం ఈ రోజును నిర్వహిస్తున్నారు.

దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి - వినియోగం, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

వేవెల్ ప్రణాళిక - సిమ్లా సమావేశం

రెండో ప్రపంచ యుద్ధం ఒకవైపు... భారతీయుల స్వాతంత్ర్య సంగ్రామం మరోవైపు.. వెరసి ఆంగ్లేయులకు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తంటాలు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. క్రిప్స్ రాయబారం, ఆగస్టు ప్రతిపాదన విఫలమయ్యాయి. క్విట్ ఇండియా ఉద్యమం ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను మరింత పెంచింది. స్వేచ్ఛా భారతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారతీయులను విడగొట్టడానికి బ్రిటిష్ వారు అనేక కుటిల ప్రయత్నాలు చేశారు. సిమ్లా సమావేశం ఏర్పాటు చేసిన లార్డ్ వేవెల్ తన ప్రణాళికను భారతీయుల ముందు పెట్టారు. కానీ చివరికి ఈ ప్రణాళిక విఫలమైంది.



- లార్డ్ లిన్‌లిత్‌గో స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్ వేవెల్‌ను భారత వైస్రాయ్‌గా నియమించింది.
- భారతదేశంలో బ్రిటిష్ పట్టు నిలిపేందుకు వేవెల్ ప్రయత్నాలు చేపట్టారు. దీనిలో భాగంగా కొన్ని ప్రతిపాదనలు చేసి దాన్ని భారత వ్యవహారాల కార్యదర్శికి సమర్పించారు. చివరికి బ్రిటన్ ప్రధాని చర్చిల్ కూడా ఈ ప్రతిపాదనలను అంగీకరించారు.

వేవెల్ ప్రతిపాదనలు

- వేవెల్ తన పేరు మీదుగానే ఈ ప్రణాళికను వెల్లడించారు.
- ఒక తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటును ఈ ప్రణాళిక ప్రతిపాదించింది. పలు రాజకీయ సంస్థలతో వైస్రాయ్ ఒక కార్యసమితిని ఏర్పాటు చేస్తారు. వైస్రాయ్ కార్యసమితి 1935 పరిధిలో పనిచేస్తుంది. గవర్నర్‌ల నిర్వహణలో ఉండే రాష్ట్రాల్లో సంకీర్ణ పద్ధతిలో మంత్రివర్గాలు తిరిగి ఏర్పడతాయి.

వేవెల్ ప్రణాళికపై ముస్లింలీగ్ వైఖరి, కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్య మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts in Indian Oil Corporation

Indian Oil Corporation Limited (IOCL) has released a notification for the recruitment of Trade Apprentice posts in various departments at its Panipat Refinery & Petrochemical Complex. The total no. of posts is 637. Eligible candidates can apply online before 20 February 2026.

Posts In CSIR-CCMB, Hyderabad

CSIR-Centre for Cellular and Molecular Biology (CSIR-CCMB), Habsiguda, Hyderabad, has released a notification for the recruitment of Technician, Technical Assistant, and Technical Officer posts. The total no. of posts is 80. The application fee is Rs.500. The last date for online applications is 22 February 2026.

Multi-Tasking Staff Jobs

The Income Tax Department, Gujarat, is inviting applications for Multi-Tasking Staff and Tax Assistant positions on a regular basis under the sports quota. The total number of posts is 46. Eligible candidates can apply online before 21 February 2026.

Did You Apply..?

Today (February 10) is the last date for the following Jobs

- 172 Medical Officer jobs in ECHS Thiruvananthapuram. ***Eligibility:*** 10th/MBBS/MD/MS.
- 16 Jobs at Mumbai Port Authority. ***Eligibility:*** Diploma/B.Tech.
- Post-Doctoral Research Fellow Posts at IISER Tirupati. ***Eligibility:*** PG/PhD.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Simplifications - II

1. If $\frac{1}{7}$ th of a number is equal to $\frac{3}{5}$ th of 800, then what is $\frac{2}{3}$ times of the number?

A) 2420 B) 2400 C) 2240 D) 2040 E) 2525

2. When a fraction 'x' is multiplied by another fraction 'y', we get the result as $\frac{182}{153}$. But when 'x' is divided by 'y', we get the result as $\frac{2}{3}$. What is the value of $\left(\frac{x^2+y^2}{x^2y^2}\right)$?

A) $1\frac{21}{28}$ B) $1\frac{23}{28}$ C) $1\frac{27}{28}$ D) $1\frac{19}{28}$ E) None of the above

3. If $x + y + z = 0$, then the value of $\frac{x^2+y^2+z^2}{y^2-zx}$ is:

A) 2 B) 0 C) 1 D) $\frac{1}{2}$ E) 7

4. If $a + b + c = 12$, $a^2 + b^2 + c^2 = 36$ and $a^3 + b^3 + c^3 = 25$ then the value of abc is:

A) 61 B) $63\frac{1}{3}$ C) 65 D) $63\frac{2}{3}$ E) 71

5. If $(3+\sqrt{5})x = (3-\sqrt{5})y = 1$ then the value of $\frac{1}{x}+\frac{1}{y}$ is:

A) $2\sqrt{5}$ B) 6 C) $\frac{3}{2}$ D) 3 E) $\frac{7}{3}$

6. If $\left(\frac{7}{10} \text{ of } x\right) - \left(\frac{3}{5} \text{ of } \frac{4}{7}\right)$ is equal to $\frac{13}{14}$, then what is the value of x?

A) $\frac{89}{51}$ B) $\frac{89}{49}$ C) $\frac{87}{49}$ D) $\frac{89}{53}$ E) $\frac{49}{71}$

7. If x and y are rational numbers, find the values of x and y in the following equation $\frac{\sqrt{7}+\sqrt{3}}{\sqrt{7}-\sqrt{3}} = x + y\sqrt{21}$

A) $\frac{5}{2}, \frac{3}{2}$ B) $\frac{7}{3}, \frac{2}{3}$ C) $\frac{5}{3}, \frac{1}{3}$ D) $\frac{5}{2}, \frac{1}{2}$ E) None of the above

8. Simplify $1 - 1 \div \left\{1 + 1 \div \left(1 - \frac{2}{3}\right)\right\}$

A) $\frac{3}{4}$ B) $\frac{1}{4}$ C) $\frac{5}{4}$ D) $\frac{2}{5}$ E) None of these

9. If we multiply a fraction by itself and divide the product by its reciprocal, the fraction thus obtained $11\frac{25}{64}$. The fraction is:

A) $\frac{9}{4}$ B) $\frac{8}{5}$ C) $\frac{10}{7}$ D) $\frac{13}{8}$ E) $\frac{7}{2}$

10. A person was to multiply a fraction by $\frac{7}{8}$. Instead he divided and got an answer which exceeds the correct answer by $\frac{3}{8}$. The correct answer is:

A) $\frac{3}{5}$ B) $\frac{7}{3}$ C) $\frac{7}{5}$ D) $\frac{9}{2}$ E) None of these

11. If we multiply a fraction by itself and divide the product by the square of its reciprocol, the fraction obtained is $7\frac{58}{81}$. The original fraction is:

A) $\frac{8}{3}$ B) $\frac{7}{5}$ C) $\frac{7}{3}$ D) $\frac{5}{3}$ E) None of these

12. If $7\frac{3}{5}$ of $8.25 \div 0.56$ of $x = 298\frac{4}{7}$, then what is the value of 'x'?

A) $\frac{4}{3}$ B) $\frac{3}{8}$ C) $\frac{3}{4}$ D) $\frac{8}{3}$ E) None of the above

13. If $\frac{a}{5} = \frac{b}{7} = \frac{c}{9}$, then the value of $\frac{a+b+c}{b}$ is:

A) 1 B) $\frac{7}{3}$ C) 3 D) $\frac{5}{3}$ E) $\frac{7}{2}$

14. A certain amount is distributed among P, Q and R. P gets $\frac{4}{15}$ and Q gets $\frac{1}{3}$ of the whole amount. If R gets Rs.426 then Q gets?

A) 345 B) 425 C) 370 D) 355 E) 233

15. In an examination, a student scores 3 marks for every correct answer and losses 1 mark for every wrong answer. If he attempts in all 75 questions and secures 125 marks. The number of questions he attempts correctly is:

A) 60 B) 50 C) 45 D) 55 E) 22

Scan the QR code for Key

These model questions were prepared by ***Dr.Vangala Srinivas, Subject Expert***

ఐఐఎం లఖ్‌నవూలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లఖ్‌నవూ.. తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ కన్సల్టెంట్ (అడ్మినిస్ట్రేషన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ కన్సల్టెంట్ (అడ్మినిస్ట్రేషన్): 02

అర్హత: సంబంధిత విభాగంలో 60 శాతంతో డిగ్రీ/ పీజీతో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ.1,80,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.02.2026
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.iiml.ac.in/job-detail

పదో తరగతితో డాక్ సేవక్ కొలువు!

పదో తరగతి మార్కుల మెరిట్‌తో కొలువులకు పిలుపొచ్చింది. గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)-2026 ప్రకటన వెలువడింది. దేశవ్యాప్తంగా 28,636 ఖాళీలున్నాయి. ఎంపికైనవారు బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ హోదాలతో విధులు నిర్వర్తించవచ్చు. ప్రతి నెలా రూ.15,000 - 20,000 వరకూ వేతనం అందుకోవచ్చు. పలు ప్రోత్సాహకాలూ పొందవచ్చు.



డాక్ సేవక్ పోస్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీరికి మూలవేతనం(బేసిక్ పే)తో పాటు కరవు భత్యమూ(డియర్‌నెస్ అలవెన్సు) చెల్లిస్తారు. అందువల్ల ప్రస్తుతం కేంద్రంలో అమలవుతోన్న 58 శాతం డీఏ వీరికీ అందుతుంది. దీని ప్రకారం బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం)కు రూ.12,000 మూల వేతనంతో పాటు 58 శాతం డీఏ రూ.6960 కూడా దక్కుతుంది. అంటే మొదటి నెల నుంచే వీరు రూ.18,960 జీతం అందుకోవచ్చు. దీంతోపాటు ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి. ప్రతి ఆరు నెలలకూ ఒక డీఏ, ఏటా ఇంక్రిమెంట్ వేతనంలో కలుస్తుంది. అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్‌లకు రూ.10,000 మూల వేతనంతో పాటు రూ.5800 డీఏ దక్కుతుంది. వీరు విధుల్లో చేరిన మొదటి నెల నుంచీ రూ.15,800 వేతనం, ఇతర ప్రోత్సాహకాలూ పొందవచ్చు. వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన సేవలకు ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ ఏబీపీఎం/ డాక్ సేవక్‌లకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారు. ఆ సేవల విలువ ప్రకారం ఇన్సెంటివ్ చెల్లిస్తారు. స్వల్ప మొత్తంలో హెచ్‌ఆర్‌ఏ కూడా ఉంటుంది. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/ కంప్యూటర్/ స్మార్ట్‌ఫోన్ లాంటివి పోస్టల్ శాఖ సమకూరుస్తుంది. సంబంధిత కార్యాలయానికి అందుబాటులో నివాసం ఉండాలి. సైకిల్ తొక్కడం రావాలి. ఈ పోస్టుల్లో అవకాశం వచ్చినవారు రోజుకు సుమారు ఐదు గంటలు పనిచేస్తే సరిపోతుంది.

విధులిలా

బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం): బ్రాంచ్ కార్యకలాపాలు పర్యవేక్షించాలి. పోస్టల్ విధులతోపాటు ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలు, రోజువారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా, ఉత్తరాలు పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలి. పోస్టల్‌కు సంబంధించిన మార్కెటింగ్ వ్యవహారాలూ చక్కబెట్టాలి. బృంద నాయకుడిగా సంబంధిత బ్రాంచ్‌ను నడిపించాలి. పోస్టల్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం): స్టాంపులు/ స్టేషనరీ అమ్మకం, ఉత్తరాల పంపిణీ, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, పేమెంట్లు, పోస్టల్‌కు సంబంధించిన ఇతర వ్యవహారాలూ చక్కబెట్టాలి. బ్రాంచ్ పోస్టు మాస్టర్ సూచించిన విధులు నిర్వర్తించాలి. తపాలా పథకాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.

డాక్ సేవక్: ఉత్తరాలు పంపిణీ చేయాలి. అలాగే స్టాంపులు/ స్టేషనరీ అమ్మకాల బాధ్యత వీరిదే. బీపీఎం, ఏబీపీఎం సూచించిన విధులూ పూర్తిచేయాలి. రైల్వే మెయిల్ సర్వీస్, పోస్టల్ పేమెంట్ బ్యాంకు వ్యవహారాలూ చక్కబెట్టాలి.

ఎంపిక

అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్‌తో నియామకాలుంటాయి. ప్రకటనలో ఖాళీలు ఉన్న బ్రాంచీలు, ఏ హోదాలో ఖాళీ ఉంది, రిజర్వ్‌డ్/ అన్ రిజర్వ్‌డ్ వివరాలు పేర్కొన్నారు. వాటిని పరిశీలించి, ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. మొదటి ప్రాధాన్యం ఇస్తోన్నదానికి ఆప్షన్-1 తర్వాత దానికి ఆప్షన్-2.. ఇలా నింపాలి. అవకాశాన్ని బట్టి వీటిలో ఏదో ఒక చోట పోస్టింగ్ కేటాయిస్తారు. ఎంపికైన వారికి సమాచారం ఎస్ఎంఎస్/ ఈమెయిల్/ పోస్టు ద్వారా అందుతుంది.

వివరాలు

ఖాళీలు: 28,636. ఏపీలో 1060, తెలంగాణలో 608.
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అంటే ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకూ చదవాలి.
వయసు: ఫిబ్రవరి 16, 2026 నాటికి 18-40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
ఫీజు: మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు ఉండదు. మిగిలిన వారంతా రూ.వంద చెల్లించాలి.
ఆన్‌లైన్ వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 14.02.2026 **వెబ్‌సైట్:** https://indiapost.gov.in/gdsonlineengagement

పంజాబ్ నేషనల్ బ్యాంకులో అప్రెంటిస్ అవకాశం

ఇటీవలి కాలంలో దాదాపు బ్యాంకులన్నీ అప్రెంటిస్ నియామకాలపై దృష్టి సారిస్తున్నాయి. పోటీ పరీక్షల సన్నద్ధతలో ఉన్నవారు వీటి కోసమూ ప్రయత్నించవచ్చు. ఈ అనుభవంతో భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల్లో రాణించడానికీ వీలవుతుంది. అందువల్ల ఆసక్తి ఉన్నవారు పంజాబ్ నేషనల్ బ్యాంకులో 5138 అప్రెంటిస్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షతో అవకాశం కల్పిస్తారు. ఎంపికైనవారు ప్రతి నెలా స్టైపెండ్ అందుకోవచ్చు.



అప్రెంటిస్‌షిప్ అవకాశం పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఖాళీలు రాష్ట్రాల వారీ ఉంటాయి. అభ్యర్థులు ఏ రాష్ట్రానికైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆ రాష్ట్ర అధికారిక భాషలో మాట్లాడటం, చదవడం, రాయడం వచ్చుండాలి. అప్రెంటిస్‌గా విజయవంతమైనవారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్ఎస్‌డీసీ) సర్టిఫికెట్ అందిస్తుంది. ఏడాది అప్రెంటిస్ అనుభవంతో ప్రైవేటు బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఇతర ఆర్థిక సంస్థల్లో అవకాశాలు అందుకోవచ్చు. అందువల్ల ఈ తరహా ఉద్యోగాలు లక్ష్యంగా ఉన్నవారు దరఖాస్తు చేయడమే మంచిది. ఈ పరీక్ష ద్వారా సన్నద్ధత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికీ వీలవుతుంది. అయితే ఇప్పటికే బ్యాంకుల్లో అప్రెంటిస్‌గా సేవలందించినవారికి మాత్రం అవకాశం లేదు. ఎంపికైనవారు ఏడాది పాటు అప్రెంటిస్‌గా కొనసాగుతారు. ఈ వ్యవధిలో ప్రతి నెలా స్టైపెండ్ ఇస్తారు. రూరల్, సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో రూ.12,300. మెట్రోల్లో రూ.15,000 చెల్లిస్తారు.

ప్రశ్నాంశాలు

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్: ఈ విభాగంలో ఆర్థికాంశాలకు ప్రాధాన్యం. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థ, బ్యాంక్ పదజాలం, బీమా, రెపో, రివర్స్ రెపో, వడ్డీ రేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలు, బ్యాంకులు-ప్రధాన కార్యాలయాలు-అధిపతులు.. ఇవన్నీ తెలుసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా తాజా సంఘటనలకు ప్రాధాన్యమివ్వాలి. దేశ చరిత్ర, సంస్కృతి, భూగోళం, పాలిటీ, సైన్సుల్లో ప్రాథమిక అవగాహననూ పరిశీలిస్తారు. వీటికోసం 8, 9, 10 తరగతుల్లోని ముఖ్యాంశాలు చదువుకుంటే సరిపోతుంది. వర్తమాన వ్యవహారాల కోసం జులై, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు అంటే.. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు-రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు..వీటికి ప్రాధాన్యమివ్వాలి.

జనరల్ ఇంగ్లిష్: ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, తప్పుగా ఉన్న పదాన్ని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్..తదితర విభాగాల నుంచే వీటిని అడుగుతారు హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు.

క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ అప్టిట్యూడ్: క్వాంటిటేటివ్ విభాగంలో.. నంబర్ సిస్టమ్, ఫండమెంటల్ అరిథ్‌మెటికల్ ఆపరేషన్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. అరిథ్‌మెటిక్ ఆపరేషన్స్‌లో భాగంగా.. శాతాలు, నిష్పత్తి, సరాసరి, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, డిస్కౌంట్.. మొదలైనవి బాగా చదవాలి. రీజనింగ్‌లో.. వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు ఉంటాయి. సెమాంటిక్ ఎనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్, నంబర్ ఎనాలజీ, ట్రెండ్స్, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ క్లాసిఫికేషన్, సిరీస్, కోడింగ్-డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్... తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి.

కంప్యూటర్ నాలెడ్జ్: కంప్యూటర్ ఉపయోగించి, చిన్న పనులు పూర్తిచేయగలరా లేదా తెలుసుకునేలా ప్రశ్నలు ఉంటాయి. వర్డ్, ఎక్సెల్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్, ఈమెయిల్, యూఆర్ఎల్, హెచ్‌టీటీపీ, వెబ్‌సైట్లు.. వీటి గురించి తెలుసుకోవాలి. ఇంజినీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ చదువుకున్నవారు ఈ ప్రశ్నలకు సులువుగానే సమాధానాలు గుర్తించగలరు.

సన్నద్ధత

- ఈ పరీక్షకు సుమారు 20-25 రోజుల వ్యవధే ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- నిర్ణీత వ్యవధిలో ఎక్కువ ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించినవారే విజేతలు కాగలరు. ఒక్కో ప్రశ్నకు గరిష్ఠంగా 36 సెకన్ల సమయమే ఉంటుంది. ఇంత తక్కువ సమయంలో సమాధానం గుర్తించాలంటే.. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తేనే సాధ్యమవుతుంది.
- సులువైనవి, తక్కువ వ్యవధిలో జవాబు రాబట్టగలిగే ప్రశ్నలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాతే మిగిలినవాటిని ప్రయత్నించాలి.
- ఐబీపీఎస్ క్లరికల్, గతంలో నిర్వహించిన అప్రెంటిస్ ప్రశ్నాపత్రాలు వీలైనన్ని సాధన చేయాలి.
- కనీసం పది నమూనా పరీక్షలైనా రాసి, జవాబులు విశ్లేషించుకోవాలి. ఇబ్బంది పడుతోన్న విభాగం/చాప్టర్లను ప్రాధాన్యంతో చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేస్తే పరీక్షలో ఎక్కువ మార్కులు పొందడానికి వీలవుతుంది.
- నేర్చుకున్న అంశాలన్నీ పరీక్షకు కొద్ది రోజుల ముందు పునశ్చరణ చేస్తే తెలిసిన ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించడం తేలికవుతుంది.

పరీక్ష

ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్.. ఒక్కో విభాగం నుంచీ 25 చొప్పున 100 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రతి సరైన జవాబుకూ ఒక మార్కు. ప్రశ్నలు ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో అడుగుతారు.

ఎంపిక

పరీక్షలో అర్హత మార్కులు పొందినవారికి స్థానిక భాషలో పరీక్ష నిర్వహిస్తారు. పది లేదా ఇంటర్‌లో ఆ భాషను చదువుకున్నవారు దీన్ని రాయనవసరం లేదు. స్థానిక భాషలో ఉత్తీర్ణులకు.. ధ్రువపత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి, అప్రెంటిస్‌గా నియమిస్తారు. ఏపీ, తెలంగాణలో ఖాళీలకు దరఖాస్తు చేసుకుని, పది/ఇంటర్‌లో తెలుగు లేదా ఉర్దూ ఒక సబ్జెక్టుగా ఉన్నవారు లాంగ్వేజ్ టెస్టు రాయనవసరం లేదు.

ముఖ్య సమాచారం

ఖాళీలు: 5138. ఏపీలో 56, తెలంగాణలో 69. **అర్హత:** ఏదైనా డిగ్రీ.
వయసు: జనవరి 1, 2026 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. జనవరి 2, 1998 - జనవరి 1, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో మినహాయింపులు వర్తిస్తాయి.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ పురుషులకు రూ.944, మహిళలకు రూ.708. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జండర్లకు రూ.236.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.02.2026
పరీక్ష: మార్చి మొదటి వారంలో నిర్వహిస్తారు.
వెబ్‌సైట్: https://pnb.bank.in/Recruitments.aspx

ఒకేషనల్ కోర్సులతో ఎలాంటి ఉపాధి?



బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి, ఈ కోర్సులు అందించే ప్రత్యేక సంస్థలు ఉన్నాయా? - పరమేశ్



■ విద్యను ఉద్యోగావకాశాలతో నేరుగా అనుసంధానించాలనే లక్ష్యంతో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (బీఓక్) డిగ్రీని రూపొందించారు. సంప్రదాయ బ్యాచిలర్ డిగ్రీలతో పోలిస్తే వీటిలో థియరీ కంటే ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఇండస్ట్రీ అనుభవం, ఉద్యోగానికి అవసరమైన అంశాలపై ఎక్కువ దృష్టి పెడతారు. చదువు పూర్తయ్యేలోపే ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా ఈ ప్రోగ్రామ్‌లు రూపొందించారు.

- బీఓక్ ప్రోగ్రామ్‌లను యూజీసీ మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తారు. ప్రతి సెమిస్టర్‌లో ప్రాక్టికల్ శిక్షణ, ల్యాబ్ వర్క్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్పులు తప్పనిసరిగా ఉంటాయి. విద్యార్థులు కోర్సు మధ్యలోనే స్కిల్ సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉండటం వల్ల కోర్సు పూర్తయ్యేలోపే ప్రారంభ స్థాయి, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయగల సామర్థ్యం వస్తుంది.
- ఉపాధి అవకాశాల విషయానికి వస్తే, బీఓక్ విద్యార్థులు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డిజైనర్, డేటా అనలిస్ట్ అసిస్టెంట్, గ్రాఫిక్ డిజైనర్, రిటైల్ సూపర్‌వైజర్, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్ లాంటి ఉద్యోగాల్లో చేరవచ్చు. అలాగే, డిజిటల్ స్కిల్స్ ఉన్నవారు ఫ్రీలాన్సింగ్, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి రంగాల్లో కూడా మంచి అవకాశాలు పొందవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతకు ఈ కోర్సులు ఉపాధి కల్పనలో కీలకంగా మారుతున్నాయి.
- రాష్ట్ర విశ్వవిద్యాలయాల అనుబంధంలోని కళాశాలలు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, కమ్యూనిటీ కాలేజీలు, కొన్ని సెంట్రల్ యూనివర్సిటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్‌తో అనుసంధానమైన సంస్థలు బీఓక్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు పరిశ్రమలతో నేరుగా ఒప్పందాలు చేసుకుని ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కూడా కల్పిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు చదువుతో పాటు అనుభవం కూడా దక్కుతోంది.

> “ఒకేషనల్ కోర్సులు అనేక రంగాల్లో అందుబాటులో ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, డిజిటల్ మీడియా, రిటైల్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, అగ్రికల్చర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, రిన్యూవబుల్ ఎనర్జీ.. ఇలా పలు బీఓక్ స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్నవే. దీంతో కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలూ పొందవచ్చు.”

- బీఓక్ పూర్తి చేసుకున్నవారు ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఎంటక్, ఎంబీఏ లాంటి ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ కోర్సులు చేయడానికీ అవకాశం ఉంటుంది. ఉద్యోగం, చదువు అనే రెండు మార్గాలనూ సమతౌల్యంతో కొనసాగించేందుకు ఇది అనుకూలం.

త్వరగా ఉపాధి పొందాలనుకునే వారూ, ప్రాక్టికల్ స్కిల్స్ మీద ఆసక్తి ఉన్న వారూ, స్వయం ఉపాధి లేదా పరిశ్రమలో నేరుగా ప్రవేశించాలనుకునే యువతకు బీఓక్ కోర్సులు చాలా మంచి ఎంపిక. సరైన స్పెషలైజేషన్, పరిశ్రమలతో అనుసంధానం ఉన్న సంస్థను ఎంచుకుంటే ఈ డిగ్రీలు మెరుగైన భవిష్యత్తును అందిస్తాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్‌షిప్స్

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: ఇన్ఫినిట్ థింకింగ్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ అడ్వర్టైజింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, డిస్‌ప్లే యాడ్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU89

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: గ్రోకెట్ వెంచర్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, పబ్లిక్ రిలేషన్స్ స్టైపెండ్: రూ.11,000-25,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU8T

హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: రెనైసెన్స్ అకాడమీ ఆఫ్ విజ్‌డమ్ ప్రై.లి. నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్వ్యూ కోఆర్డినేషన్, రిక్రూట్‌మెంట్, రిజ్యూమె స్క్రీనింగ్
స్టైపెండ్: రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU8Y

ఈ-కామర్స్ ఆపరేషన్స్
సంస్థ: పీఎస్‌వై ఎఫ్‌వైఐ మ్యాగజైన్
నైపుణ్యాలు: ఎంఎస్-ఎక్సెల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, షాపిఫై స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://url-shortener.me/AU98

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్
సంస్థ: ప్యాన్‌గో
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: రూ.10,000-16,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AU9E

వీడియో ఎడిటింగ్
సంస్థ: డివైన్ ఇన్‌ఫ్రా
నైపుణ్యం: వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.2,500-5,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUAP

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: గ్రెయిన్ జీనియస్ ఫుడ్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://hosturl.info/auz0pO

మార్కెటింగ్ అండ్ ఆపరేషన్స్
సంస్థ: రివైవింగ్ రిచ్యువల్స్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, మార్కెట్ రిసెర్చ్, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.2,000-3,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUA1

కంటెంట్ డెవలప్‌మెంట్
సంస్థ: లెర్న్‌తెటా
నైపుణ్యాలు: లాజికల్ రీజనింగ్, మ్యాథమెటిక్స్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUAA

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: హ్యాపీనెస్ ఫ్యాక్టర్స్
నైపుణ్యాలు: ఆటోమేషన్, కేన్వా, చాట్‌జీపీటీ, కంటెంట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ టూల్స్, లింక్డ్‌ఇన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఫేస్‌బుక్ యాడ్స్, జనరేటివ్ ఏఐ టూల్స్, మార్కెట్ అనాలిసిస్, ఎంఎస్-ఆఫీస్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, యూట్యూబ్ యాడ్స్
స్టైపెండ్: రూ.4,000-6,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUAI

వీడియో ఎడిటర్
సంస్థ: ఎక్స్‌పోస్ ట్రెండ్జ్
నైపుణ్యం: వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.2,500-5,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUBJ

ఐఏఎఫ్ అగ్నివీర్‌వాయు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్‌వాయు నాన్-కంబాటెంట్ నియామకాలకు ప్రకటన విడుదల చేసింది. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
విభాగాలు: హాస్పిటాలిటీ అండ్ హౌస్‌కీపింగ్. **అర్హత:** పదోతరగతి, 152 సెం.మీ. తగిన బరువు ఉండాలి.
వయసు: 21 సంవత్సరాలు మించకూడదు. 02.07.2005-02.01.2009 మధ్య జన్మించాలి.
వేతనం: నెలకు రూ.30,000. ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి.
ఎంపిక: రాత పరీక్ష, ఎస్ఎస్‌టీ, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్‌లతో.
దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి ఎయిర్ ఫోర్స్ స్టేషన్లకు పోస్టు ద్వారా పంపాలి. ఈ స్టేషన్లు బెంగళూరు, న్యూదిల్లీ, హైదరాబాద్, గాంధీనగర్, పుణెల్లో ఉన్నాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.02.2026
వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in

అసిస్టెంట్ మేనేజర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లఖ్‌నవూ.. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్-ప్రోగ్రామ్స్ (కన్సల్టెంట్ రోల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ మేనేజర్-ప్రోగ్రామ్స్ (కన్సల్టెంట్ రోల్) - 04

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ ఎంబీఏతో పాటు పని అనుభవం.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 20.02.2026
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.iiml.ac.in/job-detail

బీహెచ్‌యూలో

బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), వారణాసి.. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది,

- ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-I (నాన్-మెడికల్): 01
- ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III: 01

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ (సోషల్ సైన్స్/ లైఫ్ సైన్సెస్), ఉద్యోగానుభవం.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-Iకు రూ.56,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-IIIకు రూ.28,000.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా varanasi.prarambh@gmail.comకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 23.02.2026.
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.bhu.ac.in/site/tempvacancy/1_2_16

నాన్ టీచింగ్


సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం, న్యూదిల్లీ.. ఆదర్శ సంస్కృత మహావిద్యాలయాలు, ఆదర్శ సంస్కృత శోధ్ సంస్థాన్‌లోని వివిధ విభాగాల్లో నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- కాలేజ్ లైబ్రేరియన్:05 ● సెక్షన్ ఆఫీసర్:01 ● అసిస్టెంట్:14
- ప్రొఫెషనల్ అసిస్టెంట్:01 ● అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ):03
- లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ):18

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, నెట్/పీహెచ్‌డీ. విద్యార్హతలతోపాటు పని అనుభవం, టైపింగ్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు ఎల్‌డీసీకి రూ.19,000 - 63,200; యూడీసీకి రూ.25,500 - 81,100; అసిస్టెంట్/ ప్రొఫెషనల్ అసిస్టెంట్‌కు రూ.35,400 - 1,12,400; సెక్షన్ ఆఫీసర్‌కు రూ.44,900 - 1,42,400; కాలేజ్ లైబ్రేరియన్‌కు రూ.57,700 - 1,82,400.
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్టు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.02.2026.
వెబ్‌సైట్: https://www.sanskrit.nic.in/

నైపుణ్యాభివృద్ధి సంస్థను మరింత బలోపేతం చేయండి

● అధికారులకు చంద్రబాబు ఆదేశం



ఈనాడు, అమరావతి: నైపుణ్యాభివృద్ధి సంస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇతర శాఖల్లోని నైపుణ్యాభివృద్ధి పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను దీనితో ఇంటిగ్రేట్ చేయాలని చెప్పారు. ఉపాధి కూలీలకూ ఎలాంటి నైపుణ్యం నేర్పించగలరో చూడాలని సూచించారు. మంత్రులు, కార్యదర్శులతో సమావేశంలో నైపుణ్యాభివృద్ధి అంశంపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి నైపుణ్యాభివృద్ధి కార్యదర్శి కోన శశిధర్ వివరిస్తూ.. 'సరైన విద్యార్హతలు లేని, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ లాంటి వారికి ఆయా పనుల్లో వారికున్న నైపుణ్యం ఏ స్థాయిలో ఉందనేది గుర్తించేందుకు ఏఐతో 'స్కిల్ టెస్ట్' చేసి, వారి నైపుణ్యాన్ని అంచనా వేస్తున్నాం. అన్ని జిల్లాలో ఇలా లక్ష మందికిపైగా స్క్రీనింగ్ చేశాం. నీతి ఆయోగ్ సూచన మేరకు నిధుల సమీకరణలో భాగంగా ప్రపంచ బ్యాంక్ ఫండింగ్ కోసం వచ్చే నాలుగేళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం' అని చెప్పారు. సీఎం స్పందిస్తూ.. దానికంటే ముందు వివిధ శాఖల్లో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన నిధులను సమీకరించుకుని వాటితో పనిచేయాలని సూచించారు. ఒక్క కార్మిక శాఖ నుంచే ఏటా రూ.300 కోట్లు దీనికోసం సమీకరించే అవకాశం ఉంటుందని ఉదాహరణగా చెప్పారు.

ఇచ్ఛాపురం-నెల్లూరు మధ్య

4 రైల్వే లైన్లతో సరకు రవాణా వేగవంతం

● బుల్లెట్ రైళ్ల కారిడార్లతో ఏపీకి అధిక ప్రయోజనం

● 774 రైల్వే క్రాసింగ్స్ తొలగించేలా వంతెనలు

● ఎన్‌హెచ్, రైల్వే ప్రాజెక్టులకు వేగంగా భూసేకరణ జరగాలి

● విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని యూనిట్‌కు రూ.3.90కి తీసుకొస్తాం

● ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లు.. 4 వరుసలకు పెరిగితే, సరకు రవాణా వేగంగా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 774 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించనున్నారని, ఇవి పూర్తయ్యేలా చూస్తే.. ఎక్కడా లెవెల్ క్రాసింగ్స్ ఉండవని తెలిపారు. రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండదని, వీటికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించి గడువులోపు భూములు సేకరించేలా చూడాలని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ విషయం తమకు సంబంధం లేదనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదన్నారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం మాట్లాడారు.



మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు

● హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు బుల్లెట్ రైళ్ల కారిడార్లతో ఏపీకి అధిక ప్రయోజనం కలుగుతుందని, ఇవన్నీ ఏపీ మీదుగానే వెళ్లాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

● 'ఏ ఉత్పత్తికైనా రవాణా ఖర్చు కీలకపాత్ర పోషిస్తుంది. ఆయా ఉత్పత్తులకు ప్రస్తుతం సగటున 14 శాతం రవాణా ఖర్చు అవుతోంది. దీనిని 7-8 శాతానికి తగ్గించాలి.

● వాటర్‌వే అత్యుత్తమమైనది. తర్వాత రైలు, రోడ్లు, ఎయిర్‌వేస్ వస్తాయి.

● 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి చేస్తున్నాం. నాలుగైదేళ్లలో ఇది 1,000 లక్షల టన్నులకు వెళ్తుంది. ఇదంతా దేశ, విదేశీ మార్కెట్‌కు వెళ్లేలా లాజిస్టిక్స్ సదుపాయం ఉండాలి.

● అనంతపురం జిల్లా నుంచి రైళ్లలో అరటి రవాణా చేస్తున్నారు. ఇలా అన్ని పంటలపై దృష్టిపెట్టాలి.

● సీ ప్లేన్స్‌లో మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శం కానుంది' అని చంద్రబాబు కోరారు

విద్యుత్ కొనుగోలు ధర రూ.4 లోపునకు తీసుకొస్తాం

● 'రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.18 ఉండగా, ఇప్పటికే 38 పైసలు చొప్పున తగ్గించాం.

● దీనిని రూ.4 లోపు ఉండేలా చూస్తాం. యూనిట్ ధర రూ.3.90 కి తీసుకురావాలనే లక్ష్యం పెట్టుకున్నాం.

● ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కాలి.

● విద్యుత్, నీటికి ఒకప్పుడు కొరత ఉండేది. ఇప్పుడు వాటి కొరత లేకుండా అధిగమించాం.

● మన రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానంలో అక్కడే విద్యుదుత్పత్తి, స్టోరేజీ, అక్కడి నుంచే డిస్ట్రిబ్యూషన్ ఉండేలా చూస్తున్నాం.

● ఒక మీటరు భూగర్భజలాలను పెంచడం ద్వారా రూ.4 వేల కోట్లు ఆదా అవుతుంది.

● ఆర్టీసీలో వెయ్యి విద్యుత్ బస్సులు తీసుకుంటున్నాం.

● పీఎం కుసుమ్, సోలార్ రూఫ్‌టాఫ్ ప్రాజెక్టులను కలెక్టర్లు వేగవంతమయ్యేలా చూడాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మేలైన ఉత్పత్తులకే అంతర్జాతీయ మార్కెట్

● ఎంఎస్ఎంఈ వస్తువులకు బ్రాండింగ్ తేవాలి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు సంబంధించి బ్యాంకర్లు.. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ కలిపి డేటా బేస్ తయారు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రొడక్ట్ పెర్‌ఫెక్షన్(మేలైన ఉత్పత్తి) సాధించాలంటే డేటా అనుసంధానం ముఖ్యమని పేర్కొన్నారు. సచివాలయంలో నిర్వహించిన కార్యదర్శుల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. 'ఎవరు ఏ తరహా ఉత్పత్తులు చేస్తున్నారనేది తెలియకపోతే.. మేలు రకం తయారీ సాధ్యం కాదు. ఉత్పత్తుల నాణ్యత.. మార్కెటింగ్.. బ్రాండింగ్.. ప్యాకేజింగ్ వంటి అంశాలు చాలా ముఖ్యం. ప్రతి ఉత్పత్తి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. డిమాండ్.. ఉత్పత్తి.. మార్కెటింగ్ అనేది నిరంతరం జరగాల్సిన ప్రక్రియ. ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టాలి' అని నిర్దేశించారు. .

● డ్వాక్రా మహిళలు, మెప్మా కోసం కొత్తగా 'స్వయం' పేరిట బ్రాండ్ ఏర్పాటు చేశాం. డ్వాక్రా, మెప్మాలో సుమారు 1.1 కోట్ల మంది మహిళల భాగస్వామ్యం ఉంది. ఒక కుటుంబంలో సగటున ముగ్గురు ఉన్నారని భావిస్తే.. 3.3 కోట్ల మంది వినియోగదారులు అవుతారు. 'స్వయం' పెద్ద బ్రాండ్‌గా మారుతుందని పేర్కొన్నారు.

● అరకు కాఫీకి బ్రాండింగ్ తెచ్చాం. దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. అన్ని విమానాశ్రయాల్లో అరకు కాఫీ ఉత్పత్తుల ప్రచార పోస్టర్లు ఉండాలి. అన్ని ముఖ్య నగరాల్లో వాటిని ఏర్పాటు చేయండి అని సీఎం సూచించారు.

ఎస్టీపీల ఏర్పాటుకు రూ.300 కోట్లతో భూసేకరణ

ఈనాడు, అమరావతి: నగరాల్లో మురుగు నీటి నిర్వహణ కోసం ఎస్టీపీల ఏర్పాటుకు రూ.300 కోట్లతో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సమకూరుస్తుందని తెలిపారు. కార్యదర్శుల సదస్సులో స్వచ్ఛాంధ్రపై సీఎం మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో వ్యర్థాలను వేగంగా ప్రాసెస్ చేయాలని, అన్ని ప్రభుత్వ విభాగాల్లో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్నది లక్ష్యమని సీఎం చెప్పారు.

కేంద్ర పథకాల కింద ఒక్క నెలలో రూ.6,336 కోట్ల ఖర్చు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రంలో ఒక్క జనవరి నెలలోనే రూ.6,336 కోట్లు ఖర్చు పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కిందటి నెలలో మంత్రులు, కార్యదర్శులతో జరిపిన సమీక్ష సందర్భంగా నిధులు వినియోగించుకోకపోతే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ శాఖల వారీగా, జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి, లక్ష్యాలు విధించారు. ఆ మేరకు ఒక్క నెలలో రూ.6,336 కోట్లు ఖర్చు పెట్టగలిగినట్లు ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై సమీక్షలో ఆయన ఈ విషయాలను వివరించారు.

● రాష్ట్రంలో 79 కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలవుతున్నాయి. ● కేంద్రం కేటాయింపులు మొత్తం రూ.17,893 కోట్లు. ● జనవరి నెలాఖరు వరకు రాష్ట్ర, కేంద్ర వాటా నిధులు కలిపి ఖర్చు చేసింది రూ.14,096 కోట్లు.

కేంద్ర నిధులు ఖర్చు పెట్టకపోతే ఎలా?: సీఎం చంద్రబాబు

'కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని ఖర్చు పెట్టకపోతే ఎలా? మంగళవారం దిల్లీలో అయిదారుగురు మంత్రులు, కార్యదర్శులను కలుస్తున్నాను. రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు సైతం దిల్లీ వెళ్లి మాట్లాడి, నిధులు తెచ్చుకోవాలి. సమస్యలు పరిష్కరించుకోవాలి. ఆయా శాఖల్లో అమలు చేయాల్సిన సంస్కరణలు పూర్తి చేయాలి. శాసనసభ సమావేశాల్లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు. నిధులు ఖర్చు చేయకుండా ఏ ప్రాజెక్టు ఆగిపోయినా అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. విశాఖలో యూనిటీ మాల్, రాజమహేంద్రవరం, గండికోటల్లో పర్యాటక ప్రాజెక్టులు, విశాఖలో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ వంటి అంశాల్లో పురోగతి లేకపోవడంపై కేంద్ర ఆర్థికమంత్రి సీఎంకు లేఖ రాసిన అంశాన్ని ఆర్థికశాఖ అధికారులు ప్రస్తావించగా.. ముఖ్యమంత్రి పై విధంగా స్పందించారు.



సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు

● కేంద్ర ప్రాయోజిత పథకాల ఖర్చులో చివరి 3 స్థానాల్లో ఉన్న ప్రకాశం, చిత్తూరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లను సీఎం ప్రశ్నించారు.

● బ్యాంకుల్లో ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధులు రూ.148 కోట్లు ఉన్నాయని, వాటిని ఆయా జిల్లాల్లో వాడుకోవాలని చెప్పినా.. కలెక్టర్లు ఇంకా స్పందించలేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

● గనులశాఖలో సంస్కరణలు పూర్తయితే రూ.400 కోట్ల నిధులు వస్తాయని, రోడ్లు, భద్రతా విభాగంలో రూ.350 కోట్లు వస్తాయని ఆర్థికశాఖ అధికారులు సీఎంకు చెప్పారు.

4.35% భూ వివాదాలకే తక్షణ పరిష్కారం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఊరూరా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ క్లినిక్‌లలో 11,270 ఫిర్యాదులు రాగా, వాటిలో 491 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించినట్లు రెవెన్యూ శాఖ పేర్కొంది. మొత్తం ఫిర్యాదుల్లో ఇవి 4.35 శాతం! మరో 9,758 సమస్యలకు గడువు విధించి ఆ లోపు పరిష్కరిస్తామని పేర్కొంది. మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో రెవెన్యూ శాఖ ఈ అంశాలను నివేదించింది. మొత్తం ఫిర్యాదుల్లో 28 సమస్యలను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లారు.

● 2024 జూన్‌కు ముందు 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయగా, 4,783 గ్రామాల్లో భూహక్కు పత్రాల మార్పిడి కసరత్తు జరిగింది. ● 2026 జనవరి వరకు భూహక్కు పత్రాల స్థానే 22.33 లక్షల పట్టాదారు పాసు పుస్తకాలు సిద్ధమయ్యాయి. ● 18.77 లక్షల పాస్ పుస్తకాలను ఈకేవైసీ ద్వారా తనిఖీ చేసి, పంపిణీ చేశారు.

అనకాపల్లి, అనంతపురంలో.. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి, అనంతపురం జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగ్గా.. కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రమాదాల కారణంగా సంభవించిన మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. గుంతలు లేని రహదారులు ఉన్న జిల్లాల్లో కడప, అన్నమయ్య టాప్‌లో ఉండగా.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలపై దృష్టి అవసరమని ప్రభుత్వం పేర్కొంది. రవాణా, రోడ్డు భద్రతపై సదస్సులో నివేదిక విడుదల చేశారు. అల్లూరి జిల్లాలో మాతృ మరణాల రేటు అధికంగా ఉందని నివేదిక పేర్కొంది.

పింఛన్లపై ప్రజల్లో భారీగా సానుకూల దృక్పథం

● సంపద సృష్టి, ఆదాయ కల్పన కార్యక్రమాలు చేపట్టాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'ప్రజలకు అందిస్తున్న సేవలు సమగ్రంగా లోపాలు లేకుండా ఉండాలి. సంపద సృష్టి, ఆదాయ కల్పన లాంటి కార్యక్రమాలు చేపడితే ప్రజల సానుకూల దృక్పథంలో సుస్థిరత వస్తుంది. దీన్ని అధికారులు సీరియస్‌గా తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ప్రజా సానుకూల దృక్పథంపై చర్చ సందర్భంగా చంద్రబాబు స్పందించారు. శాఖలు, సేవల వారీగా ప్రజల్లో ఉన్న సానుకూలత శాతాలను ఆయన వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సానుకూల దృక్పథానికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. 'తొలి ఏడాది (2024-జూన్ నుంచి 2025 మే వరకు) సానుకూలతలో రాష్ట్ర స్కోర్ 65.08 శాతంగా ఉంది. 2025 డిసెంబరు 25వ తేదీ నుంచి గత నెల 25వ తేదీవరకూ (నెల రోజుల్లో) చేసిన సర్వేలో సానుకూలత 70.04 శాతంగా ఉంది' అని సీఎం తెలిపారు. పింఛన్లపై ప్రజల్లో సానుకూలత బ్రహ్మాండంగా ఉందన్నారు. 'ధాన్యం కొనుగోళ్లను అసాధారణంగా చేస్తున్నప్పటికీ, దాని గురించి ప్రజల్లోకి తక్కువగా తీసుకువెళ్లినట్లుంది, దీనిపై ఓనర్‌షిప్ తీసుకోవాలి. మున్సిపల్ సేవలందిస్తున్నాం కానీ, ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో సానుకూలత రావడం లేదు' అని అభిప్రాయపడ్డారు.

సీఎం ప్రకటించినవాటిలో సేవల సానుకూలత రేట్ వివరాలు (శాతంలో)

సేవ	తొలి ఏడాదిలో	2025 డిసెంబరు 25 – 2026 జనవరి 25 వరకు
పింఛన్లు	87.6	92
రేషన్	74.5	79
అన్నా క్యాంటీన్లు	79.8	93.1
పాఠశాల విద్య	82.1,	83.5
పీసీబీ	74.9	82.6
ధాన్యం కొనుగోళ్లు	72.6	73.9
ఆసుపత్రుల సేవలు	63	71
విద్యుత్	61.3	75.4
మున్సిపల్ పారిశుద్ధ్యం	62.5	66.3
మున్సిపల్ నీటి సరఫరా	73.2	75.1
వీధిదీపాలు, పంచాయతీరాజ్ (రహదారులు)	54.8	63.3
ఆర్టీసీ (డ్రైవర్ల వ్యవహారశైలి, భద్రత)	70	79
ఆర్టీసీ (బస్టాండ్లలో శుభ్రత, తాగునీరు వంటివి)	51	57
దీపం	68.7	72.1
దేవాలయాలు	69.9	69.3
గంజాయి, డ్రగ్స్ నియంత్రణ	63.9	71.7
రిజిస్ట్రేషన్లు	69.6	72.9
రెవెన్యూ	69.6	72.9
ఇసుక	61.4,	73.2
స్వర్ణ గ్రామాలు	70.9	71.8
హౌసింగ్	67.4,	71.5
విత్తనాలు	58.7	67.0
యూరియా అందుబాటు	60.9	65.1

భవన, నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏపీటీఎస్‌కు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీటీఎస్ ద్వారా టెండర్లు పిలిచి, ఎంపిక చేసిన సంస్థలతో 2026-27 సంవత్సరానికి శిక్షణ ఇప్పించాలని సూచించింది. గతేడాది వసూలైన పన్నులో 10% వార్షిక పరిమితి మించకుండా 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలకు నైపుణ్య శిక్షణకు అనుమతించాలని పేర్కొంది. 2025-26కు సంబంధించి 65 వేల మందికి కార్మికులు, వారిపై ఆధారపడ్డ పిల్లలు, కుటుంబ సభ్యులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గతంలో ఇచ్చిన అనుమతిని, వచ్చే సంవత్సరానికి పొడిగించింది.

భూ సమస్యలపై ఫిర్యాదుల పరంపర

● తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో తన భూమి విస్తీర్ణాన్ని తక్కువ చేసి చూపారని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం పాపాయిపల్లికి చెందిన హేమంత్‌రావు వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో తన భూమికి సంబంధించిన సర్వే నంబర్లను తప్పుగా నమోదు చేశారని, వాటిని సరి చేసేలా అధికారులను ఆదేశించాలని పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన రమాదేవి కోరారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు హక్కు ఉన్నా, కుటుంబ సభ్యులు వారి పేర్లతో తప్పుడు దస్తావేజులు సృష్టించి ఆ వివరాలే ఆన్‌లైన్‌లో నమోదు చేయించారని వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలానికి చెందిన రంగయ్య వాపోయారు.

స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖ టాప్

ఈనాడు, అమరావతి: జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. స్థూల ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ జిల్లా.. తలసరి ఆదాయం పరంగా మూడో స్థానంలో ఉంది. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు వెల్లడించింది. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.2,94,507 అంచనా కాగా.. తొమ్మిది జిల్లాలు మాత్రమే రాష్ట్ర సగటు కంటే ఎగువన ఉన్నాయి.

2025-26 సంవత్సరానికి జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి ముందస్తు అంచనా

జిల్లా పేరు	రూ.కోట్లు	ర్యాంకు
విశాఖపట్నం	1,60,771	1
ఎన్టీఆర్	1,05,173	2
కృష్ణా	98,801	3
తిరుపతి	98,526	4
ఏలూరు	88,543	5
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	85,444	6
గుంటూరు	83,618	7
వైఎస్సార్ కడప	79,617	8
అనంతపురం	76,849	9
కాకినాడ	75,342	10
పశ్చిమగోదావరి	73,970	11
తూర్పుగోదావరి	70,512	12
శ్రీసత్యసాయి	63,190	13
అనకాపల్లి	60,146	14
కర్నూలు	54,452	15
పల్నాడు	49,596	16
చిత్తూరు	49,303	17
నంద్యాల	48,531	18
ప్రకాశం	48,457	19
శ్రీకాకుళం	47,663	20
బాపట్ల	46,268	21
విజయనగరం	45,085	22
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	44,859	23
అన్నమయ్య	36,035	24
మార్కాపురం	29,031	25
అల్లూరి సీతారామరాజు	18,583	26
పార్వతీపురం మన్యం	17,271	27
పోలవరం	6,723	28

2025-26 సంవత్సరానికి జిల్లాల వారీగా తలసరి ఆదాయం ముందస్తు అంచనా (రూపాయల్లో)

జిల్లా పేరు	తలసరి ఆదాయం	ర్యాంకు
విశాఖపట్నం	6,58,091	1
కృష్ణా	4,82,078	2
ఎన్టీఆర్	3,91,390	3
ఏలూరు	3,77,214	4
తిరుపతి	3,53,351	5
పశ్చిమగోదావరి	3,38,488	6
గుంటూరు	3,28,534	7
బాపట్ల	3,04,055	8
కాకినాడ	2,97,328	9
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	2,90,190	10
అనంతపురం	2,85,492	11
వైఎస్సార్ కడప	2,83,716	12
శ్రీసత్యసాయి	2,82,231	13
తూర్పుగోదావరి	2,81,510	14
అనకాపల్లి	2,73,210	15
అల్లూరి సీతారామరాజు	2,61,332	16
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	2,57,126	17
చిత్తూరు	2,52,077	18
ప్రకాశం	2,35,751	19
నంద్యాల	2,27,307	20
మార్కాపురం	2,16,990	21
అన్నమయ్య	2,14,902	22
పల్నాడు	2,05,002	23
కర్నూలు	2,00,143	24
విజయనగరం	1,94,660	25
శ్రీకాకుళం	1,80,971	26
పోలవరం	1,61,605	27
పార్వతీపురం మన్యం	1,56,977	28

ఆ జిల్లాల్లో పరిస్థితులపై విశ్లేషించాలి

ఈనాడు, అమరావతి: సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. అందులో అధికారులు వెల్లడించిన కొన్ని వివరాలివి..



మంత్రులు, కార్యదర్శుల సదస్సులో పాల్గొన్న ఉన్నతాధికారులు

● 2024తో పోల్చితే 2025లో శ్రీకాకుళం జిల్లాలో 36.2 శాతం, కృష్ణా-19.3, అల్లూరి సీతారామరాజు-18.7, నంద్యాల- 17.5, ప్రకాశం-17.3% మేర నేరాలు తగ్గాయి. అదే సమయంలో అన్నమయ్య జిల్లాలో 8.1%, నెల్లూరు-6.1, కోనసీమ-5.8, పార్వతీపురం మన్యం-4.8, గుంటూరు జిల్లాలో 4.6% మేర నేరాలు పెరిగాయి. నేరాలు పెరిగిన జిల్లాల్లో.. అందుకు కారణాలను ఆయా జిల్లాల ఎస్పీలు విశ్లేషించి, నియంత్రణ చర్యలు చేపట్టాలి.

● హింసాత్మక నేరాలు నంద్యాలలో 28%, కృష్ణా-27.9, అనకాపల్లి-25.4, ప్రకాశం-23.1, బాపట్లలో 21.6% తగ్గాయి. చిత్తూరులో గరిష్ఠంగా 3.3% పెరిగాయి. బాగా తగ్గిన జిల్లాతో పోలిస్తే.. బాగా పెరిగిన జిల్లాకు మధ్య వ్యత్యాసం 25%గా ఉంది. దీనికి కారణాలు అధ్యయనం చేసి, నియంత్రణ చర్యలు చేపట్టాలి.

● కృష్ణా, విశాఖపట్నం, చిత్తూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లో మహిళలపై నేరాలు తగ్గగా.. శ్రీసత్యసాయి, పల్నాడు, వైఎస్సార్ కడప, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో పెరిగాయి.

● రైతుల ఆత్మహత్యలు తగ్గినా, వ్యవసాయ కూలీల బలవన్మరణాలు పెరిగాయి. గృహిణులు, ప్రైవేటు ఉద్యోగుల ఆత్మహత్యలకు కారణాలు వెలికితీయాలి.

మద్యం తాగి.. పాఠశాల బస్సు నడిపిన డ్రైవర్

● ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరి మృతి.. 8 మందికి గాయాలు

పర్వతగిరి (వరంగల్), న్యూస్‌టుడే: పిల్లలను తీసుకెళ్తున్నామనే విచక్షణ లేకుండా..పూటుగా మద్యం తాగడంతోపాటు వేగంగా బస్సును నడిపి బాలుడితో సహా ఇద్దరి మృతికి కారకుడయ్యాడో బడి బస్సు డ్రైవర్. ఈ ఘటన తెలంగాణలోని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... వరంగల్ నగరంలోని రంగశాయిపేట, శంభునిపేట, నిజాంపురకు చెందిన మూడు కుటుంబాలకు చెందిన 15 మంది పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ యాకూబ్ బాబా దర్శనానికి సోమవారం ట్రాక్టరులో బయల్దేరారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో శ్రీనగర్ క్రాస్‌రోడ్డు సమీపంలో సంగెం మండలం తీగరాజుపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఎదురుగా వచ్చి ట్రాక్టరును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. అందులో ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మూడు 108 వాహనాల్లో ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా శంభునిపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ ఇస్మాయిల్(50), నిజాంపుర ప్రాంతానికి చెందిన ఎండీ రెయాన్(2) మృతి చెందారు. పాఠశాల బస్సు డ్రైవర్, అందులోని ఓ విద్యార్థి, ట్రాక్టరులో ఉన్నవారితో కలిపి మొత్తం 8 మంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో బడి బస్సులో సుమారు 30 మంది పిల్లలున్నారు. 'పాఠశాల బస్సు డ్రైవర్ అనిల్ మద్యం తాగి నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని, బ్రీత్ అనలైజర్‌తో పరిశీలిస్తే 152 రీడింగ్ వచ్చిందని' పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న పాఠశాల బస్సు, ట్రాక్టరు



ఇస్మాయిల్



రెయాన్

సంస్కరణల్లో మనమే ముందుండాలి

● సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలి

● అధికారులకు సీఎం ఆదేశం

ఈనాడు, అమరావతి: వివిధ శాఖల్లో నిబంధనలను సరళీకరించడం ద్వారా.. పాలన సులభతరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కార్యదర్శుల సదస్సులో పెట్టుబడులు, పరిశ్రమల పురోగతిపై ఆయన మాట్లాడుతూ.. 'అగ్నిమాపక, పురపాలక, అటవీ, పరిశ్రమలు, పాఠశాల విద్యతో పాటు మొత్తం 15 శాఖల్లో నిబంధనలను మరింత సరళీకరించాలి. నిర్దేశిత కాలపరిమితి ముగిసిన తర్వాత చట్టాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. అవసరం లేని విధానాలతో అనుమతులు వేగంగా ఇవ్వడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఎలాంటి ఇబ్బందీ ఉండకూడదు. పశుసంవర్ధక శాఖ, సీసీఎల్ఏ, కార్మిక, ఫ్యాక్టరీల శాఖలు నిబంధనల సరళీకరణపై దృష్టి పెట్టాలి. రియల్‌టైం గవర్నెన్స్ వచ్చిన తర్వాత అవసరం లేని నిబంధనలను గుర్తించండి. సంస్కరణల అమలులో మనమే ముందుండాలి. సంస్కరణలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో మనం ముందు ఉండటంవల్లనే.. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వచ్చాయి. సంస్కరణలను తీసుకువచ్చేందుకు వీలుగా త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టిలి' అని పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణానికి మెటీరియల్‌కు ఇబ్బంది పెట్టొద్దు

'ఇసుక, గనుల శాఖలకు సంబంధించి నిబంధనలు సులభతరం కావాలి. సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలి. రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ రాకుండా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి ఇబ్బందులు వస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు మెటీరియల్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలి. పనులు వేగంగా పూర్తి కావాలంటే సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలి. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి' అని సీఎం పేర్కొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల హోదా మార్పునకు కృషి

ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్



విద్యాసాగర్, రమణలను సత్కరిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల హోదా మార్పు, జాబ్‌చార్టు తదితర అంశాల పరిష్కారంపై దృష్టి సారిస్తామని రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సోమవారం ఏపీ ఎన్జీవో హోంలో విద్యాసాగర్‌ను, ప్రధాన కార్యదర్శి రమణను కలిసి సత్కరించింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరింది. 'వ్యవసాయ విస్తరణాధికారులకు నిర్దిష్ట జాబ్‌చార్టు లేకపోవడంతో అన్ని పనులూ అప్పగిస్తున్నారు. దశాబ్దాలుగా ఒక్క పదోన్నతి కూడా లేదు. వ్యవసాయ డిప్లొమా చేసిన వారికి సర్వీసులో ఒక పదోన్నతైనా కల్పించాలి. రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ద్వారా ఈ అంశాలను పరిష్కరించాలి' అని విన్నవించింది. సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, సుభాని, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఈఏసీ సభ్యురాలిగా సరిత సజ్జ

ఈనాడు, దిల్లీ: కేంద్ర, పర్యావరణ అటవీశాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ నిపుణుల మదింపు కమిటీ(ఈఏసీ) సభ్యురాలిగా తెలంగాణకు చెందిన సరిత సజ్జ నియమితులయ్యారు. మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులకు అవసరమైన మదింపు కార్యక్రమాన్ని ఈ కమిటీ చేపడుతుంది. గుజరాత్‌కు చెందిన విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ రామ్‌కుమార్ ఈ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

గృహగణన ప్రశ్నావళిలో ఓబీసీలను చేర్చాలి

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం జనగణన మొదటి దశలో భాగంగా వచ్చే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో చేపట్టే గృహగణనలో ఓబీసీ కులాలను లెక్కించేలా గెజిట్‌లో సవరణలు చేసేలా చూడాలని అఖిలభారత ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. గృహగణనలో కులం కాలమ్ ఉంచి ప్రశ్నావళిలో ఓబీసీ కులం పేరు చేర్చకపోవడం వల్ల ఆ సామాజికవర్గానికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, దీనికి సంబంధించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా చొరవ చూపాలని ఆయన కోరారు. ఇదే అంశంపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథావలేకూ వినతిపత్రాలు సమర్పించారు.

తీరం.. తీరు మారుతోంది!

- కోనసీమలో పలుచోట్ల భూమి కోత.. మరికొన్ని ప్రాంతాల్లో పెరుగుదల
- నిర్ధారించిన ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్

ఈనాడు, అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని తీర ప్రాంతంలో భౌగోళికంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ జిల్లాలో 85.85 కిలోమీటర్ల పొడవున తీరప్రాంతం ఉంది. ప్రతి ఏడేళ్ల కాలపరిమితితో పరిశీలిస్తే.. కొన్ని ప్రాంతాల్లో సముద్ర కోత కారణంగా కొంత భూమి నీటిలో కలిసిపోతుండగా.. మరికొన్నిచోట్ల కొత్త భూభాగం ఏర్పడుతోందని ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ) పరిశీలనలో తేలింది. తీర ప్రాంతంలో మార్పులపై జిల్లా యంత్రాంగం నివేదిక కోరడంతో ఏపీఎస్ఏసీ 1989 నుంచి 2021 వరకు ప్రతి ఏడేళ్లకోసారి శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి వివరాలు వెల్లడించింది.

22.72 కి.మీ. మేర కోత

కోనసీమ జిల్లాలోని తీర ప్రాంతంలో మొత్తంగా 22.72 కి.మీ. పొడవు (33.35 శాతం) కోతకు గురైనట్లు నిర్ధారణైంది. కోత తీవ్రత 18.99 కి.మీ. వరకు అధికంగా (ఏడాదికి ఐదు మీటర్లకు పైగా) ఉంది. 6.65 కి.మీ. వరకు ఓ మాదిరిగా (ఏడాదికి 2 నుంచి 5 మీటర్లు), 3.08 కి.మీ. మేర (రెండు మీటర్ల కంటే దిగువన) తక్కువగా ఉంది.

◆ గౌతమి గోదావరి సమీపంలోని కొత్తపాలెం, అంతర్వేది గ్రామాల పరిధిలో తీర ప్రాంతం ఏడాదికి ఐదు మీటర్లకు మించి సంద్రంలో కలిసిపోతోంది.

◆ అంతర్వేది, వాడరేవు, ఎస్.యానాం, బెండమూరులంక పరిధిలో దాదాపు 6.65 కి.మీ. మేర (ఏడాదికి ఐదు నుంచి రెండు మీటర్ల వరకు) సముద్ర గర్భంలో కలిసిపోతోంది. కొన్నిచోట్ల ఏటా అర మీటరు నుంచి రెండు మీటర్ల వరకు తీర ప్రాంతంపై కోత ప్రభావం ఉంటోంది.

52.14 కి.మీ. అదనంగా భూపెరుగుదల

సముద్ర తీరంలో మార్పుల కారణంగా 52.14 కి.మీ. మేర (దాదాపు 60.70 శాతం) కొత్త భూభాగం ఏర్పడింది. ఇది 27.85 కి.మీ. ఏటా ఐదు మీటర్లకు మించి ఉంటే.. 13.6 కి.మీ. పరిధిలో 2 నుంచి 5 మీటర్ల వరకు, 4.99 కి.మీ. పరిధిలో అర మీటరు మేర అదనంగా భూభాగం కలుస్తోంది.◆ కొత్త భూభాగం పెరుగుదల గౌతమి గోదావరి పరీవాహక ప్రాంతంలో ఏటా ఐదు మీటర్లకు మించి ఉంటోంది. ఇది కేశవదాసుపాలెం-గొల్లపాలెం, చిర్రయానాం-పొర గ్రామాల మధ్య, వాసాలతిప్ప (రిజర్వ్ ఫారెస్ట్)లో 27.85 కి.మీ. మేర నమోదైంది.◆ వాసాలతిప్ప, అంతర్వేది, గొల్లపాలెం, చిర్రయానాం ప్రాంతాల్లో 13.6 కి.మీ. మేర.. అంటే ఏటా రెండు మీటర్ల నుంచి ఐదు మీటర్ల వరకు కొత్త భూభాగం ఏర్పడుతోంది. చిర్రయానాం, వాసాలతిప్ప, గొల్లపాలెం పరిసరాల్లో 10.69 కి.మీ. మేర.. రెండు మీటర్ల లోపు పెరుగుదల నమోదైంది. కేవలం 4.99 కి.మీ. పరిధిలో స్థిరంగా ఉంది.



డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాం పరిధిలో సముద్ర కోత

అడ్డగోలుగా వ్యవహరించినా 'స్వచ్ఛ'మేనా?

- వైకాపా ప్రభుత్వంలో అక్రమాలపై చర్యలేవి?
- గతంలో బినామీ సంస్థలకు రూ.కోట్లు కట్టబెట్టారు
- ఇప్పటికీ కీలక స్థానాల్లో ఆ అధికారులే

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో స్వచ్ఛాంధ్ర సంస్థలో వివిధ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ అటకెక్కిందా? బాధ్యులను గుర్తించి ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై ఇప్పుడు ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వచ్ఛాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో 2019-24 మధ్య కాలంలో పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు సరఫరా చేసిన డస్ట్ బిన్లు, ట్రై సైకిళ్లు, ఈ-ఆటోల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై విచారణ చేయించాలని తెదేపా ఎమ్మెల్యే ఒకరు స్వయంగా ఇచ్చిన ఫిర్యాదు పైనా ఎలాంటి పురోగతి లేదు. సంస్థలోనూ ఇప్పటికీ కీలక స్థానాల్లో అప్పట్లో చక్రం తిప్పిన అధికారులే కొనసాగుతున్నారు. నాసిరకమైన పరికరాలు సరఫరా చేసిన బినామీ సంస్థలకు అధికారులు భారీగా ఆర్థిక లబ్ధి చేకూర్చారన్నది ఫిర్యాదుల్లో సారాంశం.

ఆ రెండు సంస్థలకే టెండర్లు

స్వచ్ఛాంధ్ర సంస్థలో గత ప్రభుత్వంలో చేసిన వివిధ కొనుగోళ్లు, ఇతర పనుల టెండర్లు రెండే సంస్థలు దక్కించుకునేవి. వీటికి అనుకూలంగా అధికారులు టెండర్ నిబంధనలు రూపొందించి మిగతా వారెవరూ దరిదాపులకు రాకుండా చూసేవారు. ఆ రెండు సంస్థలకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్నతాధికారి ఒకరు అప్పట్లో అండగా నిలిచేవారు. దీంతో కిందిస్థాయి అధికారులు ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు తలూపేవారు.

◆ 2019-24 మధ్య కాలంలో సుమారు రూ.100 కోట్ల విలువైన 24 వేల డస్ట్ బిన్లు, ట్రై సైకిళ్లు ఒక్కొక్కటి రూ.43 వేల ధరకు కొనుగోలు చేశారు. ఆ రెండు సంస్థలకు టెండర్లు దక్కేలా అధికారులు నిబంధనలు సడలించారన్నది అభియోగం. నకిలీ బ్యాంకు గ్యారంటీ పత్రాలు సమర్పించారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.

◆ చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటికీ నీలం, ఆకుపచ్చ రంగుల్లో బిన్ల సరఫరాకు రూ.120 కోట్లతో పిలిచిన టెండర్లు కూడా ఈ రెండు సంస్థలతో పాటు అదే సిండికేట్‌కు చెందిన మరో సంస్థకు అధికారులు కట్టబెట్టారు. వీటిని కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోయినా చేసినట్లుగా అధికారులు రికార్డులు సృష్టించి బిల్లులు చెల్లించేశారన్నది ఇంకో ఆరోపణ.

◆ రూ.75 కోట్లతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీల్లో, రూ.15 కోట్లతో సేకరించిన కంపాక్టర్ బిన్లలోనూ ఏ ఇతర సంస్థలు పాల్గొనకుండా ఆ రెండు సంస్థలకే అధికారులు టెండర్లు కట్టబెట్టారని ఫిర్యాదులొచ్చాయి. వీటిలో చాలావరకు పంపిణీయే కాలేదు. ట్రాక్టర్లు ఇచ్చి, ట్రాలీలు పంపిణీ చేయకపోవడంతో అనేకచోట్ల నిరుపయోగమయ్యాయి.

బయో మైనింగ్ పనుల్లోనూ గోల్‌మాల్

గత ప్రభుత్వంలో బయోమైనింగ్ పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. యార్డుల్లో ఉన్న దాని కంటే ఎక్కువ మెట్రిక్ టన్నుల్లో వ్యర్థాలు చూపించి, అంతా తొలగించినట్లు దొంగ బిల్లులు పెట్టి రూ.240 కోట్లు డ్రా చేసేశారు. యార్డుల్లో లెగసీ వేస్ట్ తొలగింపు కాంట్రాక్టు కూడా ఆ రెండు సంస్థలకే కట్టబెట్టారు. 65 పుర, నగరపాలక సంస్థల్లో పనులు చేసినట్లుగా రికార్డులు సృష్టించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ గోల్‌మాల్ వ్యవహారం బయటపడింది. యార్డుల్లోనే 80 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉన్నట్లుగా గుర్తించింది.

◆ 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో స్వచ్ఛాంధ్ర వివిధ పనులకు పిలిచిన టెండర్లలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామిక సంస్థల (ఎంఎస్ఎంఈ)కు అత్యధిక ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించారు. వైకాపా ప్రభుత్వంలో ఆ రెండు సంస్థలకు ప్రాధాన్యమిచ్చి ఎంఎస్ఎంఈలను దగ్గరకు రానివ్వలేదు. అంతేకాక తెదేపా ప్రభుత్వంలో చేసిన కొనుగోళ్లపై విజిలెన్స్‌తో విచారణ చేయించి ఎంఎస్ఎంఈలను వేధింపులకు గురి చేశారు.

నాటి పడా ఓఎస్డీయే ప్రస్తుత ఎండీ

వైకాపా ప్రభుత్వంలో పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పడా)కు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా పని చేసిన అనిల్‌కుమార్‌రెడ్డినే ప్రస్తుతం స్వచ్ఛాంధ్ర సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. పడా ఆధ్వర్యంలో చేపట్టిన పలు పనులపై అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనిల్‌కుమార్‌రెడ్డిని స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీగా నియమించడం గమనార్హం. అలాగే గత ప్రభుత్వంలో వివిధ కొనుగోళ్లలో చక్రం తిప్పిన ఒక అధికారిణి ఇప్పటికీ అదే స్థానంలో కొనసాగుతున్నారు.

గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు.. సాష్టాంగ నమస్కార యాత్ర



ప్రపంచ శాంతి కోసం బిహార్‌కు చెందిన ఉపేంద్రదాస్... ఉత్తరాఖండ్‌లోని గంగోత్రి నుంచి తమిళనాడులోని రామేశ్వరం వరకు సుమారు 3,400 కిలోమీటర్లు సాష్టాంగ నమస్కార యాత్ర చేపట్టారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ యాత్ర ఐదు రాష్ట్రాల మీదుగా సాగి సోమవారం ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలం వీఎం బంజర్‌కు చేరుకుంది. "నేలపై సాష్టాంగ నమస్కారం చేస్తూ ఈ యాత్ర ప్రారంభించా. ఇప్పటికి రెండు సంవత్సరాల ఎనిమిది నెలలైంది" అని ఆయన వివరించారు. - న్యూస్‌టుడే, పెనుబల్లి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్, పదోన్నతి కల్పించేలా ఆదేశించండి

- హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తోపాటు పదోన్నతి కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వలమల శ్రీనివాసరావు వేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. సాధారణ పరిపాలనశాఖ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది కోట కృష్ణదీప్తి వాదనలు వినిపించారు.

భాజపా మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: పార్టీని బలోపేతం చేసే దిశగా భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధ రాజు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన క్రియాశీలక మహిళా ప్రతినిధులకు ఈ కమిటీలో ప్రాధాన్యమిచ్చినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ ఉపాధ్యక్షులు: కరణం సుభాషిణి (నెల్లూరు), పాక రాణి నాగ మల్లిక (విజయనగరం), టి.విజయవాణి (తూర్పుగోదావరి), వి.లలిత (విశాఖపట్నం), పాలడుగు సుభాషిణి (ఎన్టీఆర్), అల్లూరి పద్మవర్మ (పశ్చిమ గోదావరి), జిల్లెళ్లమూడి రమాదేవి (ప్రకాశం)◆ ప్రధాన కార్యదర్శులు: నద్ది నాగ మల్లేశ్వరి యాదవ్ (గుంటూరు), వత్సవాయి రోహిణి (విశాఖపట్నం), పెదబల్లి సుష్మ (కడప)◆ కార్యదర్శులు: కె.సత్యనారాయణమ్మ (అల్లూరి సీతారామరాజు), కోటి సుధ (శ్రీసత్యసాయి), బత్తిని స్వాతి (నంద్యాల), చాగంటి హరిపావని (గుంటూరు), చిగురుపాటి లక్ష్మి (ఎన్టీఆర్), కానూరి శేషమాధవి (కృష్ణా), బెల్లంకొండ విజయలక్ష్మి (ప్రకాశం)◆ కోశాధికారి: ఆర్.దేవిక చౌదరి (తిరుపతి)◆ కార్యాలయ కార్యదర్శి: కంభంపాటి మాధవి (కృష్ణా)◆ సోషల్ మీడియా కన్వీనర్: శిరీషకిరణ్ (ఎన్టీఆర్)◆ జోనల్ ఇన్‌ఛార్జిలు: మండల సంతోషి శుభ లక్ష్మి (ఉత్తరాంధ్ర), పిడికిటి శ్రీదేవి (గోదావరి), పరుచూరు వెంకట శివలక్ష్మి (కోస్తాంధ్ర), వై.చంద్రకళ రాయల్ (రాయలసీమ)

ఎనీమియా ముక్త భారత్ అమలు తీరుపై అధ్యయనం

రాష్ట్రంలో మేఘాలయ ఎన్‌హెచ్‌ఎం బృందం పర్యటన



మంగళగిరిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఎన్‌హెచ్‌ఎం మేఘాలయ బృందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎనీమియా ముక్త భారత్(ఏఎంబీ) అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) మేఘాలయ బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎన్‌హెచ్‌ఎం మేఘాలయ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నోవెరినా మరాక్, స్టేట్ కన్సల్టెంట్ బాడోండర్ షిల్లాలు రాష్ట్ర వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో భేటీ అయ్యారు. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల్లో రక్తహీనత, ఆరోగ్య తనిఖీలపై ఆరా తీశారు. ఇందిరానగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శించి అక్కడ వైద్యసేవల తీరు, గర్భిణులకు అందుతున్న వైద్యసేవలను బృంద సభ్యులు పరిశీలించారు. రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న రక్తహీనత సమస్య పరిష్కారానికి చేపట్టిన ఉత్తమ పద్ధతులపై ఆరా తీశారు. మంగళవారం పలు పీహెచ్‌సీలతోపాటు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించనున్నారు.

గట్టు కదిలితే.. నష్టపోవాల్సిందేనా?

- రీసర్వేలో తగ్గిన భూమి విస్తీర్ణం
- వైకాపా ప్రభుత్వ రీసర్వే పాపాల్లో ఇదొకటి
- వెబ్‌ల్యాండ్ 1.0, రిజిస్ట్రేషన్ పత్రాల్నే ప్రామాణికంగా తీసుకోవాలని వినతులు
- ప్రభుత్వం మార్గదర్శకాలిచ్చినా.. అమలుకు మీనమేషాలే

ఈనాడు, అమరావతి: రీసర్వే సమయంలో జరిగిన తప్పుల్లో.. ఒక సర్వే నంబర్లోని రైతులందరినీ ముడేసి సంయుక్త ఎల్‌పీఎం నంబర్లు ఇచ్చేయడం ఒకటి. కొలతల్లో తేడాలు మరో అతిపెద్ద సమస్య. ఒక సర్వే నంబర్లో ఒకరి భూమి విస్తీర్ణం తగ్గితే.. అదే సర్వే నంబర్లో మిగిలిన రైతుల పొలాల్లో కలిసి ఉంటుంది. అంటే ఆ సర్వే నంబరులోని రైతులందరి సమస్య. ఇలా లక్షల మంది సతమతం అవుతున్నారు. భూమి విలువ భారీగా పెరిగిన నేపథ్యంలో.. 5% నిబంధన అంటే ఎకరాకు 5 సెంట్లు తగ్గితే కొన్నిచోట్ల రూ.లక్షల్లో కోల్పోతారు. అందుకే రైతులు అర్జీలపై అర్జీలు పెడుతున్నారు. వెబ్‌ల్యాండ్ 1.0, రిజిస్ట్రేషన్ పత్రాల్లో సక్రమంగానే నమోదైందని.. వాటిని ప్రామాణికంగా తీసుకుని వెబ్‌ల్యాండ్ 2.0లో నమోదుచేయాలని కోరుతున్నారు. రీసర్వేలో ఎదురైన ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఆదేశాలిచ్చారు. అయినా రెవెన్యూ అధికారులు అన్నింటికీ 5% నిబంధనే చెబుతూ అర్జీలను తిరస్కరిస్తున్నారు.

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఎకరా విలువ రూ.20-40లక్షల పైమాటే. సగటున చూసినా సెంటు రూ.30వేలు. రీసర్వేలో ఎకరాకు 5 సెంట్లు తగ్గితే.. రెండెకరాల రైతు రూ.3లక్షల ఆస్తిని కోల్పోయినట్లే. ఐదేళ్ల వైకాపా పాలనలో ఇలాంటివి కోకొల్లలు. వాటిని సరిదిద్ది బాధితులకు ఊరట కల్పించడంపై మండల అధికారులు దృష్టి సారించట్లేదు. 5% తగ్గొచ్చు, పెరగొచ్చంటూ అన్నిటికీ ఒకే నిబంధన చెబుతున్నారు. తమకు లింకు దస్తావేజులున్నాయని, తమ భూమి పక్క రైతు పొలంలో కలిసిందని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలిచ్చినా రెవెన్యూ అధికారుల్లో వాటి అమలు దిశగా చర్యలూ లేవు.

గట్టు లోపల ఉన్న భూమినే లెక్కిస్తే ఎలా?

ఉదాహరణకు రైతుకు ఎకరా పొలం ఉంటే గట్టు మధ్య భూమి విస్తీర్ణాన్నే ప్రామాణికంగా తీసుకుని అందులో 97 సెంట్లు ఉంటే అంతవరకే నమోదు చేశారు. దున్నేటప్పుడు గట్టు హద్దు చెరిగినా.. కావాలని అడుగో, రెండడుగులో జరిగినా ఆ మూడు సెంట్లు పక్క పొలంలో కలుస్తుంది. తమ భూమి ఎంత ఉందని రైతులు ఏటా కొలిపించుకోరు. అందుకే చాలామంది రైతులు దీన్ని గుర్తించలేరు. రీసర్వే సమయంలోనే పొలం తగ్గిన విషయం వారికి తెలిసింది. అదే విషయాన్ని రెవెన్యూ అధికారులకూ చెప్పారు. అయినా నాలుగు హద్దుల మధ్య మీ పొలం ఇంతే అని అప్పటి అధికారులు రికార్డులు రాసేశారు. పట్టాదారు పాసుపుస్తకాలిచ్చేశారు. ఇటీవల కొత్త పాసుపుస్తకాలూ అవే వివరాలతో ముద్రించి మరోసారి పంపిణీ చేశారు.

5% నిబంధనేంటి?

బ్రిటిష్ కాలంలో లింకుల లెక్కన గొలుసులతో కొలతలు వేసేవారు. వాటిని పట్టుకోవడంలో తేడాలున్నా.. చెట్లు, గుట్టలపై నుంచి నడిపించినా కొలతల్లో కొంత తేడా వచ్చేది. అందుకే వాస్తవ విస్తీర్ణం కంటే 5% భూమి పెరగొచ్చు, తగ్గొచ్చనే నిబంధన పెట్టారు. విస్తీర్ణం కంటే సరిహద్దులకే ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీం కోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. అందుకే రెవెన్యూశాఖ రీసర్వేలో రైతుకు భూమి తగ్గినా, పెరిగినా 5% నిబంధన చెబుతున్నారు. పెరిగినవారు సంతోషపడుతుంటే.. భూమి తగ్గినవారు మనోవేదనకు గురవుతున్నారు.

కొత్త మార్గదర్శకాలు ఇలా..

విస్తీర్ణంలో వ్యత్యాసం సమస్యల పరిష్కారానికి గతంలో ఇచ్చిన ఉత్తర్వులన్నీ రద్దయ్యాయని ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ఆదేశాల్లో పేర్కొంది. తాజాగా మార్గదర్శకాలిచ్చింది. మండలస్థాయి అధికారులు వాటినే అమలుచేయాలి. వెబ్‌ల్యాండ్ 1.0 లేదా రిజిస్ట్రేషన్ పత్రాల్లో నమోదైన భూమి కంటే వాస్తవ విస్తీర్ణం తక్కువగా ఉంటే.. దాన్ని పొరుగువారు ఆక్రమిస్తే తిరిగి పట్టాదారుకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. రీసర్వేలో విస్తీర్ణం తగ్గితే.. పట్టాదారు, సరిహద్దు భూయజమానులకు అభ్యంతరం లేకుంటే వెబ్‌ల్యాండ్ 2.0లో నమోదు చేయొచ్చని సూచించింది. ఒక పట్టాదారు భూమి విస్తీర్ణంలో వ్యత్యాసం 5% కంటే ఎక్కువ ఉంటే.. అది పక్క పట్టాదారు పొలంలో కలిసి ఉంటే ఆయనకున్న హక్కుపత్రాల్ని పరిశీలించి అందులో ఉన్న మేరకే నమోదుచేయాలి. అతని వద్ద ఉన్న అధిక విస్తీర్ణాన్ని వాస్తవ పట్టాదారుకు చేర్చాలి. వ్యత్యాస విస్తీర్ణం 5శాతం కంటే తక్కువ ఉంటే వాస్తవంగా వినియోగంలో ఉన్న భూమినే నమోదుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది.

రెండేళ్లలో 77% పెరిగిన వ్యవసాయ రుణాలు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రుణాలు రెండేళ్లలో 77% పెరిగాయి. 2023లో వివిధ బ్యాంకులు రాష్ట్రంలోని రైతులకు రూ.1.27 లక్షల కోట్లు వ్యవసాయ రుణాల కింద మంజూరుచేయగా 2025నాటికి అది రూ.2.25 లక్షల కోట్లకు చేరింది. జాతీయస్థాయిలో నమోదైన సగటు వృద్ధి 41శాతంతో పోలిస్తే ఏపీలో రుణాలు భారీ మొత్తంలో పెరిగాయి. సోమవారం లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి ఈమేరకు సమాధానం ఇచ్చారు.

ఏపీలో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.2,279 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఎవరూ క్లెయిమ్‌చేయని డిపాజిట్లు రూ.2,279.16 కోట్ల మేర బ్యాంకుల్లో ఉన్నట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. లోక్‌సభలో అమలాపురం తెదేపా ఎంపీ జీఎం హరీష్ బాలయోగి అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఈ డిపాజిట్లకు సంబంధించిన వారిని గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించాలని బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 158 చోట్ల ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. కోనసీమ జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి 28వ తేదీ మధ్యకాలంలో 1,899 ఖాతాలకు సంబంధించిన రూ.5.08 కోట్లు పరిష్కరించినట్లు చెప్పారు.

స్వయం సహాయక సంఘాల మొండి బకాయిలు రూ.407 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాల మొండి బకాయిలు రూ.407.62 కోట్లకు చేరినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి లోక్‌సభకు చెప్పారు. తమిళనాడు (రూ.1,359 కోట్లు), తెలంగాణ (రూ.616 కోట్లు), కర్ణాటక (రూ.582 కోట్లు), పశ్చిమబెంగాల్ (రూ.531 కోట్లు) తర్వాత అత్యధిక ఎస్‌హెచ్‌జీ మొండిబకాయిలు ఏపీలోనే ఉన్నట్లు చెప్పారు.

ఏపీలో ఐదేళ్లలో రూ.1.84 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు

ఆంధ్రప్రదేశ్‌లో 2021-22 నుంచి 2025-26 (2026 జనవరి) వరకు సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీ కింద రూ.1,84,731 కోట్లు వసూలైనట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. 2021-22లో రూ.30,350 కోట్లు, 2022-23లో రూ.36,439 కోట్లు, 2023-24లో రూ.40,900 కోట్లు, 2024-25లో రూ.41,981 కోట్లు వసూలైనట్లు వివరించారు. 2025-26లో జనవరి వరకు రూ.35,061 కోట్లు వచ్చినట్లు చెప్పారు.

● ఆంధ్రప్రదేశ్‌లో 11,905 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం ఉన్న 10 థర్మల్ ప్లాంట్ల నుంచి గత నాలుగేళ్లలో 637 లక్షల టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి అయినట్లు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో విశాఖపట్నం తెదేపా ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

సీఎం కార్యాలయ భవనానికి వెళ్లే మార్గంలో హైడ్రాలిక్ బొల్లార్డ్‌లు

ఈనాడు, అమరావతి: సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ భవనానికి భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. సీఎం కార్యాలయం ఉన్న బ్లాక్-1కు వెళ్లే మార్గంలో హైడ్రాలిక్ బొల్లార్డ్‌లు, ఇతర సెక్యూరిటీ పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి కొనుగోలు, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్‌కు రూ.55 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయంలో బ్లాక్ నం.2 నుంచి బ్లాక్ నం.1కు వెళ్లే మార్గంలో ప్రస్తుతం బూమ్ బ్యారియర్ మాత్రమే ఉంది. వాహనాల నియంత్రణకు దాని స్థానంలో హైడ్రాలిక్ బొల్లార్డ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

తమ్మినేని మోహన్‌కు తెదేపా నేతల నివాళి

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్ మృతి చెందడంపై తెదేపా నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, నేతలు బుచ్చిరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయినవారే ఆయువు తీస్తున్నారు!

- విశాఖలో రెండేళ్లలో జరిగిన హత్యల అధ్యయనంలో వెల్లడి
- నిందితుల్లో ఎక్కువ మంది వయసు 19–39 ఏళ్ల లోపే

ఈనాడు, విశాఖపట్నం

ఆస్తి కోసం అన్నను హతమార్చిన తమ్ముడు.. ప్రియుడితో కలిసి భర్త ప్రాణం తీసిన భార్య.. మద్యం మత్తులో అత్తను చంపిన అల్లుడు.. ఇలాంటి కేసులు తరచూ వినిపిస్తుండటంతో విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లోని ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్లు వాటిపై అధ్యయనం చేపట్టారు. విశాఖ పరిధిలో రెండేళ్లలో జరిగిన కేసులను పూర్తిగా విశ్లేషించారు. ఈ అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా అయినవారి మధ్య అనుబంధాలు ముక్కలై ఆయువు తీసేలా మారుతున్నాయని తేలింది. ఎక్కువ కేసుల్లో రక్త సంబంధీకులు, స్నేహితులు, బంధువులే నిందితులవడం గమనార్హం. బాధితుల్లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉన్నారు.

44 కేసుల విశ్లేషణ

జనవరి 2023 నుంచి డిసెంబరు 2024 వరకు జరిగిన హత్యలపై ప్రొఫెసర్లు అధ్యయనం చేపట్టారు. ఇందుకు కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లోని శవపరీక్షల ఆధారంగా.. విశాఖ నగరం, పరిసర ప్రాంతాల్లోని హత్యల ధోరణి తెలుసుకోవడమే లక్ష్యంగా అధ్యయనం సాగింది. రెండేళ్లలో 3,779 పోస్టుమార్టాలు చేయగా.. అందులో మొత్తం 44 హత్యలుగా తెలుసుకొని, వాటి పోలీసు నివేదికలను విశ్లేషించారు. ఈ అధ్యయనాన్ని ఏఎంసీలోని ఇన్‌స్టిట్యూషనల్ ఎథిక్స్ కమిటీ ఆమోదించింది. తాజాగా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్- జర్నల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ప్రచురితమైంది.

నేర చరిత్ర లేనివారే అధికం..

◆ 31 మంది పురుషులు, 13 మంది మహిళల హత్యల ఘటనల్లో 14 కేసుల నిందితులు, మృతులు ఒకే ప్రాంతానికి చెందినవారు.

◆ హతుల్లో 31.82% మంది 30-39 ఏళ్ల వారు కాగా.. 22.73% మంది 20-29 ఏళ్ల వారు. అధిక శాతం రైతులు, సేల్స్ పర్సన్లు, భవన నిర్మాణ, పారిశుద్ధ్య కూలీలు, డ్రైవర్లు, గృహిణులు, ఇతర చిన్నపాటి పనులు చేసుకునే వారే.

◆ విశ్లేషణ చేపట్టే నాటికి 31 మంది నిందితులను గుర్తించగా.. వారందరూ 10 నుంచి 59 ఏళ్లలోపు వారే. వారిలో 19 మంది వయసు 10-39 ఏళ్లే కావడం గమనార్హం. 30 మంది నిందితులకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు.

◆ ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఎక్కువ హత్యలు జరిగాయి. వీటిలోనూ తలకు గాయమై ఎక్కువ మంది చనిపోయారు.

◆ బహిరంగ ప్రదేశాల్లో 32 మంది, ఇళ్లలో 12 మంది హత్యకు గురయ్యారు. రాత్రి సమయాల్లో 18, సాయంత్రం వేళల్లో 9 హత్యలు జరిగాయి.

కుటుంబ గొడవలే ప్రధాన కారణాలు..

◆ కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు: 16 కేసులు

◆ అనుమానం, వివాహేతర సంబంధాలు: 13

◆ భూ వివాదాలు: 4;

◆ దోపిడీ: 2

◆ వరకట్నం, ర్యాగింగ్, బెదిరింపులు, మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడమూ మరణాలకు కారణాలయ్యాయి.

నిరంతర పరిశోధనలు అవసరం..

హత్యల నివారణకు చట్టాలను కఠినంగా అమలు చేయడంతోపాటు అసమానతలను తొలగించాలని నిపుణులు సూచిస్తున్నారు. 'ఈ ధోరణులను అర్థం చేసుకొని, సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచాలి. న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలి. బాధితులు, నిందితుల లక్షణాలు, మానసిక సమస్యలు తదితర అంశాలపై నిరంతర పరిశోధనలు అవసరం. కోపం, ఒత్తిడిని తగ్గించడానికి కౌన్సెలింగ్ ద్వారా ఇలాంటి ఘటనలను నివారించవచ్చు' అని నిపుణులు పేర్కొంటున్నారు.